# నాకు దేవుని చూడాలని వుంది

రావూరి భరద్వాజ



నాకు

# దేవుని చూడాలని ఉంది

కథల సంపుటి

డాక్టర్
రావూరి భరద్వాజ

# సంపాదకీయం

**భరద్వాజను ప్రప్రథమంగా** నేను చూసింది 1942వ సంవత్సరంలో. అతనితో తొలిసారిగా మాట్లాడింది 1950వ సంవత్సరంలో. నేను మొదటిసారి చూచినప్పుడు అతనేమీ కాడు. మొదటిసారిగా మాట్లాడినప్పుడు మాత్రం 'సమీక్ష' సంపాదక వర్గంలో సభ్యుడు. అప్పటికే అతను రచయితగా మంచి పేరు సంపాదించుకొన్నాడు. అతణ్ణి కల్సుకొని నేను రాసిన కథ నొకదాన్నిచ్చాను. పావుగంటలోనే ఆ కథను చదివి నాకిచ్చేస్తూ, అదే కథను ఎలా రాస్తే బాగుంటుందో చెప్పాడు. రెండు రోజుల తర్వాత ఆ మార్పులూ చేర్పులూ చేసి తీసుకెళ్ళానుగానీ, అతను చెప్పినట్లుగా మాత్రం కథ రాలేదు.

"అక్కడక్కడా, చిన్న చిన్న సర్దుబాట్లు చేయనా?" అంటూనే అతను ఆ కథను మొత్తం తిరగరాసి నాకిచ్చేశాడు. "సమీక్ష కథల పత్రిక కాదు. రిలీఫ్ కోసం, ఒకటి రెండు కథలూ, కవితలూ వేసినా, ఇప్పటికే మా వద్ద చాలా కథలున్నాయి. మీ వంతు రావటానికి చాలా కాలం పడుతుంది. అందాకా ఇది మీ దగ్గర ఉంచుకోవటం దేనికి? మద్రాసులో నాకు తెల్సిన పత్రికల వాళ్ళున్నారు. మీరు వొప్పుకొంటే వారికి పంపుతాను... అవి అచ్చంగా కథల్నే ప్రచురిస్తాయి" అన్నాడు భరద్వాజ.

రెండు మాసాల తర్వాత ఆ కథ అచ్చయింది. తొలిసారిగా అచ్చులో నా పేరు చూచుకున్నది అప్పుడే; అదీ భరద్వాజ ప్రోత్సాహముతోనే.

ఇంకో మిత్రుని అనుభవం తెల్సుకొందాం.

"కథ అని చెప్పదగ్గ నా మొదటి కథ అచ్చయింది 'తెలుగు స్వతంత్ర'లో 1949వ సంవత్సరంలో అనుకొంటాను. విచిత్రమేమిటంటే ఆ మొదటి కథ రాసింది నేను కాదు. నన్ను రచయిత కమ్మని ప్రోత్సహించిన మిత్రుడు భరద్వాజ రాసుకొన్న కథ అది. దాన్ని నా పేర పంపి, నన్ను రచయితను చేసింది తాను. ఆ కథ బాగున్నదని పేరు వచ్చింది" అంటాడు శార్వరి.

భరద్వాజ 'సమీక్ష' పత్రికలో చేరటానికి ముందు, 'జ్యోతి' పత్రికలో కొద్ది రోజులపాటు పని చేశాడు. అప్పుడే 'శార్వరి'తో పరిచయమయింది. వీరిద్దరూ కలిసి 'కవితాకుటీరం'అనే చిన్న సాహితీ సంస్థను స్థాపించారు. ఆ సంస్థ తరఫున సాహిత్యసేవ చేయాలని ప్రయత్నించారు. ఆ ప్రయత్నాలు ఫలించినట్లయితే, భరద్వాజ తొలి కథా సంపుటం 'పాడ్యమి' 1949వ సంవత్సరంలోనే వచ్చివుండేది. అలా రాబోతున్నదని 'జ్యోతి' పత్రికలో ప్రకటన కూడా వెలువడింది. కాని ఏం లాభం? వారుభయులు చేసిన ప్రయత్నాలూ ఫలించలేదు. అంతలోనే, ఆ ఉద్యోగానికి కూడా ఉద్వాసన చెప్పవలసి వచ్చింది. ఆ తర్వాతనే శార్వరి 'కళావాణి' అనే సంస్థను ప్రారంభించి, 'రాగిణి', 'కొత్త చిగుళ్ళు' అనే పేర్లతో భరద్వాజ రాసిన రెండు కథా సంపుటాలను ప్రకటించాడు.

తాను పుంకానుపుంఖంగా రాయడమే కాకుండా, ఏ పాటి రాయగల వారి చేతనయినా, పట్టుబట్టి, శతపోరి రాయించటం భరద్వాజకు అప్పుడూ ఇప్పుడూ వున్న అలవాటే. 'అతని ప్రోత్సాహంతో రచయితలైన వారి సంఖ్య అసంఖ్యాకం' అనటం నిస్సందేహంగా అతిశయోక్తే గాని, 'అసలు ఎవ్వరూ

లే'రనటం మాత్రం పచ్చి అబద్ధం. ఒక అమరశ్రీ, ఒక వైశంపాయన, ఒక వీరమల్లు రామకృష్ణ, ఒక శార్వరి- కాక మరో పదిమందీ అతను తాయరు చేసిన రచయితలే!

ఆలూరి ప్రకాశరావు, వీరమల్లు రామకృష్ణ, ఆలూరి భుజంగరావు, అబ్బరాజు నాగభూషణం, శారద ఎప్పుడూ భరద్వాజతో కలిసి మెలిసి తిరుగుతూ ఉండేవారు. వేజెండ్ల సాంబశివరావు, కవిరావు, వెలగా వెంకటప్పయ్య అప్పుడప్పుడూ కలుస్తూ ఉండేవారు. సమిష్టి కృషి మీద కొండంత విశ్వాసం వున్న భరద్వాజ, వీరందరినీ కలుపుకొని, 'యువసాహితి' అనే సాహిత్య సంస్థను ఏర్పాటు చేశారు. ఈ సంస్థకు కార్యదర్శిగా, అధ్యక్షుడుగా వుండి, వారం వారం సమావేశాలను నిర్వహించారు. చర్చలు గోష్ఠులు నడిపాడు. ఈ సంస్థ తరపున కొన్ని పుస్తకాలను కూడా ప్రచురించాడు. ఉత్పత్తిదారుకూ, వినియోగదారుకూ మధ్య వుండే దళారీలను తొలగించటం ప్రధానాశయంగా, కారుచవగ్గా పుస్తకాలను అచ్చువేసి, పాఠకులకు అందించాలని అతను ప్రయత్నించాడు. అందుకోసం 'రోహిణీ పబ్లికేషన్స్' అనే ప్రచురణ సంస్థను కొద్ది పెట్టుబడితో స్థాపించాడు. వారికి తానే ప్రధాన సంపాదకుడుగా ఉన్నాడు. 'అసావేరి' అనే పుస్తకం అచ్చువేశాడు. అప్పుల పాలయ్యాడు. ఆ అప్పులను తన జీతంలోంచి, నెల వాయిదాల మీద తీర్చవలసి వచ్చింది.

భరద్వాజ పట్టుదలకొక ప్రతీక. అతనో మొండి మనిషి. సుమారు మూడున్నర దశాబ్దాలుగా కలిసి మెలిసి తిరిగిన వాళ్ళం కాబట్టి అతనిలోని మంచి చెడుగులు రెండూ నాకు తెలుసు.

అవసరమయింది గనుక చెబుతున్నాను.

భరద్వాజ ఏమీ కాని రోజుల్లో జరిగిన సంఘటన యిది. పొట్ట చేతబట్టుకొని, ఆవురావురుమంటూ ఊరూరా, వాడవాడా తిరుగుతున్న కాలమది. ఒకసారి అతడు చాలా దగ్గరి బంధువుల ఇంటికెళ్ళాడు. స్నానం చేసి అప్పటికి రెండు రోజులయింది. ఒళ్ళు మాసింది. దుస్తులూ మాశాయి. సబ్బు కావాలన్నాడు. 'నీ ముఖానికి సబ్బొక్కటే తక్కువయిందేం?' అని ఈసడించాడా బంధువు. భరద్వాజ సబ్బు లేకుండానే స్నానం చేసి, 'వస్తా'నని చెప్పి, వెళ్ళిపోయాడు. ఈ సంఘటన 1944వ సంవత్సరంలో జరిగింది. నాటి నుండి నేటిదాకా, అతను స్నానానికి సబ్బు వాడడని చాలా మందికి తెలియదు. ఈలోగా ఆ బంధువులు అనేకసార్లు భరద్వాజ ఇంటికి వచ్చారు. అతనివల్ల రకరకాల ఉపకారాలు కూడా పొందారు.

1956వ సంవత్సరంలో మద్రాసులోని ఒక స్టూడియోలో ఒక జానపద చిత్రం షూటింగ్ జరుగుతోంది. పింగళి నాగేంద్రరావుగారు ఆ చిత్రానికి కథ, మాటలు, పాటలు రాశారు. నాగేంద్రరావుగారు ఒక సీను చెప్పి, ఎలా ఉన్నదన్నాడు కుటుంబరావును. కొడవటిగంటి నవ్వి వూరుకొన్నాడు గానీ, అక్కడే వున్న భరద్వాజ ఠఫీమని "చందమామ కథలాగా వుంది" అనేశాడు. ఆ సీను చూడటం కోసం రమ్మని నాగేంద్రరావుగారు, కొడవటిగంటినీ, భరద్వాజనూ బలవంతం చేశారు. ముగ్గురూ ఫ్లోర్‌లో అడుగు పెడుతున్న వేళకు దర్శకుడు ఫ్లోర్ ముందు నిలబడి ఉన్నాడు. ఆ దర్శకునికి భరద్వాజ బాగా తెలుసు. అయినా, కుటుంబరావునూ, నాగేంద్రరావునూ లోపలికి పోనిచ్చి, భరద్వాజ వెళ్ళకుండా అడ్డుపెట్టాడు ఆ చిత్ర దర్శకుడు. అతనో క్షణం ఆశ్చర్యపోయాడు.

ఎందుకిలా అడ్డుపెట్టాడు...? రెండు మాసాల క్రిందట అదే దర్శకుని మరో చిత్రాన్ని తాను తీవ్రంగా విమర్శిస్తూ రాసిన సంగతి భరద్వాజకు అప్పుడు గుర్తుకొచ్చింది. 'మంచిది' అంటూనే ఆ చిత్ర దర్శకునికో నమస్కారం చేసి వెనక్కు తిరిగాడు. అంతే! ఆ దర్శకుని మరే చిత్రమూ, భరద్వాజ ఇంతవరకూ మళ్ళా చూడలేదు. అలాంటి మొండి పట్టుదలగల మనిషి భరద్వాజ.

1958వ సంవత్సరంలో ధనికొండ హనుమంతరావుగారి వద్ద ఉద్యోగం మానేసి, ఒక ఫౌంటెన్ పెన్నుల కంపెనీలో పనికి కుదిరాడు భరద్వాజ. అంతకుముందుదాకా కలంతో రాయటమే తప్ప, వ్యాపారం చేయటం అతనికి తెలియదు. కానీ విధివశాత్తూ ఆ ఉద్యోగంతోనే రాజీపడి కాలం గడపవలసి వచ్చింది. అలా కాలం గడుపుతున్నప్పుడు ఓ సారి - ఓ కలం - అస్తవ్యస్తంగా త్రిప్పటం వల్ల పగిలిపోయింది. వాస్తవానికి అది ఖరీదైన కలం. కాని అది పగిలిపోవటానికి భరద్వాజ ఎంత మాత్రం కారణం కాదు. తెలుసుకోకుండానే ఆ కంపెనీ యజమాని భరద్వాజను దుర్భాషలాడాడు. ఆ కలం విరిగిపోవటానికి, యజమాని అన్నగారే కారణమని భరద్వాజ సంజాయిషీ యిచ్చాడు. తనే కారణమని ఆ పెద్దమనిషి కూడా అంగీకరించాడు. కానీ యజమాని మాత్రం ససేమిరా వొప్పుకోలేదు. "నోర్ముయ్! మాట్లాడావంటే పళ్ళు రాలగొడతాను" అన్నాడాయన కళ్ళెర్రచేస్తూ. తాను చేయని తప్పుకు మాట పడవలసి వచ్చినందుకు భరద్వాజ ఎంతగా కుమిలిపోయాడో, అతని డైరీ (దినచర్య గ్రంథం) పుటలను చూస్తేగాని తెలియదు. రెండు దశాబ్దాలు గడిచిన అనంతరం, అదే యజమాని, అదే వ్యాపారంలో నష్టపడి, కట్టుబట్టలతో హైదరాబాదు వచ్చినప్పుడు, భరద్వాజ అతన్ని ఆప్యాయంగా ఆదరించడమే గాక, తన మిత్రులతో చెప్పి, అతని కుమారుడికి మంచి ఉద్యోగం కూడా ఇప్పించాడు. "అబ్బీ! జాగ్రత్తగా ఉద్యోం చేసుకో. ఈ యజమాని చాలా మంచివాడు. మీ నాన్న మాదిరిగా, నిష్కారణంగా కోపగించుకోడు. చేయని తప్పుకు పళ్ళు రాలగొడతానని మాత్రం అసలే అనడు" అని నవ్వుతూ చురక అంటించాడు భరద్వాజ.

సహజంగానే సున్నితమయిన హృదయం కలవాడు భరద్వాజ. అతననుభవించిన దారిద్రమూ, నిరుద్యోగమూ, అవమానాలూ, ఈసడింపులూ ఏకమై. అతణ్ని రాయిగా మార్చివేసి ఉండవలసింది. అతననుభవించిన సూదిపోట్లు అతణ్ని కరుకెక్కించి ఉండవలసింది. కానీ అవన్నీ అతని స్వభావాన్ని మృదువుగా, మరింత మృదువుగా మార్చేశాయి.

అల్ప ప్రయోజనాల కోసం అతణ్ని వేధించిన వారున్నారు. ఈర్ష్యతో, ద్వేషంతో, అసూయతో, అతణ్ని బాధించిన వారున్నారు.అతనికెలాంటి ప్రయోజనమూ కల్గకుండా కుట్రలు పన్ని హింసించిన వారున్నారు. ఆఖరుకు నోటి దగ్గరి కూడు తీసేసి, అలా తీసేసినందుకు, హాయిగా నవ్వుకొన్న వారూ ఉన్నారు.

తనను అనుమానించిన వారిని, అవమానించిన వారిని, వేధించిన వారిని, బాధించిన వారిని, హింసించిన వారిని, ధ్వంసించిన వారిని; చిరునవ్వుతో క్షమించగలిగిన సహృదయుడు భరద్వాజ. ఏ ప్రమాణాలతో కొలిచి చూసినా - అదుగో - అల్లంత ఎత్తుగానే కనబడతాడు భరద్వాజ. అతనికున్న మొండితనం, గుండె నిబ్బరం, పట్టుదల, దీక్ష, చాలా తక్కువ మందిలో కన్పిస్తాయి.

మూడున్నర దశాబ్దాలుగా భరద్వాజను సన్నిహితంగా తెలిసిన వాణ్ని కాబట్టి, అతని లోపలా, బయటా జరిగిన మార్పులనూ, జరుగుతున్న మార్పులనూ, ఖచ్చితంగా మదింపు వేయగలనన్న నమ్మకం నాకున్నది. అధిక సంఖ్యాకులకు 'రచయిత భరద్వాజ' మాత్రమే తెలుసు. నాకు 'వ్యక్తి భరద్వాజ' కూడా అతి దగ్గరగా తెలుసు. రచయిత(గా) భరద్వాజ సాధించిన విజయాలనూ, ప్రమాణాలనూ చూసి, అభినందిస్తున్న చాలా మందికి, వ్యక్తి(గా) భరద్వాజ సాధించినదేమిటో తెలిసే అవకాశం బహు తక్కువ! అందుకు ఒక చిన్న సంఘటనను ఉదహరిస్తున్నాను.

1942వ సంవత్సరంలోనో, లేక 1943వ సంవత్సరంలోనో అనుకుంటాను. భరద్వాజ మోగులూరు వెళ్ళాడు. అప్పటికతని వయసు 15 లేదా 16 సంవత్సరాలు. బంధువులు - అప్పటికే ఇంటికి తాళం వేసుకొని వెళ్ళాపోయారు. ఇమ్మడి సెట్టి సీతారామయ్య తల్లిచాటు బిడ్డ. భరద్వాజకు సావాసగాడు. తనకు ఆకలిగా ఉందన్నాడు భరద్వాజ. తల్లి కంటబడకుండా చిన్న పప్పు బెల్లం చెక్కను దొంగచాటుగా చొక్కా లోపల దాచుకొచ్చి యిచ్చాడు సీతారామయ్య. ఆ పూట గడిచిపోయింది.

1976వ సంవత్సరంలో; తన కూతురు పెళ్ళి నిశ్చయమయిందనీ, తనకేమీ పాలుపోవటం లేదనీ, అదే సీతారామయ్య ఉత్తరం ముక్క రాశాడు. ఆ పెళ్ళికైన ఖర్చు (లో చాలా భాగం) భరద్వాజ భరించాడు. అయినా "మా సీతారామయ్య రుణం నేనింకా తీర్చుకోవాల్సి ఉంది" అంటాడు భరద్వాజ - ఇప్పటికీ! వ్యక్తిగా అతను సాధించినదేమిటో నాకు చాలా స్పష్టంగా తెలుసు. ఇంకా విపులంగా రాయటానికిది సమయం కాదు. 'భరద్వాజ సాహితీ జీవితం' అనే గ్రంథంలో ఈ వివరాలన్నింటినీ తెలియజేస్తున్నాను.

వ్యక్తి భరద్వాజను గురించి ఇప్పుడిక్కడ ఈపాటి చెప్పడానికైనా ఒక ముఖ్య కారణం ఉంది. తనెలాంటి వాడో తెలిస్తే- ఎంతగా తెలిస్తే - అంతగా అతని సాహిత్యాన్ని మనం అవగతం చేసుకోవచ్చు; ఆస్వాదించవచ్చు.

భరద్వాజ ఒకప్పుడు రాసిన రచనల్లో 'కామాజిక స్పృహ'ను మనం చూడవచ్చు. ప్రేమికుల్ని, శ్రామికుల్ని చూడవచ్చు. మానవతను, దానవతను చూడవచ్చు. అపారమైన కారుణ్యాన్ని, అసాధారణమైన కాఠిన్యాన్ని చూడవచ్చు. ఇవన్నీ భరద్వాజ చూశాడు. స్వయంగా అనుభవించాడు. మనల్ని కూడా చూడమనీ అనుభవించమనీ, మనముందు పరిచాడు.

భరద్వాజ తనపేరుతో రాసినవే గాక, అనేక గుప్త నామాలతో రాసినవి కూడా అసంఖ్యాకంగా వున్నాయని నాకు తెలుసు. అతని రచనల్లో కొన్నింటిని - దిన, వార, పక్ష, మాసపత్రికలు సంపాదకీయాలుగా ప్రచురించిన సందర్భాలున్నాయనీ నాకు తెలుసు.

భరద్వాజ 'పజిల్స్' పూర్తి చేయటం నాకు తెలియదు గానీ, రెండు మూడు పత్రికల కోసం, సంవత్సరాల పర్యంతం 'పజిల్స్' కంపోజ్ చేసిన సంగతీ నాకు తెలుసు.

వాడుకలో వున్న పదాలు, తన భావాలను ప్రస్ఫుటించవనుకొన్నప్పుడు, కొత్త పదాలను సృష్టించుకోడానికి ప్రయత్నించాడు భరద్వాజ. మనకింతవరకూ నవల, నవలిక మాత్రమే తెలుసు. 1950 ప్రాంతంలోనే 'నవలానిక' అనే కొత్త ప్రక్రియను అతను పరిచయం చేశాడు. కాశీవిశ్వనాథంగారి

సంపాదకత్వాన వెలువడ్డ 'సర్వోదయ' పత్రికలో భరద్వాజ ప్రకటించిన "చర్చిగోడలు" అతని మొదటి నవలానిక. "ఇది కథకంటే కాస్త పెద్దది. నవలిక కంటే కాస్త చిన్నది" అంటాడతను. మనకింతవరకూ, 'భుక్తాయాసం' మాత్రమే తెలుసు. భరద్వాజ 'ధనాయాసం' కూడా దీనికి జతపరిచాడు. "అవసరాన్ని మించి తింటే భుక్తాయాసం, అవసరాన్ని మించిన డబ్బులంటే ధనాయాసం" అంటుంది భరద్వాజ రాసిన 'కాదంబరి' నవలలోని ఒక పాత్ర. 1953లో అతను రాసిన 'చిత్రగ్రహం' నవలలోని చిత్రగ్రహం పేరు 'శశూన్'. ఇది అంతకుముందు, తెలుగు పఠితలకు తెలిసిన పదం కాదు. (శశి+మూన్='శశూన్' అని, భరద్వాజ తరువాత వివరణ ఇచ్చాడు) 'జలప్రళయం' అన్న మరో చిన్న నవలలో కొందరు శాస్త్రవేత్తలు, చంద్రమండలం వెళ్ళి అక్కడి నుండి, కొత్త పదార్థాన్ని తీసుకొస్తారు. ఆ పదార్థం పేరు 'లూనారియం'. ఇదీ మనకు కొత్త పదమే! ఒక చోట మనకు 'బహులేమియా' అన్న దేశం కనబడుతుంది. మరోచోట 'గర్భమిత్రుడు' కనబడతాడు. కొన్ని విషయాల్లో అతను త్రివిక్రమమూర్తి. మరికొన్ని విషయల్లో వామన మూర్తి. జంటనగరాల్లో అసంఖ్యాకంగా వున్న సాంస్కృతిక సంస్థలన్నింటికీ, అతను దూరంగానే ఉంటాడు. ఏ సాహిత్య సభలకూ, ఏ సారస్వత సమావేశాలకూ సాధారణంగా అతను హాజరు కాడు. "ఆ సభలకు హాజరయ్యే సాహిత్యోపాసకులకు, నాలాంటి సామాన్యుడు చెప్పవలసిందేమీ లేదు. వారు చెప్పే గొప్ప గొప్ప విషయాలు నావంటి మామూలు వాడికి బోధపడవు" అంటాడు భరద్వాజ.

ప్రపంచ ప్రఖ్యాత రచయిత ఖ్వాజా అహమ్మద్ అబ్బాస్, అతణ్ణి మాక్సింగోర్కీతో పోల్చినప్పుడూ; సుప్రసిద్ధ పత్రికా రచయిత 'యం.సి.' అతణ్ని బాల్జాక్ సరసన నిలబెట్టినప్పుడూ; మహాకవి శ్రీ శ్రీ అతని రచనలను ఆంటన్ చెకోవ్ రచనలతో తులతూగగలవన్నప్పుడూ; మరో సాహిత్యోపాసి, అతణ్ని జార్జివాషింగ్‌టన్ కార్వర్ ప్రక్కన నిలబెట్టినప్పుడూ; భరద్వాజ ఉత్తుంగ తరంగంలా ఎగసిపడడానికి బదులుగా తనలోకి తను కుంచించుకుపోయాడు. వామనుడయ్యాడు. "ఒక్క కష్టాలను అనుభవించటంలో తప్ప, వారికీ నాకూ పోలికలు ఎక్కడున్నాయి గనక?" అన్నాడతను వినయంగా.

వ్యక్తిగా భరద్వాజ ఎంత సంతృప్తితో సాయిలా పాయిలాగా ఉంటాడో, రచయితగా భరద్వాజ అంతకంటే మించిన అసంతృప్తితో సీరియస్‌గా ఉంటాడు. తనేదో సాధించాడని, ఈ క్షణం వరకూ అతను అనుకోవటం లేదు. ఆత్మస్తుతి మృత్యువుతో సమానమనీ, అహం మనిషిని మింగేస్తుందనీ అతని కెప్పుడో తెలుసు. కాబట్టే అతను జాగ్రత్తపడి, తానే ముందుగా 'అహం' గారిని మింగివేశాడు. 'ఆత్మస్తుతి' గారిని ఆమడ దూరానికి తరిమి వేశాడు. "నా బతుక్కుతోడు ఇంకా అహం కూడా ఎందుకండీ బాబూ! ఏం చూసుకొనీ?" అని మనల్నే ప్రశ్నిస్తాడు భరద్వాజ. అతని కళ్ళు సూక్ష్మదర్శినిగానూ, దూరదర్శినిగానూ పనిచేస్తాయి. చిన్న చలిచీమ కళ్ళల్లోని భయాన్ని కూడా అతను ఇట్టే చూడగలడు. లోకంబులు, లోకేశులు, లోకస్థులు తెగిన తుది నలోకంబగు పెంజీకటి కవ్వలగా, ఏకాకృతితో వెలుగుతున్న మూర్తిని దర్శించటానికి ఇప్పుడు తహతహలాడుతున్నాడు.

భరద్వాజ - అవనీగర్భపు అట్టడుగు పొరలను చీల్చుకొని, ఆకాశంకేసి ఎదుగుతున్న దేవదారు వృక్షం లాంటివాడు. అరిగిన కొద్దీ, తరిగిన కొద్దీ, పరిమళ పుంజాలను విరజిమ్ముతున్న చందన

తరవులాంటి వాడు. తన పరిసరాలలో - పడుపుగత్తెలో, పాలికాపులో, పసి నిగ్గులో, పండు ముసలిలో, కూలివానిలో, కష్టజీవిలో, ముష్టివానిలో, నిరుద్యోగిలో, చిరుద్యోగిలో, హరిజనునిలో, గిరిజనునిలో, అడుగు వానిలో, బడుగువానిలో, పీడితునిలో, తాడితునిలో, బక్కవానిలో, వారి ఆకిలిలో, అశాంతిలో, ఆర్తిలో, వెరపులేని అరపులో, నినాదాల విరుపులో, తుపాకుల మెరుపులో, అరుణంలో, అరుణారుణ రుధిరంలో, మరణంలో మరణించిన శబ్దంలో తనను తాను చూచుకొంటున్నవాడు. ఈ అశాశ్వతపు విలువలకు ఆవలగా, అతీతంగా, అననుభూతమైన పారమార్థిక మూల్యాలను లక్ష్యంగా పెట్టుకున్నవాడు. పరమోదాత్తమైన ఆ లక్ష్యాన్ని చేరటం కోసం, అనువైన సత్పథాన్ని అన్వేషిస్తున్నవాడు.

సర్వే భవంతు సుఖినః సర్వే సంతు నిరామయాః

సర్వే భద్రాణి పశ్యంతు మాకశ్చిత్ దుఃఖ బాగ్భవేత్.

"సర్వ ప్రాణులూ సుఖపడాలి. ఆరోగ్యంగా ఉండాలి. అందరికీ అనునిత్యం శుభమే కలగాలి. జగత్తులో ఎవ్వరూ దుఃఖ బాధితులు కాకూడదు" అని మనసా వాచా కర్మణా విశ్వసించినవాడు. అటువంటి సామాజికావతరణం కోసం ఎదురు చూస్తున్నవాడు.

గడచిన 40 సంవత్సరాల కాలంలో భరద్వాజ చాలా రాశాడు. తను జాగ్రత్త పరచుకొన్నవీ, తన మిత్రులు భద్రపరచినవీ కాక- అతను పోగొట్టుకొన్న రచనలు గూడా ఎక్కువగానే ఉన్నాయి. రానున్న సంవత్సరాలలో ఈ నా మిత్రుణ్ని గురించి, ఇటువంటి ప్రయత్నమొకటి చేయవలసి వస్తుందని, నేను ఏ మాత్రం ఊహించగలిగినా అతని రచనలనూ అతనికి సంబంధించిన సమాచారాన్నీ ఇప్పటికన్నా మించి జాగ్రత్తపరచి ఉంచేవాణ్ని, నాకా రోజుల్లో అటువంటి సూచనలేవీ భరద్వాజలో కనిపించలేదు. "బూతు కథలు రాసి కొంత కాలం నెట్టుకు రాగలడేమో" అనుకొన్నారు అతన్ని ఎరిగిన వారు. ఆ నెట్టుకు రావడం "ఇంత ఎత్తు" దాకా సాగుతుందని వారూ అనుకోలేదు; నేనూ అనుకోలేదు. భరద్వాజలో వచ్చిన ప్రతి మార్పునూ ప్రతిబింబించే కథలను, ఈ సంపుటంలో చేర్చాలన్నది నా సంకల్పం. ఇందుకోసం ఎంపిక చేసిన కథలు సుమారు 50 దాకా ఉన్నాయి. వాటినన్నింటిని ఒకే పుస్తకంలో చేర్చటం సాధ్యం కాదు. అందుచేత - రచనా కాలాన్నీ, వస్తువునూ, కథా సంవిధానాన్నీ ప్రాతిపదికలుగా చేసుకొని, కథలను మళ్ళీ వర్గీకరణ చేయవలసి వచ్చింది. ఇలా చేయటం వల్ల రాశిలో కథల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిన మాట నిజమే గానీ, ఆ మేరకు వాసిలో ఆశించిన ప్రయోజనం రెట్టింపు అయింది. భరద్వాజలో వచ్చిన పరిణామాన్ని అతని కథల ద్వారా ప్రతిబింబింప చేయాలన్న సంకల్పం సమగ్రంగా కాకపోయినా స్థూలంగానైనా నెరవేరిందని నేను భావిస్తున్నాను.

ఈ కార్యక్రమం - ఈ మాత్రమైనా విజయవంతం కావటానికి చాలా మంది మిత్రులు సహకరించారు. భరద్వాజ తొలి వచన రచనకు ఆధారాలను అన్వేషించి నాకు అందచేసినవారు డాక్టర్ ముదిగొండ శివప్రసాద్‌గారు. తమ పరిశోధనలో భాగంగా- భరద్వాజగారి అముద్రిత కథలను, కొన్ని పాత కథలను, సేకరించి ఇచ్చిన వారు, శ్రీ కృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయ సాహిత్య పరిశోధక విద్యార్థి శ్రీ జానగాని కాటమయ్యగారు. 'చిత్రగ్రహం' నవల తొలిసారిగా ప్రకటితమైన వివరాలను

అందజేసిన వారు, వేటపాలెంలోని సారస్వత నికేతనం నిర్వాహకులు శ్రీ ఆర్.వి.శేషగిరిరావుగారు. తమ వద్ద వున్న భరద్వాజ రచనలకు సంబంధించిన వివరాలను, ఇతర సమాచారాన్ని పంపి సహాయపడిన వారు, డాక్టర్ వెలగా వెంకటప్పయ్యగారు. సంపాదకీయ వ్యాఖ్యలకు మేలు ప్రతులను తయారు చేయటంలోనూ, కొన్ని కథలను ఎత్తి వ్రాయటంలోనూ సహాయపడిన వారు శ్రీమతి తిరందాసు అమ్మాజీగారు. వీరందరికీ, ఇంకా తదితర మిత్రులకు నా హృదయపూర్వకమైన నమస్కారాలు!

కవిరాజ సాహితీ సదనమ్

5-8-1983 **త్రిపురనేని సుబ్బారావు**

## శ్రీ కొల్లూరి కోటేశ్వరరావు

### గారికి

## ఓ... ఒకప్పుడు

## (1943-47)

## "? ?"

## వీరగాథ

## విమల

**1943-44 సంవత్సరాల్లో** భరద్వాజ (మాటల్లో ఇప్పటికీ) విద్యార్థి. అంతకు కొంచెం ముందుగానే- అతను చదువుకోవటం ప్రారంభించాడు. ఆ చదువు పూర్తిగా వంట పట్టిందనుకోనవసరం లేదు; వంట పట్టించుకోవడం కోసం అతడు పడిన శ్రమ, చేసిన కృషి - ఒక నవల వ్రాయడానికి పనికొచ్చేటంతగా ఉన్నది. ఇంతవరకూ జరిపిన పరిశోధనల్లో - మారుమూలన పడివున్న రెండు మూడు రచనలు వెలుగులోకి వచ్చాయి. నిజమేగానీ ఇవి పరమ జటిలంగానూ, అసంపూర్ణంగానూ ఉన్నాయి. సుమారుగా నలభై సంవత్సరాల క్రిందటి కాగితాలేమో అవన్నీ నుగ్గు నుగ్గు అయినాయి.

కొన్ని కాగితాలను సగానికి సగం పురుగులు తినేశాయి. కొన్ని పేజీలు లేవు కూడా.

ప్రస్తుతానికిది భరద్వాజ తొలి వచన రచనగా మనం భావిద్దాం. దీనికొక శీర్షికలేదు. ఇది వ్రాసినప్పుడు తను ఏ శీర్షికను ఉంచిందీ భరద్వాజ చెప్పలేకపోయాడు. తాను ఏం వ్రాయదలచుకున్నదీ తనకిప్పుడు గుర్తురావడం లేదన్నాడు.

ఇది - చారిత్రకమన్న భ్రాంతిని కలిగించే జానపద గాథ. దీనిని వ్రాసినప్పటి భరద్వాజకు కథా కథనం ముఖ్యం కాదు భాష ముఖ్యం; శబ్దాడంబరం ముఖ్యం! ఎంత జటిలంగా క్లిష్టంగా కష్టంగా రాస్తే అంత గొప్ప రచన అన్న భ్రాంతికి అందరి కవుల్లాగా, రచయితల్లాగా ఆయనా లొంగిపోయాడు.

అప్పటికి అతని వయస్సు 16-17 సంవత్సరాలు. బాల్యం వదిలి యవ్వన ప్రాంగణంలో అడుగు మోపుతున్న సంధికాలం. అవమాన ప్రహారానికి గురి అయ్యి నిలువునా రోషాన్ని నింపుకొన్న కాలం. పుస్తకాలనే పీల్చి, పుస్తకాలనే తాగి, పుస్తకాలనే తిని బతుకుదామని సంకల్పించిన కాలం. ఆ సంకల్పాన్ని కొంతకు కొంత ఆచరణలోకి గుంజుకొచ్చి పడేసిన కాలం. కనుకనే ఈ రచయిత తొలి నాళ్ళలోని తొట్ట తొలి రచనలో మనకు భాషాడంబరమే కనిపిస్తుంది. ప్రబంధాలలోని, మహా కావ్యాలలోని అనేక పంక్తులు యధాతథంగానూ, అప్పుడప్పుడు వేషాలు మార్చుకొనీ మనకు కనిపిస్తాయి.

ఎందుకిలా జరిగిందో, ఎందుకిలా జరుగుతుందో ఊహించడం పెద్ద కష్టమేమీ కాదు. ఏదో రాయాలన్న తపన, రాయడానికి ఏమీ స్ఫురించని స్థితి, చేతకాకపోవడమూ; వీటి మధ్య ఇరుక్కున్న కవికిగానీ రచయితకు గానీ ఇటువంటివి సంభవించడం సహజం. మరీ ఖచ్చితంగా చెప్పాలంటే ఇటువంటివే సంభవిస్తాయి. దీన్ని 'బాల్య దశ' అనవచ్చు. బిడ్డకు నడవాలని ఉంటుంది, నడవడం చేతకాదు, నడవకుండా వుండగలగడం ప్రకృతికే విరుద్ధం. ఏ గోడనో, గొబ్బెనో, మంచాన్నో, కుంచాన్నో పుచ్చుకొని, పడకుండా ఆసరా చేసుకొని, నడవడం నేర్చుకొని, నేర్చుకొన్నాక ఆ అవసరాలను వదలుకొని, సొంతంగా నడవడం సర్వసాధారణం.

ఈ పరిణామ క్రమాన్ని, పరిణామ వేగాన్ని తెలుసుకొనగోరేవారి ఉపయోగార్థం - ఇది అసంపూర్ణమే అయినప్పటికీ - ఇప్పటికి దొరికిన వాటిల్లో మొట్ట మొదటిదయిన భరద్వాజ వచన రచనను ఇక చదవండి.

## "? ?"

**ఆర్యావర్తమున** స్వర్ణముఖియను ద్వీపవతీ తటాంచలమున సుధానిధి యనఁబరగు మహానగర మొండు గలదు. అందలి సౌధ సుధా ప్రభలంబర చుంచితములు...

(ఇది ప్రారంభం. ఇక్కడి నుండి మిగిలిన ముప్పావు కాగితాన్ని పురుగులు తినేశాయి.

రెండవ పేజీ ఏమయిందో తెలియదు. మూడవ పేజీలో మిగిలిన పంక్తుల్నిక్కడ ఇవ్వడమయింది. 'యాతడు' అని ప్రారంభం కావడానికి ముందు యెంతో కొంత కథ జరిగి వుండాలి. కథ కాకపోతే-పురవర్ణనం లేదా వన వర్ణనం లేదా మరొకటో ఉండి ఉండాలి. అది ఏమిటో మనకు తెలియదు.)

....యాతడు 2 నవద్వయ ద్వీప నానా జయశ్రీ వధూటీ సమాశ్లిష్ట భుజుడని కీర్తిఁగాంచినవాఁడు. అంతియేఁగాక 3 అవి తోర్వీనవఖండ ఖండవరకు జ్యాభోగి, సాభోగ, భోగ విభాస్యద్భుజ దండ మండితుడ వంది...

.................................................................................................................................................

1. చూడండి: అల్లసాని పెద్దన రచించిన స్వారోచిష మనుసంభవం
వరణా ద్వీపవతీ తటాంచలమునన్ వప్రస్థలీ చుంబితాం
బరమైన సౌధ సుధా ప్రభా ధవళిత ప్రాలేయ రుఙ్మండలీ...

2. చూడండి: శ్రీనాదుని శృంగార నైషధం.
వితత నవద్వయ ద్వీప నానా జయశ్రీ
వధూటీ సమాశ్లిష్ట భుజుడు...

3. చూడండి: రామరాజ భూషణుని వసుచరిత్ర.
అవితోర్వీ నవఖండ ఖండపరశు జ్యాభోగి సాభోగభో
గ విభాస్వద్భుజ దండ, దండధర దీక్షా రూక్ష నానా వి
క్ష విబుక్షేపక కాండ...

.................................................................................................................................................

(మళ్ళీ పేజీలు లేవు... దాదాపుగా నాలుగైదు పేజీలు తప్పి పోయి ఉండాలి. 'ఇన్ని పేజీలు తప్పిపోయా'యని ఖచ్చితంగా చెప్పేటందుకు పేజీలమీద సంఖ్యలు కూడా లేవు. కాకపోతే 'సరిపోవచ్చు'నని నేను భావించిన రీతిలో పుటలను పేర్చాను. ''సౌందర్యమును వర్ణింప నజుని కైన దరముగాదు'' అన్న పేజీ తప్ప మిగిలినవి ఇక్కడ నప్పవని నాకు తోచింది. ఇందులోని 'ముద్దుగుమ్మ' ఎవరో ఈ కాగితాల్లోని వాక్యాలను చూసి చెప్పడం సాధ్యం కాదు. ఈ 'ముద్దుగుమ్మ' పేరు కూడా తెలియదు.)

... సౌందర్యమును వర్ణింప నజునికైనఁ దరముఁగాదన్నచో నే నెంతటి వాడ! అయినను యోపినంతఁ జిత్రించెదఁగాక...

4. శశిబింబ మణిహేమ సౌదామనీ చయోత్కర కాంతులను, నవలతా పుష్ప విభవంబులను, కర్పూర చందన కాశ్మీర మృగ మదమును, నేర్చి కూర్చి నేర్పున నీ ముద్దుగుమ్మ నావిరించి సృష్టించి యుండనోపు. కాదేని గాంగ సైకత స్థల.....

.................................................................................................................................................

4. చూడండి: నన్నెచోడ మహాకవికృత కుమారసంభవం.

శశిబింబ మణిహేమ సౌదామనీ చయో
త్కరకాంతులన్నియు నరసి తెచ్చి
నవలతా పుష్ప పల్లవ బిసకోమల
విభవంబు లన్నియు వెదకి తెచ్చి
కర్పూర చందన కాశ్మీర మృగమదా
మోదంబులన్నియు ముంచి తెచ్చి
పరవాదినీ శుక పరిపుష్ట మధుకరా
రావంబులన్నియు రాచి తెచ్చి

.....................................................................................................................................................

(తరువాత పేజీలోని పై భాగం పోయింది. అడుగు ముక్క ''ఆమె చంచత్పల్లవ''తో ప్రారంభమయి 'నయియుండెను'తో ముగిసింది)

5. ఆమె చంచత్పల్లవ కోమలాంగుళములు గలిగినట్టిదియు. సంపూర్ణ చంద్రాననయు, నంచ చ్ఛందన గంధియు, గంధ గజయానయు జక్రవాక స్తనియు, కించిన్మధ్యయు, తటిల్లతా విలసి తాంగియు నయి యుండెను.

(దీని తరువాత ఎన్ని పేజీలు లేవో ఆ లేని పేజీలలో వున్న కథ ఏమిటో - వూహించటం అసాధ్యమనిపిస్తున్నది. లభించిన పుటలోని తొలి వాక్యం '- డిగ్గి'నిటల తటంబున నవంజలి పుటి ఘటించి వీరసేనుండిట్లనియె' అని ఉన్నది. ఎవరీ వీరసేనుడు? ఇతను రాజు అయి ఉండడు. ఎందుచేతనంటే - 'నిటలతటంబున నవంజలి పుటి' ఘటించాడు. పైగా 'దేవా!' అని సంబోధించి, 'తమ యాజ్ఞ మేరకు' అని చెప్పుకుపోయాడు. ఇతడు రాజోద్యోగి గాని, రాజ బంధువుగాని అయి ఉండాలి. అసలు సుధానిధి మహా నగరాన్ని పాలించే రాజుగారి పేరేమిటి? మధ్యలో వచ్చిన 'ముద్దుగుమ్మ' పేరేమిటి? ఈమెకూ రాజుగారికీ ఉన్న సంబంధమేమిటి? ఈ ముద్దుగుమ్మకు ఏదో జరిగి ఉండాలి. శత్రురాజులు మాయోపాయంతో ఆమెను తస్కరించారా? వన విహారానికి వెళ్ళిన ఆ చిట్టి తల్లి దోవ తప్పి పోయిందా? ఏ దేవతలో గంధర్వ కుమారులో ఆమెను తమ లోకాలకు తీసుకు పోయారా? ఇలాంటిదేదో ఒకటి జరిగే ఉటుందని మనకు తెలుస్తూనే ఉంది. లేకపోతే - 'ఆచాన నేనాకానఁగాన'నని వీరసేనుడు అనడు. '-డిగ్గి' అని వాక్యం ప్రారంభమయింది గదా! ఏమి డిగ్గి? రథమా? అశ్వమా? ఏనుగా? అదీ తెలియదు.)

... డిగ్గి, నిటల తటంబున నంజలి పుటి ఘటించి వీర సేనుండిట్లనియె!

''దేవా! తమ యాజ్ఞమేరకు మన రాజ్యమందలి తరులను, దరులను గిరులను బరికించితి. శత్రు రాజుల యారణ్య భూములంజొచ్చి కంటవత్తి నిడుకొని యన్వేషించితింగాని - నాచాన నేనా

కాన(గాన. ఇక మరలుదమనుకొంటిని అంత 6. తళతళ మెఱుములు మెఱసినవి. బెళపెళ నుఱుముచు బెరిల్లున బిడుగులు, నలుగడల( బడ సాగినవి. నేను ఖడ్గధారినై హయము నదలించుచు, ముందునకు బోవుచుండ - దేవా! చెప్పుటకు నోరాడకున్నది. ఒక భయం...

................................................................................................................................

5. చూడండి: పిల్లలమఱ్ఱి పినవీరభద్ర కవి రచించిన శృంగార శాకుంతలం.

చంచత్పల్లవ కోమలాంగుళ కర స్సంపూర్ణ చంద్రానన

న్యంచ చ్చందన గంధి గంధగజయానం జక్రవాక స్తనిం

గించిన్మధ్య తటిల్లతా విలసి తాంగిం, బద్మ పత్రాక్షి వీ

క్షించెన్ రాజు....

................................................................................................................................

(-కరమైన దేదో కనిపించి ఉండాలి. అది ఒక దృశ్యం కావచ్చు; ఒక క్రూర మృగం కావచ్చు; ఒక విష సర్పం కావచ్చు; ఇలా ఎన్ని రకాలుగానైనా ఊహించవచ్చు. ఆ తరువాతి కాగితాలు కనిపించలేదు. మిగిలి ఉన్న ఆఖరు కాగితం మీద చదవడానికి అనువుగా ఉన్న ఒకే ఒక వాక్యం ఇదిగో ఇదీ -)

... తధిరోహిత హరింభా సముద్ధూత ధూళి ధూళులు రక్తచందనవృష్టులయినవి.

(ఆత రువాత ఇంకేదో జరిగి ఉండాలి. ఆ జరిగిందేమిటో భరద్వాజ రాసి కూడా ఉండవచ్చు. ఆ కాగితాలేవీ ప్రస్తుతానికి లేవు.)

* * *

................................................................................................................................

6. చూడండి: పింగళి సూరనా మాత్యుని కళాపూర్ణోదయం.

తళతళ మెఱుములు మెఱయగ

బెళపెళ నుఱుముచు బెరిల్లు పెఠిలన బిడుగుల్

నలుగడబడ, బెడిదపు ధా

రలుగల బలువాన జలధరంబులు గురిసెన్.

................................................................................................................................

**భరద్వాజ** 'బాల్యదశ'లో రాసిన మరొక పెద్ద కథ ఈ వీరగాథ. ఇది సమగ్రంగానే ఉంది. ఈ పుస్తకానికి రాసిన పరిచయంలో భరద్వాజ ఇలా అంటున్నాడు.

"1943 నాటి మాట! అప్పటికే తెలుగు కావ్యాల తోనూ, ప్రబంధాలతోనూ కొంత పరిచయం ఏర్పడింది. ఈ పరిచయానికి పరోక్షంగా తోడ్పడిన వారు మా నాన్నగారు. ఆయన తనంత తానుగా ఏమీ వ్రాసిన జ్ఞాపకం నాకు లేదు. కానీ అద్భుతమైన కథలను అత్యద్భుతమైన శైలిలో చెబుతూ వుండేవారు. ఈ కథా గోష్ఠి సంవత్సరాల పర్యంతరం అవిచ్ఛిన్నంగా జరిగింది. శ్రోతలు ఎక్కువ సంఖ్యలోనే ఉండేవారు. ఆనాడు మా నాన్నగారు చెప్పిన కథల్లో కొన్నింటిని ఆ దరిమిలా నేను ఉపయోగించుకొన్నాను. ఈ 'వీరగాథ'కు కూడా 'మూలం' మా నాన్నగారే!" అని అన్నాడు భరద్వాజ.

ఆ తరువాతి వాక్యం జాగ్రత్తగా పరిశీలించదగినట్టిది. "ఇది నా తొలి రచన అనవచ్చు" అన్నదే ఆ వాక్యం. ఇదే తొలి రచన అయితే - ఇంతకు ముందు రచన ఎప్పటిదవుతుంది? వీరగాథ రచనా కాలం 1943. ఇంతకు ముందటి రచనను చేసిన కాలం 43-44 అనుకున్నాం. నామరహితమైన ఆ రచనా శైలికీ వీరగాధ శైలికీ చాలా భేదం ఉంది. ఆ రచనలో క్లిష్టత ఎక్కువ. శబ్దాడంబరం ఎక్కువ. ప్రబంధాల, కావ్యాల, ప్రభావం ఎక్కువ. వీరగాధ కూడా గ్రాంధిక శైలిలోనే ఉన్నప్పటికీ అన్వయ క్లిష్టత లేదు. శబ్దాడంబరం లేదు. ఈ రచన మీద ప్రబంధాల, కావ్యాల ప్రభావం కూడా పెద్దగా లేదు. లేదుగాని అర్థానుస్వారాల మీదా శకట రేఫల మీదా రచయితకు మోజు తగ్గలేదు.

---

1. చూడండి: భరద్వాజ రచించిన 'వీరగాధ' గ్రంథానికి 'నాటికి నేడు' శీర్షికతో ఉన్న పరిచయం. ప్రచురణ 1973.

---

నా అనుమానం ఏమిటంటే, నామ రహితమైన ఆ రచనకూ వీరగాధకూ మధ్య, భరద్వాజ మరి కొన్ని రచనలు చేసి ఉండాలి. అవి పద్య కవితలు, గేయ కవితలు కాక వచన రచనలే అయి ఉండాలి. పోనీ - సందర్భానుసారంగా, సన్నివేశానుసారంగా శైలీ విన్యాసాన్ని మార్చుకొన్నాడన్న యోగ్యతా పత్రాన్ని భరద్వాజకివ్వడానికీ అవకాశం లేదు. కారణం - రచయితగా భరద్వాజ అప్పటికి శిశుతుల్యుడు.

నామ రహితమైన ఆ రచనను చేసింది 1943 ప్రారంభంలోనూ, వీరగాధను రాసింది 1943 చివరిలోనూ అయి వుంటుందా? ఈ సంవత్సర కాలంలోనూ పద్య కవితలూ గేయకవితలూ కాక వచన రచనలెన్నో చేసి తన శైలిని భరద్వాజ సరిదిద్దుకున్నాడా? లేకపోతే 'ఇది నా తొలి రచన అనవచ్చు' అన్న భరద్వాజ మాటను లాంఛనంగానూ, యధాలాపంగానూ అన్న మాటగానే మనం తీసుకోవాలా?

కానీ - ఒకటి మాత్రం స్పష్టమయింది. 1943వ సంవత్సరం నాటికి, వీరగాధను రాస్తున్న నాటికి, భరద్వాజకు "గ్రాంధిక వాసన" వదల్లేదు. వీరగాధను రాశాక, రాసి... సరే! ఆ వివరాలు

ముందు ముందు చెప్పుకొందాం.

వీరగాథలోని కథ అచ్చం జానపద కుటుంబానికి చెందినది. ఒక రాచబిడ్డ ప్రమాద వశాత్తూ అరణ్యంలో తప్పిపోయి, ఒక కోయ పెద్దకు దొరికి, అక్కడే పెరిగి, వారికి నాయకత్వం వహించి ఆ దేశపు రాజుమీద తిరుగుబాటుచేసిన వైనం, ఇందులో చిత్రితమైంది. ప్రప్రథమంగా గ్రాంధిక భాషలో రాసిన ఈ కథ పుస్తక రూపంలో రావడానికి ముందే, శిష్ట వ్యావహారిక భాషలో భరద్వాజ తిరగరాశాడు. ఆ రాయడంలో కథకొక సామాజిక ప్రయోజనాన్ని కూడా జోడించినాడు.

ఉదయుడనే కోయ యువకుడు, అనేక దోపిడీలు చేసి పట్టుబడ్డాడు. రాజుగారు అతనికి ఉరిశిక్ష విధించారు. అతనిప్పుడు కారాగారంలో వున్నాడు... ఇక చదవండి.)

# వీరగాథ

**సభాభవనము** నానుకొని యొక సౌధమున్నది. అందు పురుషులెవరును నుండరు. సభలో నుత్సాహకరములగు విషయములు చర్చించునప్పుడును, విద్యావ్యాసంగములు జరుగునప్పుడును, వినోదాది ప్రదర్శనములు ప్రదర్శించు సందర్భములందును, అంతఃపురాంగన లా సౌధమునలంకరింతురు. సౌధమునకును, సభా భవనమునకును, నడుమ ఒక జాలకమున్నది. సౌధమున నుండువారికి సభయంతయుఁ గనుపట్టును. సభలోని వారికట సౌధమున్నటులే దెలియదు.

ఉదయుని వార్తలు దేశమంతటయుఁ బ్రాఁకినట్లే యంతఃపురమునఁ గూడ బ్రాఁకినవి. తీరికవేళ యంతఃపురస్త్రీ లుదయుని గుఱించి చర్చించుచుండుట వాడుకయైనది. అతని చర్యలపై వారు వాదోపవాదములు జరిపెడువారు.

నాడుదయుఁడు బందిగాఁజిక్కెననియు, విచారణము జరుగుటయుఁ దెలియవచ్చుటతో, నంతఃపురాంగన లందఱును సౌధజాలకమునఁజేరి యాతని జూచు నిచ్చతో నొకరినొకరు త్రోసికొనఁ దొడగిరి. నిగళబద్ధుఁడై యుదయుఁడేతెంచెను. అందఱతోఁబాటంతఃపుర రమణులతనిఁజూచి యబ్బురపడిరి. సభ్యులకుఁ దోచిన సందేహములు వీరికినిఁ దోఁచినవి. వారివలె వీరును నత్యాసత్యముల నెఱుంగలేకుండిరి.

అందఱ మాట యెటులున్నను రాజపుత్రిక చారుమతికి మాత్రము మనసు మనసులో లేదు. ఉదయునిఁ జూచుట తోడనే యామె చిత్తముత్తలపడఁజొచ్చినది. అబ్బురపాటుతో నా రాకుమారి నయనములు వికసించినవి. ఉదయునకు సంబంధించిన గాథలనేకముల నామెయు వినియున్నది. 'అతఁడెవఁడో గాని విచిత్ర చారిత్రుఁ'డని యనుకొనినది. ఉదయుని గుఱించి చారుమతి యూహించిన రూపమునకు, నిప్పటి యాతని యాకృతికి నావంతయేని సంబంధము లేదు. ఈ తరుణుఁడింతటి సంక్షోభమునకుఁ గారణభూతుఁడని యామె భావించినపుడెల్ల, నాపాదమస్తకము బులకితయై పోయెడిది. ఱెప్పలార్పక వానినట్టే చూచెడిది. తల పంకించెడిది.

వీరవర్మ శిక్షఁ జెప్పినాఁడు. రాజభటులుదయునిఁ గొనిపోయినారు.

"మహారాజు తగు శిక్ష విధించినా"రని కొందఱనిరి. "వాఁడొనరించిన ఘోరకృత్యముల కిది యేపాటిది? ప్రభువులింకను గొప్ప శిక్ష వేయవలసినది. దయఁదలఁచి యీ మాత్రముతో విడిచినా, "రని మఱికొందఱనిరి.

ఇచ్చవచ్చిన తెఱంగున నమ్మచ్చెకంటులెల్ల ముచ్చట లాడికొనఁదొడఁగిరి. ఉదయుఁడెంతటి యదృష్టహీనుఁడోకాని, యతని కొసంబడిన శిక్షకై విచారించు వారాపూఁట నావీట లేరు. సభ చాలింపఁబడినది. ఎచటివారచటికిఁ బ్రయాణమైరి. చారుమతి మాత్రమింకను నా జాలకము వొద్దనే గూరుచుండి యుండెను. ఆమె మోము చిన్నవోయినది కనులశ్రువుల రాల్చుచున్నవి.

చంచలయను నేస్తురాలు రాజపుత్త్రిని సమీపించి భుజముపైఁ జేయిడి - "నెచ్చెలీ! ఏమిది యిట్లుంటివి? సభ చాలించి చాలతడవైనది. మనవా రందఱు నీపాటికంతఃపురము చేరికొందురు. నీవింకను గదలవే"మని యడిగెను.

రాజపుత్రిక బదులాడలేదు. చంచలయు చారుమతి దాపునఁ జతికిలఁబడినది. తోడనే రాజకుమారిక విచారించు చున్నదని గ్రహించినది. కారణమేమాయని దీర్ఘముగ నాలోచించినది. చంచల కేమియుఁ దోపఁలేదు. రాజపుత్త్రిని గ్రుచ్చి గ్రుచ్చి యడిగినది. చారుమతి ప్రత్యుత్తరమీయలేదు.

"సఖీ! నేనెంత బుద్ధిహీనురాలను! నా తప్పిదము నేఁటికిఁ గదా తెలియవచ్చినది! రాజపుత్త్రిక కాంతరంగిక సఖులలో నెల్ల, నేనెమిన్ననని నిన్నటి దనుక భావించుచుంటిని! నేఁడు నాకు జ్ఞానోదయమైనది. ఇంక నెప్పుడును నిన్ను నే నేదియు నడుగను. అడిగితినేని శిక్షింపు,"మని చంచల నిష్ఠురములాడినది.

చారుమతి మెల్లన నవ్వి, "ఓసీ! నీకుఁ జెప్పరానిదిందేమియు లేదు. పద అంతఃపురమునకుఁ బోవుద,"మనెను.

"రాజపుత్రీ! నాకడ నీ దబ్బఱలు సాగవు సుమా? 'ఏమియులేదని, నీ వనినంత మాత్రమున, నేమీయు లేదని నేననుకొందుననుకొంటివా యేమి?"

"మఱి యేమున్నదందువు?"

"ఏదియో యుండియే యుండును. లేకున్న నీ కనులేల బాష్పపూర్ణములు గావలసి వచ్చినవి? నిర్నిమిత్తముగ నేడ్చుట యసంభవము. అతిరహస్యమైన జెప్పకుము. అంతియే కాని, 'ఏమియు లే'దని మాత్రమనకుము."

"చంచలా! నీవు చాలా బుద్ధి సూక్ష్మత గలదానవు సుమా! నా కాప్తురాలవు గనుక, నీతో నీ మాటలనుచుంటి. వీనిని పొక్కనీకు,"మని రాజపుత్రికయనినది. చంచలయు నందులకంగీకరించినది.

"చంచలా! మహారాజుదయుని కా శిక్ష విధించుటలో న్యాయ్యమేమియు లేదు. న్యాయ్యమందునేని, మా తండ్రిగారు సైతమట్టి శిక్షకుఁ బాల్పడక తప్పదు. ఉదయుఁడల్ప సైన్యములతో గ్రామములను చుట్టుముట్ట, మా తండ్రిగారనల్ప సైనిక శక్తితో దేశములకు దేశముల

నొకప్పుడు చుట్టిముట్టినారు. స్వల్ప దోషమునకై యుదయుఁడంతటి శిక్షకర్హుఁడేని, మహారాజెంతటి శిక్షకర్హుఁడో యూహింపఁగలవా? ద్రోహమన రెండును ద్రోహములేగదా! ఒక ద్రోహమునకు శిక్షయు, నట్టిదేయైన మఱియొక దానికి శిక్ష లేకపోవుటయు న్యాయ్యము గాదు. ఇద్దఱును శిక్షార్హులే! ఇందొక ద్రోహి శిక్షకుఁడును, మఱియొకడు శిక్షితుఁడునైనారు. ఉదయునకు జరిగిన యీ యన్యాయ్యమునకే నాకేడ్పు వచ్చినది. నీవు నాకొక యుపకారము చేయవలెను. ఇది నీచేఁదక్కనన్యులచేఁగాదు. ఉదయుని నెట్లైన ను విడిపింపవలయును. రేపటి నుండి యఁతడు ప్రదర్శనార్థమై బయటకు తీయఁబడును. మనకప్పుడవకాశమేమియు నుండదు. మనమేమి చేసిన నీ రాత్రియే చేయవలయును. ఏమనెద,"వని చారుమతి యడిగెను. చంచల గుండెల బాదికొనుచు, "రాజపుత్రీ! నీకీయాలోచన యేల కలిగినది? ఇందెంత ప్రమాదమున్నదో నీ కెఱుకవడకున్నది. ఉదయుని పలాయనమునకెవరు కారణమను ప్రశ్నమునకు, మనమేమి యుత్తరమియ్యగలము? ఇట్టి పిచ్చి యాలోచనలఁ గట్టిపెట్టి యంతఃపురమున కేగుదము ర,"మ్మనెను.

"చంచలా! నే నేమో యనుకొంటిని గాని, నీ వింత బేలవని యెఱుంగను జుమా! ఇందు ప్రమాదమున్న నుండుఁగాక! అది మనలనేమియు! జేయఁజాలదు. రాజభటులకిబ్బడిగా ధనము గ్రుమ్మరింపుము. వా రంగీకరింపకపోరు. వారికిని బ్రమాదమేమియు నుండదు. ఉదయుఁడు మాయావియను ప్రచారమున్నది. అది సత్యమైనను యసత్యమైనను కానిమ్ము. ఆ ప్రచారమే యిప్పుడుదయుని రక్షింప! జాలినది. అతఁడు కనుపట్టమికిఁ గారణము స్పష్టముగనున్నది. మాయావి గనుక మాయగనే యాతఁడంతర్హితుఁడయ్యెను. మహారాజుగారు మాత్రమేమి చేయుదురు?"

చారుమతి బుద్ధి సూక్ష్మతకుఁ జంచల లోలోన యచ్చెరువంది "అమ్మా! నా కిందేమియు నభిరుచిలేదు. కాని, ప్రాణసఖివగు నీ యభీష్టమును గాదనలేక యొప్పుకొనుచున్నాను. నేనును శక్తివంచన లేకుండ! బ్రయత్నించెదను. భగవంతుఁడు తోడురాకున్న నే నేమిచేయుదును? రండు, పోవుదము. ఇప్పటికే కాలాతీతమైనది. ఇంకను నాలస్యమైన మనల ననుమానింపఁగల,"రని చారుమతితోఁ గలిసి సౌధము వీడెను.

ఉదయుఁడెంత యదృష్టవంతుడో గాని యతని కొఱకై విచారించువారాపూఁట నావీట నొకరుండిరి.

* * *

యామికుఁడు కాంస్యఘంటికను ముమ్మాఱు మ్రోగించెను. ఆ శబ్దములు చల్లగా సాగి, గాలిలోఁదేలి, క్రమముగ విస్తరిల్లుచు వాయు విలీనములైనవి. ఘంటారావము లంతర్హితములైన యొకటి రెండు నిమేషములయనంతర, మొక తమశ్ఛాయ యంతిపురి వీడి, నిశ్శబ్దముగఁ గదలి, యల్లిబిల్లిగ నల్లుకొనిన పొదలలోఁ గలిసిపోయినది. అనంతరమడుగుల సవ్వడి పొడకట్టినది. ఏవియో నీడలటునిటు నడయాడినవి. గుసగుసలొక యరగడియలో నంతరించినవి. ధనపు సంచులు చేతులు మాఱినవి.

"చంచలా! ఇది చాలా గోప్యముగ నుండవలయును జుమా! రాజపుత్రిక గూడ నిందులకు

సమ్మతించినదని నీ వనుటచే, మేమంగీకరించు చున్నాము. ప్రాణములు నీచేతనున్నవి. మహారాజుగారీతని కొఱకెట్టి ప్రయత్నము లొనర్చిరో నీ వెఱుఁగక పోలేదు. ధనమునకై యాసపడి, మేమిది చేయుటలేదు. మాకీ ధనమక్కరలేదు. మాకు నాలుబిడ్డలున్నారు. దయచేసి నీ వీ రహస్యమును బైట పెట్టకు,"మని యొక స్వరము మెల్లగఁబలికెను.

"వీరపాలా! దీనికింతగాఁజెప్పవలయునా? రహస్యము బైటఁబడెనేని మీతోపాటు నేనునూ శిక్షార్హనే కదా! మీకేమియు భయములేదు. రండు. ఉదయుని నివాసమునకు మార్గము చూపుఁడు తెల్లవాఱుట కిఁకనెంతయో వ్యవధిలే,"దని చంచల పలికినది.

భటులు ముందు నడువ, చంచల వారి ననుసరించినది. అందఱును గారాగృహము సమీపించినారు. అందొకఁడు ఱాలను గొట్టి, చిన్న దివ్వె వెలిగించినాఁడు. ఆ వెలుతురులో, నుదయుని గది యంతయు స్పష్టముగఁగనిపించుచున్నది. కవాటము దీసియున్నది. లోన నుదయుఁడు లేడు. రాజభటుల ప్రాణము లెగిరిపోయినవి. చంచల నిర్విణ్ణురాలయినది. ఒక్క క్షణ మందఱకును జీఁకటులు గ్రమ్మినట్లయ్యెను.

"చంచలా! నీ సాహసము నభినందించుచున్నాను. మీ రాజ పుత్రికకు నా ధన్యవాదము లర్పింపుము. కారుణ్య బుద్ధితో! గాక, న్యాయ్యబుద్ధితో నావిమోచనమునకై పాటుపడిన చారుమతి నిష్పాక్షికతకు నేమిచ్చినను ఋణము దీఱదు. నీ సాహాయ్యము లేకయే, నేను విముక్తిఁబొందితిని. ఇటునున్న మా వారా కార్యమును బూర్తిగావించిరి. యోగముండెనేని మఱియొకతూరి నిన్నుఁ గలిసికొనెదను. సెలవిమ్ము. నీవును నంతిపురికేఁగుము. రాజభటులా ధనముతో సుఖించుదురుగాక," యని యొక సన్నని స్వరము వినవచ్చినది. తరువాత నాకులు గదలిన చప్పుడైనది. మఱి కొంత సేపటికి హయహేషయు, పరుగును వినవచ్చనవి.

* * *

ఉదయుని నూరేగించుటకయి, చేసిన యట్టహాస మంతయు నిలచిపోయినది.అతఁడు పలాయితుఁడైనాఁడని తెలిసినది. వీర వర్మ వంచిన తల నెత్తలేదు. మంత్రిమొగము చిన్నవోయినది. అశేష ప్రజానీకమాయుదయునిఁ జూచుటకచట! జేరినది. వారికీ వింతయెదురైనది. 'రాత్రి వానిని బంధించిరఁట. బీగములు రాజు నొద్దనే యుండెనఁట. ఉదయమగుసరికి ఉదయుఁడదృశ్యుఁడాయెనట. కావలివారలు రజ్జువుతో బంధింపఁబడి యుండిరఁట. వాఁడెంత యైంద్రజాలికుఁడు కాకున్న నిట్లొనర్ప గలఁ,'డని జనులు పరిపరి విధముల ననుకొనఁజొచ్చిరి.

"మంత్రీ! వీఁడు మానవమాత్రుఁడు కాఁడు. సాధారణ మానవుల కిట్టివి యసంభవములు. చావునకో, బ్రతుకునకో, మన కతనితో వైరము వచ్చినది. కానిండు, ఎటులైనను నాకు సమ్మతమే! చాల కాలము తరువాత, మఱల నేను గత్తి పట్టవలసి వచ్చినది. స్వదేశ రక్షణార్థమయి, నేను యుద్ధ మొనర్పక తప్పనటుల లేదు. కోట రక్షణార్థమయి, స్వల్పమగు సైన్యము నిట నుంచుము. తక్కుంగల మన బలము నంతయు, యుద్ధమునకు సిద్ధపఱపుము. విజయమో వీర స్వర్గమో తేలిపోవును.

రేపటివేళ మనమక్కడ నుండవలయు''నని వీరవర్మ మంత్రికాజ్ఞనిచ్చెను.

ప్రయత్నము లతివేగముగ జరిగినవి. మూలనున్న యాయుధములను బండ్ల కెక్కించుకొని, వలయు సంభారములతో, మంత్రి సైన్యాధిపతులతో, వీరవర్మ మఱునాఁటికిఁ గొండ ప్రాంతమును జేరి యట శిబిరములు నిర్మించి కొనెను.

ఆ రాత్రి రాజును, మంత్రియు, సేనా నాయకుఁడును యుద్ధమును గుఱించి, చాలా ప్రొద్దుపోవువఱకుఁ జర్చలు సలిపిరి. ప్రణాళికలు సిద్ధమైనవి. ఈ ప్రణాళికల ప్రకారము సైన్యము మూఁడు భాగములుగ విభాగింపబఁడినది. మూఁడు దెసలనుండియు నొకేమాఱు యుద్ధము చేయఁబడును. ఉదయుఁడు పాఱిపోవుట కిఁక మార్గము లేదు. నాల్గవ దెసయందలిది పర్వత భాగము. మానవమాత్రుల కారోహణావరోహణములట సాధ్యములు గావు.

మఱునాఁడు యుద్ధము ప్రారంభమైనది. వీరవర్మ సైన్యము ముమ్మొన యుద్ధ మెనర్ప సాగినది. బాణము లసంఖ్యాకములుగ కొండపైఁ గురియుచుండెను. సైనికులు వీరాలాపము లాడుచు పురోగ మించు చుండిరి. కాని, కోయల విల్లునంబుల ధాటికి, వీరవర్మ సైనికులాగఁ జాలకుండిరి. రాజసైన్యము ప్రయోగించు నాయుధములేమియుఁ, గోయలను, గాయపఱుచుట లేదు. వారు పెద్ద పెద్ద శిలల వెనుక దాఁగికొని, యదను చూచి యెదురు ప్రయోగములు చేయుచుండిరి. వీరవర్మ యాయుధసంపత్తి, కొండఱాలకుఁ దగిలి వమ్మగు చుండెను. వానిని కోయలు సంతరించి, తిరిగి రాజసైన్యముపైఁ బ్రయోగించు చుండిరి ఒక్కొక్క వేళ వీరవర్మ సైనికులు, ముందుకు వచ్చుచున్నట్లు దోఁచినచో పెద్ద శిలలను. క్రిందకు దొరలించి, కోయలు వారి పురోగమనము నరికట్టుచుండిరి. ఆ పాషాణ ఘాతమున కపారముగ రాజసైన్యము మడియుచుండెను. ప్రొద్దు గ్రుంకుటతో నాటి యుద్ధ మాపి వేయఁబడెను.

నాయక త్రయమున కేమియుఁ దోఁపలేదు. వారి ప్రణాళికలన్నియు వమ్మయిపోయినవి. ఈ నాఁటి యుద్ధమున వారేమియు సాధింపలేదు. మీఁదు మిక్కిలి యధికమగు నష్టము సంభవించినది. వందల కొలఁది సైనికులు మరణించిరి. ఇంకెందఱో వికలాంగులైరి. అపారమగు నాయుధసంపద కోల్పోవలసి వచ్చెను. రెండవ నాఁటి యుద్ధమున కవశ్యమగు విషయములను జర్చించుకొని మంత్రియు, సెన్యాధికారియుఁ దమ తమ నివాసముల కేఁగిరి. వీరవర్మయుఁ దల్పముపై మేను సేర్చి కనులు మూసెను...

ఇంతలో నేదియో చప్పుడైనది. వీరవర్మ యలికిడికి కనులదెఱచెను. అతని కభిముఖముగ నుదయుఁడు కరవాలము ధరించి ప్రత్యక్షమయ్యెను. తన సైన్యమంతయు నేమైనది? శిబిర రక్షకులెక్కడ? ఇందఱ కనుగప్పి యితండెట్లు లోనికి రాఁగలిగినాఁడు? ఇది స్వప్నమనుననుమాన మొకటి వీరవర్మకుఁ దోచిఁనది. తా ననవరత మాతని స్మరించుటచే, స్వప్నమున గూడ వీఁడు దర్శనమిచ్చుచున్నాఁడని భావించి వీరవర్మ తిరిగి విశ్రమింపఁబోయెను.

ఉదయుఁడు, వీరవర్మనుఁ దట్టిలేపుచు, ''ప్రభూ! ఇది స్వప్నమనుకొనుచుంటిరా యేమి? కాదు, నేను నిజముగ నుదయుఁడనే! మీతోఁగొన్ని విషయములు చర్చింపవలయునని యా

యర్ధరాత్రమున నిటకు వచ్చితిని. మీరు బిగ్గరగా నఱచుటవలన బ్రయోజనమేమియు లేదు. శిబిర రక్షకులపై మత్తుఁజల్లి వచ్చితిని. వారింతలో మేల్కొనరు. ఇప్పుడు మీ ప్రాణములు నా చేతిలో నున్నవి. సహాయము మీరర్థించులోపల, దానితో మీ యక్కఱ దీఱిపోవును. ప్రభూ! ఈనాఁటి యుద్ధమున మీకేమియు లభించి యుండలేదు గదా! మఱి కొన్ని దినముల యనంతరమేని, మీ రద్దానికి భిన్నమగు ఫలితమును బొందఁ జాలరు. యుద్ధము తీవ్రముగ జరుగుచున్నప్పుడు, కొండపై నుండి నేను మీ సైనికులను జూచితిని. మహాశిలల క్రిందఁబడి తుత్తునియలై గొందఱును, శరాఘాతములఁ గొందఱును మరణించితిరి. ఇంత యపార నష్టమేల కలుగవలయునో నాకు స్ఫురింపకున్నది! వారందఱెందుకొఱకీ రణమొనర్చుచుండిరో, యెందుకొఱకసువులనర్పించు చుండిరో వారికిఁ దెలియదు. మన కొఱకై వారేల పోరు సల్పవలయును? మీరంగీకరించు మంటిరేని యొక సూచన చేయువాఁడ. కార్యార్థులమగు మన మిద్దరము యుద్ధము సేయుదము. నేనోడితినేని నా యావత్సంపదయు మీ యధీనమగును. మీరోడితిరేని యర్ధరాజ్యము నా కొసఁగుడు. మీ యభిప్రాయమేమి? కాదందురేని యథావిధి కయ్యము సేయుటకు నేనును సిద్ధముగనే యుంటి”నని యుదయుఁడనెను.

ఉదయుని సూచన ధర్మ సమ్మతముగఁదోఁచుటచే, వీరవర్మ యాతనితోఁ గత్తి యుద్ధమొనర్చుట కంగీకరించెను.

ఇరువురును విచిత్రగతుల కత్తులఁ ద్రిప్పుచు, నొకరి నొకరు వ్రేయఁ బోవుచుండిరి. ఒకపరి వీరవర్మ కరవాల, ముదయుని తలఁదెగవేసెడిదే! ఉపాయముతో నతఁడు కూలం బడినాఁడు. ఆ వ్రేటుకు శిబిరపుఁ గంబము తెగిపడినది. మఱియొక తూరి వీరవర్మ గుండెలు బద్దలు కావలసినది. ఎదురెత్తుతో వీరవర్మ యా దెబ్బఁ దప్పుకొనినాఁడు. కత్తులొండొంటిని ‘ఖణ ఖణ’ మని తాఁకుచుండెను. గాలిలో రివ్వు రివ్వున దూసికొని పోవచుండెను. ఉదయుఁడు తరుణ వయస్కుఁడు దృఢగాత్రుఁడు. వీరవర్మ కౌమారదశలో నున్నను విశేషమగు ననుభవ జ్ఞానము కలవాఁడు.

ఈ ధ్వనులకు వీరవర్మ సైనికులు నిద్దుర మేల్కొని యుదయునిఁ జుట్టుముట్ట యత్నించిరి. వీరవర్మ వారింపనిచో నతఁడీ సరికి నేలఁ గూలియుండును. జయాపజయములు నిర్ణయింప నేరిక శక్యము కాకుండెను. ఇంతలో నున్నటులుండి యుదయుఁడొక వ్రేటు వేయుటయు, నా ధాటి కోఁజాలక, వీరవర్మ కరవాలమల్లంత దూరమునఁ ద్రుళ్ళి పడుటయు జరిగినది. వీరవర్మ నిరాయుధుఁడాయెను. ఒకే యొక ఖడ్గ ప్రహారముతో వీరవర్మ రాజ్య, ముదయుని పాదాక్రాంత మగును. కాని యుదయుఁడా కార్య మొనర్పలేదు. స్వయముగఁ దానే వేఱొక ఖడ్గమతని కిచ్చుచు - “ప్రభూ! రాజ్యలోభమునకు దాసుఁడనైనేనధర్మ యుద్ధ మొనర్పఁజాలను. ఆయుధ రహితునితోఁ బోరి గెల్చుట నీచాతినీచము. రండు, మఱల ద్వంద్వయుద్ధమాచరింతము. జయాప జయములు భగవదధీనము,”లని పలికెను.

వీర వర్మ యుదయుని ధర్మనిష్ఠకు నిశ్చలుఁడయ్యెను.

“ప్రభూ! ఆలోచించుచుంటిరే?”, మని యుదయుఁడడిగెను.

"ఉదయా! నేను నీతో యుద్ధము సేయువాఁడను గాను. నీ వనినటుల జయాపజయములు భగవదధీనములు. దురదృష్టమున నీవోడితివేని, యొక ధర్మనిష్ఠా గరిష్ఠుని, లోకమున లేకుండఁజేసిన వాఁడ నౌదును. నీయట్టి విశాల హృదయునితో రణమొనర్ప నా మనమంగీకరించుట లేదు. నేఁటితో నీకును నాకును సఖ్యము గుదిరిన,"దని వీర వర్మ గద్గదతో ననెను.

* * *

కోయనాయకున కానందము మిక్కుట మైనది. డగ్గుత్తికచే నేమాటయుఁ బెగిలి రాలేదు. అవును. అతని జీవితమున కింతకంటె సంతోషకరమగు సమయమేముండును? కోయ పల్లెలోఁ బెరిగిన యుదయుఁడేడ, మహారాజ సన్మానములందుటేడ? చూడఁజూడ నిదియంతయు నొక దీర్ఘస్వప్నమువలె వానికిఁదోచెను. ఉదయుని తండ్రి యతి వృద్ధుఁడైనాఁడు. తల్లియుఁదత్తుల్యయైనది. దాసీ దాస మహరహము వారి సేమమును బరామరసించు చుండును. ఉదయుఁడెంత కార్యభారములో నున్నను, వారమున కొకతూరి యేని, వారిని దర్శించుచుండెడివాఁడు. వారును తగు విధములఁ, గుమారుని బుజ్జగించి యనుపుచుండెడివారు. ఒక్కొక్క నూతన యత్నము ప్రారంభించినపుడెల్లఁ దల్లి కల్లోల పడెడిది. ఆమె దృష్టిలో నిదియంతయు నిరర్థకమగు శ్రమ, ఏరికోరి తన బిడ్డడేఁదో యపాయము దెచ్చికొనునని భావించుచుండెడిది. కాని, యుదయుని ప్రయత్నముల వెనుకనున్న మహత్తరమగు సత్యములామెకుదెలియవు. ఆమె భావనాశక్తి కవి యతీతములు. కోయనాయకుఁడుదయుని గుఱించి యంతగా నాలోచింపఁడు. తన కుమారుఁడజ్ఞానిగాఁబ్రవర్తింపఁడను నమ్మకమాతనికిఁగలదు. లోలోన నెంత మథనపడిన నది వెలికిఁదోఁపనిచ్చెడు వాఁడు కాఁడు. కార్యాలయము నందలి యున్నతాసనమునందునిష్ఠుఁడై, జటిల సమస్యను దర్కించునప్పుడును, హయా రూఢుఁడై యెల్లెడలం దానయై గన్పట్టుచు, సైన్యముల కాజ్ఞలిచ్చునప్పుడును, దిగ్దంతులవంటి వారు సైత మతని యాజ్ఞా బద్ధులై హోసాడు లొనర్చునప్పుడును, నాయకుఁడుదయునిఁ జూచి లోలోన నుబ్బి పోయెడివాఁడు. ఒక్కొక్క తఱి యతని యుద్ధకౌశలముఁగని యబ్బురపాటు చెందును. ఆ యాయుధముల ప్రోవులు, సైనిక బలము, కోశాగారము, వివిధ కార్యాలయముల కట్టడములు తిలకించి వీని కన్నిటికిని నీ యనాథ బాలకుండా కారణమని విస్తుపోవును.

'ఉదయుఁడదృష్టవంతుఁడా! లేక తా మదృష్టవంతులా?' యని యొక్కొక్క సమయమునఁ జర్చలు చేసికొనును. ఉదయుఁడు లేకున్నచో నిక్కడి జీవన వాహినిలోఁ బరినామము వచ్చెడిది గాదు. యథావిధిగ నది సాగిపోయెడిది. ఉదయుని రాకతో నంతయుఁజిత్రముగ మాఱిపోయినది. ఒక శతాబ్దిలోని జీవిత మొక వత్సరములో జీవింప వలసి వచ్చినది. యుదయుఁడుఁ గూడ నదృష్ట శాలియే! లేకున్న నాతని యునికియే ప్రపంచమున నుండెడిది గాదు.

ప్రయాణమున కన్నియుఁ సిద్ధపఱుపఁబడినవి. నేఁడు చంద్ర నగర రాజధానిలో నుదయునికి సన్మాన మేర్పరుపఁ బడినది. మహారాజు సతీసమేతముగా నీ యుత్సవములోఁ బాల్గొనును. దేశ

దేశముల యందలి ప్రముఖులకు శుభలేఖలంపఁబడినవి. ప్రఖ్యాతికెక్కిన కవులు, గాయకులు, నృత్య నాటకకారులా యుత్సవమును బరిపూర్తి యొనర్చుట కాహ్వానింపఁబడినారు. రాజ కుటుంబీకులధిరోహించు శకటము లింకను రాజధానినుండి రాలేదు. కోయ సైన్యము లీ సరికి రాజధానిఁ, జేరియుండును. ఉన్నత కక్ష్యకుఁ జెందిన యుద్యోగులు, కొలఁదిమంది సైనికులు మాత్రముదయుని గౌరవార్థమింకను బల్లెలో నున్నారు. ఉదయుఁడమూల్య వస్త్రాభరణాదులచే నలంకరింపఁబడినాఁడు. సహజ సౌందర్య రాశియైన యతని కా యలంకారములు మఱింత వన్నెఁదెచ్చినవి.

ఇవి యన్నియుఁ జాల వన్నట్లు, వృద్ధుడు మఱికొన్ని యాభరణములచే నుదయు నలంకరించుచు, "బాబూ! ఇవి యమూల్యాభరణములు. వీని ప్రభావముననే నీ వింతవాఁడవైతివి. ఈ యాభరణముల వెనుక నొక గాథ యున్నది. వేఱొకప్పుడు నీ కా గాథఁ జెప్పెద." నను నంతలో శకటములు వచ్చి వాకిట నాఁగినవి.

నాఁటి చంద్రనగరమున నే వంకఁ జూచినను నుదయుని కథలే జెప్పికొనుచుండిరి. దేశ దేశముల యందటి మాననీయులెందఱో, నాఁటి సన్మాన మహోత్సమునఁ బాల్గొనిరి. ప్రాతః కాలమున నుదయుఁడు రాజవీధులలో నూరేగెను. పురపరంధ్రీ లలామ లతనిపై ముత్తెపు సేసలు చల్లిరి. మంగళ వాద్యములు మ్రోసినవి. జయజయనినాదము లెగసినవి. వీరవర్మ సైనికులు ముందు బారులుదీరి నడువ, నుదయుని సైన్యము వెనుక వచ్చుచుండ, నుదయుఁడు గజా రూఢుఁడూ రాజవీథుల నూరేగెను.

ఉత్సవానంతరము రాజ సింహాసనమునకు దాపునగల యాసనముపై నుదయుఁడు పవిష్ఠుఁడాయెను. ఉభయుల ప్రధానోద్యోగులను, బుర ప్రముఖులును, సామంతులును, లలితకళోపాసకులును వచ్చుటతోఁ గ్రమముగ నా సభా భవన మంతయు నిండెను. సామాన్య జనుల కటఁ జోటులేదు. ఉదయుని తలిదండ్రుల కొక దెస నాసనము లేర్పాటు చేయఁబడినవి. అంతఃపురాంగనలు గూడ జాలకము నుండి నిదియంతయుఁ జూచుచుండిరి. ఒకప్పుడిటకు బంధితుఁడుగాఁ గొనిరాఁబడిన యుదయుఁడిపుడు రాజ లాంఛనములతో గౌరవింపఁ బడుచున్నా!డు.

ఒక్కొక్కరు లేచి, యుదయుని శౌర్యమును. వీరత్వమును బరిపరి విధముల, నభినందించుచు నుపన్యసించు చుండిరి. చంచలయు చారుమతి దాపునఁ గూర్చుండి, మద్య మధ్య రాజపుత్రిక నపహసించుచు, యానాఁటి యతని పలాయనమును గుఱించి వివిధ గతుల నూహింపఁదొడగెను.

ముఖ్యులగు వారి యుపన్యాసము లన్నియు నైనవి. ప్రధాన మంత్రి లేచి, సభను నిశ్శబ్దముగ నుండ వేఁడి తన యుపన్యాసమును బ్రారంభించెను.

"మహాజనులారా! మన మింతకాలము నుండియు! దెలియక యొక తప్పిదము నాచరించు చుంటిమి. పొరపడుట ప్రతివారికిని సాజము. ఆ తప్పిదమును మన్నింపుడని యుదయుదత్తుఁడు గారిని నే నర్థించు చున్నాను. వారి గుణగణములను గూర్చి, మీకు వేఱుగ నేను జెప్పనక్కరలేదు

గదా! వారు మహాపండితులు. బహుశాస్త్ర కోవిదులు. శౌర్యధన సంపన్నులు. వారి బుద్ధి సూక్ష్మతకు నిదర్శనముగ నెన్నేని సంఘటనముల నుదహరింపవచ్చును. చిత్రాతి చిత్రముగఁ బ్రచారమందున్న గాథలు, వారి నైపుణ్యమును వేనోళ్ళఁ జాటుచున్నవి. ఇంతలి బలసంపన్నులయ్యును వీరికి గర్వమనునది లేదు. భూతదయ దర్మనిష్ఠలు వీరి నిధులు. ఇటీవల ద్వంద్వ యుద్ధములో, ధర్మమునకు గట్టుబడి మన ప్రభువువారి ప్రాణములను గాపాడిరి. ఇంతటి చిన్న వయస్సులో నిన్ని సుగుణముల కిక్కయైన యీ మహాబాగుఁడు, నేటి నుండి మన కాప్తవర్గము లోనివాఁడు. వీరు మన ప్రభువు వారి కాంతరంగిక సచివులుగా నియమింపఁ బడిరి. శ్రీ శ్రీ శ్రీ ఉదయదత్తుఁడుగా రా పదవిని స్వీకరింతురు గాక,'' యని ముగించెను.

సభలోఁ గరతాళములు చెలరేఁగినవి. ఉదయుఁడు లేచి, యందఱకును బ్రణమిల్లి రాజసింహాసనము దాపున కేఁగెను. రత్న ఖచిత మగు నొక ఖడ్గమును. వీర వర్మ యుదయునకిచ్చుటకు ముందునకు వచ్చుటయు, దాని నందుకొను నిమిత్తముదయుఁడు వంగి ముందునకేఁగుటయుఁ జరిగెను. అప్రయత్నముగ వీర వర్మ దృక్కులుదయుని యాభరణములపైఁ బ్రసరించినవి. నిమిషకాల మతఁడట్టె పరిశీలించినాఁడు. వీర వర్మ వదనము వివర్ణమైనది. కర చరణములు కంపించినవి. అతఁడెట్లో యంతి ప్రయత్నమున సింహాసనములో గూలఁబడెను. క్రిందటి నిమేషము వఱకు నానందోత్సాహములతోఁ బిలపిల లాడుచుండిన సభా భవనమంతయు, నిప్పుడాశ్చర్యముతోఁ జిత్రాకృతిఁదాల్చినది. ప్రధానమంత్రి నివ్వెఱవోయెను. ఉదయదత్తుఁడు మతిభ్రమణము కలిగినట్లుండెను. కోయదంపతలు గుండె లవిసినవి. అంతఃపుర స్త్రీ జనమ్ముల మనమ్ము లాకులపాటు నొందెను. చారుమతి చంచల వంకఁ జూచినది. చంచల మిన్ను బరికించినది. సభ్యులలో మెల్లగా సంది ప్రారంభమైనది. ఉదయుఁడేదో మాయాజాలము ప్రయోగించినాఁడనియు. నందుచే మహారాజిట్టులైనాఁడనియు నొకఁడు బిగ్గరగా నఱచెను. అందఱు 'నదె సత్యమదే సత్య'మని యఱచిరి. ''పట్టుకొనుఁడు... మహాచోరుఁడు... బంధింపుఁడు, యాలసించినఁ బాఱిపోవు,''నని ధైర్యశాలురగు కొందఱు దూరమందుండి కేకలిడుచుండిరి. వీర వర్మ వారింపనిచో నాఁటి సభ గగ్గోలు కాక తప్పెడిది కాదు.

వీర వర్మ యాపాదమస్తక ముదయుని గ్రుచ్చి గ్రుచ్చి చూచుచు, తల పంకించుచు, నాలోచించుకొనుచు నుండెను. ఆ చేష్టల కర్థమేమియో యెవరికిని బోధపడలేదు.

ఉన్నట్టులుండి వీర వర్మ ''నాయనా! నీ జననీ జనకులెవ?''రని యుదయుని ప్రశ్నించెను.

ఉదయుఁడు కోయనాయకుని, నతని భార్యను జూపించుచు, ''వా''రని సమాధానమిచ్చెను. ''ప్రభూ! ఏల యట్లు ప్రశ్నించుచుంటిరి? ఈ సభ్యులన్యాయ్యముగ నన్ను దూషించు చున్నారు. మీ తీరు జూడ మీ రేదియో రహస్యముగ నాలోచించుకొని వచ్చినట్లున్నది. అవమానమును నేను సహింపను జుమీ! మీ సభా మధ్యమందుంటినని తలంపకుఁడు. అగ్ని కణ మెచటనున్నను, దనపని నిర్వహింపక పోదు. ఆలోచించు కొనుడు.''

వీరవర్మ మోమున క్రోదచ్ఛాయలు నెమకు వారి యాస లడియాసలైనవి. ఉదయుని యా

రీతి భాషణమున కతఁడు కుపితుఁడు కాలేదు. వృద్ధ దంపతులను దగ్గఱకుఁ జీరి, "ఓయీ! నేను మిమ్మేమియు ననను. నిజము చెప్పితిరేని మీరు కోరిన బహుమానమిత్తును. నిక్కము వక్కాణింపుఁడు. ఈ యుదయుఁడు మీ కుమారుఁడా?" యని ప్రశ్నించెను.

కోయనాయకుని శరీరమెల్లఁగంపించినది. అతఁడెన్నండును సభా ప్రవేశము చేసినవాఁడు కాదు. అట్టి యెడ నిట్టి సభలో యిందఱి సమక్షమున, నొక ప్రశ్నకుఁ బ్రత్యుత్తర మిచ్చుటయన్న సామాన్యమా? భయముచే నాతఁడేమియు బదులు చెప్పలేదు.

"పితృపాదు లేల భయపడుచున్నారు? ఇందు భయపడునక్కఱ యేదియు లేదుగదా! నేను మీ కుమారుఁడనే యని చెప్పుటకేల సంశయించుచున్నా?"రని యుదయుఁడొత్తియొత్తి యడిగెను.

నాయకుఁడు తెప్పఱిల్లి, "సంశయమెందులకు నాయనా! నీవు నాకుఁగుమారుడవు గాక మరేమవుదువు? నాకు భయమేమియు లే,"దనెను.

వీరవర్మ మొగము మఱల మ్లానమైనది. "ఐనచో నీ సువర్ణ రత్నాభరణములు నీకెట్లు లభించినవి? రాజ కుటుంబములందక్క నిట్టి యాభరణములితరులు ధరింపఁజాలరు. సత్యము వక్కాణింపుము. నీకే యపాయమును రానీయను. భగవంతునిపై నొట్టిడి చెప్పుచుంటిని. నీ యుదయునకును. నీకును నెట్టికీడు రాదు. చెప్పుము. నిజము చెప్పు," మని వీర వర్మ తొందర పెట్టెను.

ఉదయుఁడు తండ్రి దిక్కు మొగంబై, "తండ్రీ! యిందేదైన రహస్యమున్న బయటఁబెట్టుము. నీకెట్టి భయమును వలదు. ఒక వేళ నీ కీ రాజు కీడు దలపెట్టెనేని యావల యాలోచింత,"మనుటతో, వృద్ధుఁడు తెప్పఱిల్లి, కంఠము సవరించుకొని యిట్లు చెప్పెను.

"అయ్యా! ఇరువదియైదేండ్ల క్రిందట వేఁట జాగిలముల వెంటఁదీసుకొని, సాటివారు తోడురాగ నరణ్యమునంబడి పోవచుంటిని. ఇంతలో నొక దెసనుండి నా వీనుల కార్తధ్వనులు గోచరించినవి. బలములఁదరలించుకొని నే నట కేఁగుసరి, కొక బెబ్బులితో నిరువురు రాజ భటులు పోరాడుచుండిరి. మా బాణము లా వ్యాఘ్రమును దాఁకులోపల నది భటులను, సమీపస్థయై యున్న స్త్రీని, విగతజీవులను జేసి వైచినది. బెబ్బులి దూఁకు నుదుటులోనాపె సందిటనుండి జారిపడిన యీ శిశువును నేను బెంచుకొంటిని. ఉదయమున నాకు దొరకుటచే నేనీ బాలకునికి ఉదయదత్తుఁడను నామ ముంచితిని. ఈ యాభరణము లామె ధరించినవే! నేనే వాని నటనుండి తెచ్చుకొంటిని. ఇంతవఱకు నే నెఱుంగుదును- అయ్యా! మీ పాదములనంటి వేఁడికొందును. నా యుదయుని నేమియుఁ జేయకుఁడు. ఇందేమైన తప్పిదమున్న నన్ను శిక్షింపుఁ,"డని వృద్ధుఁడనెను.

సభయంతయుఁ జిత్తరువు వలెనైనది. చారుమతికి ప్రపంచ మంతయు బరిభ్రమించు చున్నట్లు దోఁచెను. అంతఃపుర స్త్రీలు ముక్కుపై వ్రేలిడుకొనిరి. ఉదయుఁడేమియు మాటాడలేదు. వీర వర్మ మాత్రమే వెక్కి వెక్కి యేడువఁ దొడంగెను.

ప్రధానమంత్రి లేచి యెకిమీని సమీపించి - "ప్రభూ! ఏమిది? ఇది సభా భవనము! బేలవలె

మీరు రోదించుట యుక్తము కాదు. ఆ యాభరణములు మీ యాప్తవర్గములోని వారివా యేమి?'' యని యడిగెను.

''ఔను. వివాహ కాలమున సోదరి విద్యావతికిఁ దండ్రిగారు చేయించిన యాభరణములివి. ఆ రత్న హారమును బరీక్షింపుము. దానిపై విద్యావతి నామధేయము చెక్కఁబడి యుండును. తండ్రిగారీ రత్నములఁగాశ్మీర బేహారుల యొద్ద విలిచినారు.''

మంత్రి యుదయుని మెడలోని రత్న హారమును బరీక్షించెను. వీరవర్మ యనినట్లు దానిపై, విద్యావతియను నక్కరములు జెక్కంబడి యున్నవి.

అప్పుడంతయు విశదమైనది. ఆనంద విచారము లొక్కపరి పెల్లుబుక, నొకరినొకరు గాఢానుశ్లేష మొనర్చుకొనిరి. వీర వర్మ కోయదంపతులకుఁ బ్రణమిల్లి, ''మీరు లేనిచో నా మేనల్లుఁడు నాకుఁ దక్కెడి వాఁడు గాఁడు. వీనికి నిజముగఁ దలిదండ్రులు మీరె. మీరును మన యుదయునితో పాటుగ రాజభవనమున నుండవలయును.'' సంతోషాతి శయమున వీర వర్మ యంతకంటె నెక్కుడు మాటాడలేకపోయెను.

సభ్యుల హర్షధ్వనులతో భవన మంతయుఁ బ్రతిధ్వనించినది. నాఁటి యుదయుని జన్మానమహెూత్సవ, మీరీతి శుభావహముగఁ బరిణమించి నందుల కందఱును సంతోషాయత్త చిత్తులైరి.

మంత్రి మెల్లన నవ్వుచు, ''ప్రభూ! ఉదయునిఁదమనాంతరంగికామత్యులుగా నియమించుటంత యుత్తమముగాదు. మేనల్లుని నల్లునిగాఁ జేసికొన్న నది మేనల్లుని గౌరవించుట యగును గాని, యాంతరంగికామాత్య పదవి నిచ్చినచో నది యగౌరవము కాకపోదు. మేమా శుభముహూర్తమునకై యెదురు చూచుచుంటి,'' మనెను.

జాలకము కడఁ కూర్చుండియున్న, చంచలా చారుమతుల కా మాటలు వినఁబడినవి. చంచల ముసిముసి నవ్వులు నవ్వుచు చారుమతిని జూచినది. చారుమతి చెక్కిళులపై సిగ్గులు, నునులేఁత మొగ్గలు దొడగినవి.

* * *

**1943 చివరి వరకూ,** పోనీ 1944 తొలి అర్ధ సంవత్సరము వరకూ, భరద్వాజను 'గ్రాంధిక వాసన' విడిచి పెట్టలేదనుకొన్నాం. కానీ, అలా విడిచి పెట్టవలసిన తరుణం అప్పటికే ఆసన్నమయి ఉంది. వీరగాధకు రాసిన పరిచయంలో భరద్వాజ - ''ఇది నా తొలి రచన అనవచ్చు'' అన్నారు. ఆ తరువాతి వాక్యాలను చాలా చాలా జాగ్రత్తగా చూడడం మరీ మరీ అవసరం-

1 ''ఆ రోజుల్లోనే ప్రఖ్యాత కథకుడు జీవన ప్రభాత్ గారు ఉద్యోగ రీత్యా మా గ్రామంలో కొంత కాలం ఉన్నారు. వారికీ రచన (వీరగాధ) చూపించాను. సాయంత్రానికల్లా పూర్తి చేశారు. నా రచనను తిప్పి ఇస్తూ కొన్ని పుస్తకాలు కూడా ఇచ్చారు. అవి చలంగారి పుస్తకాలు. ఆధునిక కథా సాహిత్యంతో నా పరిచయం అలా ప్రారంభమయింది.''

ఆ ప్రారంభానికి ముందు నుంచే భరద్వాజకు కథా ప్రపంచంతో ప్రత్యక్షంగా పరోక్షంగా సంబంధాలేర్పడ్డాయి. భరద్వాజ నాన్నగారు - రావూరి కోటయ్యగారు 2. ''మంచి గాయకుడు. ఉత్తమ సంస్కారి. తత్వానందుల వారి సన్నిధిన ఉపదేశం పొందిన వారు. ఉన్నవ లక్ష్మీనారాయణగారికి అతి సన్నిహితులు. పంతులు గారి ప్రేరణ వల్లనే సంఘ సంస్కార కార్యకలాపాలలో శ్రీ కోటయ్యగారు పాల్గొంటూ ఉండేవారు. ఆయనగారు ఉన్నవ వారి ప్రోద్బలం మీదా సరదా కోసమూ - శాసనాలను సేకరించారు. ఉన్నవ వారే - తమ మిత్రుడైన త్రిపురనేని రామస్వామి చౌదరిగారికి, కోటయ్య గారిని పరిచయం చేశారు.

3. ''తదాదిగా రావూరి వారు, రామస్వామి గారు, అత్యంత ఆప్తులుగానే జీవించారు.''

తెలుగు కావ్యాలతోనూ, ప్రబంధాలతోనూ, తనకు పరిచయం కలగడానికి - పరోక్షంగా -తన తండ్రి గారే కారణమన్నాడు భరద్వాజ. ఆయన తనంత తానుగా వ్రాసిన జ్ఞాపకం కూడా తనకు లేదన్నాడు.

---

1. చూడండి: 'వీరగాధ'కు భరద్వాజ రాసిన పరిచయం. ప్రచురణ 1973.

2. చూడండి: డాక్టర్ సి.హెచ్.దేటవానందరావు గారి వ్యాస సంపుటి 'మంజూష''.
ప్రచురణ: 1973.

3 చూడండి: పైపుస్తకం.

---

4. ''కానీ అద్భుత మైన కథలను, అత్యద్భుతమైన శైలిలో చెబుతూ ఉండేవారు.

.... ఆనాడు మా నాన్నగారు చెప్పిన కథల్లో కొన్నింటిని, ఆదరిమిలా నేను ఉపయోగించుకొన్నాను,'' అన్నాడు భరద్వాజ. కథా కథన చాతుర్యం కోటయ్యగారికి బాగా ఉండి ఉండాలి. ఏ చిన్న సంఘటన నైనా - అటూ ఇటూ సాగదీసి, కాస్త కలిపి, ఇంకాస్త తీసివేసి రుచికరంగా తయారు చేసి చెబుతుండేవారేమో!

5. ''(ఆ కవిలె కట్టల్లో) అక్కడక్కడా తాము చూసిన సంఘటనలను మా నాన్నగారు కథలుగా మలచి చెబుతుండేవారు. ఈ (చిలుక తీర్పు) సంపుటంలో చేర్చిన వేంకటాద్రి నాయనింగారి కథలకు అవే ఆధారాలు'' అన్నాడు భరద్వాజ.

ఇలా తండ్రి వేపు నుండే కాక - తల్లివేపు నుండి కూడా కథలు వినే అవకాశం అతనికి లభించింది.

6. ''మోగులూరు సుబ్బమ్మగారని, మా అమ్మమ్మగారు, మహాద్భుతమైన కథలు చెప్పేది. పన్నెండు మంది రాజకుమార్తెల కథలను ఆమె అరవై రోజులపాటు చెప్పింది... ఒక్కోసారి ఆ ఉపకథల్లోనే ఎన్నో చిన్న కథలు, చిట్టికథలు దొర్లుకొస్తాయి. ఇలా ఒక్కొక్క కథనే ప్రతి ఏడాది చెప్పడం కాదు - ఏ సంవత్సరానికా సంవత్సరం కొత్త సీరియల్ ప్రారంభించేది. అందులో హాస్యం, భీభత్సం

శృంగారం, అద్భుతం సమస్తమూ ఉండేవి.''

....................................................................................................................................

4. చూడండి: 'వీరగాధ'కు 'నాటికి నేడు' శీర్షికన భరద్వాజ రాసిన పరిచయం. ప్రచురణ: 1973

5. చూడండి: ''చిలుక తీర్పు'' కథా సంపుటానికి 'అనగా అనగా అనగా...' శీర్షికన భరద్వాజ రాసిన పరిచయం. ప్రచురణ: 1982

6. చూడండి: భరద్వాజ రచించిన 'కంచికి వెళ్ళిన కథ'' ప్రచురణ: 1967.

....................................................................................................................................

చిన్నతనంలో ఆ కథలన్నీ వినడంవల్ల భరద్వాజ లాభ పడ్డాడు. అతను పిల్లలకోసం రాసిన కథల్లోనూ, నవలల్లోనూ, తను చిన్న నాట విన్న కథలు కొన్నయినా దొరలి ఉంటాయి.

సరళ గ్రాంధికంలో రాసిన 'వీరగాధ' వ్రాత ప్రతిని జీవన ప్రభాత్‌గారు సాయంత్రానికల్లా తిరిగి ఇచ్చేస్తూ చలంగారి పుస్తకాలు కొన్ని భరద్వాజకిచ్చారు. ఆధునిక కథా సాహిత్యంతో తన పరిచయం అలా ప్రారంభమయిందన్నాడు భరద్వాజ.

అలా ప్రారంభమయ్యాకనే - భరద్వాజ సాంఘిక కథలు రాయడం ప్రారంభించారు. ఎన్ని రాశాడో, ఏయే పత్రికలకు పంపించాడో దాఖలాలు లేవు. పంపించినవన్నీ కావుగానీ - ఎక్కువ భాగం సురక్షితంగా అతనికి తిరిగొచ్చాయి. ఇంకొన్నింటి అతీగతీ తెలియదు. అలా ఆనవాలు లేకుండా పోయినవి పోగా పోగా - ఒక కథ అనుకోని విధంగా 'ప్రజా మిత్ర'లో అచ్చయింది.

7. ''నా మొదటి కథ 1945లో అచ్చయింది''అని భరద్వాజ చెప్పుకొన్నా, 8. 1944-45 సంవత్సరాల్లో భరద్వాజ తొలికథ అచ్చయిందని, విమర్శకులన్నా అది నిజంకాదు. భరద్వాజ కథను మొదటిసారిగా అచ్చు వేసింది 'ప్రజామిత్ర' వారపత్రికే అయితే, అది 25-8-1946వ తేదీ సంచికలో. 1945వ సంవత్సరంలోనే అచ్చయి ఉంటే, అది 'ప్రజామిత్ర' అయి ఉండదు. మరింకేదో పత్రిక కావాలి. ఇదే నిజమని మనం భావిస్తే ఆ కథ పేరు 'విమల' అయి ఉండడానికి అసలే వీలు పడదు. ఎందువల్లనంటే, భరద్వాజ చాలా సందర్భాల్లో తన కథ తొలిసారిగా 'ప్రజామిత్ర'లో వచ్చిందని చెప్పారు. 1945కు బదులు 1946 అని మనం సవరించుకొంటే, మిగిలినవన్నీ సరిపోతాయి.

ఒక్క ఏడాదిని వెనక్కు జరుపుకొని భరద్వాజ బావుకొనేదేమీ ఉండదు. ఇది మతిమరపున జరిగి ఉండాలి. పొరబాటునైనా జరిగి ఉండాలి.

....................................................................................................................................

7. చూడండి: భరద్వాజ వ్యాసం 'కథలు వ్రాయడమెలా?' ప్రచురణ: 1963.

8. చూడండి: జనత (దినపత్రిక) తేది 5-8-82 శ్రీ పోలవరపు శ్రీహరి రావుగారి వ్యాసం.

....................................................................................................................................

9. ''అప్పట్లో ఆ కథ వ్రాసి నేనేదో ఘనకార్యం చేశాననే అనుకొన్నాను. పనిమాలా ఆ కథను

చాలా మంది చేత చదివించాను. అచ్చులో నా పేరు చూసుకొని మురిసిపోయాను," అని దాచుకోకుండా చెప్పుకొన్నారు భరద్వాజ.

---

9. చూడండి: 'కథలు వ్రాయడమెలా?' వ్యాసం. ప్రచురణ: 1963.

---

ఈ కథా రచయితను ప్రప్రథమంగా తెలుగు పాఠకులకు పరిచయం చేసిన 'ప్రజామిత్ర' పాత సంచిక నుండి ఆ కథను సేకరించి ఇక్కడిస్తున్నాను.

# విమల

**విమలమ్మ** భర్త చనిపోయి ఇప్పటికి రెండు నెలలు అయింది. తల్లిని అతి చిన్నతనంలోనే కోల్పోయిన విమలమ్మ ప్రస్తుతం భర్తను కూడా పోగొట్టుకుంది. విమల తండ్రి సీతారామయ్యగారైనా ఏమంత ఆస్తి పరుడుకాదు. రెండు ఎకరాల మెట్ట మాత్రమే అతనికి ఉన్న భూ వసతి. ఇదివరకు మాత్రం ఓ మండువా లోగిలి ఉండేది. కాని, అంతా ఈ మధ్యే ద్వితీయ వివాహ సందర్భంలో వచ్చిన బాకీ బాపతు, బాబూసేట్ వేలం వేయించాడు. పోతే సాలీనా రెండు వందల రూపాయలు గ్రాంటు ఇచ్చే స్కూలు మాత్రం ఒకటి ఉంది. దానిమీద, ఆ రెండెకరాల మీద వచ్చే ఆదాయంతో అతడు గౌరవంగానే కాలం వెళ్ళబుచ్చుతూ ఉన్నాడు.

ఇంతకీ ఇప్పుడు వచ్చిన చిక్కేమిటంటే ముక్కుపచ్చలారని తన ముద్దుల కూతురు దైన్య జీవితాన్ని గురించి. తను బ్రతికి ఉన్నన్నాళ్ళూ చిట్టితల్లికేం లోటు రాదు. కాని తన మరణానంతరం? ప్రత్యుత్తరం శూన్యం. పోనీ విమలను ఏ అయ్య చేతుల్లోనయినా పెడితే? అమ్మయ్యో! ఈ తుచ్ఛలోకం తననింకా బ్రతుకనిస్తుందా? అసలు తమ వంశమంటే ఎల్లాంటిది? నిప్పులాంటిది. ఒకరు వ్రేలెత్తి చూపడానికి గుండెలా? అగ్ని హోత్రంలాంటి వంశంలో పుట్టిన తాను తన వితంతు కూతురునకు వివాహం చేయడమా? స్వర్గలోకంలోని తన పితృదేవతలు తన్ను చూచి ఎంత ఖేద పడతారు...?- ఇత్యాది ఆలోచనలతో వేగిపోయేవాడు సీతారామయ్య పంతులు.

వయస్సు ముదరడంతో పాటే అతనికి దిగుళ్ళు కూడా ఎక్కువయినాయి. కాల క్రమేణా క్షీణించి మంచం పట్టాడు పంతులు. ఇప్పుడు పంతులు పని మరీ అధ్వాన్నంగా ఉంది. స్కూలు మూలబడే రోజులు సమీపిస్తున్నాయి. దూరంగా ఆలోచించాడు. తన బంధువుల్లో ఓ మంచి కుర్రాడిని తెచ్చి ఇంట్లో ఉంచుకుందామనుకున్నాడు. దానికోసం ప్రయత్నాలు చేశాడు. చివరకు తన భార్య వేలువిడిచిన మేనమామకు దగ్గర బంధువైన ఒక కుర్రాడు దొరికాడు.

అతని పేరు శర్మ. శర్మకు తల్లీతండ్రి చిన్నతనంలోనే చనిపోయారు. ఎలాగో వారాలు చేసుకొని బి.ఎ పూర్తి చేశాడు. ప్రస్తుతం ఓ మిల్లులో నెలకు పాతిక రూపాయలు తెచ్చుకుంటున్నాడు. పంతులుగారి మాట ప్రకారం శర్మ పంతులుగారి గ్రామం చేరుకున్నాడప్పుడే. అప్పటికి మధ్యాహ్నం

ఒకటిన్నర గంటలయి ఉంటుంది.

"సీతారామయ్యగారూ!" అంటూ శర్మ సీతారామయ్యగారి వీధి తలుపు తట్టాడు. అప్పుడే భోజనం చేసిన పంతులుగారు వంట్లో తేలిగ్గా ఉండడం చేత అలా మర్రిచెట్టుకేసి వెళ్ళాడు. అంచేత విమల ఒక్కర్తె చిరిచాపపై పడుకొని ఏదో పుస్తకం చదువుతోంది. వచ్చిన యువకుణ్ణి చూచింది విమల; తన తండ్రి చెప్పిన శర్మ యితడే అయి ఉంటాడని అనుకొని ఉచిత మర్యాదలు చేసింది. మరో కొంత సేపటికి పంతులుగారు వచ్చారు? వచ్చిన శర్మను చూచి బాగా సంబరపడ్డాడు. తన యొక్క మంచితనం చేత కొద్దిగంటల్లోనే వారిలో ఒక ఆప్తుడులాగా కలిసిపోయాడు శర్మ. ఆ తెల్లవారే స్కూలుకు సంబంధించిన యావత్తు రికార్డు శర్మ చేతికిచ్చేశాడు పంతులు. తన భారాన్ని వొదుల్చుకొని విశ్రాంతి జీవితాన్ని గడుప నిశ్చయించాడు పంతులుగారు.

రెండు సంవత్సరాలు... కాల శకటానికి రెండు చక్రాలు అయి గిర్రున తిరిగిపోయాయి.

శర్మ కూడా పని చేసుకుంటూ గ్రాంటును 200 నుండి 500 రూపాయల వరకు పెంపు చేసుకున్నాడు. శర్మ తెలివితేటలు, చురుకుదనం చూసిన పంతులు విమలను శర్మకీయడాన్ని గురించి ఆలోచిస్తూ ఉండేవాడు. విమలా శర్మలు కూడా ఎంతో కలివిడిగా, ఎంతో సన్నిహితుల్లా, చిలుకా గోరువంకల్లా నట్టింట్లో మసలుతూంటే చూచిన కొందరు పెద్ద మనుష్యులు విమలా శర్మల వివాహాన్ని గురించి పంతుల్ని హెచ్చరిస్తూ ఉంటే అతను ఓ చిరునవ్వు నవ్వి ప్రత్యుత్తరం మీయకుండానే వెళ్ళిపోతూ ఉండేవాడు.

* * *

అర్ధరాత్రి. పంతులుగారు నీళ్ళు పట్టుకొని ప్రక్క దొడ్లోకి వెళ్ళాడు. తన చేతిలోని లాంతరు వెలుగులో ఎవరో యిద్దరు వ్యక్తులు పమిడి ప్రత్తి చెట్టుచాటున నక్కి ఉన్నట్టుగా పంతులుకు లీలగా తోచింది. "ఎవరు వారు?" అని గట్టిగా కేకలు వేశాడు పంతులు. కాని ప్రత్యుత్తరం లేదు. దగ్గరగా వెళ్ళాడు; ఆశ్చర్యం! ఆ ఆడమనిషి ఎవ్వరో కాదు... కుల పెద్ద సోమయాజి గారి భార్య...అతగాడెవరు? జీతగాడు వెంకన్న. తల దించేసుకు చక్కా వచ్చాడు పంతులు. వచ్చేడేగాని కంటికి కునుకు పట్టింది కాదు.

...40 సంవత్సరాలు మొగుడితో కాపురం వెలిగించి, యౌవనం అంతా అనుభవించిన ఆమెకే అన్ని కోరికలుంటే... 16 ఏండ్లయినా నిండని తన విమల మాట... ఏమైనా గానీ విమలా శర్మలకు తప్పకుండా వివాహం చేసి తీరాలి.

దృఢ నిశ్చయానికి వచ్చేశాడు పంతులు. ఇంతలోనే భళ్ళున తెల్లవారింది.

పంచాంగం చూచాడు. లగ్నం నిశ్చయించాడు. అర్థంలేని వ్యర్థపు పనులన్నీ త్రోసి రాజని సంస్కరణయుతంగా ముచ్చటగా మూడు నిమిషాల్లో వివాహం పూర్తయింది. గ్రామంలో సంస్కరనాభిలాషులందరు నూతన దంపతులకు తేనీటి విందు ఏర్పాటు చేశారు.

వివాహత్పూర్వం 'ఈ పెళ్ళి శాస్త్ర సమ్మతమయినది కాదు కాబట్టి దీన్ని జరపడానికి వీల్లేదు'

అంటూ తాకీదు పంపాడు సోమయాజి. 'ఇందుకు భిన్నంగా నడిస్తే సంఘ బహిష్కారం తప్ప'దన్నాడు. ఫలితంగా పంతులు కుటుంబం వెలివేయబడిందన్నారు.

కాని సంస్కరణాభిలాషులు, అభ్యుదయ కాములు అగు జాతీయ ప్రముఖులు పంతులు పక్షానే ఉన్నారు... మరి సోమయాజులు గారి ఆంక్ష సోదిలోకి లేకుండా పోవడానికి ఎంత కాలం కావాలి? అదీగాక చీకటి ద్రోహుల్ని సహించే ఈ సంఘం ధర్మయుత జీవితాన్ని చూచి ఇలా కొరకొరలాడుతుందేం...?

* * *

# ఒకప్పుడు

## (1947-53)

## కారుణ్యం

## చిత్రగ్రహం

**1. జీవన ప్రభాత్** గారిచ్చిన చలంగారి పుస్తకాలు చదవడం ద్వారా ఆధునిక కథా సాహిత్యంతో తనకు పరిచయం ప్రారంభమయిందని భరద్వాజ చెప్పుకొన్నాడు. ఇది 1943లో జరిగింది.

కథా సాహిత్యంతో పరిచయం, చలంగారి పుస్తకాల వల్లనే లభించిందనుకొన్నా కథేతర సాహిత్యాన్ని కూడా భరద్వాజ విరివిగా చదివాడు. ఇందువల్ల కొంత ఉపకారం పొందాడు. వీర గ్రాంధిక సరళ గ్రాంధిక బంధనాల నుండి భరద్వాజ బయటపడ్డాడు. ఆ బయటపడిన దశలు - 1945, 1946 సంవత్సరాల మధ్య. భరద్వాజ మెల్లమెల్లగా ఎంతో కొంత రాస్తూనే ఉన్నాడు. రాద్దామని కూచుంటే...

2. "ఒక్క వాక్యం కుదిరేది కాదు. చచ్చీ చెడీ నాలుగు లైన్లు రాస్తే, అయిదో లైను రాసేందుకు గాను కొన్ని గంటల సేపు ప్రయత్నించిన విషయం నాకిప్పటికీ జ్ఞాపకం ఉంది" అని చెప్పుకొన్నాడు భరద్వాజ.

---

1. చూడండి: 'వీరగాధ'కు భరద్వాజ పరిచయం. ప్రచురణ: 1973.

2. చూడండి: 'కథలు వ్రాయడమెలా?' ప్రచురణ: 1963..

అయిదు బంతులు రాయడానికే తనింత ఉడ్డుకుడిచి పోతుంటే, పదేసి పేజీల, పదిహేనేసి పేజీల కథలను వాళ్ళెలా రాస్తున్నారు?

3. ''(అది) తెలుసుకొందామన్న ఆసక్తితో వరుసగా మా ఊరి లైబ్రరీలో ఉన్న పుస్తకాలను చదవడం మొదలు పెట్టాను. పత్రికల్లో అడ్డమొచ్చిన ప్రతి కథా చదివాను. మొట్టమొదట అవన్నీ అద్భుతంగా ఉండేవి. అన్నీ గొప్పగా ఉండేవి.'' రాను రాను కథను రుచి మరిగాక, అన్ని కథలూ 'అద్భుతంగా' ఉండడం మానేశాయి. ఆ సన్నివేశం అలా ఉండాలనీ, ఈ సంభాషణ ఇలా ఉండాలనీ భరద్వాజ అనుకొన్నాడు.

4. ''ఆ తరువాతనే నేను కుటుంబరావు గారి కథలు చదివాను. గోపీచంద్‌గారి కథలు చదివాను.. చలం గారి యువ ప్రచురణలన్నీ చదివాను. వీరందరిలోనూ చలం గారు నన్నమితంగా ఆకర్షించారు... చలం పుస్తకాల తరువాత, అంతగానూ, నన్నాకర్షించిన గ్రంథాలు కవిరాజు రామస్వామి చౌదరి గారివి. ఆ తరువాత గోపరాజు రామచంద్రరావు గారివి.'' ఆకర్షించిన రచయితల వరుస బాగా ఉంది. వయస్సుకు తగినట్టుగానూ ఉంది.

తన, 'విమల' కథ 1946లో అచ్చయ్యాక కుటుంబరావును, గోపీచంద్‌ను, చలంగారి యువ ప్రచురణలను చదివానన్నాడు భరద్వాజ. మరి, 1943లోనే జీవన ప్రభాత్‌గారు, చలంగారి పుస్తకాలను తనకిచ్చినట్లు భరద్వాజ చెప్పుకొన్నాడేం? ఆధునిక కథా సాహిత్యంతో తన పరిచయం చలం ద్వారా జరిగిందన్నాడేం?

.................................................................................................................

3. చూడండి: 'కథలు వ్రాయడమెలా?' ప్రచురణ: 1963.

4. చూడండి: 'కథలు వ్రాయడమెలా?' ప్రచురణ: 1963..

.................................................................................................................

ఇందులో వైరుధ్యమేమీ లేదు. 1943కు ముందుగానే మచిలీపట్నంలోని అభిసారికా గ్రంథమాల వారు, చలం గారి పుస్తకాలను, ప్రచురించారు. జీవన ప్రభాత్ ఈ పుస్తకాలను తెచ్చి భరద్వాజకిచ్చారు. అప్పట్లో ఆ కథల ప్రభావం భరద్వాజ మీద పెద్దగా లేదు. ఉండి ఉంటే ఆ లక్షణం, 'విమల' కథలో అంతో ఇంతో కనిపించి ఉండేది.

వీరగ్రాంధిక, సరళ గ్రాంధిక బంధనాల నుండి బయట పడిన భరద్వాజ. రెండు మూడేళ్ళయినా స్వేచ్ఛను అనుభవించక ముందే, చలంగారు తన వేపుకు గుంజుకోవడం ప్రారంభించాడు. ఈ గుంజుడు బలమయింది. ఈ ఆకర్షణ శక్తివంతమయింది. పాఠకులు తప్పి పోకుండా అడుగడుగునా సెక్స్ ఎరలను ఉంచాడు చలం. పైగా అందంగా రాసే వాడు. శైలీ విషయమూ కూడా అందంతో నిండి పోయాక - ఆ సౌందర్య బంధాల నుండి బయట పడడం ఒకంతట సాధ్యం కాదు. సాధ్యం కాకుండా ఉండటమే చలంగారిక్కావలసింది. కుటుంబరావు గారన్నట్లు, అధిక సంఖ్యకులైన వారు, చలంగారికి దాసోహం కాగా, మిగిలిన వారు, ఆయన పుస్తకాలను తగలేశారు. భరద్వాజ అధిక సంఖ్యాకుల్లోనే ఉన్నాడు. చలాన్ని చదివీ, చదివీ, చదివీ,

అతని కొక రెప్లికా లాగా తయారయ్యాడు. ఈ దుస్థితి 1952-53 దాకా అతన్ని విడిచి పెట్టలేదు.

ఆ రోజుల్లో అతను తెనాలిలో ఉన్నాడు. ఉండి చాలా ఇబ్బందులు పడ్డాడు. కొత్త రకం జీవితం అనుభవంలోకి వచ్చింది. ఈ కొత్త జీవితాన్ని కూడా సెక్సురంగులోంచే చూశాడు భరద్వాజ. 1950వ సంవత్సరంలో భరద్వాజ ప్రకటించిన 'రాగిణి' పుస్తకానికి పరిచయం రాస్తూ చలం ఇలా అన్నాడు-

5. "ఈ పుస్తకాన్ని పొగిడితే చలం పుస్తకాల్ని పొగడడమే అవుతుంది.. (తన సిద్ధాంతం) భరద్వాజ వంటి కొత్త రచయితల ద్వారా ఫెరపెట్యుయేట్ కాబోతోందంటే చాలా నిరాశ పుడుతుంది, ఈ తెలుగు దేశపు భావినిర్ణయ సారస్వత ప్రభువులకు." చలం సాహిత్యంతోనే కాక- చలంగారితో వ్యక్తిగత పరిచయం కూడా బాగానే ఉంది భరద్వాజకు. ఆ కైపులో ఉండి అతను రాసిన కథలు తెలుగు పాఠకులను ఊపి పారేశాయి. అదిగో - అలా ఊపిన కథల్లో ఇదొకటి.

---

5. చూడండి: 'రాగిణి' కథా సంపుటానికి చలం గారి పరిచయం. ప్రచురణ: 1950

---

# కారుణ్యం

**ఆకాశం మీద** సాగిలపడ్డ సాయంత్రం మబ్బుల ఆఖరి ముదురపచ్చ మెరుగూ, బాగా కళ్ళు తెరవని చంద్రవంక మూగ కాంతీ, పచ్చ గన్నేరు గుబుర్ల నుండి చాచుకు వస్తున్న చీకటి నునుపూ, గుళ్ళో దీపాల వెలుగుల చెదురుడు మధ్య ఆమెను చూశాడు గోపాలరావు. చప్పున అతనికి సనాతన పద్ధతుల మీదకి ఆపేక్ష వచ్చింది. దేవాలయములు ఉండటం ఎంత మంచిది ధైర్యమున్న పురుషులకు? రోజులో బైటికి రాని సౌందర్య రేఖలన్నీ అందాలుగా తయారయి వొస్తాయి గుళ్ళోకి పాపాలు పోగొట్టుకొని పుణ్యం సంపాదిద్దామని.

ఆమె ప్రత్యేకం అందరి మధ్యా గోపాలరావుకి. అందరి చూపులు ఆమెను వొదిలి రావటల్లేదు. చేతిలో ఇత్తడి పూలబుట్ట, దాంట్లో కాయలు, కర్పూరం, జమ్మిపత్రి, పూదువత్తులు. గోపాలం గూడా గుళ్ళోకి వెళ్ళాడు, ఆమె వెంట ఆమె కోసం. ఇటు తిరగదు, చూడదు. దీపాల వెలుతుర్లో మరీ స్పష్టం ఆమె. ఎరుపు మెరుగులో నించి, తెలుపు నీడలోకి మారే దేహచ్ఛాయ, గుండ్రటి భుజాలు, పయట గట్టితనం, పెద్ద పువ్వుకు మల్లే మెరిసే ముఖం, నల్లచీర ఆమె వొంటికి. ఆకుపచ్చని రెవికలోంచి, ఆకాశం మీదికి చాచుకొన్న, వెలుతురు గీరలకు మల్లే రెండు చేతులు, చివర ఐదు తామర కాడలు. మెడమీద పడే చీకటి జుట్టు, చెంపల మీదికి కొంచెం జరిగి. తలలో రెండు ఎర్ర గన్నేరు పూలు, తులసీ దళాలు కాసిని.

ఆమె ధ్యానం దేవుడి మీదా, పూజమీదా. చుట్టూ ఏమి జరుగుతుందో ఆమెకు తెలీదు గావును. అవసరం లేదేమో గూడా! ఎప్పుడో, ఏ జన్మలోనో, వొదిలి వచ్చిన తపస్సును ఇప్పుడు

యిట్లా తీర్చుకొంటుందేమో? ఏం వరం ఆమెకు కావాలి? ఏ స్వప్న ప్రియుడి కోసమో ఈ పూజ, ధ్యానం? ఇదీ గోపాలరావుకి ఆమె మీద ధ్యానం. అతనికి కోపం చుట్టూ జనం మీద. ఈ పురుగులన్నీ ఆమెని తాకటమేమిటి? తనొక రాజకుమారుడై కత్తి తీసుకొని, ఈ జనాన్ని, ఆమెని తాకకుండా ఆపితే! ఆమె గుళ్ళోకి రాబొయ్యేముందు, ఇంకెవరూ రాకుండా ఆజ్ఞ పెడితే! వాడు - ఆ దేవుడు ఏం చేస్తున్నాడు? ఈమె ప్రార్థన వినపట్టం లేదా? డబ్బుకోసం, వ్యాపారంలో లాభం కోసం, కోర్టులో గెలవడం కోసం, బర్రె తన్నకుండా పాలివ్వటం కోసం, తనను చచ్చేట్టు తన్నిన పగవాడి పెద్ద కొడుకు చావటం కోసం, టైఫాయిడ్ జబ్బు మందుల్లేకుండా కుదరటం కోసం, తమ వాళ్ళకు ఎదిటి వాళ్ళను ప్రేమించే రొమాంటిక్ సెన్స్ లేకుండా ఉండటం కోసం, వందల మంది క్షుద్రులు పెట్టే కేకల్లో ఈ మధుర గానం వినపట్టం లేదా ఆ దేవునికి? ఇట్లాంటి ఆమె తన దగ్గరికి రావటం చాలు గదా - చప్పున ఏ వరం ఇవ్వటానికైనా? ఇంకా - ఇంకా - ఇంతసేపు కళ్ళు మూసుకొని ఉన్నా వాడు పలక నట్టుందేం? అసలు ఉన్నాడా? ఉండే వినిపించుకోవటం లేదా? వినిపించుకున్నా చెయ్యటానికి ఆమెలో అర్హత కనిపించటల్లేదా? ఈ పురుగులకు ఉన్న విలువన్నా చివరికి? తనే దేవుడైతే...?

ఐపోయింది గావును పూజ కర్పూరం వెలిగించింది. ఆమె చూపులు గుళ్ళో, యిత్తడి దేవుడి వేపు. అతని చూపులు ఆమె పెదిమల మీద, మెల్లగా పాకుతూ రొమ్ముల దాకా వచ్చి ఆగిపోయినాయి అక్కడే కదలకుండా. నల్లవొంపుల గట్టిజుట్టులో ఆమె ముఖం - సముద్ర నీల జలాలలో ప్రతిఫలించే చంద్రబింబం అతనికి. మెళ్లో హారము, చెవుల అంటుజోడు తళుకులూ, నక్షత్రాల మిణుగురులు.

ఆమె వెనక్కు తిరిగి వెడుతోంది. ఎటూ చూడక, ఎవరికీ సంబంధం లేకుండా, స్వప్నంలో, గానం వింటో తన్మయుడైపోతున్న వాడికి నిద్రాభంగమైతే పడే బాధ అతనికి. ఆమెకు తెలీదు తన సౌందర్య ప్రతిభ. తెలిసే తెలీనట్లు పోతోందో మరి? మొత్తం మీద వెడుతోంది పచ్చ గన్నేరు పొదలమధ్య ద్వారం వేపు. ఆమె యిల్లు అటే గావును...

ఇంతే ఆఖరా ఆమెను చూడటం? మళ్ళీ మళ్ళీ వొస్తుందా? పది సంవత్సరాల కిందట మాయమైపోయిన దేవుడి మీద భక్తి చప్పున అతనిలో కొచ్చింది మళ్ళీ. వెనక్కు వొచ్చి లేని భక్తినంతా కూడగట్టుకొని దేవుణ్ని ప్రార్థించాడు. ఆమెను రోజూ గుడికి రప్పించమని. ఇక్కడికి రావటానికి వీల్లేకపోతే, ఆమెను చూడటానికి - ఏమీ అభ్యంతరం కలగని మరొక చోటికైనా ఫర్వాలేదు.

ఆ రాత్రల్లా అతనికి అదే ఆలోచన. మర్చిపోదామని ప్రయత్నిం చేశాడు. చేస్తున్న కొద్దీ ఆమె రూపం మరీ బిగ్గరగా పలుకుతోంది. ఎట్లాగైనా మరొకసారి ఆమెను కన్పించేట్టు చెయ్యమని భగవంతుణ్ని ప్రార్థించాడు. చాలా సహజం ఇది. ఎక్కడో ఎప్పుడో, ఎవరో అరుదుగా తప్ప - పరిస్థితులకు రాతనూ, విధినీ, దేవున్నీ తోడు చేసుకోక తప్పదు. తమకు కలిగే కష్ట సుఖాలకు బాధ్యత, తమదీ పరిస్థితులదీ అనే సత్యాన్ని భరించటంలో ఎంత బాధ వుంది? తమ అసమర్థతను కప్పి పుచ్చుకోవటానికే ఇవన్నీ ఏర్పడ్డాయని చెప్పే వాళ్ళ మీద ఈ జనానికి ఎంత కోపం!

భగవంతుడు అతని ప్రార్థన ఆలకించాడేమో మరి - మర్నాటి సాయంత్రం, అతను, సగం దిగులు, సగం అనుమానం, కాస్త ఆశ, సంతోషంతో గుళ్ళోకి వొచ్చాడు. ఆమె మూలగా దేవుడి

ముందు నిలబడి ఉంది. నిన్నటి కంటే ఎక్కువ ఆకర్షకంగా, అందంగా అవుపించింది ఆమె వాళు ్ల. అట్లాగే నిల్చుండి పోయాడు. చుట్టూ ఏమౌతుందో అతనికి తెలీదు. కలలు కంటున్నాడు. ఆమె చుట్టూ కలలు, ఆమె నుండి కలలు. ఆమెలోనించి తనలోకి కలలు.

భగ్గున అతని కళ్ళముందు పొగలేచింది. మెత్తగా వొంపులు నొక్కుతో సాగిపోయింది. సూర్యుడి పసిడి కిరణాలు పడి మెరిసే మంచు ముత్యాల సప్తవర్ణాల మెరుపులు పొగనిండా లేచాయి. అన్నీ మెరుపులు, మిణుగురు పురుగుల్లాంటి మెరుపులు. వాటి మీద అందంగా పడుకొని ఉంది ఒక అమ్మాయి, తలకింద చెయ్యి పెట్టుకొని. ఆమె పెదిమల మీద దయ. మొఖం సాయంత్రం మబ్బుల పచ్చకాంతి. తెల్లని నీడలు మెడ నుండి జారుతో వొచ్చి, వక్షాల దగ్గర వలయం తిరిగాయి. చీకటి గుహల్లో ప్రతిధ్వనించే ఈదురుగాలి వంటి జుట్టు.

''రా'' అన్నది ఆమె చేతిని కొంచెం ముందుకు సాచి అతన్ని.

''ఎవరు?'' అన్నాడు గోపాలం.

''నువ్వే - నువ్వే- రా''

''....................''

''నేను తపస్సు చేసింది ఎవరి కోసం అనుకున్నావు? ప్రతి రోజు గుళ్ళోకి రావటం ఎందుకనుకొన్నావు? నువ్వు, నువ్వు, నువ్వు కావాలి. నీ కోసం అనంత కాలం నుంచీ నేనుపుట్టటం - నా ప్రాణం - నిజం - నీ కోసం! ఎప్పుడో పాపం చేశాను... నువ్వు నా జీవానివి. నా భావానికి జీవానివి'' అంటూ ఆమె, ఆ రంగుల చిన్ని చిన్ని మెరుపుల పక్క మీదికి వాలి, చేతులు చాపి, అతని మెడ వెనుక వేళ్ళు కలిపి, బలంగా, వొత్తుకొంది తన వేపుకు.

అతని కళ్ళు మూతలు పడ్డాయి. చేతి వేళ్ళలోనించి, కళ్ళలోనించి, పెదిమలలో నించి, అతనిలోకి సంతోష ప్రవాహం పడుతోంది.

''ఇందుకే - ఇందుకే నేను తపస్సు చేసింది. నా బాబూ! ఎందుకో అనుకొన్నావా? నీ కంటే ఏ ఒకటి మాత్రం ఏం ఎక్కువ ఈ లోకంలో? ఈ పెదిమలు చాలు నా అనంత ఆరాధన సఫలం కావటానికి'' అంటూ ఆమె అతని పెదిమలు చెంపకు ఆనించుకుంది. తనొక గొప్ప మెరుపు, ఆమొక గొప్ప మెరుపు. వాళ్ళిద్దరు అట్లా కళ్ళు మూసుకొని అల్లుకొని ఉన్నారు. చుట్టూ ఉన్న చిన్న చిన్న కాంతి ఖండాలు సంతోష రవాలు చేస్తున్నాయి. వేగంగా, మహా వేగంగా తిరుగుతున్నాయి. ఆ ప్రళయ వేగంలో ఏది ఏ రంగు మెరుపో తెలియదు. సప్తవర్ణ సమ్మిశ్రిత మహార్ణవం. ఇద్దరూ ఆ కాంతి పుంజంలో కరిగిపోయినారు...

గోపాలరావుకు స్మృతి వొచ్చేప్పటికి కర్పూరపు కాంతి తగ్గిపోయింది; ఆమె హారతిచ్చిన కర్పూర కాంతి. తిరిగి వెడుతోంది. చీకటి మీద పలచగా పాకుతున్న వెలుగులో ఆమె తన వేపు చూసినట్టే అనిపించింది గోపాలరావుకి. వెడుతో వెడుతో, ఆగి వెనక్కి చూసి తలొంచుకున్నట్టనిపించింది. చీకట్లో గూడా మెరిసే కళ్ళు, తనను తొరతొరగా రమ్మని పిలుస్తున్నట్టు అనిపించి ముందుకు పొయ్యాడు. ఆమె లేదు. అప్పటికే బయట పచ్చగన్నేరు పొదల వేపుకు వెడుతోంది. నాలుగడుగుల్లో గన్నేరు

గుబుర్ల వద్దకు వెళ్ళాడు. ఆమె వొంటి అందాన్నంతా పచ్చ మెరుగుగా మార్చుకొన్న గన్నేరు పూలు వెన్నెట్లో నవ్వాయి. ఆమె ఆ గుబుర్లలో లేదు. ఎంత వెదికినా కనిపించలేదు గోపాలరావుకి.

దిగులుగా యింటికొచ్చాడు. సరిగ్గా నిద్ర పట్టదు. యిల్లంతా చికాగ్గా కనిపించింది. ఓపిగ్గా సర్దాడు. రోజూ తనకు అందంగా కనిపించే హిందీ స్టార్ల ఫొటోలు రోతగా అవుపించాయి. ఏ భంగిమలో పెట్టినా అవి అసహ్యమే! మంచం మీద అటూ ఇటూ పొర్లాడాడు. వొంటి చిత చిత పోవటానికి స్నానం చేశాడు. మనసు స్నానం చెయ్యాలి.

తను ఆమెను చూడకుండా ఉంటే బాగుండేది. ఈ గిజాటు బాధ ఉండదు అప్పుడు. ఎందుకు ఆమె బొమ్మ తన కళ్ళల్లో కనిపించటం? ఆమెను తాను తాకాలనీ, ముద్దుగా నొసటిమీద నల్ల మెరుపులకు మల్లే మెరిసే వెంట్రుకలు సరిచెయ్యాలనీ, భుజాల నుండి, రొమ్ముల మీదుగా జారి, పిరుదుల దగ్గర మళ్ళీ వొంపులు దిరిగి, ముందుకు పోతున్న అందాలు తనకు రావాలని ఎందుకు తన మనస్సు బాధపడుతోంది? పర స్త్రీ మీద మోహం కలగటం పాపమంటారు. మరి ఆమె - ఆ దేవకన్యమీద తనకు మోహం కలుగుతోందేం? కలగటం తప్పా? మానవ పుటక పుట్టిన తరువాత, అందానికి ఆర్ద్రమై పొయ్యే హృదయాన్ని పెట్టి, హృదయం రసజగత్తుల్లో తన్మయ పడే అందాలను కలిగించి, ఆకర్షణ ఉండకూడదనటం ఏం భావ్యం? అందాన్ని చూసి ద్రవీభూతం కాని వాడు మానవుడు గాడు. అది తప్పా? తప్పయితే యిట్లా కలుగుతోందేం మరి? 'తప్పు' అని శాసించే దేవుడు తప్పు చేసిన తరువాత శిక్షించే దానికంటే, ముందుగా, తప్పుచెయ్యకుండానే ఎందుకు అడ్డు పడడు?

గోపాలరావు పగలల్లా అనుకొంటాడు సాయంత్రం ఆ గుడి వేపు పోగూడదని. అంతే! సూర్యుడు కొండ వెనక్కు జారుతున్న కొద్దీ, మబ్బులు తెలుపు రంగును వొదిలి, పసుపుగా, ఎరుపుగా మారుతున్న కొద్దీ, క్షితిజం నుండి చీకటి పెరిగి అల్లుకొంటున్న కొద్దీ, అన్ని నిశ్చయాలు, ప్రతిజ్ఞలూ, వొట్లూ పోయి మామూలు మనిషి అవుతాడు. ఇక నిలబడవు కాళ్ళు. ఎక్కడ ఎంత దూరాన ఉన్నా అతని శరీరాన్ని మోసుకొచ్చి గుళ్ళో ఆమె సామీప్యాన చేరుస్తాయి. అప్పటికి వాటి పని అయిపోతుంది. కళ్ళు ఇంకేం చూడవు ఆమెని తప్ప. మనస్సు ఆమెని కావలించుకొంటుంది.

మొదట్లో ఆమె దిన దినం గుడికి విడవకుండా వొస్తుంటే చాలనిపించేది. ఇప్పుడు ఊరికే రావటం బాగుండటం లేదు అతనికి. తనవేపు చూడాలి. ఆమె తనను చూస్తున్నట్టు, తనకు తెలిసేట్టు చూడాలని గోపాలరావు కోరిక. నిజంగా చూస్తుందేమో అతనికేం తెలుసు? ఈ భౌతిక నేత్రాలతో గాక, మనో నేత్రాలతో చూసే శక్తి ఆమెకి ఉన్నదేమో అతను ఆలోచించడు. అయినా ఏం గొప్ప అతను? ఎవరికంటే గొప్ప? ఆమె ఊరికే చూస్తే సరిపోయిందా? ఇప్పుడు చాలవచ్చు. చూసిం తరువాత! "ఓస్ యింతేనా?" అనిపిస్తుంది. చూసి మెచ్చుకోవాలి. మెచ్చుకొన్నట్టుపైకి కనిపించాలి. అప్పుడు అతనికి సంతుష్టి. ఆ పునాదుల మీద సౌధం కడతాడు. అంతస్తులంతస్తులుగా, అందాలుగా. స్త్రీ కొంచంగా ఏ కోణం నుంచైనా పురుషుణ్ని దయగా చూసిందా? ఆ మొగవాడి తిప్పలకు అంతం ఉండదు. అతను కల్పించుకొనే మేడలకు ఈ భూగోళం చాలదు. అతని మీద అతనికి అనంతమైన ప్రేమ కలుగుతుంది. అందం, శౌర్యం, ధనం, తెలివితేటలు, అమూల్యమై, అపురూపమై పోతాయి

తనవి తనకే! ఆ చనువును పట్టుకొని, పాకి, ఆమెనంతా ఆక్రమించి, సొంతం చేసుకొని, తనలోకి తీసుకోవటానికి తోవలు వెతుకుతాడు.

తనమీద తనకే శ్రద్ధ పోతోంది. ఆమెను కదిలించలేని తన అందం నిరర్థకం. అన్నం సయించదు. కాఫీ సయించదు. నిద్ర పట్టదు. అశ్రద్ధ అతన్ని ఆక్రమించింది. స్నానం చెయ్యడు. రోజురోజుకూ అతనిలో దిగులు ఎక్కువవుతోంది. అట్లా- ఆ విధంగానే గోపాలరావు గుళ్ళోకి వొస్తుంటాడు, రోజూ ఎక్కడ, ఏ పనిమీద ఉండనీ.

ఒక రోజు అతను గదిలో పడుకొని ఉన్నాడు రాత్రి పొద్దు బోయి. నిద్రరాదు. అటూ ఇటూ మసులుతున్నాడు. ముందుగది బైట అడుగుల చప్పుడు. తరవాత కిటికీ తెరచి ఎవరో అతన్ని కాసేపు చూసి తలుపు కొట్టారు. గోపాలరావు తలుపు తీసే సరికి ఎవరో ఆడమనిషి చప్పున లోపలికొచ్చింది.

"ఎవరు?" అన్నాడు.

"నేను..." బిడియం గొంతులో.

"ఎవరు?"

"ఆమె... ఆమె తెలీదా?"

వెంటనే గోపాలానికి తెలిసిపోయింది. ఆమె అంటే అతని నిఘంటువులో ఇటీవల 'గుళ్ళో కనిపించే ఆమె' అన్నమాట. ఆమె తప్ప మిగతా స్త్రీలు 'ఆమెలు' కారు ప్రస్తుతం అతనికి.

"ఏమిటి ఆమె? ఏం కావాలి?" అన్నాడు, ఏదైనా సరే త్యాగం చెయ్యడానికి సిద్ధపడ్డ గొంతుతో.

"ఏం వద్దు..."

మాట పూర్తికాకముందే అతను నిరుత్సాహ పడ్డాడు, అయ్యో ఎటువంటి ఘనకార్యమూ చెయ్యడానికి వీలులేకపోయిందే అని.

"ఈ చీటీ యిచ్చింది. మీరు రాత్రికి గుళ్ళోకి రావాలి."

ఒక్క గంతులో గదిలో నుంచి బయటికి దూకి తొరతొరగా వెళ్ళిపోయింది. కళ్ళముందు పెద్ద మెరుపు రెండు క్షణాలు మెరిసి మాయమయినట్లుంది అతనికి. ఆ వచ్చిన మనిషిని పట్టుకొని ఎన్నెన్నో అడగాలనిపించింది. ఆమెకు తన మీద ప్రేమ ఎప్పణ్నించి వొచ్చింది? తనను చూసిన మొదటి రోజునా? రెండో రోజునా? రోజుకు తను ఎన్నిసార్లు జ్ఞాపకమొస్తుంటాడు? ఇట్లాంటివి అడిగి తెలుసుకోవాలి. తెలుసుకొని సంతోషించాలి. చాలా కాలం నుండి బాధపడుతున్నానని చెబితే సంతోషమూ, ప్రొద్దుణ్నించీ నంటే దిగులు.

కాగితం విప్పి చదివాడు. ముత్యాల కోవలకు మల్లే లేవు. చీకిరిబీకిరిగా ఉన్నాయ్ వొంకులుగా. అవే అతనికి ముత్యాల కోవలు. ఇంకో అభిప్రాయం గూడా గోపాలానికి కలిగింది. ఇట్లా వొంకులుగా, సరిగ్గా తెలుసుకోవడానికి, వీల్లేకుండా ఉన్నవే ముత్యాల కోవలవుతాయనీ,

మిగతావి కావనీ.

“రాత్రికి రండి గుళ్ళోకి, పచ్చగన్నేరు పొదల నాపరాయి దగ్గరకు. తప్పక... రాజేశ్వరి” ఆ గీతల్లో అతనికి అజంతా శిల్పమూ, ఎల్లోరా సౌందర్యమూ, తాజ్‌మహల్ కాంతీ కనిపించాయి. క్షణకాలం రాజేశ్వరి ఆ మాటల్లో కనిపించి ‘తప్పక రండి’ అన్నది అతని కళ్లకి.

వెళ్ళాడు ఆమె ఆజ్ఞ ప్రకారం. నాపరాయి దగ్గర కూర్చున్నాడు కొత్తగా సినిమా చూడబోయ్యే పిల్లవాడి ఉత్సాహంతో. అన్నీ అనుమానాలు. రాదేం? ఇంకా ఆలస్యం చేస్తుందేం? దోవ తప్పి పోయిందా రాత్రి పూట ఆమె పాదాలకు; రాళ్ళు- వెధవ రాళ్ళు - ఎన్ని తగులుతాయో! మునిసిపాలిటీ వాళ్ళకు బుద్ధి లేదనే విషయం వెంటనే తెలిసింది గోపాలరావుకు. ఆమె వొంటి మీద జాగ్రత్త కలుగుతోంది. పొరబాటు పడ్డదేమోనని గుడి చుట్టూ రెండుసార్లు ప్రదక్షిణం చేసి వచ్చాడు. అనవసరంగా చుక్కలు లెక్కపెట్టాడు. గన్నేరు పొదల దాకా వెళ్ళి కాసేపు నిలబడి, వెనక్కు తిరిగి, మళ్ళా ముందుకు నాలుగడుగులు వేశాడు.

గన్నేరు గుబుర్లలో మిణుగురులు కాలిపోతున్నాయి. దూరంగా ఉన్న మర్రిచెట్టుమీద కొంగల గుంపు, చెట్టు కప్పుకొన్న తెల్ల ముసుగులా ఉంది. ఆకాశపు గతుకుల్లో నిలవుండి పోయిన వెన్నెల జలాలకు మల్లే నక్షత్రాలు మెరుస్తున్నాయి. గాలి తెరలు చెరువులో నించి చేపల వాసనా, కప్పల అరుపులూ మోస్తున్నాయి. గోపురం నెత్తిమీదుగా వెన్నెలతో నిండిన మబ్బులు కొండ వేపుకు జరుగుతున్నాయి.

క్షణంలో తులసీ దళాల వాసనా, గుడిలోని వెన్నెలకు పచ్చ మెరుగూ వొచ్చింది, మంచు దుప్పటి కప్పుకొన్న పచ్చ తంగేడు పొదకు మల్లే రాజేశ్వరి రావటంతో, ఆమె భూమి మీద నడుస్తున్నట్టు లేదు. కలలో, గాలిలో నడుస్తున్న దానల్లే ఉంది.

చంద్రుడికి మబ్బు అడ్డం వచ్చింది. గోపురం గూళ్ళలోని గబ్బిలాలు అరిచాయి. గన్నేరు పొదల్లోనించి కీచురాయి కూస్తోంది.

రాజేశ్వరి తెల్ల నాపరాయి చివర కూచుని ఉంది. గోపాలరావు దగ్గిరగా జరిగాడు. అతని చూపులు అతని కళ్ళనుండి లోపలికి, ఆమె చేతులు వణుకుతూ ఉన్నాయి. నెత్తురు పదును వొంటినిండా మోహపు బలుపు.

“ఎంతకాలం... ఎన్ని రోజులు... అదృష్టం..”అని గొణుగుతున్నాడు. మాటలు సరిగ్గా రావు.

“ఉండు. తాకబోకు - తప్పు” అన్నది రాజేశ్వరి పసిపాపకు మల్లే.

ఆగాడు. అయితే... అయితే... ఎందుకు? రావడం ఎందుకు?

“ఎందుకు? ఏం తప్పు చేశాను నేను? నేనేనా చేసింది? ఇంకెవరన్నానా? వాణ్ని... వాణ్ని...నరుకుతా. బూడిద చేస్తా. చాణుక్యుడికి మల్లే నీళ్ళల్లో కలిపి తాగుతా, ఏమిటి?” అన్నాడు ఆమె బుగ్గలు తాకుతూ.

యుగయుగాల నుండి అందాలు మనసుల్లో కలవర పెట్టి అమోఘమైన త్యాగాలు,

వీరకృత్యాలు, యుద్ధాలు, మహా తపస్సులు చేసిన పురుష రక్తం అతనిలో కలవర పడ్డది స్త్రీ కోసం. స్త్రీ నీచురాలనీ, ఆమె అందం బద్బుద ప్రాయమనీ, మాంసం, చీమూ, నెత్తురూ, కలసిన తోలు తిత్తులనీ, ఆ కాంతి, మెత్తదనం, కలలు లేపటం, వొట్టి మోసమనీ, రాసేవాళ్ళు, దీన్నే పరమ పవిత్రంగా ప్రచారం చేసే వేదాంతులూ, ఈ గాథలకేం చెబుతారు? వొట్టి మోసం, దగా, అబద్ధం కావచ్చు వోపిక చచ్చి, అలవాటు పడి, కొత్తదనం, రసన నశించిపోయిన తరువాత. కానీ అప్పుడు అది నిజమే! ఆ కాస్త కాలమూ, అబద్ధాలయితేనేం? స్వర్గంలోకి, తీసికెళ్ళే మాధుర్య తప్త మర్మరధ్వనులు, మంజుల సంగీత రుతాలు, అప్పటికి. ఏది నిజం? ఏది అబద్ధం?

"నేను పాపిని దుర్మార్గురాలిని, నన్ను తాకొద్దు" అన్నది.

ఆ నిమిషాన తను ఎటువంటిదైనా గోపాలరావుకు అభ్యంతరం లేదని ఆమెకు తెలీదు. ఆమె అన్ని తప్పుల్నీ క్షమించడానికి సిద్ధపడ్డ కారుణ్యహృదయుడయ్యాడు గోపాలరావు. అందుకే పగలల్లా పోట్లాటలు తిట్టుకోవటం, అసహ్యించుకోవటం, జుట్టు పట్టుకు యీడవటం, ఆకలి దరిద్రాలు, అసహాయత్వంలో గడిచినా, రాత్రిలో - చీకటిలో - ఆ స్త్రీ పురుషులు మధ్య అన్నీ పోతాయి. పురుషుడే ఆ నిమిషాన, పగలు జరిగినవన్నీ మరిచిపోయి, ఆమెను భిక్షమెత్తుతాడు. క్షమాపణలు కోరే ఘడియలూ ఉండవచ్చు. పగటి కసినంతా బెట్టుతో, ధీరత్వంతో అసమ్మతి ప్రకటనలతో, తీర్చుకొని స్త్రీలు తమ ఆనంద ద్వారాలు తెరుస్తారు. పురుషులను హృదయంలో, లాలించి, బెల్లించి, అనునయిస్తారు. ఇదే లేకపోతే పురుషులంతా రాక్షసులూ, క్రూర మృగాలూ అయిపోయే వారే! సృష్టి ఈ మహా వరాన్నే స్త్రీలకు ప్రసాదించకపోతే కీటకాల కంటే హీనమై నిలవనీడ లేక ఎప్పుడో జాతి మొత్తమే నశించి ఉండేది.

"కాదు నువ్వు దేవతవు! అందాల కాణాచివి" అంటున్నాడు.

"కాదు"

"మొదట్లో మిమ్మల్ని చూశాను. సంతోషంగా కనిపించారు. ఆ తరువాత రోజు రోజుకూ మీరు పాడైపోతున్నారు. ఎందుకు?" అన్నది తనలో తను అనుకొంటున్నట్టు తలవొంచుకొని.

కీచురాయి పాట ఆగిపోయి సన్నగా మంచు పడుతోంది. మంచులో స్నానం చేసిన వెన్నెల నిర్మలంగా నవ్వుతోంది. చుట్టూ తడి గడ్డిమీద వెన్నెల నీడలు పడి మెరుస్తున్నాయి.

"తెలీదా నీకు? నీ కోసం తపస్సు చేస్తున్నాను! ఎన్ని తపస్సులు చెయ్యనిదే ఈ కాంతి నాకు చిక్కుతుంది?"అన్నాడు గోపాలరావు, ఆమె గడ్డాన్ని పట్టుకొని మొఖం వెన్నెల వేపుకు ఎత్తుతూ.

"ఎందుకు తపస్సు చేయటం? ఏముంది నాలో? మల మూత్రాదుల కూటమి యిది. వొట్టి తోలు."

"నీకు తెలీదు. నన్ను అగ్నిలో కాల్చిందీ, కత్తులతో కోసిందీ, మల మూత్రాదుల కూటమి కాదు. అయినా - ఇదే నన్ను బాధించింది" అన్నాడు ఆమె భుజాలు పట్టుకొని ముందుకు వొంగుతూ. బలిపీఠం మీది యజ్ఞ పశువు స్థితిలో ఉంది రాజేశ్వరి.

"ఆగు. పాపం యిది. నా మీది ఆశను వొదలుకో. రేపణ్నించీ రావొద్దు. నన్ను మర్చిపో. నేను నీకు అమ్మననుకో. అమ్మను - నిన్ను కన్న అమ్మననుకో. తల్లి మీద ఈ కోర్కె రావటం పాపం కదూ? ఇది చెప్పేందుకే వచ్చాను."

"ఎట్లా అనుకోను? ఎంత ప్రయత్నించినా ఆ భావం రావటల్లేదు. మొదట్లో ఎంత అలవాటు చేసుకోవాలనుకున్నాను నువ్వు 'అమ్మ'వని కానీ కావు నాకు..."

చంద్రుడు కొండవేపు జరుగుతున్నాడు. గన్నేరు గుబుర్ల నీడలు సాగుతున్నాయి. రెండు కొంగలు లేచి చెరువు వేపు వలయం చుట్టి తిరిగి చెట్టుమీద వాలాయి. ఏవో పిట్టలు దూరంగా అరుస్తున్నాయి.

"నేను... నేనే నిన్ను పాడు చేస్తున్నాను. రేపణ్నించీ అసలు గుళ్ళోకి రాను" అన్నది రాజేశ్వరి.

"రావా? రావా? నేను ఛస్తాను. నిన్ను చూడని దిగులు బరువు భరించలేను" అన్నాడు ఆమె భుజం మీద తలపెట్టి.

"ఏం చేసేది? అందుకే నువ్వంటే జాలి నాకు. నా మూలంగా బాధ. పాపిష్టిదాన్ని నిన్ను హింస పెడుతున్నాను, ఏం చేసేది? నాదేం తప్పు?"

చాలు 'నీ మీద జాలి నాకు' అన్న వాక్యం స్త్రీ నోటి నుండి వొచ్చిందా? వేరే ప్రోత్సాహం అనవసరం పురుషుడికి. ఆ మాట అనటంతో తన మీది సర్వాధికారాలనూ కోల్పోతుంది. 'నేను నీ బానిసని. నీకు లొంగిపోయాను. నీ పద దళితమయి పోయాను. నన్ను నువ్వేమన్నా చేసుకో. నేను అభ్యంతరం చెప్పను. చెప్పే శక్తి పోయింది నాకు' అన్న అర్థం ఆ మాటకు. గోపాలరావు చొక్కా గుండీలు విప్పి దూరంగా విసిరిపారేసి, చేతులు చాపి, ఆమె వీపు వెనక వేళ్ళు కలిపి, తన వేపుకు తీసుకొన్నాడు. రాజేశ్వరి అన్నీ మరిచిపోయింది. ఈ లోకం, కాలం, గోపాలరావు, సర్వం. సర్వం, తెలీవు ఆమెకి. కళ్ళు మూతలు పడ్డాయి. రాజేశ్వరి జుట్టు ఊడింది. తులసీ దళాలు కింద పడ్డాయి. ముక్కులో నుండి, వెచ్చటి గాలి అతని మొఖాన్ని తాకుతున్నది. మెల్లగా, లేడి పిల్ల వలె పెదిమలు కదిలిస్తున్నది. మాటలు రావు. ఎన్నో యుగాల నుండి, ఆమెలో, ఆమె జాతిలో పేరుకుపోయిన, దయ, జాలి, ఆమెని ఆమె. వ్యక్తిత్వాన్ని, ధ్వంసం చేసినై. బాధ, తనను చూసి బాధ. భారత ఆధ్యాత్మిక హృదయం సహించలేని బాధ. ఏం చేస్తుంది రాజేశ్వరి? ఆమెకు స్వంత యోచన లేకుండా చేసిన తల్లిదండ్రులు, సంఘం, గ్రహించరు తాము చేస్తున్న తప్పులు.

ఏ మహా తపో ఫలితమో జన్మించిన రాజేశ్వరి శరీరం, వొంపు దగ్గిర తుళ్ళిపడే ప్రవాహం లాంటి యవ్వనం, బుగ్గలు, ప్రకృతి ప్రసాదించిన మృదు సదనపు రసన, అన్నీ, అన్నీ, నొక్కి, అదిమి అనుభవిస్తున్నాడు. కోతులు, కుక్కలు, మృగాలు, పశువులు,మొదలైన రక్త సంబంధీకులంతా అతన్ని ముందుకు ముందుకు తోసి, తమను తాము ప్రతిఫలింప చేసుకొంటున్నారు; ఆ సమయాన అతనిలో.

ఆమెకు ఆమె తెలీదు. అతని చేతుల్లోపడి, శరాఘాతం తిన్న కురంగంవలె, రాజేశ్వరి శరీరం మూలిగింది. మెలికలు తిరిగింది. పవిత్ర భారతనారి మానం మహా పవిత్రమైన దేవాలయ ప్రాంగణంలో చెరపబడుతోంది. రాజేశ్వరి నుండి ప్రతి రోజూ పూజలందుకొనే భగవంతుడు రాడేం? తన భక్తురాలి

శీలాన్ని కాపాడడేం? ఇంత కాలం ఆమె శూన్యాన్నే నమ్మిందా? భగవంతుడు వున్నాడా? ఉంటే యిదంతా గమనిస్తూ కూచున్నాడా? ఆమెలో రాక్షసత్వాన్ని రగిలిస్తే అతను నాశనమౌతాడే! లేక అతనిలో నుండి ఆ పాపపు కోర్కె తీసేస్తే పోతుందే! ముక్కోటి దేవతలు, భారత దేశ ఆధ్యాత్మిక శక్తులు, ఆమె చేసిన భక్తి, ఏవీ - ఏ వొక్కటీ ఆమెని రక్షించలేదు.

అతని కావిల్లోకి వచ్చేంత వరకే ఆమె. అతని స్పర్శతో, సర్వ పూజలూ, శక్తులూ, నీతులూ దూరంగా తొలిగిపోయినాయి. అతని నడుం చుట్టూ చేతులు కట్టి తన వేపు, తనలోకి, తన అంత రాంతరాల్లోకి, రక్తనాళాల్లోకి, తీసుకొంటోంది. అతని చెంపలు రొమ్ములకు అదుముకొంది. ఎక్కడున్నదో తెలీదు. కలలు, కాంతులు కలలు... విశ్వంలో, ఏ పదార్థామూ, కార్యమూ, ఇవ్వలేని మహోన్నత ఆనందపు కలలు. అతని జుట్టు పీకింది. స్వాధీనం తప్పిన చేతులు, అతన్ని తన మీదకు అదుముకొంటున్నాయి ఆమెని.

గోపాలరావు విజయ నాదం చేశాడు. వస్తుతః ఆమె మీది కోర్కె ఉంది అతనికి. కానీ అది విఫలం కావటం ఎంత సేపు? ఆమెలో దుర్బలత్వం లేకపోతే, శాస్త్రాలు, నీతులు, ఆచారాలు, సాంప్రదాయాలు ఆమెలో ఆ దౌర్బల్యం లేకుండా చేస్తే, అతని గతేమిటి? అతనేగాదు, పురుష ప్రపంచపు గతే అర్థం గాదు స్త్రీల పట్ల.

రాజ్యాన్ని గెలిచిన వీరుడు విశ్రాంతి తీసుకొంటున్న పద్ధతిలో ఉన్నాడు గోపాలరావు. ఆమె అతన్ని వొదిలి కూచుంది. ముఖంలో మనసులో ఎక్కడా మాలిన్యం, భీతి, పాపం అసహ్యం ఫీల్ గాదు రాజేశ్వరి. సంతృప్తి పడుతోంది.

ఆపని పాపం అనిపించట్లేదు ఆమెకు. కారుణ్యం, తనకై తన కోసం బాధపడే వ్యక్తిని, ఆ బాధనుండి రక్షించాలనే తృప్తి, ఆనందం. అనాదినుండీ వొస్తున్న సాంప్రదాయాలు, భూతదయ బోధలు అట్లా చేసినై రాజేశ్వరిని. పాపం గాదా తన వల్ల మరొక ప్రాణికి హాని కలుగుతుంటే! చీమ కాలి క్రిందపడి ఛస్తే దానాలు చేసేవాళ్లు, పులిని చంపటానికి వొప్పుకోని దయాపరులు, మహా హంతకుణ్ని క్షమించగల దీరోదాత్తులూ, గడ్డిని కొయ్యటానికి, గిలగిలలాడే ఆర్ద్ర మనస్కులు ఆమె పూర్వీక భారతీయులు. వాళ్ళందరూ ఆమెలో తమ ధార్మిక సంపత్తిని దాచుకొన్నారు. వీటి నుండి - ప్రతి రక్తకణంలోనూ జీర్ణించిపోయి, ఈ భావాల నుండి ఎట్లా విడిపడగలదు రాజేశ్వరి?

'వెడతాను' తనచుట్టూ వున్న గోపాలరావును తప్పించుకొంటో అన్నది.

"అప్పుడే? అప్పుడే వెళ్ళటం?"

"ఆయన..."

"ఎట్లా విడవను, ఈ కంఠపు వొంపు, భుజాల పలచదనం... భూమిని వెదుకుతూ వొచ్చే ఉషా కన్యను, నిన్ను" అంటున్నాడు.

ఆమెకు తను ఎంత యిబ్బందో తెలుసుకోడు. తనసంగతే తనకి. అతని వర్ణన ఆమెకు అసహ్యంగా, డోకుగా వుంది. వొట్టి అర్భకుడికి మల్లే, అజ్ఞానానికి మల్లే, కనిపిస్తున్నాడు రాజేశ్వరికి. తుచ్ఛమైన శరీరాన్ని ఇట్లా, ఇటువంటి అపురూపమైన మాటలతో వర్ణిస్తాడేమిటా అని ఆశ్చర్యం.

"వొదులు పోవాలి."

"తప్పదా? పోకుండా ఉండలేవా? ఈ కాలం ఇట్లాగే ఆగిపోతే! ఎప్పుడూ నువ్వూ నేను విడిపోకుండా ఈ ఆకాశం నీడలకింద, చెట్లపచ్చదనం మధ్య ఉంటే?"

"ఏముంది ఉంటే! ఇక పో మళ్ళీ రాకు రోజూ గుళ్ళోకి. నా వేపు అట్లా దిగులుగా చూడబోకు. నన్ను మర్చిపో, ఏం? సరేనా?"

"నిన్నా? నిన్నా? మర్చిపోవటం? నన్ను నేను మరిస్తే అప్పుడూ నిన్ను మరవటం. జీవిత మంతా అద్భుతంగా వెలగగల కాంతితో నింపావు నన్ను. ఎట్లా జరుగుతుంది. నిన్ను మరవటం? రోజూ నిన్ను చూడందే నేను బ్రతకలేను..."

"నేను చచ్చిపోయాననుకో రాజేశ్వరి చచ్చిపోయింది. వెళ్ళు, ఎవర్ని చూసావు రోజూ? నేను చచ్చి పొయ్యానుగా నా బాబూ! నా పిచ్చి తండ్రి అట్లా స్త్రీల మీద మోహం కలగొచ్చా?" అన్నది రాజేశ్వరి, దిగులుగా ఉన్న అతని ముఖాన్ని మెల్లగా ఊయిస్తూ.

నేను వినలేను. నాకు తెలుసు. ఎవరో గంధర్వులు బిగ్గిరిగా పలుకుతున్నారు. నువ్వు చచ్చిపోవు. నీ దాపుకు రావటానికి మృత్యువే భయపడుతుంది... ఏం చెయ్యను? నాదేం తప్పు? నేను నా స్వాధీనంలో లేను. ఏదో అనూహ్యమైన మహాశక్తి నన్నిట్లా ప్రేరేపిస్తున్నది."

అబద్ధం గాదు. ఆ నిమిషానికవి నగ్న సత్యాలు. అబద్ధం అనిపించవు. అప్పుడు అంతే!

"అయితే నేను రేపట్నుంచీ గుళ్ళోకి రాను"

"రావాలి నా కోసం - వొట్టే!"

"ఒస్తే నన్ను గురించి నువ్వు పడే దిగులు చూస్తూ సహించలేను. విచారంతో మెలిక పడే నీ పెదిమ; ముఖము మీది దుఖ్ఖపు బలుపు, స్వయంగా చూస్తూ ఎట్లా ఊరుకోను? నా కోసం గాదు. నీ రక్షణ కోసం, మంచి కోసం రాను."

"రాకపోతే మరీ కృంగిపోతాను. తోచదు. శూన్యం, చీకటి, ఏమీ తెలియదు." అన్నాడు కన్నీళ్ళు పెట్టుకుంటూ.

ఆమె హృదయం ద్రవించింది.

"ఎట్లా నాన్నా నీతో చచ్చేది! ఒకసారితో తృప్తిపడవు... నువ్వంటే భయంగా ఉంది నాకు. ఏమైతావో అని... పాపిష్టిదాన్ని. ఎందుకు పుట్టాను? ఎందుకు తుచ్ఛమైన తోలుతిత్తిని చూపి నిన్ను హింసిస్తున్నాను?" అన్నది రాజేశ్వరి, అతని కన్నీళ్ళు తుడుస్తో.

అతని పరుషత్వానికి అర్థమవుతోనే ఉంది ఆమె బలహీనత. ఒక సారి దయతో, శరీరం మీద సర్వహక్కులూ పురుషుడికిచ్చిన తరువాత అతని నుండి తప్పించుకోవటం కష్టమైన పని ఏ స్త్రీకైనా. ఆకలితో చచ్చిపోతున్న పాముకు పాలుబోసి బతికిస్తే, అది కరవకుండా ఊరుకోదు.

"నువ్వు రోజూరా, లేకపోతే... నువ్వురాని రోజు నేను ఆత్మ హత్య చేసుకుంటాను. నేను జీవించటం నీకిష్టంలేని రోజున రావడం మానుకో. సరేనా?"

గోపాలరావుకు తెలుసు ఆమె రాకుండా ఉండదని. భూతదయ, కారుణ్యం, అనంత కాలం నుండి ఘోష పెడుతున్న బోధలు, పిపీలికం కోసం, చిలక కోసం, డేగకు మాంసం కోసం, శరీర భాగాలనూ, శరీరాలనే త్యాగం చేసిన త్యాగ మూర్తుల రక్తం ఆమెలో ఉన్నంత కాలం; తనకోసం, అందం కోసం, తను అసహ్యించుకొనే మలమూత్రాదుల కొంపకు ఆశించి, లభ్యంకాకపోతే ఆత్మహత్య చేసుకొంటాననే వ్యక్తికి ఆ శరీరం ఇవ్వకుండా ఉండలేదు. ప్రాణాలను, ధనాన్ని, రాజ్యాలను, తపోశక్తుల్ని, పరుల సౌఖ్యాలను తృణప్రాయంగా వెచ్చించిన మహా మహుల జీవకణాలు ఆమెను వొంచి వొప్పుకొనేట్టు చేశాయి.

'వెడతాను'. పోతోంది రావణుని చేతుల్లో మానభంగం పొందిన రంభకు మల్లే.

"రేపు- తప్పక రా - లేదా ఎల్లుండి నా శవం చూస్తావు" అన్నాడు గోపాలరావు.

ఆమె వెనక్కు తిరిగి క్షణకాలం నిలబడి, గట్టిగా నిట్టూర్పు విడిచి పచ్చగన్నేరు పొదల్లోకి మాయమైంది.

అదృష్టవశాత్తూ లభించిన ఈ అందాన్ని గోపాలరావు ప్రతి రోజూ అనుభవిస్తున్నాడు. ఒకసారి ఆమె చాలా దిగులుగా కనపడ్డది. నవ్వదు. తనవేపు చూడదు. పలకదు. అతనికి తోచలేదు ఆమె అట్లా ఉంటే!

"ఏమిటి??" అన్నాడు గోపాలరావు ఆమె ముఖాన్ని పైకెత్తి.

"ఆఁ"

"ఏమిటి ఇట్లా దిగులు...?"

"ఏం లేదు. సుస్తి"

తరవాత ఆమెను కావిలించుకొన్నప్పుడు, వీపు ఉబ్బులుబ్బులుగా తగిలింది. రెవికలాగి చూశాడు. నల్లగా రెండంగుళాల వెడుల్పులో చర్మం కమిలిపోయింది. అట్లాంటి చారలే తొడలమీద, పిరుదుల మీద గూడా చూశాడు."

రాజేశ్వరి చప్పున కన్నీళ్ళతో అతని వొళ్ళో పడిపోయింది.

"ఎవడు వాడు? ఏ రాక్షసుడు నిన్నిట్లా చేసింది? వాణ్ణి... వాణ్ణి - నరుకుతా, బూడిద చేస్తా, చాణుక్యుడికి మల్లే ఆ భస్మజలం తాగుతా" అన్నాడు గోపాలరావు - ఆమె చారలకు ఉమ్మిని రాస్తో. గోపాలరావు చదివిన చరిత్రలో చాణుక్యుడే జ్ఞాపకం కొంచెం. ఆ పాఠపు వినియోగం యిక్కడ తటస్తపడ్డది.

"ఎవరూ లేరు. ఆయన్నేమీ అనకండి. ఏం చేస్తాడు పాపం ఆయన మట్టుకు?"

"ఎవరు ఆ..."అని బూతు పలికాడు.

"వద్దు, ఊరుకో."

"ఊరుకోను, వాడి శవం మీద నిన్ను నడిపిస్తా, నేను మామూలు మనిషిని కాను. చెప్పు?..." ఆవేశంతో ఊగుతున్నాడు.

“మీ భార్య మరొకడితో సంబంధం చేస్తున్నదంటే మీరు ఊరుకొంటారా?”

గోపాలరావుకుతన భార్య, మేనమామకు అన్నం పెడుతూ మాట్లాడినందుకు నెత్తురు పడేట్టు కొట్టినసంగతి జ్ఞాపకమొచ్చింది-

“నీ భర్త? వాడేనా కొట్టింది?” అన్నాడు గోపాలరావు తగ్గుస్వరంతో. అట్లా కొట్టడం న్యాయమని అతని అంతరాత్మ నినదిస్తున్నా అది పైకి కనపడనియ్యకుండా, అన్యాయమనేట్టు ధ్వనింపచేస్తున్నాడు.

“ఎంత కాలం నుండి వాడు నిన్ను కొట్టటం?”

“పోనివ్వండి” అన్నది రాజేశ్వరి ఆ మాటలు అతనితో చెప్పటం యిష్టం లేక.

“కాదు. ఎంతకాలం నుండి?”

“మొదట్లో లేదు. అర్ధరాత్రప్పుడు ప్రతి రోజూ కనబడకపోతే యామనుకొంటాడు? ఎంత కాలం నమ్ముతాడు...?” రాజేశ్వరి ఏడుస్తోంది.

“ఊరుకో” అన్నాడు గోపాలరావు. అతనికి దిక్కు తెలియటల్లేదు ఏమనటానికి గూడా.

“రావటం మానుదామనుకొంటాను. ఆ గట్టి నిశ్చయంతోనే పండుకొంటాను. కానీ నిద్ర రాదు. చుట్టూ ముసురుకొంటున్న దిగులు నిన్ను గురించి - ఒక్క పూట రాకపోతే, నువ్వేమను కొంటావో, ఎంత బాధపడతావో, ఈ గడ్డిలో, గుడిలో, ఎట్లా పిచ్చిగా, నా కోసం ఎదురు చూస్తో ఉ ంటావో, అని దిగులు. ఏం చేసేది? ఆయన నన్ను అర్థం చేసుకోడు.”

“వాడు మనిషి గాదు, నిన్నింతగా దుఃఖపెడుతున్న ఆ కీటకం” అన్నాడు, కసిగా గోపాలరావు. ఆ సమయాన తాను భర్యను చీల్చుకు తింటున్న సంగతి గుర్తుకురాలేదు అతనికి.

“కొట్టినా యాడవను నేను, నన్ను నీచం చేశాడు. నాకు మదం కొవ్వు, కావరటమట నీతో రావటానికి. “నేను చాలక, వాడు అవసరమయ్యాడా?” అన్నాడు. ఎంత చెప్పినా వినిపించుకోడు. నావన్నీ అబద్ధాలంటాడు. నాకా మదం? కావరం? కొవ్వు? నేను వొక్క రవ్వ ఆలస్యమైతే, ఎంత మదన పడతావో వారికి తెలీదు. కన్నీళ్ళతో నా నడుము చుట్టూ వెళ్ళాడే నీ రూపాలు వారికి అర్థం కావు... ఇప్పటికి లేస్తాడు. నన్ను ఈ రాత్రి ఏం చేస్తాడో చెప్పలేను... వెడతాను” అంటూ రాజేశ్వరి లేచింది అతన్ని తప్పుకొని.

“రాజూ ! రాజూ!! నా పిచ్చి కాంతీ! పోతావా? పో... పో... వెళ్ళు. వద్దులే వెళ్ళు. నీ జ్ఞాపకాలతో, మృతి పొందుతాను. ఏమయితేనేం? పో వెళ్ళు. వెళ్లు...” అన్నాడు గోపాలరావు చేతులు ముఖానికి కప్పుకొని.

రాజేశ్వరి ఆగి వెనక్కు వొచ్చి అతన్ని వొళ్ళోకి తీసుకొంది.

పసిపిల్లవాడికి మల్లే ఆమె వొళ్ళో విలపిస్తున్నాడు గోపాలరావు. ఆమె అతని వీపును, జుట్టును సవరిస్తోంది.

జగద్గానస్వనాలకు పులకలెత్తి, లలిత లాస్యం చేస్తున్నాయి, నక్షత్రాలు. తెల్లగా కరిగిపోతున్న ఆకాశం మీద, అలల మీల్లే మబ్బులు ప్రవహిస్తున్నాయి. గాలిలో- కప్పల, కీచురాళ్ళ, కలరవాలు,

చుట్టూ మంచులో స్నానం చేసిన నిర్మలమైన గడ్డి, జిల్లేడు పూలు చంద్రుణ్ణి పందెం కడుతున్నాయి తెలుపుకు. వాళ్ళిద్దరూ, దుఃఖపు బరువుతో వొంగిపోయినారు.

“మరచిపో. నేను చచ్చిపోయాననుకో. రాజేశ్వరి చచ్చింది. ఇంకేం వస్తుంది నీ దగ్గరికి?... ఊరుకో నాన్నా! వారికి అర్థం కాదు. మళ్ళీ తెలీని మొద్దు గాదు ఆయన. ‘ఆకలి’ అంటూ యవడన్నా వాకిట్లోకి వస్తే అన్నం పెట్టి, డబ్బులిచ్చి పంపుతాడు. ఎవరికి ఏ కష్టమొచ్చినా, తనకొచ్చినట్టు విచారిస్తాడు. కాల్లో ముల్లు గుచ్చుకొంటే, తేలుకుడితే, తల నొచ్చితే అట్లా కళ్ళనీళ్ళు పెట్టుకొని హైరానా పడతాడు, శత్రువులకొచ్చినా మళ్ళీ, కానీ నీకోసం వొక మానవ హృదయమే క్షోభిల్లిపోతున్నదంటే నమ్మడు. బలిసిన కామం కొవ్వు, కండ రాల మదం ఇదంతా నంటాడు. అన్ని కష్టాలూ నిజమయి... ఇదొక్కటే ఆయన మనసులో అబద్ధమయింది. వొదలను... ఆయన విలపించే కష్టాలు తీరిస్తే పుణ్యలోకాలు వస్తాయట. ఇది - నన్ను గురించి నువ్వు పడుతున్న ఈ వేదన తీరిస్తే పాపం నరకమట. ఇన్ని శాస్త్రాలు చదివారాయన. ఇదెట్లా సత్యమని నమ్మాడో తెలీకుండా ఉంది. ఊరుకో... వొస్తాగా...” అంటున్నది అతన్ని రాజేశ్వరి లాలిస్తో. ఆమె నుండి ఆ వాగ్దానం పొందిన తరువాత గోపాలరావు స్థిమిత పడ్డాడు.

భారతీయత్వమంతా పాడయిపోతున్నదని ఈ పిలకవాళ్ళూ, నామాలవాళ్ళూ, విబూతివాళ్లూ, వేదాంతులూ, భక్తులూ, దేశభక్తులూ, గోల పెడతారు గానీ, అతిథులకు, భార్యను దానం చేసిన పురాతనత్వాన్ని తిరిగి ప్రతిష్ఠించరేం?

తమ రుషులు, పూర్వీకులు చెప్పిన మాటలేగా యివి! అన్నిట్లోనూ, ‘దయ’ ఉండొచ్చు. అన్నిటి కంటే మహోన్నతమైన, జన్మకు సాఫల్యాన్ని, సార్థకతను యిచ్చే ఈ మాధుర్య కార్యానికి ‘దయ’ పనికిరాదు. మిగతావన్నీ, పుణ్యం. ఇదొక్కటే పాపం!...

రాజేశ్వరి వెళ్ళింది...

వాన. అంకుశపు పోట్లు దిన్న మదమత్తేభాల వలె మేఘాలు ఘోష పెడుతున్నాయి. గోపాలరావు కిటికీలో నుండి బైటికి చూశాడు. అంత వర్షంలో తడిసిన చీకటి హోరుగాలి విసురు. నిన్న రాత్రి తను ఆ వేళప్పుడు రాజేశ్వరితో గడిపిన సంగతులు జ్ఞప్తికి తెచ్చుకుంటున్నాడు. వాన. ఆకాశం మీద అగ్ని దేవుని వీర విహారం. మెరుపుల్లో లోకమంతా మండుతోంది... హాయిగా ఈ పాటికి రాజేశ్వరితో... ఛీ... వాన. అంతే అనుకొంటాడు. పోడు. ఆమె తన కొరకు ఎటువంటి త్యాగం చేసింది! తను తన కోసం వానలో గుళ్ళోకి పోలేడే!

ఎక్కడో ఎవ్వరో దప్ప, స్త్రీ ప్రేమ కోసం, ఆమె పెదిమల మీద లలితంగా మెరిసే చిరునవ్వు కోసం, జీవిత మంతా మహోన్నతంగా, గర్వంగా జీవించగల ఆ ఆలింగనంలోని రసన కోసం, త్యాగం చెయ్యలేరు. అల్పాతి అల్పమైన వాటిని గూడ.

గాలి తలుపును కొడుతోంది. పిలుస్తోంది మనిషికి మల్లే. గోపాలరావు తలుపు దీశాడు. రాజేశ్వరి నవ్వుతో వొచ్చింది లోపలికి. వర్షంలో తడిసిన ఆమె వొంటికి చీరె అంటుకుపోయి, దీపం వెలుతురులో మెరుస్తోంది. జుట్టు చివర్ల నుండి నీళ్ళు కారుతున్నాయ్. చలికి గడ గడ వొణుకుతోంది.

“రాలేదేం”? అన్నది రాజేశ్వరి జుట్టు నీళ్ళు పిండుతూ. గోపాలరావు సిగ్గుపడ్డాడు. స్త్రీకున్న సాహసమైనా లేని దౌర్భాగ్య పురుషుడు.

అతని ధోవతిని కట్టుకొంది. రెవిక లేదు. ఆకాశపు నిర్మల జలాలతో మిళితమయిన ఆమె శరీరపు శుభ తేజస్సు, ఆ గదిని వెలిగించింది.

“చాలా సేపు చూశాను. పెద్దగా పిలిచాను. వెతికాను, ఏం వాన? ఎన్ని గుంటల్లో పడ్డాను? ఈ రాత్రి వస్తాననుకోలేదు నీ దగ్గిరికి. నేను రాననుకున్నావు గదూ?” అన్నది రాజేశ్వరి అతని భుజాలు పట్టుకొని దూరంగా ఉంచి, మొఖంలోకి చూస్తో.

“లేదు” అన్నాడు గోపాలరావు.

“నాకు తెలుసు; నువ్వనుకొంటావు నేను లేనిది నువ్వే ఉండవని. పిచ్చి బాబూ పిచ్చిబాబూ! ఇట్లా అయితే ఎట్లా జీవిస్తావోయ్ ముందు ముందు?” అని కావిలించుకొని ముద్దు పెట్టుకున్నది.

పలచని ధోవతి కింది వొంటిరంగు, మెడమీది నవనవ, ప్రకృతి శ్రద్ధతో, భక్తితో, ఆపేక్షతో తీర్చిదిద్దిన స్నిగ్ధోన్నతాల మెరుగు, మృదుసదనపు లాలన, యూరువుల అందాల బరువు, అన్నీ ఆ రాత్రి అతని స్వంతం - ఆ గళ్ళ పరుపు మీద.

తెల్లార కట్ట తెలుపులో కరిగిపోతున్న చుక్కల చివరి కాంతిలో, వర్షంలో శుభ్రపడిన లోక పర్యాలోకన కోసం బయలుదేరిన ఉషా కన్య వలె రాజేశ్వరి వెళ్ళిపోయింది.

“నువ్వు గుళ్ళోకి రావొద్దు యిక నుండి. ఎందుకైనా మంచిది. యిల్లు కదలకు. నేనే మీ యింటికొస్తుంటాను. తప్పక, తప్పక వొస్తాను. నువ్వు మాత్రం రావొద్దు” అన్నది రాజేశ్వరి పోతూ పోతూ.

గోపాలరావుకు ఆ శ్రమ గూడా లేదు. ప్రతి రోజూ రాజేశ్వరి రాత్రి పది దాటి వొచ్చి తెల్లవారు ఝామున వెడుతుంటుంది. ఒక రోజున గోపాలరావు ఆమె వీపు, తొడలు, పిరుదులు పరీక్షిస్తున్నాడు.

“ఏమిటి? అన్నది రాజేశ్వరి.

“అవే!” అన్నాడు నవ్వుతో ఇంకా చేతులతో వాటిని తడుపుతోనే.

“దెబ్బలా? అవునా?... ఇంకెందుకుంటయ్?” అన్నది నవ్వి.

“ఏం? వోపిక చచ్చింది గావును! విసుగెత్తి ఊరుకున్నాడు.”

“ఉండవు. ఉండటానికి వీల్లేదు!!” అన్నది.

పదిరోజుల తరువాత గోపాలరావు బజార్లో, వొకతన్ని పోలీసులు సంకెళ్ళతో తీసుకెడుతుంటే చూశాడు. ఆ ఖైదీని తెలిసినాయన, తన విచారాన్ని మాటల్లో తెలియజేసి, లోకంలో స్త్రీల సాహసాల్నీ, అన్యాయాల్నీ, పూర్వపు స్త్రీలలో ఉండే పాతివ్రత్యాన్ని(?) గురించి మాట్లాడుతున్నాడు తన అనుభవంలోనించి.

“ఏమిటి?” అన్నారు వొకరు.

"అతను భార్యను చంపాడు."

"ఎందుకు?"

"ఎప్పుడు?"

"అతని భార్య 'రంకుతనం' చేస్తున్నది. చాలా కాలం చెప్పి, కొట్టి చూశాడు పాపం, భార్యను దోవలో పెడదామని ఆ పెద్దమనిషి. ఆమె వినలేదు. పది రోజుల కిందట - అంత వర్షంలో గూడా ఆమె గుళ్ళోకి వెళ్ళిందట విటుడు కోసం. సహించలేక మొగుడు వెళ్ళి కత్తితో పొడిచి చంపాడు. పోలీసులు పట్టుకొన్నారు."

గోపాలరావు కళ్ళముందు బజారు, అందులో నడిచే బళ్ళు, ప్రజలు, ప్రక్క దుకాణాలు గిరగిరా పరిభ్రమిస్తున్నాయి. తల క్రిందులౌతున్నాయి. ఆ మహా వేగంలో ప్రపంచమంతా చీకటయింది. భూమి అగాధమై అతన్ని లోపలికి జార్చుకొంటోంది.

ఎవరు? రాజేశ్వరి... రాజేశ్వరి... పదిరోజుల క్రిందట... కత్తితో చావు... రోజూ... ప్రతిరోజూ...తనతో... రాత్రి పూట...ఎవరు? ఎవరు? ఎవరు?...???

* * *

**1950లో --** తన 23వ ఏట -- తన మొదటి పుస్తకాన్ని ప్రకటించాడు భరద్వాజ. ఆ పుస్తకం పేరు 'రాగిణి'. అందులో ఏడు కథలున్నాయి. "పాపం, జాలిగుండె, పిరికి వాడు, రాగిణి, మనస్తత్వాలు, మేడిపండ్లు" అన్న కథలన్నీ సెక్సు కథలే. 'ఇంతలో వుంది' అన్న కథ మాత్రం కాస్త నయం. ఈ పుస్తకానికి 'మనోవైజ్ఞానిక కథల సంపుటి' అని మరో ఉప శీర్షికను బ్రాకెట్లలో వుంచాడు భరద్వాజ. ఈ పుస్తకంలో మన సెక్సును విపరీతంగా ఉద్రేకింప చేసే కథలున్నాయే గాని, మచ్చుకు కూడా 'మనో వైజ్ఞానిక' కథ కానరాదు; ఆ తరువాత ప్రకటించిన 'కొత్త చిగుళ్ళు' అన్న కథలు, "శిథిల సంధ్య" అన్న మరో పెద్ద కథ భరద్వాజ రాసిన సెక్సు కథలన్నింటిలోకి యెన్నదగినవి. అంటే - సెక్సు కథా రచయితగా అతనీ కథల్లో 'తారస్థాయి'నందుకున్నాడన్న మాట. పేరు లేకుండా ఒక కథను ప్రచురిస్తే అది చలంగారి రచనో భరద్వాజ రచనో తెలుసుకోవడం దుస్తరంగా ఉండేది. ఈ స్థితినుంచి బయట పడమని ధనికొండ హనుమంతరావు గారు, ఇతర మిత్రులు అతన్ని హెచ్చరించారు. ఆ హెచ్చరికలు అతన్ని ఆలోచింప చేశాయి. చలంగారి వలయం నుంచి బయటపడటం కోసం, అతను కొంత కాలం పాటు పూర్తిగా రాయడమే మానివేశాడు. మానివేసి తన దృష్టిని సైన్సు వేపుకు మళ్ళించారు. ఆ రోజుల్లో సైన్సు పుస్తకాలన్నీ ఇంగ్లీషు భాషలోనే ఉండేవి. దేశీయ భాషల్లో సుగమ విజ్ఞాన శాస్త్ర గ్రంథాలు ఎప్పుడోగానీ వచ్చేవి కావు. తెలుగులో ఆ కొరతను తీర్చడం కోసం, ఆ తరువాత చాలా సైన్సు పుస్తకాలను భరద్వాజ ప్రకటించాడు.

అంతరిక్షయాత్ర ఒక మధుర స్వప్నంగా మాత్రమే ఉన్న 1953లో, భరద్వాజ 'చిత్రగ్రహం' అన్న వంద పేజీల నవలను రాశాడు. ఈ నవలను ప్రచురించడానికి మూడు పత్రికలు 'విచారంతో' తిరస్కరించాయి. లిఖితపూర్వకమైన దాఖలా లేమీ లేవుగాని - అసలు సంగతేమిటో ఆ పత్రికల వారు దాచుకోకుండా చెప్పారు. చిత్రగ్రహం నవలలోని కల్పిత గ్రహమైన 'శుషూన్'లో భూ మండలం మీద - ఎక్కడా లేని సామ్యవాద వాతావరణం నెలకొని ఉంటుంది. ఆ పత్రికల రాజకీయాభి ప్రాయాలకూ, ఈ కల్పిత గ్రహాలమీద ఉన్న సామ్యవాద వాతావరణానికీ సరిపడదు. అందుకని వారు 'విచారంతో' తిరస్కరించారు.

ఆ రోజుల్లో ఆంధ్రప్రభ దిన, వార పత్రికలు రెండూ మద్రాసు నుండి వెలువడుతూ ఉండేవి. ఈ రెండింటికీ శ్రీ నార్ల వెంకటేశ్వరరావు సంపాదకులు. చిత్రగ్రహం వ్రాత ప్రతిని నార్ల వారికి పంపించాడు. ఈ నవలను మూడు పత్రికలు తిప్పి పంపివేశాయని, ఇందులో ఉన్న రాజకీయ వాసన ఆ పత్రికలకు సయించలేదనీ, ఈ విషయం సంపాదకులకు ముందుగా తెలిసి ఉండడం మంచిదన్న అభిప్రాయంతో నార్లవారికి ఒక జాబు కూడా రాశడు భరద్వాజ. మూడవ వారానికల్లా అటు నార్లవారి నుంచి ఇటు విద్వాన్ విశ్వంగారి నుంచి భరద్వాజకు రెండు జాబులు వచ్చాయి. ఈ రెండింటిలోని విషయం ఒక్కటే! ఆ నవల ప్రచురించడానికి అంగీకరించారు. యధావకాశాన ప్రకటిస్తున్నారు. అన్నట్లుగానే 1955 జూన్ 22, 29, జులై 6, 13 తేదీ ఆంధ్ర ప్రభ వార పత్రిక సంచికల్లో ఎటువంటి సవరణలు లేకుండా వచ్చింది. 1955లోనే ఆదర్శ గ్రంథమండలి వారు దాన్ని పుస్తకంగా వేశారు.

భరద్వాజ వైజ్ఞానిక దృష్టిని, రాజకీయ దృక్పథాన్ని అవగతం చేసకునేందుకు, చిత్రగ్రహం నవల భహుధా తోడ్పడుతుంది. 30 సంవత్సరాల క్రిందటి ఈ నవలలోని ఎన్నో వైజ్ఞానికాంశాలు ఇప్పుడు యధార్థరూపం ధరించాయి. దేశ కాలాలను మానవుడు తన స్వాధీనంలోకి తెచ్చుకుంటాడనీ, మృత్యువును కూడా తన అదుపులో వుంచుకొనగలుగుతాడనీ, భరద్వాజ ఆనాడే ఊహించాడు. అలా జరగాలని హృదయపూర్వకంగా ఆశించాడు. ఎప్పుడూ, ఎందుకూ కొరతలేని సమాజాన్ని; ఒక సర్వపూర్ణ స్వేచ్ఛా సమాజాన్ని; జరరుజలను జయించిన సమాజాన్ని; శుషూన్ గ్రహం మీద వెలయింప చేశాడు భరద్వాజ. మానవ సమాజం గూడా ఏదో ఒక నాటికి అటువంటి ఉన్నతోన్నత స్థాయికి చేరుకొనాలని మనసారా వాంఛించాడు..

ఈ నవల మూడు దశాబ్దాల క్రిందటిదన్న విషయాన్ని గుర్తుంచుకుంటే, భరద్వాజలో వచ్చిన పరిణామం ఎంత తీవ్రమైనదో మనం సులభంగా అర్థం చేసుకో గలుగుతాం. మానవ సమాజం చేరుకొనవలసిన, సాధించ వలసిన, పరమోత్తమ లక్ష్యాన్ని ఆనాడు భరద్వాజ స్పష్టం చేశాడు... మానవ సంక్షేమం పట్ల అతనికున్న గాఢానురక్తికి ఈ నవల ఒక ఉదాహరణ ప్రాయం!

ఒక అమెరికా దేశీయుడు, ఒక వంగ దేశీయుడు, ఒక తెలుగువాడు కలిసి - చంద్రమండలానికి బయలు దేరారు. మార్గమధ్యంలో ఉన్నారు.... ఇక చదవండి...

# చిత్రగ్రహం

**చప్పున** రాకెట్‌లోని దీపాలు కాంతి తగ్గాయి. ఇంకా ఇంకా తగ్గాయి. డిమ్‌గా వెలుగుతున్నాయి. ప్రక్కనే ఉన్న మరొక డైనమోను స్టార్ట్ చేశాడు, అల్‌ఫ్రెడ్. అది 'జ్'న తిరిగి 'సుయ్' మంటూ ఆగిపోయింది. ఉన్న శక్తిని సహస్రాధికం చేసే ఇ.టి. మీటను నొక్కాడు బెనర్జీ. రాకెట్ తిరిగి ప్రయాణం సాగించింది. కానీ స్పీడా మీటరు పని చెయ్యడం లేదు. మైలేజి+కావడం లేదు. యంత్రాలు పని చేస్తూనే ఉన్నాయి. కానీ అంగుళం ముందుకెళ్ళడం లేదు రాకెట్.

"రాకెట్ ఎక్కడో స్లిప్ అవుతున్నది" అన్నాడు అల్ ఫ్రెడ్ తనలో తను అనుకొంటున్నట్లు.

నేను కె.ఎమ్.గుండా అంతటా చూశాను. దూరంగా ఆకుపచ్చగా బాంబు లాంటిదేదో మావైపే వస్తున్నది. నేను పెద్ద కేకవేసి రాకెట్‌ను ప్రక్కకు లాగమని బెనర్జీకి చెప్పాను. అతను ఎంతో ప్రయత్నించాడు. రాకెట్ వెంట్రుక మేర ముందుకు కదలనైనా కదలలేదు. క్షణక్షణానికీ ఆ ఆకుపచ్చ బాంబు మమ్ముల్ని సమీపిస్తున్నది. సమీపిస్తున్న కొద్దీ దాని ఆకారం స్పష్టంగా కనిపించసాగింది. దానికి మన విమానాలకి వలె రెండు రెక్కలున్నాయి. ప్రొఫెల్లరుకు బదులు రెండు లైట్లు వెలుగుతున్నాయి. అందులో ఒక లైటు కాంతి మా రాకెట్టుకు తగులుతోంది. ఇంతలో... సమశీతోష్ణాలనుండి మమ్ము రక్షించే రసాయనిక వాయు ద్రవ్య మంతా ఉప్పన దూసుకు పోయింది. ఏమిటా అని ఇలా చూద్దును గదా! వాయువు నిండిన, బయటి లోహపు గొట్టాలు కరిగిపోతున్నాయి. డైనమో పూర్తిగా ఆగిపోయింది. బాటరీ సాయంతో చిన్న బల్బు వెలిగించాడు బెనర్జీ. అప్పటి మా పరిస్థితి వర్ణనాతీతం! ఏమి చెయ్యటానికీ ఎవ్వరికీ పాలు పోలేదు. దిగ్భ్రాంతులము, నిశ్చేష్టులము అయిపొయ్యాం.

ఇంతలో ఆ ఆకు పచ్చని బాంబు మా దాపుకొచ్చింది. ఒక రబ్బరు గొట్టం వంటి సాధనం రాకెట్‌ను తాకి చూచింది. చుట్టూ ఒకటి రెండు సార్లు తిరిగింది. ఆ తరువాత ఏమయిందో మాకు కనపళ్ళేదు. ఉన్నట్టుండి చటుక్కున యంత్రాలు పనిచేశాయి. మీటరు మరలా మైలేజిని ప్లస్ చేస్తున్నది. మా ఆనందానికి అవధి లేకపోయింది.

"ఇదేమిటంటారు?" అన్నాడు బెనర్జీ.

"విల్సన్ నక్షత్రశాల వారు గూడా వీటిని గుర్తించినట్లు లేదు. ఇవేవో కొత్త ద్రవ్య కూటాలు. బ్రహ్మాండంలో ఎక్కడో జరిగిన సంఘర్షణల వల్ల ఇటువంటి ద్రవ్య శకలాలుద్భవిస్తుంటాయి. సహజమైన ఆకర్షణ శక్తి వల్ల, ఆ శకటం మన రాకెట్‌ను సమీపించి, మరొక ద్రవ్యరాశి ఆకర్షణ వలన దాటిపోయింది. ఇవి ప్రదేశార్ణవంలో నూతనంగా జనించిన దీవులుగా లెక్కించ వచ్చు.. అరె... అదేమిటి బెనర్జీ! నువ్వు రాకెట్ నెటు నడుపుతున్నావో చూడు," అని కేకేశాడు అల్‌ఫ్రెడ్.

చంద్రుడు మాకు అభిముఖంగా ఉండటానికి బదులు ప్రక్కగా ఉన్నాడు.

"లాభం లేదు. రాకెట్ చెడిపోయింది. ఎంత ప్రయత్నించినా సరిగ్గా తిరగడం లేదు" అన్నాడు

బెనర్జీ.

మా గుండెలు గుభేలుమన్నాయి. మా సర్వస్వాన్నీ భగవదర్పితం చేయడం కన్నా ఏం చేయగలం?

ఇంతలో రాకెట్ మీది భాగానికి చిల్లి పడ్డది. ఆ రంధ్రంలో నుండి ఏదో కన్ను మమ్మల్ని పరీక్షిస్తున్నట్లు నేను గుర్తించాను. భయంతో నా గొంతు ఆర్చుకుపోయింది. రక్తం శీతలావహమైంది. ఇంతలోనే ఆల్‌ఫ్రెడ్ కెవ్వున కేకవేసి కూల బడ్డాడు. ఒక చిన్న హస్తం, పసివాని హస్తమంత మృదువైనది, అతని వైపుగా వొస్తున్నది. బెనర్జీ మీటరు మీదనే పడిపోయాడు... మెల్లగా నవ్వులాంటి మెత్తని ధ్వని వినిపించింది. ఎవరిదా నవ్వు? ఎక్కడిదా నవ్వు? మెల్లగా తలెత్తి చూశాను. అలాంటి ఆకు పచ్చని బాంబులు పది దాకా ముందున్నాయి. రెండు మూడు వందలు... ఇంకా ఎక్కువే - ఫ్లైయింగ్ సాసర్లు- మా చుట్టూ ఉన్నాయి. నాకు పిచ్చెత్తిపోయింది. నల్లని ముసుగులాంటిదేదో నన్నావరించ సాగింది. కళ్ళలో పసుపు పచ్చగా, ఎర్రగా, ఊదాగా, తెలుపుగా, నీలంగా చివరికి చీకటిగా రంగులు వెలిగినట్లు కొద్దిగా జ్ఞాపకం. ఆ తరువాత ఏది ఎట్లా జరిగిందో నాకు తెలియదు...

ఏదో మత్తు. ఏదో బరువు. ఒక బరువైన తెర, నా నుండి తొలగి పోయినట్లు తోచింది. భరింపరాని మాధుర్యమేదో నేను రుచి చూస్తున్నట్టు, సుగంధ వాయువులమరులు నన్ను చుట్టుముట్టినట్లు తోచింది. మెల్లగా కళ్ళు విప్పాను. పైన మృదువైన కాంతి. క్రిందకు చూశాను. మెత్తని శయ్య, ఏవో గాజు సీసాలు, బల్లలు. ఇంకా నేనెరుగనివీ చాలా ఉన్నాయి. మరలా నా కళ్ళు మూతలు పడ్డాయి. ఎవరిదో మృదుహస్తం నన్నే స్పృశిస్తున్నట్టు గ్రహించాను. ఎవరిదో చూడాలనే కుతూహలంతో ప్రయత్నించాను. నా కనులు విడివడలేదు. కీచు గొంతుతో ఏవో మాటలు వినపడ్డాయి. తరువాత దూరంలోకి వెడుతున్న అడుగుల చప్పుడును బట్టి, 'ఎవరో' వెళ్ళిపోయారనుకొన్నాను.

ఈ 'ఎవరో' గారెవరు? నేనెక్కడున్నాను? ఇది భూమండలమేనా? అయితే మేము భూమండలానికి పడిపోయామన్నమాట! అంత ఎత్తునుండి పడితే, మా రాకెట్ బద్దలయిపోలేదా? ఒక విధంగా - పడటానికి కూడా అవకాశం లేదు. ఇంత వేగంతో భూమ్యాకర్షణను తప్పుకొని వచ్చిన మా రాకెట్, భూమిని చేరదు సరిగదా- అలా ఆకాశం లోనే - మరొక గ్రహం లాగా తిరుగుతుండాలి. కాబట్టి ఇది భూమండలమనేందుకు వీలు లేదు... చప్పున నా కొక ఆలోచన వచ్చింది. ఇది అంగారక గ్రహమేమో? అంగారకుని మీద జీవం ఉండవచ్చునన్న నమ్మకం శాస్త్రజ్ఞులు ప్రకటించారు. అక్కడి వాతావరణం 10 డిగ్రీలు కావడమే అందుకు కారణమని గూడా వారు ప్రకటించారు. మేము చూసిన ఆకు పచ్చని బాంబులు ఫ్లైయింగ్ సాసర్లు అంగారక గ్రహానికి సంబంధించినవి కావచ్చు. అయితే అంగారక గ్రహ వాసులు మమ్మల్ని తమ గ్రహానికి తీసుకువచ్చారన్నమాట. లాగి తంతే గారెల బుట్టలో పడినట్టుంది. మరి బెనర్జీ ఆల్‌ఫ్రెడ్ ఎక్కడున్నారు? వారేమయ్యారు?

ఏవో నవ్వులు. ఒకటి కాదు - డజను గొంతుకల, మెత్తని నవ్వులు నాకు వినిపించాయి. నా కన్నులు ఇంకా మూతబడే ఉన్నాయి. ఎంత ప్రయత్నించినా అవి విడివడడం లేదు. ఎవరో నన్ను

లేవనెత్తి కూర్చోబెట్టారు. తరువాత నా నుండి ఏదో వొలిచి వేస్తున్నట్టు తోచింది. ఎదురుగా కొందరు మనుషులు కనిపించారు. వాళ్ళు మనుషులని ముందు అనుకోలేదు. నాలుగడుగుల ఎత్తున్నారు. తెలుపు, పసుపు, రోజా రేకులు కలిపినట్లుంది వారి రంగు. పెద్ద తలకాయ. నారింజ రంగు వెంట్రుకలు ఆకుపచ్చని కళ్ళు, జాగ్రత్తగా పరిశీలించిన మీదట కాని నేనొక గాజు సీసాలో ఉన్నట్లు తెలియలేదు. నేను మంచి నీళ్ళు కావాలన్నాను. వారిలో వారు ఒకరినొకరు చూసుకొన్నారు. నా వేపు చిత్రంగా చూశారు. అందులో ఒకతను చిన్న ముక్కాలి పీటవంటి దాని మీద కూచుని రివ్వున ఎగిరిపోయాడు. ఈలోగా ఇంకొకాయన నా దగ్గర కొచ్చి, సీసామీద గుంర్తించబడిన గీతలను కాయితం మీద రాసుకెళ్ళాడు. ఇంతలో ముక్కాలి పీటలు రెండు వచ్చి వాలాయి. మొదటాయన రెండవ వానికి నన్ను చూపిస్తూ ఏదో అన్నాడు. రెండవ అతని తల చాలా పెద్దది. మిగతా శరీరం అంతా కలిపినా, తల అంత ఉండదు. అతను నా దగ్గరకొచ్చాడు. ఏదో గొట్టంలో నుంచి నన్ను కాసేపు చూశాడు. ఆశ్చర్యపడ్డాడు. ఆలోచించాడు. ఫక్కున నవ్వాడు. తిరిగి ఆలోచించాడు. తల గోక్కున్నాడు. పీటలోని ఒక సొరుగు లాగి చిన్న వస్తువేదో తీశాడు. అది మన హాండ్ కెమరా అంత ఉంటుంది. రెండు వైర్లు తీసి, సీసాలో గుండా లోపలకు విడిచాడు. వాటి చివరల నుండి మెరుపులు వెలువడుతున్నాయి. దాదాపు పావుగంట వరకూ అలానే చేశాడు. వైర్లు తీసేశాడు. చిన్న వస్తువులోని గాజు పలక మీద కొన్ని గీతలు చుక్కలు, సున్నాలు ఉండటం చూశాను. అతనా గాజు పలకను బల్లమీద పెట్టి స్టెతస్కోపులాంటి సాధనాన్ని దాని కానించాడు. రెండవ రెండు కొసలు చెవులకు తగిలించుకున్నాడు. అతనేమి చెపుతాడా అని అందరూ అతని వేపే చూస్తున్నట్లు నేనర్థం చేసుకొన్నాను. అతను దీర్ఘంగా నిట్టూర్చి ప్రక్కనున్నతనికి సౌంజ్ఞ చేశాడు. అతను నాకు మంచినీరు తెచ్చి యిచ్చాడు. గుక్కకు రాలేదు. ఇంకా కావాలని సౌంజ్ఞ చేశాను. మరి కాసిని లభించాయి.

ఈ రకంగా వీరితో నేనెలా వేగను? నాకు కావలసిన వస్తువులన్నీ నాకెలా లభిస్తాయి.? ఈ గాజు గోళం నుండి నాకెప్పుడు విముక్తి? మా వారిద్దరూ ఏమయ్యారు? నన్నిలా ఒంటరిని చేయడంలో వారి ఉద్దేశమేమిటి? ఈ అంగారక వాసులు రక్తపిపాసులు కారుగదా! ఇత్యాది సందేహాలు వందలాది నాకు తోచాయి. కానీ సమాధానం యెవరిస్తారు? ఇంతలో మరొకాయన నా దగ్గరకొచ్చి, సీసా మీద చూసి ఏదో రాసుకెళ్ళారు. ముక్కాలు పీట మీద వచ్చి నాకు మంచినీరిప్పించినాయన, ఇంకా ఆ కెమేరా ముందు కూచునే ఉన్నాడు. నా తల మీద రెండు వైర్లు వేళ్ళాడుతూ, మెరుపులను చిమ్ముతూనే ఉన్నాయి. అతను రాసుకొంటూనే ఉన్నాడు. క్రమంగా నీడలు సాగుతున్నాయి. చీకట్లు బుసలుకొడుతో పరుచుకొంటున్నాయి. ఇంతలో కాంతి పుంజాలు చప్పున వెలిగాయి. అంతా పట్టపగలు. కెమెరా ముందు వ్యక్తులు మారుతున్నారు. కాయితాలకు కాయితాలు గాజు పలకలను చూసి రాసేస్తున్నారు. నా గడియారంలో 5 గంటలయింది. మా ప్రయాణం సక్రమంగా సాగినట్లయితే ఎప్పుడో చంద్రమండలంలో ఉండేవాళ్ళం. ఈ లెక్కన భూమండలంలో ఇప్పుడు తెల తెలవారుతూ ఉంటుందన్నమాట...

నాకాకలి మిక్కుటంగా ఉన్నది. కడుపు మీద చేతితో కొట్టుకొని, తింటున్నట్లు సైగ చేశాను. కెమెరా ముందు కూచుని రాస్తున్నాయన నా వయిపు చూడటం లేదు. ఆహారం లభించటం దుస్తరమని

తెలిసినప్పటి నుండి కూడా నా ఆకలి క్షణక్షణం ప్రవర్ధమానమవుతున్నది. రాస్తున్నాయన ఠక్కున ఆపాడు. దగ్గరనున్నతనికి ఏదో సౌంజ్ఞ చేశాడు. వెన్న, పాలు గురిగింజలంతలేసి పళ్ళు నాకిచ్చారు. కొంత వరకు నయమే! నేనవి తింటున్నప్పుడు మరొకరు నన్నతి జాగ్రత్తగా పరిశీస్తూ నోట్‌బుక్‌లో ఏదో రాసుకొంటున్నారు. నాకు ఆశ్చర్యమూ, చిరాకూ కలిగాయి. ఈ సీసానుండి విముక్తి ఎప్పుడు? ఈ అంగారకేయుల నాగరికతను సంస్కృతిని నేను పరీక్షించేదెప్పుడు?

ఒక పొట్టిమనిషి సీసా దగ్గరకొచ్చి తలుపు తీశాడు. అంత వరకూ ఈ సీసా కొక తలుపున్నదని కూడా నాకు తెలియదు. నేను బైటికొచ్చాను. ఏదో షాక్ తగిలినట్లు ఫీలయ్యాను. కాని ఆ ఫీలింగ్ ఎక్కువ సేపు ఉండలేదు. సరిగ్గా అదే క్షణాన బెనర్జీ, ఆల్‌ఫ్రెడ్‌గారలు కూడా వచ్చారు. వారికీ కించిద్భేదంతో ఇలాంటి అనుభవాలే జరిగాయట. ఇది అంగారక గ్రహమన్న నా అనుమానంతో వారు కూడా ఏకీభవించారు. 'ఇదీ ఒకందుకు మంచిదే' నన్నాడు బెనర్జీ.

అయితే ఇవన్నీ అబద్ధాలయినాయి. అయినాయన్న సంగతి వారం రోజుల తర్వాతగానీ మేము గ్రహించలేదు. అది అంగారక గ్రహం కాదని తెలుసుకొన్న క్షణాన ఆశ్చర్యంతో మేము కొరడువారి పోయాము. ఆ గ్రహం పేరు'శషూన్'. అది భూమికి చంద్రునికీ మధ్యలో ఉన్నది. చంద్రుడు భూమికి ఉపగ్రహమైతే 'శషూన్' చంద్రునకు ఉపగ్రహం.

"ఇంత వరకెవ్వరూ కనిపెట్టలేదా?"

బెనర్జీగారి ఈ సందేహానికి ఆల్‌ఫ్రెడ్ సమాధానమిచ్చాడు.

"లేదు' అన్నాడు ఆల్‌ఫ్రెండ్. "మానవ మేధస్సు కొన్ని పరిమితులకు లోబడే ఆలోచిస్తుంది. భావిస్తుంది. ఒకనాడు మానవుడు కనుగొనలేని కొన్ని నక్షత్ర మండలాలను ఈనాడు గుర్తిస్తున్నాడు. అంత మాత్రాన అవి ఆనాడు లేకుండా పోలేదు. ఈనాడు నూతనంగా ఊడిపడనూ లేదు. ఇంకా మనం కనుగొనలేనివి ఎన్ని కోటాను కోట్లున్నాయో ఎవరెరుగుదురు? వాటిలో 'శషూన్' గ్రహం గూడా ఒకటి కావచ్చు."

"కోటాను కోట్ల కాంతి సంవత్సరాల దూరాన ఉన్న ద్రవ్య రాసులను గూడా గుర్తించాం గదా! ఇది మన దృష్టి పథంనుండి దాటిపోవటానికి కారణమేమిటి బెనర్జీ?"

"మన యంత్రాలు ఒక పద్ధతితోనే పనిచేస్తాయి. అలాంటి వాటినే మనం నిర్మించాం. ఈ గోళం మామూలు గోళాలకు భిన్నమైన ప్రకృతిని కలిగి ఉండవచ్చు. ఈ భిన్న దశను మన యంత్రాలు గ్రహించలేకపోవచ్చు.. ఆగండి బెనర్జీ! నేనిది అక్షరాలా సత్యమని చెప్పటం లేదు. నా ప్రతి వాక్యానికీ ముందు 'బుహుశ' అని మీరు చేర్చుకోవాలి" అన్నాడు ఆల్‌ఫ్రెడ్.

మేమనుకొన్న దానిలో కొంతవరకే సత్యమున్నది. అది చంద్రునికి, భూమికి దాదాపు మధ్యలో ఉన్నది. అది ఆత్మ ప్రదక్షిణ చేస్తుంది. దాని రోజుకు 16 గంటలు మాత్రమే ఉన్నాయి. దీన్ని బట్టి అది భూమి చుట్టు కొలతలో 2/3 వంతులు మాత్రమే ఉన్నది. కాగా అది చంద్రునికి ఉపగ్రహం కాదు. అది భూమి చుట్టూ ప్రదక్షిణం చేస్తున్నది.

ఈలోగా మాకు శషూన్ గ్రహవాసులతో ప్రగాఢ పరిచయమేర్పడ్డది. మేము వైజ్ఞానికులమని

తెలిపిన తర్వాత వారు మమ్మమితంగా గౌరవించారు. వారి భాషకు 20 అక్షరాలు మాత్రమే ఉన్నాయి. దీర్ఘాలు, వత్తులు బహు స్వల్పంగా ఉన్నాయి. (ఈ మానం శఘన్ గ్రహవాసులది. ఇక్కడ నుండీ వారు మాతో మాట్లాడిన మాటలు, చూపించిన చిత్రాలు, అంకెలు, కొలతలు మొదలైనవన్నీ మనవాటిలోకి మార్చుకొని ఇక్కడ వ్రాస్తున్నాను. వారి మానాలకు, మానవాటికి చాలా భేదాలున్నాయి. పాఠకుల సౌకర్యార్థం వీటినిలా వ్రాయవలసి వచ్చింది) నాలుగైదు వందల సంవత్సరాల క్రిందట ఆ భాషకు 48 అక్షరాలుండేవట. భాషావేత్తలు తీవ్రంగా పరిశోధించి వాటిని 20 లోకి కుదించారు. 56 అక్షరాలుగల నా ఆంధ్ర భాషను వీరి సాయంతో సంస్కరించాలనుకొన్నాను.

శఘలు (శఘన్ గ్రవాసులు) అతి సౌమ్యులు. పరిశోధనంటే వారికున్న ఆసక్తి ఇంతా అంతా కాదు. 'యుద్ధం' అన్న పదానికి అర్థం కావాలంటే వారెంతో ఆశ్చర్యపోయారు. ఆరువందల సంవత్సరాల క్రిందట ఒక శఘ మహాకవి వ్రాసిన ఉద్గ్రంథంలో ఈ పదం పది పదిహేనుసార్లు ఉపయోగించబడిందట. ప్రతి నిత్యమూ 'యుద్ధం' అన్న పేరుతో పత్రికలన్నీ నిండిపోతున్న నా భూగోళ సంస్కృతిని తలచుకొని సిగ్గుతో భూమిలోకి - కాదు కాదు- శఘన్‌లోకి క్రుంగిపోయాను.

"మీ గోళమంతా చూడాలని ఉత్సాహపడుతున్నాం" అన్నాడు బెనర్జీ!

"ఓ అలాగే! చూడవచ్చు" అన్నాడు శఘలు.

"ముందు ఏ దేశం వెడదాం? మనం అన్ని దేశాలకూ నిరాటంకంగా వెళ్లొచ్చుగదా?" అన్నాడు ఆల్ ఫ్రెడ్.

శఘలు విస్మయ చకితులైనారు.

"మాకు దేశమంటూ ఒకటి లేదు" అన్నాడు ఒక శఘడు. "మా గోళమంతా మా దేశమే! ఇన్నిటికీ దేశమంటే ఏమిటి?... ఓహో! అలాంటి వేమీ లేవు. మేమందరమూ ఒకటే! భూగోళంలో లాగా, మాకు సరిహద్దులు లేవు. ఎవరు ఎక్కడికైనా వెళ్ళవచ్చు. ఎవరు ఏ పనైనా చేయవచ్చు."

"అమ్మయ్యో! అంత స్వాతంత్ర్యమే?" అన్నాడు బెనర్జీ.

"ఒకరి ఆస్తి పాస్తులను మరొకరు దోచుకోరా? దుర్బలులను, బలవంతులు పీడించరా?" అన్నాడు అల్‌ఫ్రెడ్.

మమ్మల్ని మృగాలను చూసినట్లు చూశారు శఘలు. (వారి భాషను మేము అతి సులభంగా నేర్చుకొన్నాం. వచ్చేటప్పుడు వారి సాహిత్యం గూడా మేము బొచ్చెడంత తెచ్చుకొన్నాం) "ఒకరి నొకరు దోచుకొనడమంటే?... అబ్బే లేదు. అది ఆత్మగౌరవానికి భంగమని మా ఉద్దేశ్యం. బలవంతులు దుర్బలులను రక్షిస్తారు. అసలు ఆ పని గూడా చేయనట్లే అనుకొనవచ్చు. రక్షించటానికి దుర్బలులకొచ్చే కష్టనష్టాలేమిటి? ఏమీ లేనప్పుడు రక్షించడమన్నదే ఉండదు" అన్నారు వారు.

"మీకున్న సైనిక శక్తి ఎంత? మీరు కొత్తగా సాధించిన మారణాయుధాలేమిటి?" అన్నారు ఆల్‌ఫ్రెడ్.

"మీరంటున్న మాటలకు మాకు అర్థం తెలియటం లేదు. ఈ సైంటిస్టు నడగండి" అన్నారు

కొందరు.

"సుమారు వేయి సంవత్సరాల క్రిందటి వరకూ కవులు పూర్వభాషా వ్యామోహంతో ఆ పదాలను వాడేవారు. ఇప్పుడు మాకు యుద్ధాలు లేవు. కనకనే సైనికులుగానీ, ఆయుధాలుగానీ మాకక్కర లేదు. యుద్ధాలు రావలసిన అవసరం మాకేమిటి?" అన్నాడా సైంటిస్టు.

అక్కడ ప్రభుత్వం లేదు. ప్రజలంతా ఒక కుటుంబంలాగా జీవిస్తుంటారు. ఈ విషయాలన్నీ మేము శఘన్ గ్రహమంతటా సంచరించిన తరువాతనే గ్రహించాము. ఎన్నో ఫ్యాక్టరీలు, షాపులు, ఆఫీసులు స్టోర్సులు ఉన్నాయి. అక్కడ కూడా చెదురుగా తప్ప శఘులు కనిపించరు. ఎక్కువ భాగం చదువులోనూ పరిశోధనలోనూ ఉంటారట. అక్కడ వ్యవసాయాన్ని మనుషులు- అంటే శఘులు చేయరు. ఆ పనులన్నీ యంత్రాలే చేస్తాయట. ఆ యంత్రాలయినా బొగ్గుతోనూ, నూనెతోనూ నడవవు. వాటికి ఫ్యూయెల్‌గా సూర్యరశ్మిని వాడుతుంటారని తెలిసినప్పుడు మేము విస్తుపోయాం.

"మీ కేమీ అభ్యంతరం లేకపోతే దీనిని మీరెలా సాధించిందీ చెబుతారా?"అన్నాడు బెనర్జీ. "మీ రహస్యాలను తెలుసుకోవాలని నాకు లేదు. మీ కటువంటి అభిప్రాయముంటే మానవచ్చు! నేనేమీ అనుకోను."

"రహస్యం!" అని ఆశ్చర్యపోయాడా సైంటిస్టు. దాదాపు రెండు వందల సంవత్సరాల క్రిందటి పదమది. ఈ మధ్య వాడుకలో లేకపోవడం వలన చప్పున అర్థం తెలిసింది కాదు. మాకు రహస్యం లేదు. మాకు ఉండవలసిన ఆవశ్యకతా లేదు. నాకు తెలిసినదేదో నీకు చెప్పడం వల్ల - నువ్వు నేర్చుకొని పోతావు. అది సంతోషించదగ్గ విషయమేగాని, విచారించవలసిందేమున్నదిందులో. నా కృషి వల్ల వచ్చిన ఒక సత్ఫలితాన్ని కొన్ని లక్షలమంది, కోట్ల మంది ఉపయోగించుకొనడం కంటే గర్వపడవలసిన దేమిటి?" అని ఆగాడతను. "దాదాపు వంద సంవత్సరాల క్రిందట మావాడొకరు ద్రవ్యం మీద పరిశోధన చేశాడు. ఆ సందర్భలో కాంతి కూడా ఒక జాతి ద్రవ్యమేనని తేలింది. ఇంకా దగ్గరి ఉదాహరణ చెబుతున్నాను. సూర్యుడు క్రమక్రమంగా తన ద్రవ్యాన్ని కోల్పోతున్నాడని మీకు తెలుసు. అంటే సూర్యగోళంలోని ద్రవ్యం, ఉష్ణరూపంలోను, కాంతి రూపంలోను వ్యయమౌతున్న దన్నమాట. అంటే ఆ ద్రవ్యానికి - కాంతి కిరణానికి - ఉష్ణశక్తి కూడా ఉన్నదన్నమాటే గదా! కాంతి ఉండటానికి కూడా ఒక 'చోటు' కావాలి. ఆ చోటును సూక్ష్మాతి సూక్ష్మంగా సంకుచిత పరచడం వల్ల, అందులోని కాంతి తన ఉష్ణ శక్తి వల్ల తనే విచ్ఛిత్తిని పొందుతుంది. ఆ విఘట్టనా సదర్భంలో వెలువడే శక్తిని రిజర్వు చేసుకొని, మేము వాడుకొంటుంటాం. మరి మీరు?" అన్నారాయన.

"బొగ్గు నూనె దినుసులు వాడుతున్నాం. విద్యుత్తు గూడా వాడుతున్నాం" అని సంగ్రంగా చెప్పాను.

"అబ్బ ఎంత వేస్టు!" అన్నారాయన. "అణుచ్ఛేదం మేము వందల సంవత్సరాల కిందటే చేశాం. అదంత లాభసాటిగా లేదు. మొన్న మొన్నటి వరకూ ఈథర్‌ను వాడాం. అందునా బోలెడంత కాలం వృధా అవుతుంది. పుష్కలమైన సూర్యరశ్మి ఉండగా, ఇంకొకదాని కోసం ప్రాకులాడటంలో నాకు వివేకం గోచరించదు. కొద్ది నెలల క్రిందట మేము కాంతి వేగాన్ని సాధించాం. ఆ వేగంతో

యానసాధనాలను నడపటం వలన చాలా టైం వృథా అవుతున్నది. ఇతర గోళాలకు వెళ్ళాలంటే కోట్లకు కోట్ల సంవత్సరాలు తీసుకొంటుంది. మరి మేము వెళ్ళే దెప్పటికి? అందుకే ప్రస్తుతం మేము మనో వేగాన్ని సాధించాలని ప్రయత్నిస్తున్నాం. కొద్ది రోజుల్లో పని పూర్తి కావచ్చు.''

తరువాత ఆయన మమ్మొక అద్భుతమైన భవనంలోకి తీసుకెళ్ళాడు. అది పరిశోధనాగారమట. వివిధ శాఖలకు చెందిన శాస్త్రజ్ఞులు అందులో పని చేస్తున్నారు. గౌరవ సూచకంగా వారందరూ మాకు అభివందనాలర్పించారు. ఒక చోట ప్రపంచ పటమున్నది. (అంటే ఒక్క భూగోళముది మాత్రమే కాదు) అందులో భూగోళం ఒక మూలగా గుర్తు పెట్టబడి ఉంది. భూగోళంలోని కొన్ని పట్టణాల వద్ద గుర్తులున్నాయి. ఇవేమిటని మేమడిగాము.

''భూగోళంలో 'జీవశక్తి' ఉన్నదని మేము గమనించి కొన్ని వేల సంవత్సరాలైంది. కానీ ఆ శక్తిని పరిశీలించాలనే కోరిక, అప్పటి మా పూర్వులకు లేదు. దాదాపు పది సంవత్సరాలనుంచే మేమా ప్రయత్నంలో ఉన్నాం. మీతో సహవాసం చేద్దామనేదే మా వాంఛ. కానీ మా యంత్రాలు (ఫ్లయింగ్ సాసర్లు) భూగోళం సమీపంలోకి వచ్చి భస్మమైపోతుండేవి. కారణం తెలుసుకొన్నాం. నారింజరంగు కాంతి ప్రసరణ ద్వారా ఆ అపాయాన్ని అధిగమించ వచ్చునని తేలింది. మేము ఎంతో ఆదరంతో, మీ దగ్గరకు వస్తే- మిత్రులారా! మరొకలాగా భావించకండి. మిమ్మల్ని అవమానించాలని నా అభిప్రాయం కాదు; మీరు యుద్ధ విమానాలతోటి, మర ఫిరంగులతోటి వెంబడించారట. అది భావ్యం కాదు. భూగోళ వాసుల్లో ఇంతటి క్రౌర్యముంటుందని మేము అనుకోలేదు. మీ వారితో ఈ సంగతి చెప్పండి. విభిన్న గోళవాసులు, పరస్పర సహకారంతో సహజీవనం నెరపటం వల్ల కలిగేది లాభమే గానీ, నష్టంకాదు గదా! ఇప్పటికీ అసలు విషయం చెప్పనే లేదు. ఈ యీ గుర్తులు మా వారు భూగోళం మీద దిగిన ప్రదేశాలను తెలియజేస్తాయి. ఈ గుర్తులు మేము దిగవలసిన ప్రదేశాలను తెలుపుతాయి.'' అన్నారాయన.

అక్కడి వారందరూ దాదాపు ఒకే వయస్సులో ఉన్నట్లు నాకు తోచింది. ఆ సందేహమే వారినడిగాను.

''నాకా శాఖతో అంత పరిచయం లేదు. వారినడగండి మీ కన్నీ చెబుతారు.'' అని ఒకాయనను చూపించాడు మా సైంటిస్టు మిత్రుడు.

ఇతడు శరీర శాస్త్రజ్ఞుడట. ఇందులో 20 సంవత్సరాల నుండి కృషి చేస్తున్నాడట. ఈయన పరిశోధన వల్లనే శశూన్ గ్రహవాసులు 'జర'ను జయించారట.

''ఇది చాలా స్వల్ప విషయం'' అన్నాడు ఆ శరీర శాస్త్రజ్ఞుడు.

''శరీరం ద్రవ్య నిర్మితమన్న సూత్రం మీద నా సిద్ధాంతం ఆధారపడి ఉన్నది. ముసలితనం గానీ, వ్యాధిగానీ సంభవించడానికి ముఖ్య కారణం, ద్రవ్యంలో ఏదో లోపం జరగడం. మాట వరసకు ముసలితనమంటే, ద్రవ్యం తన శక్తిని కోల్పోవడమన్నమాట. అలాంటప్పుడు ఆ దుర్బల ద్రవ్యానికి క్రొత్త శక్తినివ్వటం ద్వారా ముసలితనాన్ని అరికట్టవచ్చు. అలాగే వ్యాధి విషయంలోనూ, ఆ మూలగా ఉన్నాయన వయస్సు మూడు వందల సంవత్సరాలు. ఇలా ఆయన ఎంత కాలం

జీవించదలచుకొంటే అంత కాలమూ జీవించవచ్చు. అక్కర లేదనుకొన్నప్పుడు మానుకొనవచ్చు.''

ఆశ్చర్యంతో నేను తెరచిన నోరు ముయ్యడమే మర్చిపోయాను. బెనర్జీ కొయ్య బొమ్మలా నిలుక్కుపోయినాడు. అతను నవ్వుతూ ''మీరింకా జీవ చరిత్రలో ప్రాథమిక దశలోనే ఉన్నారు. మీ అంత ప్రబలంగా మేము ఉద్రేకాలను ప్రదర్శించం. ఎంతటి వింత విషయమైనా, మీరిప్పుడు ప్రదర్శించిన దాంట్లో సహస్రాంశం గూడా మేమాశ్చర్యాన్ని ప్రదర్శించం.'' అన్నాడా శరీర శాస్త్రజ్ఞుడు. ''ఇలా రండి మీకిప్పుడే ఒక ప్రయోగం ద్వారా చూపెడతాను'' అని మమ్మొక గదిలోకి తీసుకెళ్ళారాయన.

అక్కడ ఇద్దరు శశులు కూర్చుని ఉన్నారు. అందులో ఒకతను లేచి ''నాకు నిద్రపోవాలని ఉంది. రెండు వారాలు చాలు'' అన్నాడు. 'మంచిది' అంటూ శరీర శాస్త్రజ్ఞుడు అతనినొక గాజు గ్లోబులో పడుకోబెట్టాడు. ఏదో మీట నొక్కి అందులోకి ఒక అదృశ్య పదార్థాన్ని వదిలాడు. (వదిలాడని అతను చెప్పిందాకా మాకు తెలీదు) గడియారం లాంటి ఒక సాధనంలోని ముల్లు, సున్న నుండి 15 అంకె వరకూ వచ్చి ఆగిపోయింది. ఇంతలో మరొక యంత్రం ఆ గాజు గ్లోబును అది వరకే వేలాదిగా గాజు గ్లోబులు ఉన్నమరొక గదిలోకి చేర్చింది.

''వారందరూ నిద్రపోతున్న వారే! వారి వారి గడువులు పూర్తి కాగానే ఈ గడియారం శబ్దం చేస్తుంది. ఈ అంకెలు వారు కోరిన కాలాన్ని తెలియజేస్తాయి. శబ్దం విన్నంతనే మేమతన్ని వెలుపలకు తీసుకొస్తాం.'' అన్నాడాయన.

''మీరేం చేశారు?''

''ఇన్ని రోజులూ ఆహారమెలా?''

ఆయన మెల్లగా నవ్వాడు.

''మరేమీ లేదు. అతని చైతన్య శక్తిని ఆబ్సెన్స్ చేశాను. అంత కాలమూ సుఖంగా నిద్రిస్తుంటాడు. ఆహారం ఆ గాజు గ్లోబులోనే ఉన్నది. అది వాయు రూపంలో అతనికందు తుంటుంది.''

మరలా మేము మామూలు చోటుకొచ్చాం. రెండవ శశుడు లేచి ''నేను ఆరు నెలల విశ్రాంతి తీసుకోవాలనుకొంటున్నాను'' అన్నాడు.

''ఇది గూడా ఇంతకు మునుపు లాగానే చేస్తారు గదూ?'' అన్నాడు ఆల్‌ఫ్రెడ్.

''కాదు. దానికీ దీనికీ చాల భేదమున్నది'' అన్నారాయన ''రండి ఇది గూడా చూద్దురుగాని.''

రెండవ అతన్ని గూడా అటువంటి గాజు గ్లోబులోనే పడుకోబెట్టాడు. అయితే అతని కుపయోగించిన యంత్రం వేరు. మీట నొక్కంగానే కొన్ని లక్షల మెరుపులు గ్లోబునిండా మెరిశాయి. ఒకటి రెండు నిమిషాల అనంతరం మెరుపులన్నీ మాయమయి ఆకు పచ్చని కాంతి మిగిలింది. దాన్ని జాగ్రత్తగా పరీక్షించి మరొక యంత్రాన్ని కదిలించాడు. ఆకుపచ్చని కాంతి క్రమంగా ద్రవ్య రూపంలోకి మారింది. ఆ ద్రవపదార్థాన్ని మీటరుతో కొలిచాడు. ఖచ్చితంగా ముల్లు ఆరు మీద ఉన్నది. ఈ గ్లోబును మరొక గదిలో భద్రం చేసిన తరువాత అతను ఇలా అన్నాడు--

"మొదటి కేసులో చైతన్యాన్ని అబ్సెన్స్ చేశాను. రెండవది అలా కాదు. ఇతనికీ ఆ మొదటి పద్ధతినే అనుసరించవచ్చు. అందువల్ల కొంత నష్టమున్నది. ఇతనిలో నుండి చైతన్యాన్ని పూర్తిగంతా తీసి వేశాను. అంటే జీవాన్ని తీసి వేశానన్నమాట. జీవశక్తి ప్రథమంలో మెరుపుగానూ, తరువాత ఆకు పచ్చగానూ, కొసకు ద్రవ రూపంగానూ మారటం మీరు చూశారు. అసలు జీవశక్తి అంటే ఏమిటి? పదార్థం ఒక దశలో ఉన్నప్పుడు వెలువరించే గుణం. పదార్థాన్ని ఒక దశనుండి మరొక దశలోకి పరివర్తనీయం చేస్తున్నప్పుడు, ప్రథమ దశలోని గుణాలు పదార్థాన్ని విడిచి పెడతాయి గదా! ఇప్పుడు నేను చేసిందల్లా అలా విడిచి పెట్టబడిన గుణాలు బైటికి వెళ్ళకుండా, రసాయనిక ప్రక్రియ ద్వారా ద్రవస్థితిలోకి మార్చాను. కొంత కాలం క్రిందట దీన్ని కాంతి రూపంలోనూ వాయురూపంలోనూ ఉంచాము. అందువలన కొన్ని దుష్ఫలితాలు కలిగాయి. అప్పటి నుండి ఈ పద్ధతినవలంభిస్తున్నాం" అన్నాడాయన.

"అంటే మీరు మృత్యువును జయించారన్న మాట" అన్నాడు ఆల్‌ఫ్రెడ్.

"దాదాపు" అన్నారాయన నవ్వుతూ. "వారి దగ్గర కెళ్ళండి. మీకు మరి కొన్ని క్రొత్త సంగతులు తెలుస్తాయి. వారు భావాల మీద పరిశోధిస్తున్నారు" అని నన్ను ఉద్దేశించి "మీకు వీరు చిరపరిచితులే! ప్రప్రథమంగా, మీకు మా భాష రానప్పుడు, మీ భావాలను రికార్డు చేసి, మీకు కావలసింది సమకూర్చింది వీరే," అని పరిచయం చేశాడు. నేనతన్ని గుర్తించాను.

"భావాలు మనో సంజనితాలు" అంటూ ప్రారంభించాడా భావ శాస్త్రజ్ఞుడు. "వాటి జననానికి కారణం, బహిరంత రేంద్రియాలు. అవి మెదడులోనే పుడుతుంటాయని మీకు తెలుసు. ఈ మెదడు గూడా అణు సంపుటమేనని మీకు తెలుసు. బాహ్యాంతరేంద్రియాల కార్యకలాపాల ననుసరించి, ఈ అణు సంపుటిలో సంచలనం కలుగుతుంటుంది. కొందరి తత్త్వంలో ఇది తీవ్రంగా ఉండవచ్చు. మరి కొందరి తత్త్వంలో యిది మందంగా ఉండవచ్చు. అంత మాత్రాన సంచలనం క్రమంలో భేదమంటూ ఉండదు. ఈ సూత్రాన్నాధారం చేసుకొని నేను పరిశోధించాను. వివిధ భావాలుత్పన్నమవు తున్నప్పుడు, అణు సంచలనమేవిధంగా జరుగుతున్నదో గుర్తించాను. కొన్ని వందల మందిని పరిశోధించినా భేదం కనిపించలేదు. కాబట్టి అణు సంచలనాన్ని బట్టి భావాలను సులభంగా అర్థం చేసుకోవచ్చు. అయితే ఒక్కొక్కసారి ఈ భావ వేగం అత్యధికంగా ఉంటుంది. అప్పుడు జరిగే అణు సంచలనాన్ని బట్టి భావాలను గుర్తించటం కష్టమవుతున్నది. అందుకోసం నేనూ మరి ముగ్గురమూ కలసి, ఈ చిన్న యంత్రాన్ని తయారు చేశాం. ఈ యంత్రం అణుసంచలనాలను రికార్డు చేసి పెడుతుంది. తీరికగా ఆ రికార్డు ముందువేసుకొని, భావాలను అర్థం చేసుకోవచ్చు. ఉదాహరణకు - మీరు గాజు సీసాలో ఉన్నప్పుడు నీరు కావాలని మాకెలా తెలిసిందనుకొన్నారు? మీరు దాహంతో బాధపడుతున్నారు. నీరుంటే బాగుండు ననుకొన్నారు. ఈ వైర్లు చూశారనుకొంటాను; సీసాలో మీ తలమీదుగా ఉన్నాయి. మీలో రేగే భావ తరంగాలను ఇవి విద్యుదావేశితం చేసి యంత్రంలోకి పంపుతాయి. యంత్రం వాటిని రేఖల రూపంలో లిఖిస్తుంది. ఆ లేఖనాన్ని చూసి, నేను మీకు నీరు కావాలని తెలుసుకొన్నాను. మాలో మంద బుద్ధులంటూ లేకుండా చేసుకోవాలన్న మా ప్రయత్నం ఇటీవలే సఫలమైంది. మెదడు చురుకగా, తీక్షణంగా పనిచెయ్యకపోవటానికి అందులో ఉన్న

అణువులలో కొన్ని శక్తి విహీనాలు కావటమే కారణమని మేము తెలుసుకొన్నాం. ఆ దుర్బలాణువులను తీసెయ్యడంతో మా సమస్య పరిష్కారమైంది...''

పిచ్చెత్తిపోతున్నది. ఇక వినలేము. ఆ పూటకు విశ్రాంతి తీసుకోవాలనుకొన్నాం.

''మంచిది. అలానే విశ్రాంతి తీసుకోవచ్చు'' అన్నాడాయన యంత్రం ముందు కూచుని.

''నా యంత్రం తప్పు చెపుతుందంటారా? పోనీ ఇలా రండి, ఈ గీత చూస్తే మీరేమనుకొన్నదీ తేలిపోతుంది'' అన్నాడు.

నేను సిగ్గుపడ్డాను.

''బ్రతికిపోయాను. ఇటువంటి యంత్రం భూగోళంలో కనిపెట్టలేదు. లేకపోతే కొన్ని లక్షలమందిని హతమార్చవలసి వచ్చేది. భగవంతుడు మా గోళవాసుల కిట్టి శక్తిని ప్రసాదించ కుండుగాక.'' అని ప్రార్థించాడు ఆల్‌ఫ్రెడ్.

ఆ విధంగా మేము 4, 5 వారాలు, ఆ చిత్రగ్రహం మీద సంచారం చేశాం. ఆ గ్రహం మీద పల్లెలంటూ లేవు. ఉన్నవన్నీ పట్టణాలే! ప్రతి పట్టణంలోనూ మేము చూసిన లేబరేటరీ వంటి దొకటున్నది. వందలాది స్త్రీ పురుషులు నిరంతరం శాస్త్రజ్ఞుల సహాయాన్ని పొందుతుంటారు. అక్కడి ప్రేమ సంబంధాలు గూడా మాకాశ్చర్యాన్ని కలిగించాయి. ప్రతి వారూ ఏదో ఒక పనిలో నిమగ్నులై ఉండటం మూలాన్ని కాముక వ్యాపారం అంతగా ఉండదు. ఎన్నో ఫ్యాక్టరీలను చూశాం. వాటికి మేనేజరంటూ ఎవ్వరూ లేరు. ప్రతి వారు శక్తి ఉన్నంత వరకూ పనిచేస్తారు. కావలసిన దేమిటో వాడుకొంటారు. జీత భత్యాలు లేవు. డబ్బు మారకం లేదు, కోర్టులు లేవు. పోలీసులు లేరు, ఒకరినుండి మరొకరికి భయంలేదు. సంకోచం లేదు, ఈర్ష్య లేదు. లేదన్న విచారం లేదు, దాచుకొందామన్న కుత్సిత బుద్ధి లేదు. ఆకాశంలో మత్తుగా సంచరించే మేఘ శకలాల్లాగా సంతోషంతో, ఉత్సాహంతో పింపెసలారుతుంటారు. స్వేచ్ఛగా ఆ స్వర్గ సీమలో సంచరిస్తుంటారు.

బంగారాన్ని వారెంత నిర్లక్ష్యంగా చూస్తారో తెలిసిన తరువాత నేనాశ్చర్యపోయాను.

''ఇందులో కారణం మరేమీ లేదు? అదిక్కడ పుష్కలంగా లభిస్తుంది'' అన్నాడు బెనర్జీ.

బెనర్జీతో మా తొలినాటి సైంటిస్టు ఏకీభవించలేదు.

''మొదట్లో మాకు బంగారం కొరతగా ఉండేది. అందుకోసం మా గ్రహవాసులు తహతహలాడేవారు. ఈ సంగతి మాకు - అంటే శాస్త్రజ్ఞులకు తెలిసింది. ఈ సమస్యను పరిష్కరించకపోతే చిక్కులొస్తాయని గ్రహించాం. విరవిగా బంగారాన్ని ఉత్పత్తి చేశాం- మీకూ బంగారం కొరతగానే ఉన్నదా?'' అన్నారాయన.

''ఆ! బంగారమంటే మేము పడి చచ్చిపోతాం. అసలు భూలోకంలో జరిగిన, జరుగుతున్న యుద్ధాలకు ప్రధాన కారణం బంగారమే! కామినీ కాంచనాల చుట్టూ మా సాంఘిక వ్యవస్థ అల్లుకొని ఉంది. ఇవి రెండూ మినహాయిస్తే మా కసలు జీవితమే లేదు'' అన్నాడు ఆల్‌ఫ్రెడ్ వేదనా పూరితంగా.

''ఎంత అల్పులు!'' అని ఆశ్చర్యపడ్డాడు, మా మిత్రుడు. ''నా సాటి గోళవాసులు ఇంత

అధమ స్థితిలో ఉన్నందుకు నాకెంతో విచారంగా ఉన్నది. ఈ వ్యవస్తను నీచత్వాన్ని మీరెందుకు అసహ్యించుకోరు? ఎందుకు మర్చాలని ప్రయత్నించరు?... మీ బంగారం సమస్యలను నేను పరిష్కరిస్తాను. అప్పటికైనా మీకున్న వేదనలు కొన్ని తీరిపోవచ్చు. బంగారానికి పాదరసానికి ఉన్న భేదం చాలా స్వల్పం. స్వల్పపరమాణు కేంద్రకంలో నికర ధన విద్యుదావేశం 79; పాదరసంలో 80; కాబట్టి పాదరస కేంద్రానికి ఋణ విద్యుదావేశ పరమాణువును చేర్చండి. మీకు కావలసినంత బంగారం తయారవుతుంది'' అన్నారాయన.

అక్కడ కార్లు రైళ్లు లేవు. స్టీమర్లు గూడా లేవు. వాటిని 150 సంవత్సరాల క్రిందట ప్రదర్శన శాలలో భద్రం చేశారట. ఎంత చిన్న ప్రయాణానికైనా వారు విమానాలనే వాడుతారు. ఆ విమానం అంతా కలసి పెద్ద సైజు ముక్కాలి పీటంత ఉంటుంది. ఇద్దరు సుఖంగా కూర్చోవచ్చు. దిగడానికి విమానాశ్రయాలక్కరలేదు. గజం మేర జాగా ఎక్కడున్నా దిగవచ్చు. ప్రతి విమానానికి రక్షణ యంత్రాలుంటాయి. విమానం చెడిపోయినప్పుడు ఆ యంత్రాల నుపయోగించి తాత్కాలికంగా అపాయాన్ని దాటవచ్చు. అందుకోసం ప్రత్యేకంగా, ఎవరికీ ఏమీ చెల్లించనక్కరలేదు. అవి ఉండే ప్రదేశానికి వెళ్ళి ఎవరికి కావలసినన్ని వారు తెచ్చుకోవచ్చు. పని తీరిన తరువాత వాటి యథాస్థానంలో ఉంచవచ్చు. మేము కొన్ని వందల మంది (వేలమందిని గూడా) ఇంజనీర్లను, ఉపాధ్యాయులను, విద్యార్థులను, వివిధ కార్యాలకు సంబంధించిన వారిని సంప్రదించాం. అందరూ ఒకే విధంగా చెప్పారు. ఉపాధ్యాయుడు పిల్లలకు పాఠాలు చెబుతాడు. తనకు తన కుటుంబానికి కావలసిన సరుకులు స్టోర్సులో తెచ్చుకుంటాడు. స్టోర్సులో సరుకులివ్వడానికంటూ ఎవ్వరూ ఉండరు. ఎవరికి వారే తమకు కావలసినన్ని సరుకులు తెచ్చుకుంటారు. పంటలు, వస్త్రాలు (వారి గుడ్డలు పత్తితో చేసినవి కావు) ఇతర సామానులు, ఉత్పత్తి అయినవి అయినట్లు, ఆయా శాఖల్లో పనిచేస్తున్న వారు స్టోర్సుకు చేరుస్తారు. తనకు కావలసిన దానికంటే అధికంంగా దాచుకోడాన్ని వారసలు ఊహించలేరు. మేమీ ప్రశ్న అడిగినప్పుడు వారు ఆశ్చర్యంతో మమ్మల్ని చూశారు. 'ఇటువంటి పిచ్చిపనులు మీ లోకంలో చేస్తుంటారా?' అని పృచ్ఛించారు! జవాబు చెప్పలేక తలలొంచుకొన్నాం. వ్యక్తిగతమంటూ ఏమీ లేదు. ప్రతి వ్యక్తికి ప్రతిదానిమీదా హక్కున్నది. ప్రతిదీ ప్రతివారికీ చెందిందే. తనకు మించి దాచుకోవటమంటే, తన సొమ్ము తనే దాచుకోవటం, తననుండి తనే దొంగిలించటమని వారి భావన.

వీరంతా ముఠాతత్వంగాళ్ళనీ, వ్యక్తిత్వం వీరికి లేదనీ సరిపెట్టుకోజూచాను. కానీ, వారిలో ఉన్న వ్యక్తి వికాసం నేనెప్పుడూ ఊహించనన్నా ఊహించలేదు. సమిష్టి భద్రతలో వ్యక్తిత్వం నాశనం కావటమనేది ఎందుకు జరగాలో నాకు బోధపడలేదు. అప్పటికే మేమొచ్చి చాలా కాలమైంది. ఇక భూగోళం చేరటం మంచిదని నేనన్నాను.

''నేను రాను'' అన్నాడు ఆల్‌ఫ్రెడ్. ''ఈ నాగరికతా ఇక్కడి జీవితమూ చూసిన తరువాత, నాకు భూమికి రావలెనని లేదు. ఇంత సుందర దృశ్యాన్ని చూసిన ఈ కళ్ళతో, తిరిగి ఆ పాడు లోకం చూడలేను. మిత్రులారా! దయచేసి నన్ను వదిలిపెట్టండి. నా ప్రాణమిక్కడ హాయిగా ఉన్నది. కీర్తికోసం డబ్బుకోసం స్త్రీకోసం నీచాతి నీచంగా ఘోరాతి ఘోరంగా పోరాడుకొంటున్న ఆ నరకలోకంలోకి నన్ను లాగకండి. ఇక్కడే ఉండిపోతాను'' అని ఆల్‌ఫ్రెడ్-- పాటికి పది సార్లు అన్నాడు.

“మీరిక్కడుంటానికి వారంగీకరించకపోతే?” అన్నాడు బెనర్జీ.

“అభ్యర్థిస్తాను. అప్పటికీ అంగీకరించకపోతే చంపెయ్యమని అంటాను” అన్నాడు.

“అక్కరలేదు. ఈ గోళం మా ఒక్కరిదే గాదు? అందరిదీను. ఎవ్వరయినా ఇక్కడకు రావచ్చు. వారి ఇష్టమొచ్చినంత కాలం ఇక్కడుండవచ్చు. మీకు చేతనయిన పని ఏదో మీరు చేయండి. మీకు కావలసిందేమిటో అనుభవించండి. మా కలాంటి నిషేధాలేమీ లేవు” అన్నాడు మా శషూన్ మిత్రుడు.

అతనితో మేమొచ్చిన పని చెప్పాం. సహాయం చేయమని వేడుకొన్నాం.

“ఈ స్వల్ప విషయం కోసం ఇంతగా ప్రాధేయపడనవసరం లేదు. ఎవరి నడిగినా మీకీ సందర్భంలో సహాయం చేస్తారు. ఇక్కడ వారందరూ ఒకసారి చంద్రుణ్ని తాకి వచ్చిన వారే; అంతా కలసి- కొన్ని నిమిషాల పని. షికారుగా పోయి రావచ్చు... వద్దండీ! మీకేమీ  భయం లేదు. తోడు గూడా అనవసరమే! ప్రతి స్టోర్సులోనూ అందుకు కావలసిన పరికరాలుంటాయి. వాటి నుపయోగించవలసిన విధానం గూడా వాటి మీదే రాసి ఉంటుంది. ఆ విధంగా చేయండి. మీ కొచ్చిన ప్రమాదమేమీ లేదు. మేమిక్కడ నుండి జాగ్రత్తగా చూస్తూనే ఉంటాం” అన్నాడాయన.

ఇక ఏమనడానికీ తోచలేదు. ముగ్గురం ఒకరి నొకరం చూసుకొన్నాం. సరేనని ఆయనకు మా అంగీకారం తెలియజేశాం.

పరికరాలంటే పెద్ద హడావుడులేమీ లేవు. ఒక చక్రం వంటిది పెద్ద దొకటున్నది. అదీ ఆకుపచ్చగానే ఉంది. లోపల యంత్రాలు ఉపయోగించవలసిన విధానం రాసి ఉన్నది. ముగ్గురమూ చక్రాలు తీసుకొన్నాం. వీటికీ, మన భూగోళంలో ఎగిరే పళ్ళాలకు అంతగా తేడా లేదని బెనర్జీ అన్నాడు. ముగ్గురమూ చర్రున ఆకాశంలోకి ఎగిరాము. వెళ్ళవలసిన చోటుకు మీటరు తిప్పితే చాలు, సుఖంగా అవే అక్కడకు తీసుకెడతాయి. ఎంతో ఆశతో మేము చంద్రమండలం మీద కాలూనాలని మొదట బయలుదేరాం. మధ్యలో మరొక కొత్త గ్రహాన్ని పరిచయం చేసుకొన్నాం. మా కృషికి దక్కిన ఫలితమిది. అప్పటికే చంద్రమండలం మీద శషూన్ గ్రహవాసులు పతాకం ప్రతిష్ఠితమై ఉంది. లెక్క వేస్తే అప్పటికి వారిది సాధించి 250 సంవత్సరాలైంది. దీనిని బట్టి వారికి, మనకు నాగరికతలో, విజ్ఞానంలో 250 సంవత్సరల తేడా ఉందన్న మాట. “అయితే మరొక 250 సంవత్సరాలకైనా మనమిలాంటి నాగరికతను సృజించగలమా ఆల్ ఫ్రెడ్?” అన్నాడు బెనర్జీ.

“నాకా నమ్మకం లేదు. మనం రోజు రోజుకూ ఈర్ష్యలతో, కాపీనాలతో, పరస్పర భీతితో తొక్కుకు ఛస్తున్నాం. ప్రచండమైన ఆయుధాలతో ఒకరినొకరం నాశనం చేసుకోవాలని చూస్తున్నాం. మూడవ ప్రపంచ యుద్ధం లేపి ప్రపంచమంతటినీ కబళించి వేయాలని పెద్ద పెద్ద దేశాలు అవకాశం కోసం చూస్తున్నాయి. ఏ క్షణాన, ఎక్కడ యుద్ధం రగులుకొంటుందో చెప్పలేం. మనం క్రమక్రమంగా- కనిపించిందల్లా మింగేసే - అడవి మనిషి తత్వంలోకి జారిపోతున్నాం. ఈ పతనానికి అవధి ఇంకా నిర్ణయమైనట్లు లేదు. నా ఉద్దేశ ప్రకారం మన నాగరికత తిరిగి ఆ కొస నుండి ప్రారంభం కావలసి ఉంటుంది” అన్నాడు బెనర్జీ.

ఎందుచేతో చంద్రగోళం మెట్టినామన్న సంతోషం నాకు కలగలేదు. నా మిత్రులకూ కలగలేదు. అక్కడ జేరగిలబడి, దూరదర్శిని నుండి (వీటిని మాకు శషూన్ గ్రహవాసులిచ్చారు. ఆకారంలో ఎంత చిన్నవో శక్తికి అంత పెద్దవి. మావి ఎక్కడో పోయాయి) భూమిని చూస్తుంటే "మాతృగర్భంలో తిరిగే పిండంలాగా ఈ ప్రదేశంలో గిలగిల లాడుతున్న" దన్నాడు ఆల్‌ఫ్రెడ్. "సకల పాపాలు గడ్డకట్టిపోయి, పాప పరిహారార్థం, ఆత్మ ప్రదక్షిణం చేస్తున్న పాపిలాగా" ఉన్నదన్నాడు బెనర్జీ. నా అభిప్రాయం వారడగనూ లేదు, నేను చెప్పనూ లేదు.

చంద్రగోళమంతటా తిరిగాం. మచ్చుకైనా అక్కడ పసిరిక (కనీసం) కనిపించలేదు. పెద్ద పెద్ద గోతులు, ఎత్తయిన కొండలు... అవి రాళ్ళుకాదు, అది మట్టీ కాదు. ఎన్నో ద్రవ్యాలు మహోష్ణంలో సంవత్సరాల తరబడి మరిగి, మసిలి, మహాశీతలంలో గడ్డకట్టిపోయినట్లున్నది. చంద్రగ్రహం చేరుకొన్నామన్న తృప్తికి గాను, ఇంత ద్రవ్యం తీసి దాచాడు బెనర్జీ. మేమక్కడుండగానే ఇంకొన్ని పళ్ళాలు అక్కడికొచ్చాయి. వారంతా విద్యార్థులట. చంద్రుణ్ణి గురించి ప్రాక్టికల్‌గా తెలుసుకొనేందుకు వాచ్చరట. మాతో పదినిమిషాలు మాట్లాడి; వారు చంద్రగోళం వెనుకకు వెళ్ళారు.

"మనమూ వెళదామా?" అన్నాడు ఆల్‌ఫ్రెడ్.

"వద్దు. నాకంత ఉత్సాహంగా లేదు."

తిరిగి శషూన్ గ్రహం చేరుకొనే వేళకు అక్కడ మా మిత్రుడు మా కోసం ఎదురు చూస్తున్నాడు. "మీరీ రాత్రి అక్కడ ఉండిపోతారేమో కనుక్కోమని మా సైంటిస్టుకు చెప్పాను. మీరలా అనుకోవడం లేదన్నాడు... లేకపోతే మీకు ఆహారం వగైరా పంపేవాణ్ని" అన్నాడు మా శషూన్ మిత్రుడు.

అతని ఆదరానికి ధన్యవాదాలర్పించాను.

"మీరింతగా నన్ను అభినదించనక్కరలేదు. ప్రత్యేకంగా మీకు నేను చేసింది గూడా లేదు. మమ్ములను మేమెలా గౌరవించుకొంటామో, మిమ్ములనూ అలాగే గౌరవించాం. ఇందులో మీరు నన్ను అభినందిస్తున్నది దేనికి?"

"మా జాతిలో మృగ్యమయిందే ఇది. మా నాగరికతా సౌధ నిర్మాణం, ఈ పునాది నుంచే ప్రారంభించాలి" అన్నాడు బెనర్జీ.

"మరొక శుభవార్త. మా సైంటిస్టు ఇప్పుడే భవిష్యత్తులోకి వెళ్ళి రాగలిగాడు. కాలాన్ని జయించాలని మేము గత అయిదేళ్ళుగా శ్రమపడుతున్నాం. ఇప్పటికి మా కష్టం ఫలించింది. ఇంతకాలం మాకు కొరుకుడు పడకుండా ఉన్నది కాలమే! ఇప్పటి నుండి మేము భవిష్యత్తులో గూడా జీవించగలం" అన్నాడా మిత్రుడు సంతోషంతో.

మేము చిన్న చిన్న విమానాల మీద అక్కడికెళ్లాం. ఆ సైంటిస్టు మమ్మల్ని ఆదరంతో ఆహ్వానించాడు. దాపరికం లేకుండా (వారికదేమిటో తెలియదు) తను ప్రొసీడ్ అయిన విధానం మాకు సాకల్యంగా చెప్పాడు.

"ప్రదేశాన్ని దాటటం మీకు తెలుసు" అన్నారాయన.

“అంటే?” అన్నాడు బెనర్జీ.

“సరే- మీ రిక్కడున్నారు. ఇక్కడికి చంద్రమండలం ‘యమ్’ మైళ్ళ దూరమున్నదనుకోండి. ఇక్కడి నుండి చంద్రమండలాన్ని భావించిన మరుక్షణం మీ మనస్సులో చంద్రమండలం భాసించి తీరుతుంది. అంటే మీరు ‘యమ్’ మైళ్ళ దూరాన్ని అధిగమించారన్న మాటే! అదే విధంగా సూర్యుణ్ని గురించి అనుకొన్నారనుకోండి. వెంటనే మీరు సూర్యుని దూరాన్ని దాటేశారన్న మాట! కాని కాలాన్ని అలా దాటడం సులభంగాదు. మీరు అటు గతంలోకి గానీ, ఇటు భవిష్యత్తులోకి గానీ వెళ్ళలేరు. క్రిందటి గంటవరకూ మేము వెళ్ళలేకపోయాం. ఇప్పుడు వెళ్ళగలం. భవిష్యత్తులోనికి కొన్ని గంటలు - సుమారు ఒకటిన్నర గంటలు - ఇప్పటికి మా యంత్రం వెడుతుంది. కొద్దిరోజుల్లో ఈ కాలాన్ని కావలసినంత మేరకూ పెంచుకోగలం” అన్నారు.

“ప్రాసెస్ చెప్పారు గాదు” అన్నాడు బెనర్జీ.

“వస్తున్నాను.” అంటూ ప్రారంభించాడు. “కాలానికి ఒక వేగమున్నది. ఆ వేగాన్ని సౌలభ్యం కోసం గంటలు, నిమిషాలు, సెకనులుగా మార్చుకొన్నాం. మనం ఎంత వేగాన్ని సృష్టించినా, కొసకు కాంతి వేగమైనా 1,86,000 మైళ్ళు ఒక్క సెకనులో దాటింది ప్రదేశాన్నే అనిపిస్తుంది. పొరబాటు అక్కడే! దేశ కాలాలను భిన్న రూపాలుగా చూడటం వల్లనే ఈ చిక్కు తటస్థపడుతుంది. కాల రహితమైన దేశాన్ని గానీ, దేశ రహితమైన కాలాన్ని గానీ, ఊహించగలమా? దేశాన్ని దాటుతున్న నిష్పత్తిలో మనం కాలాన్నీ దాటుతున్నాం. ఉదా: మీ గోళంలో 1వ తేదీన పెద్ద యుద్ధం జరిగిందనుకోండి. ఆ రోజునే మీరు బయలుదేరి మీరు దాపులో ఉన్న నక్షత్రాన్ని చేరుకున్నారనుకోండి. ‘ఈ రోజున భూగోళం మీద యుద్ధం జరిగిందనీ, మేము ప్రాణభీతితో ఇక్కడికి పారిపోయి వచ్చామనీ ఆ నక్షత్ర వాసులకు చెబితే వారు నమ్మరు సరిగదా, మిమ్మల్ని పిచ్చివాళ్ళ క్రింద జమకడతారు. ఈ సత్యాన్ని వారు దాదాపు 4 1/2 సంవత్సరాలకుగానీ గ్రహించరు. 1వ తేదీన మీరు సాధించింది కేవలం దేశాన్ని దాటటమే గదా! కానీ మిత్రులారా!! అదే రోజున మీరు 4 1/2 సంవత్సరాలు భవిష్యత్కాలంలోకి ప్రయాణించారు. ప్రధాన సూత్రమిదే! అయితే ఇందుకు కాంతి వేగాన్ని మించిన వేగం కావాలి. కాంతి వేగాన్ని మించి ఎన్నిరెట్లు వేగాన్ని సృష్టించగలిగితే, అంతగా భవిష్యత్ కాలంలోకి చొచ్చుకుపోవచ్చు.” అన్నాడాయన.

మేమెవ్వరమూ మాట్లాడలేదు. ఈ ఫలితం తెలిసిన తరువాత ఆల్‌ఫ్రెడ్ అసలు భూ మండలానికే రానన్నాడు. నాకు రావాలని లేదన్నాడు. కావాలంటే నువ్వెళ్ళమన్నాను. బెనర్జీ కాదు కూడదని మొండికేశాడు. ఎన్నో నిష్ఠూరాలాడాడు. ఎంతగానో గింజుకొన్నాడు.

“కనీసం వీరిని చూసి అయినా నువ్వు నేర్చుకోలేదు మిత్రమా! వీరందరూ సమిష్టి మీద జీవిస్తున్నారని మనం సంతసిస్తున్నాం. కానీ మనకది గిట్టటం లేదు. మనవరకు మనం ఇక్కడ సుఖంగా ఉండటమంటే, మన తోటి వారిని యధాస్థితిలో ఉంచటమన్న మాటే! మనం శభూన్ల నుండి నేర్చుకొన్నదిలేదా? కాదని నువ్వంటావు. అయినప్పుడు దేన్ని నువ్వు గౌరవిస్తున్నావో దాన్ని చేయటానికి సిగ్గుపడటంలో అర్థం లేదు. పరిస్థితులు ఎల్లకాలమూ ఇలానే ఉండవు. ఎప్పుడో

ఒకప్పుడు మారుతాయి. మారకపోయినా , కనీసం మారుతాయన్న ఆశతోనయినా పనిచేద్దాం. ఇక్కడ ఎవరి ధర్మాన్ని వారు నెరవేర్చుకుందా. కనీసం శఘాన్లను గౌరవిస్తున్నందుకైనా మనమీ పని చెయ్యాలి'' అన్నాడు బెనర్జీ.

నేనంగీకరించక తప్పలేదు. ఆల్‌ఫ్రెడ్ భూగోళానికి రావడం కంటే ఇక్కడుండడమే మంచిది. ఏనాటికైనా ఈ రెండు గోళవాసులనడుమ స్నేహ సౌభ్రాతృత్వాలనతడు నెలకొల్పగలడు.

శఘాన్లు మా యిద్దరి ప్రయాణానికి అన్నీ సిద్ధం చేశారు. మేము భూగోళాకి వెళ్ళనున్నామనీ ఆ వార్త గోళమంతటా వ్యాపించింది. లక్షల కొలది శఘాన్లు మాకు వీడ్కోలివ్వటానికి వచ్చారు. వారి ముఖాల్లో వెల్లివిరుస్తున్న స్నేహ వాత్సల్యాలను చూచి మురిసిపోయాను. ఎందరో సైంటిస్టులు మా గౌరవార్థం నిలబడి ఉన్నారు. ఆల్‌ఫ్రెడ్ అప్పుడప్పుడు భూగోళానికి వచ్చిపోతుంటానని బాస చేశాడు. మా రాక పట్ల భయ సందేహాలు ప్రదర్శించనవసరం లేదని, భూగోళవాసులకు చెప్పవలసిందిగా ఎందరో మిత్రులు పరిపరి విధాల హెచ్చరించారు. తమ స్నేహానురాగాలను శఘాన్లు తీవ్రంగా వాంఛిస్తున్నట్లు భూవాసులకు విధిగా తెలియజేయమని అభ్యర్థించారు. ఒక్క చోట ఒక్కసారి అన్ని లక్షలమంది తమ సద్భావ సందేశాలను భూవాసులకు అందజేయమని కోరటం, వారి నిర్మలాంతః కరణానికి చిహ్నం.

టైమవుతోంది. అందరి దగ్గిరా సెలవు తీసుకొంటున్నాను. ఆల్‌ఫ్రెడ్ నన్ను, బెనర్జీని గాఢాలింగనం చేసుకొని ''మీ స్వప్నం సఫలీకృతమవుగాక'' అని దీవించాడు. శఘాన్ మిత్రులు సంతోషంతో బాష్పతప్త నయనులైనారు. వాహనమెక్కి లోపలకు పోబోతూ ఒక్కసారి చుట్టూ చూశాను. మాకు వీడ్కోలులిస్తూ లక్షలాది హస్తాలు కలువపువ్వుల్లా గాలిలో సంచరిస్తున్నాయి. ఆల్ ఫ్రెడ్ నా యితర శఘాన్ మిత్రులు నవ్వుతూ చేతులూపుతున్నారు. అందరినీ ఒక్కసారి కంటినిండుగా చూశాను. అప్రయత్నంగా నా కన్నులు బాష్పపూరితాలయినాయి. లోపలి కొచ్చి ఠక్కున సీటుకు జారగిలబడ్డాను. మరుక్షణానే వాహనం బయలుదేరి భూ ముఖంగా దూసుకుపోసాగింది.

* * *

# అప్పుడు

## (1956-60)

## ఎత్తు పల్లాలు

## స్వార్థ పరులు

## పాలపుంత

## వర్గ దృష్టి

**దారిద్ర్యం** నిన్నటిదీ మొన్నటిదీ కాదు. ఆదిమ కమ్యూనిస్టు సమాజం విచ్ఛిన్నమై ఒకడు పనిచేయించేవాడూ, అనేక మంది పనిచేసేవారుగా సామాజం మారినప్పుడే, కలిమిలేముల తారతమ్యం ఏర్పడింది. గౌతమ బుద్ధుని కాలం నాటికే ఈ తర తమ భేదం అతి తీవ్రంగా ఉన్నది. భయంకరమైన ఈ దారిద్ర్యాన్ని చూశాక బుద్ధుడు వికల మనస్కుడైనాడు. సమస్త సంపదలను పరిత్యజించి, మానవ కోటికి సుఖ జీవనోపాయాలను అన్వేషించే ప్రయత్నం చేశాడు.

కోటాను కోట్లమంది, దుస్సహమైన దారిద్ర్యాగ్నిలో దహనమై పోతున్న సమయంలోనే అల్ప సంఖ్యాకులు అనంత సుఖాలను అనుభవిస్తున్నారు. ఈ దారిద్ర్యాన్ని భరించలేని ఒక సంస్కృత కవి 'అన్నాతురః కథయకిన్న కరోతి పాపం!' అంటాడు. 'ఆకలితో అలమటించేవాడు ఏ పాపం చేయడు కనుక? ఆకలి - అతని చేత అన్ని పాపాలనూ చేయిస్తుంది' అని దీని భావం.

దరిద్రమంటే ఏమిటో భరద్వాజకు తెలియనిది కాదు. ఒంటరిగా ఉన్నప్పుడు, పుక్కిలింత లవుతున్న లేమిని, పురచేత్తో పక్కకు తోసేసి, తన పనేమిటో తను చేసుకుపోయాడు భరద్వాజ... ఇప్పుడు అలా కుదరటం లేదు. ఆదాయం నెలకు 60 రూపాయలు. తనూ, భార్యా, పెద్ద కొడుకు రవీంద్రనాథ్ - కలిసి రోజుకు రెండు రూపాయలతో సరిపెట్టుకోవలసి వచ్చింది. ఉన్న కాస్తా కొడుక్కు పెట్టేసి, కడుపునిండా నీళ్ళు తాగి కాలం గడుపుకొన్న సందర్భాలూ ఉన్నాయి.

ఆ రోజుల్లో అపరాధ పరిశోధక నవలల పేరుతో- మద్రాసు నిండా 'హత్యా సాహిత్యం' మణుగుల కొద్దీ తయారవుతూ ఉండేది. అచ్చంగా ఆ బాపతు కథలను అచ్చు వేసే పత్రికలూ చాలా ఉన్నాయి. హేమా హేమీల్లాంటి రచయితలు సొంత పేర్లతోనూ మారు పేర్లతోనూ హత్యా సాహిత్యం ఉత్పత్తి చేసి నాలుగు రాళ్ళు సంపాయించుకుంటున్నారు. నాలుగైదొందల పెట్టుబడితో ఒక పుస్తకం అచ్చయి వస్తుంది. అన్ని ఖర్చులుపోనూ ఒక డిటెక్టివ్ నవల మీద తక్కువలో తక్కువగా మూడు వందల లాభం కళ్ళ చూడవచ్చు. అలా చూసి సంపన్నులైన వారున్నారు.

తానొక్కడూ పస్తులుండటానికేమీ అభ్యంతరం లేదు. ఆ అలవాటు లేని వాడూ కాదు? ఆ విద్య తెలియని వాడూ కాదు! కానీ తన మీద మరో ఇద్దరు ఆధారపడి ఉన్నారు మరి. తన దీనావస్థను తెలియచేస్తూ దగ్గర బంధువులకు, ఒక రిద్దరు మిత్రులకు జాబులు రాశారు. మిత్రులులేమో తమ నిస్సహాయతను తెలియజేస్తూ తిరుగుజాబులు రాశారు. దగ్గర బంధువులు- ఆపాటి శ్రమను కూడా తీసుకోలేకపోయారు. "ది సదరన్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్" అనే సంస్థకు మొదలియార్ యజమాని. ఆయన వార్తా పత్రికల పంపిణీ వ్యాపారాన్ని కూడా చేస్తూ ఉండేవాడు. ఆ సంస్థలో పనిచేస్తున్న ఒక పరిచయస్తుడు భరద్వాజ పడుతున్న అవస్థను గమనించి, అతన్నొక డిటెక్టివ్ నవల రాయమనీ, వందరూపాయలు ఇప్పిస్తాననీ అన్నాడు. 1958లో తానున్న దౌర్భాగ్య స్థితిలో వందరూపాయలంటే చాలా పెద్ద మొత్తం కిందనే లెక్క. ఓ రోజు రాత్రి 8 గంటలకు రాయడం ప్రారంభించి, ఉదయం ఆరు గంటలకల్లా డిటెక్టివ్ నవలను పూర్తి చేశాడు. ఆ నవల పేరు 'విషనాగు'. అది భరద్వాజ పేరున అచ్చుకాలేదు. అదే సంవత్సరం అక్టోబరులో మరో నవల రాశాడు. ఆ నవల పేరు 'దుష్ట చతుష్టయం'. రచయిత పేరు రావూరి జయదేవ్. దీన్ని 'కుబేరా ఎంటర్ ప్రైజెస్' వారు ప్రచురించారు. 1958

డిసెంబరులో "సత్యాన్ని దాచడం సాధ్యం కాదు," అన్న నవలనూ, 1959 ఫిబ్రవరిలో "మంచు మనిషి" అన్న నవలనూ భరద్వాజ రాశాడు. మొదటి నవల విషనాగు ఎవరి పేరు మీద వచ్చినా, మిగతా మూడు నవలలూ 'జయదేవ్' పేరుతోనే అచ్చయ్యాయి.

1958 డిసెంబరు నెల. ఏదో అవసరం పీకల మీదికొచ్చింది. 'ఎత్తుపల్లాలు' అన్న డిటెక్టివ్ కథ రాసి, రాస్తూనే డబ్బు పుచ్చుకొని ఆ గండాన్ని గడుపుకొన్నాడు భరద్వాజ.

"ఏ సబ్జెక్టునైనా అందంగా రాయగలడు సుమా!" అని చూపించటం కోసం కాక - "అవసరం మనిషిచేత ఏ పనైనా చేయిస్తుంది సుమా" అని చూపించడం కోసమే ఆ కథను ఇక్కడ చేర్చారు...

# ఎత్తుపల్లాలు

**తెనాలిని** చూడగానే డిటెక్టివ్ జయరాంకు ప్రాణం లేచి వచ్చినట్లయింది. గతించిపోయిన ఎన్నో సంఘటనలు కళ్ళ ముందు తిరిగాయి. తన చిన్నతనమంతా దాదాపు తెనాలిలోనే గడిచింది. ఇక్కడే తన జీవితానికి గట్టి బాట ఏర్పడింది. ఇక్కడే తను ప్రాణ ప్రదంగా చూసుకొనే స్నేహాలున్నాయి. ఎంత మద్రాసులో ఉన్నా, ఎన్ని సుఖాలనుభవిస్తున్నా, తన అభిమానమంతా తెనాలి మీదనే! తెనాలికీ, తనకూ ఏవో అవినాభావ సంబంధాలున్నాయి. ఆ సంబంధాలే తనకు ఇలాంటి అభిమానం ఏర్పడటానికి కారణభూతమయ్యాయి.

"ఏమిటాలోచిస్తున్నావ్?" అన్నాడు నాగభూషణం.

"అబ్బే- ఏమీ లేదురా," అన్నాడు జయరాం- తన ఆలోచనల నించి తేరుకొని.

చిన్నతనంలో ఈ నాగభూషణాన్నే తాను 'భూషితాంగుడు' అని పిలిచేవాడు. ఆ మాటకు సరైన అర్థం తనకు ఈనాటికీ తెలియదు. భూషితాంగుడంటే, 'అంగములే భూషణములుగా గలవాడా? లేక, భూషణములే అంగములుగా గలవాడా?'

"ఆ దిక్కుమాలిన ఆలోచనల్ని కాస్సేపు కట్టిపెట్టకూడదూ? అలా హాయిగా ఆ గుంటూరు రైలు కట్ట కేసి పోదాం. మనిద్దరం కలిసి ఆ రైలు బద్దీల మీద నడిచి ఎన్ని సంవత్సరాలయిందో? ఎన్నో కబుర్లు చెప్పుకొంటూ, అలా దూరమనేది తెలియకుండా పోతుండే వాళ్ళం. ఇప్పటికీ నేనెప్పుడన్నా ఆ ప్రాంతానికి పోతుంటాను. ఆ రైలు బద్దీలు 'నీ మిత్రుడేడీ?' అని అడుగుతున్నట్టే ఉంటుంది నాకు. పద! ఒక్కసారి అలా వెళ్లి, వాటిని పలకరించి వద్దాం." అన్నాడు నాగభూషణం.

ఇద్దరూ ఇంట్లోంచి బయట కొచ్చారు. వాకిట్లో చీపురు పట్టుకొని, బుచ్చమ్మ కనిపించింది.

"నా చిన్నతనంలో కూడా బుచ్చమ్మ ఇలానే చీపురు పట్టుకొని ఉండేది. అప్పటికీ, ఇప్పటికీ, ఆమెలో మార్పే లేదు. అంత నెమ్మదిగా, తాపీగా, స్థిమితంగా ఆమె ఎలా జీవిస్తున్నదో తెలియదు. ప్రపంచ యుద్ధాలు రానీ, దేశాలు అణ్వస్త్రాలతో, పరస్పరం ధ్వంసం చేసుకోనీ- ఈ బుచ్చమ్మలో మాత్రం మార్పు రాదు; మారదు. అంత తృప్తిగా జీవించగలగడం కూడా ఆర్టేనంటాను. అవునా?"

అన్నాడు జయరాం.

“కాదు; అది భగవంతుడిచ్చిన వరం. అందరికీ అలాంటి వరాలు భగవంతుడివ్వడు. అంత దాకా ఎందుకూ? మన ఇంటి పక్కన పెద్ద మేడ ఉంది చూశావా?” అన్నాడు నాగభూషణం.

“చూశాను. ఇదివరకు అది ఖాళీగా ఉండేది. మనం గోలీలు ఆడుకొనే వాళ్ళం. ఒకసారి ... సరే, అసలు సంగతేమిటి?” అన్నాడు జయరాం.

“చెబుతాను,” అన్నాడు నాగభూషణం. అంతే... తలొంచుకొని నడుస్తున్నాడు. కదిలిస్తే - కమ్మని పాటలు, విసుగెత్తే ప్రకటనలు ఇచ్చే సిలన్ రేడియోలాంటి నాగభూషణం ఎందుకు మాట్లాడడు? తన ఖర్మ కాలిపోయి, ఆ పక్కింటి మేడలో కూడా, తనకో దిక్కుమాలిన సమస్య ఎదురవదు కదా? తల పగిలే సమస్యలతో వేగలేక రవంత విశ్రాంతిగా గడుపుదామని తను తెనాలి వచ్చాడు. ఇక్కడా అవే ప్రత్యక్షమయితే, ఇక తెనాలికీ, మద్రాసుకూ భేదమేమిటి?

రైల్వే స్టేషన్ దాటి, గుడ్స్ షెడ్‌ను గడిచి, ఇద్దరూ గుంటూరు రైల్వే పట్టాల వెంట నడుస్తున్నారు. విల్లంబులా రైల్వే లైను ఎడం వైపుకు వొంగి ఉంది. వరి పొలాలు పచ్చగా, యౌవనంలా మిసమిసలాడుతున్నాయి.

“దాన్ని పరంధామయ్య కొన్నాడు,” అన్నాడు నాగభూషణం తూము మీద చతికిలబడి.

“దేన్ని?” అన్నాడు జయరాం, తానూ కూర్చొని.

“అదేరా, చిన్నప్పుడు మనం గోలీలాడిన స్థలాన్ని, కొనడంలోనూ కారుచౌకగా కొన్నాడు. అతను కొన్న వారానికి గానీ, ఊళ్ళో వాళ్ళకు ఆ సంగతే తెలియలేదు. అతను కొన్నాకనే, ఆ స్థలానికి ధర కూడా పెరిగింది. సంవత్సరం తిరక్కుండానే పరంధామయ్య మేడ కట్టాడు.... బీడీ కాలుస్తావా?” అన్నాడు నాగభూషణం.

“వద్దు. నా దగ్గర సిగరెట్టుంది.” అన్నాడు జయరాం.

తనో సిగరెట్ అంటించి, నాగభూషణానికొకటిచ్చాడు. హోరు గాలికి అయిదారు అగ్గిపుల్లలు ఆరిపోయాయి.

“మనం కనక ఇలా సిగరెట్ కోసం ఇన్ని అగ్గిపుల్లలు ఖర్చుబెట్టాంకానీ, పరంధామయ్యయితే- మొదటి పుల్లతోనే ఆగిపోయేవాడు. అది సిగరెట్ కానీ, బీడీ కాని, చుట్టకాని, మరేమైనా కనీ, ఒక్క అగ్గి పుల్లతోటే వెలగాలి.”

“వెలక్కపోతే?”

“కాల్చడం మానేస్తాడు. ఆ దారంట కాల్చుకొంటూ వెళ్ళేవాడెవడన్నా కనిపిస్తే, ఆప్యాయంగా వాడ్ని దగ్గరకు పిలిచి, వాడి క్షేమ సమాచారాలడిగాక కానీ, తను నిప్పు అడగడు. అంతగా ఏ పెంకి వెధవన్నా రాకపోతే, తనే వాడి దగ్గరికెళ్ళి కాల్చుకొంటాడు. అంతే కానీ, ప్రాణంపోయినా, రెండో అగ్గిపుల్ల ఖర్చు పెట్టడు” అన్నాడు నాగభూషనం.

“చాలా పిసినిగొట్టా?” అన్నాడు జయరాం.

“దానికి నీ ఇష్టమొచ్చిన పేరు పెట్టు. ఆయనేమీ అనుకోడు,” అన్నాడు నాగభూషణం, “ఒకసారి నేనే తెగించి అడిగాను. పరంధామయ్య నవ్వి ఊరుకొన్నాడు”

“చాలా చిత్రమయిన మనిషిలాగా ఉన్నాడు. రేపు పరిచయం చేస్తావా?”

“తప్పకుండా. అతన్ని చూసి ఆశ్చర్యపోతావురా. బోలెడంత ఆస్తి. ఎంత లేదన్నా లక్షా, లక్షన్నర విలువ చేసే ఆస్తి ఉంది. ఇప్పటికీ చొక్కా తొడుక్కోడు. ఇస్త్రీ పంచలు కట్టదు. కాఫీలు, టీలు తాగడు. ఇరవయ్యో నెంబర్ ధోవతులు- అవైనా సరిగ్గా నెరవు చాలవు మళ్ళా- కడతాడు. మూడు మూళ్ళ ఉత్తరీయం మీద వేసుకొంటాడు. పాలు తాగడు. పెరుగు పోసుకోడు. రెండో గరిటె నెయ్యి వడ్డిస్తానంటే, పెళ్ళాన్ని కుళ్ళిపోయే మాటలంటాడు. అప్పటికీ ఇప్పటికీ- అతనిలో మార్పేమీ లేదు.”

“ఎప్పటికీ ఇప్పటికీ?” అన్నాడు జయరాం.

నాగభూషణం సిగరెట్ పారేస్తూ, “ఘాటు చాల్లేదు, బావా! బీడీ వెలిగిస్తాను,” అంటూ బీడీ ముట్టించాడు.

“మా అమ్మ ఇప్పటికీ చెబుతూంటుంది. పరంధామయ్య ఈ ఊరు వచ్చే నాటికి ఇరవై యేళ్ళ వాడట. అలాంటి ముతక పంచా, మూడు మూళ్ళ ఉత్తరీయమూ, కిర్రు చెప్పులతో తెనాలి వచ్చాడట. నాలుగు రోజులు కటిక పస్తులు చేశాడట. అయిదో నాడు మా ఇంట్లో నీళ్ళు తోడి అన్నం తిన్నాడట. ఈ సంగతి పరంధామయ్య కూడా నాతో ఓ సారి అన్నాడు: ‘నాగభూషనం బాబూ! నీ తల్లి చెయ్యి మా గొప్ప చెయ్యి బాబూ! కడుపులో మండుతున్నదమ్మా, అని కొంగు చాపాను విస్తరేసి, కడుపునిండా అన్నం పెట్టింది. తెనాలిలో నేను తిన్న మొదటి భోజనం అది. ఆ తల్లికి నా చర్మంతో చెప్పులు కుట్టిచ్చినా రుణం తీరదు’ అంటాడు పరంధామయ్య. అలాంటి పరంధామయ్య ఇంట్లో ఇప్పుడు మా వస్తువులు సగానికిపైగా తాకట్టు కింద ఉన్నాయి. గోళ్ళూడగొట్టి రూపాయికి అణాలు పుచ్చుకొంటాడు. చిల్లి కానీ కోసం రక్తం పిండుతాడు. కానీ, అలా పిండుతున్నట్లు మనకు తెలియదు. ఇంకోరు చెప్పినా మనం గ్రహించం. పరంధామయ్యలో ఉన్న గొప్ప టెక్నిక్కే అది... ఇన్నిటికీ ఈ పుణ్య పురుషుడి సంగతి అసలెందుకొచ్చింది, జయరాం?” అన్నాడు నాగభూషణం.

“బుచ్చమ్మను గురించి నేనేదో అన్నాను-”

“అవునవును,” అన్నాడు నాగభూషనం. “మార్పు లేకుండా బతకడం గొప్ప ఆర్టుకింద మాట్లాడుతూ, నువ్వు బుచ్చమ్మను ఉదాహరణగా చూపుతున్నావు. అది సరైన ఉదాహరణ కాదు. బుచ్చమ్మ దగ్గర డబ్బు లేదు. ఉంటే, మారేదేమో మనం చెప్పలేము కానీ, పరంధామయ్య దగ్గర డబ్బుంది. అయినా ఆయన మారలేదు. బుచ్చమ్మ నీ భాషలో ‘వెత్తల్ పాక్’ వేస్తుంది. అప్పుడప్పుడు సినిమాల కెడుతుంది. మంచి గుడ్డలు కట్టుకొంటుంది. పరంధామయ్యకు ఇవేమీ లేవు. ఇవంటేనే గిట్టవు... ఏమిటి నువ్వనేది?” అన్నాడు నాగభూషణం.

ఏదో అనబోయిన జయరాం గుటక మింగి, “అబ్బే- ఏం లేదు” అన్నాడు సర్దుకుంటూ.

“నే ననేది - ఇంత ఉండగానే సరికాదు జయరాం! దాన్ని అనుభవించడం కూడా చేతకావాలి.

దాన్నే మనవాళ్ళు 'అదృష్టం' అంటారనుకొంటాను. ఆ ఇంట్లో ఉన్న వాళ్ళందరూ దమ్మిడీ కోసం ఆయన్ని దేబిరించాలి. పైకి వాళ్ళనేమీ అనడు కానీ, ఊరికే గొణుక్కుంటాడు. ఇప్పటికీ డబ్బు పెత్తనం ఆయనదే! ఇనప్పెట్టె తాళపు చెవులు ఆయన దగ్గరే ఉంటాయి."

"ఆయనకు పిల్లలున్నారా?"

"ఇద్దరు - ఓ కూతురు. ఓ కొడుకూనూ." అన్నాడు నాగభూషనం ఫక్కున నవ్వుతూ, "దేనికయినా అలా కలిసి రావాలి బావా! కూతురు హైస్కూల్లో చదువుతున్నప్పుడే ఎవర్నో 'లౌ' చేసింది. ఆ 'లౌ' చేసిన వాడు, ఆ పిల్ల కోసం కొట్టుకులాడిపోయాడు. అమ్మా అయ్యల్ని వొదిలి ఇక్కడికొచ్చాడు. చిల్లికానీ కట్నం లేకుండా కూతురుకు పెళ్లి చేశాడు పరంధామయ్య. మరి - ఆ కొడుకు కూడా చదువుకొన్నవాడే కదా! ఆ చిన్నారికి ఈ లౌలూ, గివ్‌లూ లేవు. యాభై వేల కట్నమూ, పదెకరాల చినరావూరు మాగాణీ కట్నం కింద పుచ్చుకొన్నక కానీ, అమ్మాయికి మూడు ముళ్ళూ వెయ్యలేదు. ఆ కట్నం డబ్బుతోనే మేడ కట్టాడని కొందరంటారు. ఆ డబ్బులో దమ్మిడీ కూడా కదిలించలేదనీ, అంతా కొడుకు పేరనే ఎక్కడో దాచాడనీ కొందరంటారు. ఎంత చేసినా ఆ పిల్లలు కాని, కోడలు అల్లుళ్లకు కాని పరంధామయ్యంటే చస్తే పడదు. అతన్ని పురుగును చూసినట్టు చూస్తారు. ఇంట్లో వారికీ, అతనికీ గడియ సరిపడదు. అతనికన్నా బుచ్చమ్మ అనేక రెట్లు నయం. కడుపునిండా తింటుంది. కంటి నిండా నిద్రపోతుంది. పరంధామయ్యకు ఈ రెండూ లేవు. అంత దాకా ఎందుకూ- పరంధామయ్య ఇంతవరకూ, పై అంతస్తు ఎక్కలేదు" అన్నాడు నాగభూషణం.

అంతలోనే దూరం నించి కెనెడియన్ ఇంజన్ కూత వినిపించింది. గుంటూరు నుండి వస్తున్న పాసింజర్ దడదడలాడుతూ పరుగెత్తి, ఔటర్ సిగ్నల్ దగ్గర ఆగిపోయింది.

"ఇప్పటికీ దీనికి ఈ జబ్బు పోలేదా?" అన్నాడు జయరాం నవ్వుతూ.

"ఏ జబ్బు?... ఓహో...అదా? పోలేదు, బావా! జి.టి. వదిలాక కాని, దీన్ని వదలరు. కేబిన్ దగ్గర రెండు లైన్లూ క్రాసవుతాయి." అన్నాడు నాగభూషనం.

"సరిగ్గా చిన్నతనంలో కూడా నువ్విలాగే అనేవాడివి," అన్నాడు జయరాం నవ్వుతూ.

మరో అయిదు నిమిషాలకు చెవులు హోరెత్తేలా ఓ కూత కూసి, జి.టి వెళ్ళిపోయింది. తర్వాత ఓ అయిదు నిమిషాలకు గుంటూరు పాసింజరు కూడా కదిలింది.

"జి.టి., కి గుంటూరు బండి పా(ర్య)రడీ అంటూ ఉండే వాడివి కదూ!" అన్నాడు నాగభూషణం.

"అవును... ఆ సంగతులన్నీ నీకు ఎంచక్కా జ్ఞాపకమున్నాయి భూషణం?" అన్నాడు జయరాం.

"నిన్న మధ్యాహ్నం-" మళ్ళీ కొత్త బీడీ ముట్టించాడు నాగ భూషణం, ఖంగు ఖంగు దగ్గుతూ.

"ఏమయింది?"

"ఇంటికి పోదాం, బావా! నాకు దగ్గుతెర వచ్చేలా ఉంది. వచ్చిందంటే ఓ పట్టాన వదలదు.

మందు వేళ కూడా అయింది.'' అన్నాడు నాగభూషణం.

ఇద్దరూ లేచి, చొక్కా దులుపుకొని, కొయ్య స్లీపర్ల మీదుగా నడుస్తున్నారు.

''పట్టాల మీదుగా నడుద్దాం బావా! రాళ్ళ సందుల్లో నీటి పాము లుంటాయి. అవి కరవ్వనుకో; కరిచినా ప్రమాదం లేదనుకో. అయినా కన్ను పోయేటంత కాటుకెందుకా అని?''

''సరిగ్గా - చిన్నప్పుడు  కూడా నాగభూషణం ఇలాగే అనేవాడు!'' అనుకొన్నాడు జయరాం.

* * *

జయరాం ఉలిక్కిపడి లేచాడు. నాగభూషనం అతని మంచం మీద కూర్చొని, జయరాంని తట్టి లేపాడు.

''పరంధామయ్య చచ్చిపోయాడు జయరాం'' అన్నాడు నాగభూషణం చాలా బాధగా.

''ఎప్పుడు?'' అన్నాడు జయరాం ఉలిక్కిపడి.

''రాత్రి, ఎప్పుడు చచ్చిపోయాడో సరిగ్గా తెలియదు.''

''ముందుగా ఎవరు చూశారు?''

నాగభూషణం ఫక్కున నవ్వాడు.

''నిజమైన మనిషివి నువ్విప్పుడయ్యావు బావా! లేచి మొహం కడుక్కో. జానకి కాఫీ కాచింది. తాగాక నీ పరిశోధన ప్రారంభిద్దువుకానీ,'' అన్నాడు నాగభూషణం.

పరంధామయ్య ఇంటి వైపునించి ముమ్మరంగా ఏడుపులు వినిపిస్తున్నాయి.

''బోలెడంత సంపాదించాడు. కడుపు మాడ్చుకొని మరీ కూడబెట్టాడు. కమ్మని గుడ్డకట్టలేదు. 'ఇది' అని చెప్పుకోదగ్గదేదీ అనుభవించలేదు. దరిద్రుడుగా పుట్టాడు. లక్షలార్జించినా దరిద్రుడుగానే బతికాడు. ఇవ్వాళా దరిద్రుడుగానే చచ్చిపోయాడు. పరంధామయ్య వెంట పోతున్నదేమీ లేదు. అతను అనుభవించిందేదో అదే అతనికి దక్కింది. మరెందుకింతగా తాపత్రయపడటం?'' అను కొన్నాడు నాగభూషణం.

జవాబు కోసం గిజగిజలాడాడు నాగభూషణం.

''నీ చెల్లెలు కాఫీ అద్భుతంగా కాస్తుంది బావా! ఏం? బాగోలేదూ?''

''పరంధామయ్యకేమన్నా సుస్తీ చేసిందా?'' అన్నాడు జయరాం నాగభూషణం మాట వినిపించుకోకుండా.

''నిన్న సాయంత్రం వరకూ పిడిరాయిలా ఉన్నాడు.''

''అయితే?''

''పద. నిన్నక్కడికి తీసుకెడితే కాని, నన్ను బతకనియ్యవు. ఆత్మరక్షణకోసమన్నా నిన్నా శవం

దగ్గరకు తీసుకెళ్ళాలి. కోపగించుకోకు కాని, బావా! సారాయి 'కుతి' లాంటిదేనా, ఈ శవం కుతి కూడా?'' అన్నాడు నాగభూషణం నవ్వుతూ.

జయరాం నవ్వలేదు.

ఇద్దరూ పరంధామయ్య ఇంటికి, చుట్టూ తిరిగి వాచ్చరు. వాకిటి ముందు నిలబడి, జయరాం ఆ ఇంటిని ఓ సారి ఎగాదిగా చూశాడు. మేడ ముందు జనం గుమిగూడి ఉన్నారు. అక్కడి నించే ఏడుపులు కూడా వినిపిస్తున్నాయి.

''అదే పరంధామయ్య ఉండే ఇల్లు,'' అన్నాడు నాగభూషణం.

''ఈ మేడలో ఉండడా?''

''ఉండడు. తనకిదే సౌఖ్యంగా ఉంటుందంటాడు పరంధామయ్య. మనమెలా కాదనడం?''

''డబ్బూ దస్కం ఇందులోనే ఉంటాయా?''

''అతనంత పిచ్చివాడు కాదు బావా! ఇనప్పెట్టె మేడలో ఉంది. దాని బీగాలు, అది ఉన్న గది బీగాలు కూడా పరంధామయ్యగారి దగ్గరే ఉంటాయి.''

''డబ్బేమయినా పోయిందా?''

''లేదనుకుంటాను. డబ్బే పోతే, ఈ జనం పరంధామయ్య చుట్టూతా ఉండరు; ఇనప్పెట్టె దగ్గరే ఉండేవారు. అయినా డబ్బును తలుచుకొని ఏడుస్తున్నట్టు లేదు,'' అన్నాడు నాగభూషణం.

ఇద్దరూ పరంధామయ్య శవం దగ్గరికొచ్చారు. తలనించి కాళ్ళ దాకా ముసుగు కప్పి ఉ ంది.

''జబ్బేమిటమ్మా?'' అన్నాడు జయరాం, అక్కడున్న ఒకామెను.

''ఏమీ లేదు నాయనా! రాత్రి పదిగంటల దాకా పిడిరాయిలాగా ఉన్నాడు. పడుకోబోయే ముందు గొడ్లకు మేతకూడా ఆయనే వేశాడు. తెల్లారేటప్పటికి మిత్తవ మింగింది.''

''చనిపోయాడని మీకెన్నింటికి తెలిసింది.'' అన్నాడు జయరాం.

ఆమె జవాబు చెప్పలేదు. జయరాంకేసి విడ్డూరంగా చూసి, పక్కకు తప్పుకొంది.

జయరాం చిరాకు పడ్డాడు.

అంతలోనే నాగభూషణం. ఓ యువకుణ్ని ఇవతలకు తెచ్చి, జయరాంకు పరిచయం చేశాడు.

''మీ నాన్నగారు చనిపోయినట్టు మీకెప్పుడు తెలిసిందండీ?'' అన్నాడు జయరాం అతనితో.

''అరగంట కిందట. అంటే, అరున్నరకు తెలిసింది,'' అన్నాడు ప్రసాదరావు.

''ముందుగా ఎవరు చూశారు?''

ప్రసాదరావు కాస్సేపు ఆలోచించాడు.

''నేనే చూశాను. అయిదు గంటలకల్లా నిద్రలేవడం నాన్నకు అలవాటు. ఎందుకు లేవలేదా అనుకొన్నాను. బద్ధకించాడేమోననుకొన్నాను. అయిదున్నరకు కూడా లేవలేదు. తలుపులు తట్టాను. జవాబు లేదు. పావుగంట ఆగి, మళ్ళా పిలిచాను. అప్పటికి మా యింట్లో అందరూ లేచారు. నేను తలుపు తట్టడం, జవాబు రాకపోవడంతో అందరూ ఏదో అనుమానించారు. నేనూ బావా, జీతగాడూ కలిసి, తలుపులు పగల గొట్టాం. ఆ చప్పుడుకు కూడా నన్న లేవలేదు. దగ్గరికెళ్ళి చూశాను. చనిపోయి ఉన్నాడు...''

''మీ నాన్నగారి శవాన్ని నన్నోసారి చూడనివ్వండి.'' అన్నాడు జయరాం.

''చూడండి.''

జయరాం శవంమీది ముసుగు తీసి చూశాడు. కళ్ళు పత్తి కాయల్లా వెళ్ళుకొచ్చాయి. పళ్ళు బిగుసుకొన్నాయి. పళ్ళ సందున పడి నాలుక నలిగిపోయింది. పెదవుల మీద కొద్ది నెత్తురున్నది. వొంటి మీద కానీ, గుడ్డల మీద కానీ నెత్తురు లేదు; గాయం లేదు; గట్టిగా తగిలిన దెబ్బ కూడా లేదు.

''మీ నాన్నగారికి గుండె జబ్బు ఉందా?''

''లేదండి,'' అన్నాడు ప్రసాదరావు.

ప్రసాదరావు భార్య, భర్తను చాటుకు పిలిచింది.

''ఏమిటా మనిషి అలా అడుగుతాడు? మామయ్య చచ్చిపోయి అఘోరిస్తుంటే అడ్డగోలుగా మాట్లాడతాడేం? వాణ్ణసలెందుకిక్కడికి రానిచ్చారు? బెదిరించి డబ్బు లాగాలని చూస్తున్నాడేమిటో ఖర్మ. పంపించెయ్యండి.'' అంది రహస్యంగా.

''ఉండవే - నీదో అడివిమేళం!'' అన్నాడు ప్రసాదరావు విసుక్కొంటూ.

''ఇది సహజంగా మరణించడం కాదు. ప్రసాదరావుగారూ! డాక్టర్ని పిలిపించి పరీక్ష చేయించండి,'' అన్నాడు జయరాం.

''ఆ పని చేస్తే, మామయ్య ఆత్మ క్షోభించిపోతుంది. వద్దులెండి,'' అన్నాడు అల్లుడు కసిగా.

''పాపం! మామవల్ల ఎంత బాధపడ్డాడో ఈ మానవుడు!'' అనుకొన్నాడు జయరాం.

కీ.శే.పరంధామయ్య కూతురు - భర్తగారిని దూరంగా తీసుకెళ్ళింది.

''అయ్యో- రామ! ఎంత చెప్పినా మీకు తెలిసి చావదేమండీ! పరాయి వాళ్ళ ముందు అంత వెటకారంగా మాట్లాడితే, వాళ్ళేమనుకొంటారు? ఏమన్నా కోపతాపాలుంటే మనలో మనం అనుకోవాలి కానీ, బయటి వారితో అంటారా ఎక్కడైనా?'' అంది.

''ఏం అంటే? నేనన్నది అబద్ధమా! కానిడబ్బు తీసి డాక్టరుకిస్తున్నానంటే, చచ్చిన మీ నాన్న ఆవురావురుమంటూ లేచి కూచుంటాడు. కావలిస్తే చూసుకో,'' అన్నాడు అల్లుడు, పరంధామయ్య శవం కేసి అసహ్యంగా చూస్తూ.

''నా ఖర్మ!'' అని నెత్తి బాదుకొంది కూతురు.

''ఆ పని చెయ్యవలసిన వాణ్ని నేను,'' అన్నాడు అల్లుడు.

''సందట్లో సడేమియా అని, మీకిప్పుడే దొరికిందా, స్వామీ, ఈ వీరంగం వెయ్యటానికి?''

''పోవే మోపీ!''' అన్నాడు అల్లుడు.

ప్రసాదరావు పిలుచుకొచ్చిన డాక్టరు, శవాన్ని పరీక్ష చేశాడు. గాయం కాని, దెబ్బకాని లేదన్నాడు. విషప్రయోగం జరగలేదన్నాడు. విపరీతంగా హృదయం సంచలించడం వల్ల మరణం సంభవించి ఉంటుందన్నాడు.

''రైట్! నేననుకొన్నదే మీరూ చెప్పారు. కాకపోతే, కళ్ళు అలా వెళ్ళుకురావు. భయాందోళనలతో పరంధామయ్య సంక్షోభపడ్డాడు. ఆ దెబ్బనుండి తట్టుకొనేందుకు పళ్ళు బిగించాడు. అప్పుడే నాలుక పళ్ళ మధ్య చిక్కుకుంది. అయితే, ఆయన మరణానికి నాలుక నలగడం కారణం కాదు. అవునా, డాక్టర్‌గారూ!'' అన్నాడు జయరాం.

''అవును''.

డాక్టర్ రిపోర్టు రాసి వెళ్ళాక, జయరాం ఓ నిట్టూర్పు విడిచాడు. ప్రసాదరావు నడిగి, పరంధామయ్య గదిలో అడుగు పెట్టాడు. నేలను పరీక్ష చేశాడు. అక్కడంతా పరిశీలించాడు. ఉన్న ఒక్క అలమారూ చూశాడు. కిటికీ తలుపులు మూసే ఉన్నాయి. వాటినెప్పుడూ పరంధామయ్య తెరవడట. గది నడి మధ్య నిలబడి, పైకి చూశాడు.. గాలి వెలుతుర్ల కోసం కట్టబడిన డార్మర్ విండో (Darmar window) ఉంది. ఇంటి నడికొప్పుకూ, పైదానికీ మధ్య అడుగుదాకా ఖాళీ ఉంది. అందులోంచి ఎవరన్నా లోపలికి వచ్చి ఉంటారా?

'అసంభవం' అనుకొన్నాడు జయరాం.

ఖాళీ స్థలం అడుగుదాకా ఉన్నా, చుట్టూ ఇనుప చువ్వలున్నాయి. వాటిని విరిచినట్టుకాని, లేదు. అయితే, పరంధామయ్య ఎలా మరణించాడు? భయం వల్లనేనని డాక్టర్ అభిప్రాయమూ, తన అభిప్రాయమూ కూడా. మరి పరంధామయ్య దేన్ని చూసి, లేదా ఎవరిని చూసి భయపడ్డాడు?

ఏమీ తోచక జయరాం గదిలోనించి బయటికొచ్చాడు. వేపచెట్టుకింద కూచుని, సిగరెట్ ముట్టించాడు.

''ఏమయింది, బావా?'' అన్నాడు నాగభూషణం నవ్వుతూ.

''పరంధామయ్య మరణంతో, ఆకస్మికంగా లాభం పొందే వారెవరన్నా వున్నారా?'' అన్నాడు జయరాం.

''ఈ కుటుంబీకులంతా లాభం పొందుతారు. ఆయన పోరు పడలేక, అందరూ విసిగిపోతున్నారు.''

''అది కాదు, భూషణం! మనిషి మీద విసుగుంటే, అది చంపే దాకా పోదు. అంతకన్నా

బలమైన కారణం ఉండాలి.''

''అంటే?''

''డబ్బు-ఆస్తి-కలవడం...''

''తన మరణానంతరం ఆస్తిమీద అన్ని హక్కులూ కొడుక్కు సంక్రమించాలని పరంధామయ్య విల్లు రాశాడు.''

''అలా ఎందుకు రాశాడు?''

''ఆడవాళ్ళకు కూడా ఆస్తిలో భాగం ఉండాలని ప్రభుత్వం శాసనం అమలు చేసినట్టు ఆయనకెవరో చెప్పారట. అందుకని అలా రాసి విల్లు రాశాడు. అది రాసి వస్తున్నప్పుడే నాకు కనిపించి, పరంధామయ్య ఈ సంగతి చెప్పాడు.''

''మరి కూతురు కేమీ ఇవ్వలేదా?''

''యాభై వేలకు ఇన్‌షూర్ చేశాడు. ఆ డబ్బు కూతురుకు చెందుతుంది,'' అన్నాడు నాగభూషణం. ''ఏమిటాలోచిస్తున్నావ్? కూతురు కాని, కొడుకు కాని చేసి ఉంటారంటావా?''

''అనటం లేదు. అనుమానిస్తున్నాను. అందుకవకాశం లేకపోలేదు. లేదా, కసికొద్దీ అల్లుడూ, కోడలూ కలిసి ఈ పనిని చేసి ఉండొచ్చు. వీరు నలుగురూ - విడివిడిగా కానీ, కలిసి కానీ చేసి ఉండొచ్చు,'' అన్నాడు జయరాం.

''అయితే, వీరిని అరెస్టు చేయిస్తావా?''

''కాని, ఇంకో సందేహం నన్ను బాధిస్తోంది భూషణం. కొద్ది కాలం తర్వాతనయినా తమ చేతికొచ్చే ఆస్తి కోసం వీరు పరంధామయ్యను చంపి వుండడం సంభవమేనా?''

''నాకు తెలియదు.''

''అల్లుడుకాని కోడలు కాని పరంధామయ్యతో ఘర్షణ పడటం నీకు తెలుసా?''

''వాళ్ళనే అనడానికే ఖర్మం! కూతురూ, కొడుకూ కూడా ఘర్షణ పడుతుంటారు.''

''ఆయనకు గిట్టని వాళ్ళున్నారా?''

''పరంధామయ్య టెక్నిక్‌ను గురించి నిన్న సాయంత్రమే నీకు చెప్పాను.''

''అవును. జ్ఞాపకం వచ్చింది.''

''ఎవరు చంపారో తర్వాత తెలుసుకోవచ్చుకాని, ఎలా చనిపోయాడంటావు?''

''చెబుతాను,'' అని క్షణకాలం ఆలోచించాడు జయరాం. ''బావా! పరంధామయ్య ఎన్నడూ మేడమైకి ఎక్కలేదన్నావు నిన్న. అది నిజమేనా?''

''అక్షరాలా! ఒక్కసారన్నా ఎక్కలేదు. ఎందుకనో నాకోసారి చెప్పాడు పరంధామయ్య.''

''ఏమన్నాడు?''

నాగభూషణం అదోలా నవ్వాడు.

"మనిషి ఎంత చిత్రమయిన వాడో, అతని ప్రవృత్తి కూడా అంత చిత్రమయిందే జయరాం. అతనికి మేడమెట్లెక్కితే, విపరీతమైన భయమట. కళ్ళు తిరుగుతాయట. అందుకనే ఎప్పుడూ మేడ ఎక్కనంటాడు పరంధామయ్య."

జయరాం ఉత్సాహంగా చిటిక వేశాడు.

"మంచి సంగతి చెప్పావ్ భూషణం. పరంధామయ్య ఎలా చనిపోయిందీ ఇప్పుడు చెబుతాను..."

అంతలోనే పొరుగూరి నించి ఎవరో బంధువులు వచ్చారు. వారిని చూడగానే, ఏడుపులు పెల్లుబికాయి ఆ యింట్లో.

నాగభూషణం పెదిమ విరిచాడు. జేబులోనించి బీడీ తీసి ముట్టించాడు. ఒక్క గుక్క పీల్చి, బీడీ నుసి రాల్చాడు.

"మొన్న మధ్యాహ్నం - " అన్నాడు నాగభూషణం ఖంగుఖంగున దగ్గుతూ.

"నాకు మళ్ళీ దగ్గుతెర వచ్చేలా ఉంది బావా!"

"నేనూ వస్తాను. అందాకా సిగరెట్ కాల్చు..." అన్నాడు జయరాం.

నాగభూషణం బీడీ పారేసి, సిగరెట్ వెలిగించాడు.

"ఈ ప్రపంచంలో ఏదీ శాశ్వతం కాదు బావా! ఆ సంగతి తెలిసి కూడా మనుషులు ఇంత నీచులు, అధములు, క్రూరులు - ఎందుకవుతూంటారో తెలీదు. మొన్న మధ్యాహ్నం- అతనితో ఘోరంగా పోట్లాడారు పరంధామయ్య. సాధారణంగా అతనికి కోపం రాదు. కాని, ఆ నాడు ఆయన కాట్ల కుక్కలా అరిచాడు."

"ఎవరి మీద?" అన్నాడు జయరాం ఆసక్తిగా.

"సూర్య నారాయణ అనే పంపులకొట్టతని మీద. అతనికి అయిదు వేలిచ్చాడట పరంధామయ్య. మూడు వేలు చెల్లేశానంటాడు సూర్యానారాయణ. రెండు వేల అయిదు వందలే ఇచ్చావంటాడు పరంధామయ్య. అయితే, అసలే ఇవ్వనన్నాడు సూర్యనారాయణ. మొత్తం అయిదు వేలూ అతని దగ్గర పుచ్చుకోకపోతే, తనను మారుపేరుతో పిలవమన్నాడు పరంధామయ్య. గోడ దగ్గర నిలబడి, ఇదంతా నేను వింటూనే ఉన్నాను. నిజానికి ఈ రోజునే సూర్యనారాయణ నోటు మీద కొంత చెల్లన్నా వెయ్యాలి. లేదా, నోటు తిరగరాయనన్నా రాయాలి. ఏది చెయ్యడానికీ పరంధామయ్య లేడు. ఇప్పుడతనికి అయిదు వందలూ అవసరం లేదు. అయిదువేలూ అవసరం లేదు. అరటన్ను కట్టెలు చాలు" అన్నాడు నాగభూషనం, గట్టిగా నిట్టూరుస్తూ మహా వేదాంతిలా.

జయరాం చకచకా పరంధామయ్య గదిలో కొచ్చాడు. మరోసారి నేలనంతా పరీక్షించాడు. తల పంకించి, చిరునవ్వు నవ్వాడు..

బంధువులు జయరాంను పరికించలేదు. పరంధామయ్య గుణగణాలను వైనవైనంగా చెప్పుకొంటూ ఏడుస్తున్నారు.

"ఇక్కడెక్కడన్నా ఫోన్ ఉందా, భూషణంబావా?" అన్నాడు జయరాం.

"ఎవరికి చేస్తావ్?"

"పోలీస్ స్టేషన్‌కు. హంతకుడు దొరికాడు," అన్నాడు జయరాం, జేబు గుడ్డతో చెమటను తుడుచుకొంటూ.

* * *

"పాపం! ఆ పంపులకొట్టు సూర్యనారాయణను అరెస్టు చేశారటనే! ఆయన పెళ్ళాం లబ్బున మొత్తుకుంటూంది," అన్నది జానకి అన్నం వడ్డిస్తూ.

"మీ అన్నగారు కట్టుకొన్న పుణ్యం అది," అన్నాడు నాగభూషణం ఓరకంటితో జయరాంను చూస్తూ.

"నిజంగా సూర్యానారాయణ దోషేనంటావా, బావా? లేకపోతే, మహాపాపం చుటుట్టకొంటుంది," అన్నాడు నాగభూషణం.

"అక్షరాలా దోషే! అతనింట్లో గొళ్ళాలూ, పగ్గాలూ కూడా దొరికి ఉండాలే!" అన్నాడు జయరాం.

"అవునట. ఏవో గొళ్ళాలు తాళ్ళకు కట్టి, సూర్యనారాయణ చూరులో పెట్టాట్ట. పోలీసులు వాటిని కూడా పట్టుకున్నారట!" అన్నది జానకి.

"పరంధామయ్య మరణించడానికి ఆ గొళ్ళాలే కారణం. అతనికి ఎత్తును చూస్తే విపరీతమైన భయమన్న సంగతి సూర్యనారాయణకు తెలుసు. మొన్న ఘర్షణ పడ్డాక, నిన్ననే అతనాపనిలో ఉన్నాడు. రాత్రి ఇంటిమీదకెక్కాడు. ఎవ్వరికీ కనిపించకుండా వేప రెమ్మల చాటున దాక్కున్నాడు. గోళ్ళాలు బిగించిన తాళ్ళను మెల్లగా డార్మర్ విండో గుండా లోపలికి దించి, ఆ గొళ్ళాలకు మంచం పట్టెలు పట్టుకొనేలా చేశాడు. తర్వాత మొత్తం మంచాన్నే పైకి లాగాడు. ఆ దాటుకు పరంధామయ్య నిద్రలేచాడు. ఎన్నడూ అనుకోని విధంగా అందులోనూ, నిద్రనుండి హఠాత్తుగా లేచాడేమో, అంత ఎత్తునుండి కిందికి చూసేసరికి, అతని గుండె విపరీతంగా కొట్టుకొంది. బాగా భయపడిపోయాడు. పళ్ళు బిగించాడు. నాలుక పళ్ళ మధ్యపడి, గాయమయింది. ఆ ఉధృతానికే పరంధామయ్య మరణించాడు. మొదట నాకూ అంతుబట్టలేదు. పరంధామయ్యకు ఎత్తుచూడటమంటే భయమని నువ్వన్నాక నాకీ ఆలోచన తట్టింది. అతని గదిలో చూశాను. నేననుకొన్నట్టే జరిగింది. మామూలుగా మంచం ఉండే చోటున ఇప్పుడు లేదు. కొంచెం పక్కకు జరిగింది. ఎత్తడం సులభంగా ఎత్తాడు కాని సరిగ్గా అదే స్థలంలో తిరిగి మంచాన్ని దించడం సూర్యనారయణ వల్ల కాలేదు. మంచానికి పడ్డ నొక్కుల్ని పోగొట్టడమూ అతని వల్లకాలేదు.

... ఏం తల్లీ, కొంచెం ఆవకాయవడ్డించు. నాలుక మరీ ససిచెడినట్టుంది!" అన్నాడు జయరాం.

* * *

**1956** ప్రారంభ దినాలలోనే తెనాలికి వీడ్కోలు చెప్పేశాడు భరద్వాజ. మద్రాసు మహానగరంలో ప్రవేశించాడు. ఆ సమయాన మద్రాసులో ఉన్న ధనికొండ హనుమంతరావుగారు మూడు పత్రికలకు సంపాదకత్వం వహించారు. ''జ్యోతి -- అభిసారిక -- చిత్రసీమ--'' ఈ మూడు పత్రికలను మూడు పరిశోధనా కేంద్రాలుగా చేసుకొని, చిన్న కథ మీద రకరకాల ప్రయోగాలు చేశాడున భరద్వాజ. ఈ ప్రయోగ ఫలితాలు అద్భుతంగా ఉన్నాయి. తన ప్రయోగాలు చేయడమే కాకుండా, ఎందరో కొత్త రచయితల వెన్ను తట్టి, సాహితీ క్షేత్రంలో వారిని ప్రవేశ పెట్టాడు. వారి రచనలను ''ఉచిత రీతి''ని సవరించాడు. అవసరమని తోచినప్పుడు మొత్తం కథను తిరగరాసి వారి రచనగానే ప్రకటించాడు.

అప్పుడే- శ్రీరంగం నారాయణబాబు, మల్లాది రామకృష్ణ శాస్త్రి, శ్రీరంగం శ్రీనివాసరావు, గోరాశాస్త్రి, అరుద్ర, డి.ఆంజనేయులు, సూరంపూడి సీతారాం, నండూరి రామమోహనరావు, తెన్నేటి సూరి, కొడవటిగంటి కుటుంబరావు, దాసరి సుబ్రహ్మణ్యం, నార్ల వెంకటేశ్వరరావు, విద్వాన్ విశ్వం, ఆమంచర్ల గోపాలరావు, శివలెంక శంభు ప్రసాద్, తిరుమల రామచంద్ర మొదలైన వారితో పరిచయాలూ, కొందరితో స్నేహాలూ ఏర్పడ్డాయి...

ధనికొండ వారిచ్చిన అవకాశాన్ని ప్రోత్సాహాన్ని భరద్వాజ సద్వినియోగం చేసుకున్నాడు. కథానికా ప్రక్రియలో ఒక నూతనత్వాన్ని ప్రవేశపెట్టటానికి అతను పూనుకొన్నాడు. జానపద సాహిత్య వాతావరణాన్నీ, ఆ సాహిత్యంలో తరచుగా కన్పించే రాజకుమారుల్ని, రాజకుమార్తెల్ని పాత్రలుగా తీసుకొని, వర్తమాన సమాజంలోని సమస్యలను ఆ పాత్రల మధ్య ప్రవేశపెట్టి, పరమ రమణీయమైన కథలను భరద్వాజ చాలా రాశాడు.

వసు చరిత్ర, మను చరిత్ర, అన్యధా శరణం నాస్తి, దీక్షిత దూహిత, మానవుడు - దానవుడు, వంటి అణి ముత్యాలనెన్నింటిలో ఆంధ్ర పాఠకులకు అందించాడు.

ఈ ప్రయోగం విజయం సాధించింది. ఈ ఉత్సాహంతో భరద్వాజ మరొక నూతన ప్రయోగం చేశాడు. మన పురాణాల్లోనూ ఉపనిషత్తులలోనూ ప్రచలితమై ఉన్న గాధల్ని ఆధారం కొని కథలు రాయడం ప్రారంభించాడు. కుమార సంభవం, స్వార్థ పరులు, గిరిజా కళ్యాణం, దక్షయజ్ఞం మొదలైన కథలు ఈ కోవకు చెందినవే! ఇప్పటి సామాజిక సమస్యలను, ఇప్పటి వాతావరణంలో చిత్రించడం అందరూ చేస్తూన్న పనే! వర్తమాన, సామాజిక, రాజకీయ అంశాలను, పురాణ పాత్రలకు అన్వయించి కథ రాసినప్పుడు పాఠకులు ఆ కథలను చదివి అభినందిస్తారా? అభిశంసిస్తారా? భరద్వాజకు ఇవి రెండూ పుష్కలంగానే లభించాయి. వేటికి వాటిని వేరు చేసి చూసుకున్నాడు. పాఠకుల నుండి అభినందనలు లభించాయి. కొందరు సాటి రచయితల నుండి అభిశంసలు లభించాయి. పఠితల ఆదరణనే పరమ పవిత్రంగా భావించిన భరద్వాజ, అలాంటి కథలనే పట్టుబట్టి రాశాడు. ధనికొండ వారి వద్ద పనిచేసినంత కాలం - కాదు కాదు ఆయన పత్రికలు నడిపినంతకాలం- ప్రతి సంచికలో ఏదో ఒక కొత్తదనం తీసుకొచ్చేందుకే భరద్వాజ కృషి చేశారు. ఈ కృషిని మెచ్చుకున్న పాఠకుల

అభిప్రాయానుసారంగా ముమ్మారు స్వర్ణ పతక గ్రహీతార్హతను భరద్వాజ సంపాదించాడు.

- ఏమైతేనేంగాని అధిక సంఖ్యాకులైన ఆనాటి పాఠకులు మెచ్చి బంగారు పతకాన్ని భరద్వాజకిప్పించిన ఈ కథలోని 'దైవ రాజకీయాలు' ఇప్పటికీ మనల్ని చకితం చేస్తాయి...

# స్వార్థపరులు

**సంఘర్షణ** అత్యంత సహజమైనది. మంచికి, చెడుగుకూ మధ్య; వెలుగుకు చీకటికీ మధ్య; సత్యానికి, అసత్యానికీ; ఇంద్రియ లోలుపతకు, ఆధ్యాత్మిక చింతనానికీ; కలవాడికి, లేనివాడికీ; సంఘర్షణ అనివార్యమే కాగలదు. శతాబ్దాలు - కాదు - యుగాల పర్యంతం, ఈ ద్వివిధ శాఖల మధ్య జరుగుతున్న సంఘర్షణనే చరిత్రగా, మనం పరిగణిస్తున్నాము.

కలవాడు తన సంపదను రక్షించుకోవడానికి విశ్వప్రయత్నాలు చేస్తాడు. ఉచ్ఛ నీచ భేద మెంచకుండా, వివిధ విధానాలను అవలంభిస్తాడు. అతనికి ప్రభుత్వము, దాని తాలూకు వివిధ శాఖలు, అండదండలుగా ఉంటాయి. శాస్త్రాలు అతని పక్షాన సాక్షమిస్తాయి. చివరికి అతనే జయించడం కద్దు. లేని వాడు, ఈ అవరోధాలనన్నింటినీ అధిగమించడానికే ప్రయత్నిస్తాడు. కలవాని సంపదను, అతని అధికారాన్ని, తన కైవసం చేసుకోవాలని అభిలషిస్తాడు. తనలాంటి వారిని సమీకరిస్తాడు. ఈ సంఘటిత శక్తికి- ఒక రకంగా చెప్పాలంటే ఏదీ ఎదురు నిలువదు. ఈ మహాశక్తి ఏ పనినైనా సాధిస్తుంది. దీనికి అపజయమంటూ ఉండదు.

కానీ, చరిత్రను పరిశీలించిన వారికి, ఇలాంటి సంఘటిత శక్తులు పరాజయం పొందిన సందర్భాలు కొన్ని గోచరిస్తాయి. దురదృష్ట వశాత్తూ ఈ 'ఉదాహరణలు' ఆ మహాశక్తులకు అంటగట్ట బడ్డాయి. నిశితంగా చూసినవారికి, ఆ లోపం, ఆ సంఘటిత శక్తిది కాదనీ దాని నిర్వాహకులదేననీ స్పష్టపడుతుంది. ప్రతి అపజయానికీ ఇదే కారణం కాకపోవచ్చుగానీ; దీని ప్రభావం - ప్రతి పరాజయం వెనుకా - ఏ మాత్రమో ఉండి తీరుతుంది.

అంత దాకా ఎందుకూ?

ఆ నాడు-

* * *

దేవలోకపు పరిపాలనా బాధ్యతంతా, మహా విష్ణువు మీద మోపబడ్డది. ముఖ్యమైన అన్ని శాఖలనూ ఆయనగారే చూసుకోవలసి వచ్చింది. ఇంకొకరికి ఒప్పచెప్పాలన్నా ప్రయత్నాలు ఆటే సాగలేదు. అందుకోసం గట్టిగా ప్రయత్నించిన వారు గూడా లేరు. ఒక వేళ ప్రయత్నించినా, నిడివేరడం అసాధ్యం కనకనే, ఏ కొందరన్నా ప్రయత్నిద్దామనుకొన్నా మానేశారేమో స్పష్టంగా చెప్పడం కష్టం! ఏది ఏమైనప్పటికీ, కీలకమైన ప్రతి శాఖా మహా విష్ణువు చేతుల్లో ఉన్నది. ఆయన గారు ఎంతో విసుక్కొంటూ, మహా బాధపడుతూ, ఆ భారాన్ని శిరసావహించారు.

చూస్తున్న వారెవరికైనా స్థూలంగా కనిపించేదిది. కానీ దీని వెనుక ఎన్నో 'కుట్ర'లున్నాయన్న విషయం చాలా మందికి తెలియదు.

కావాలనే, విష్ణుమూర్తి ముఖ్యాంగాలన్నీ తన గుప్పెట్లో ఉంచుకొన్నాడనీ, అలా ఉంచుకోడం కోసం నానా బాధలూ పడ్డాడనీ, బెదిరించవలసిన చోట బెదిరించీ, పదవులివ్వవలసిన చోట పదవులిచ్చీ గౌరవ బిరుదులిచ్చి ఇంకొంత  మంందినీ, ఆకట్టుకొన్నట్టు గూడా చాలా మందికి తెలియదు. నిజంగా, ఇవన్నీ తెలిసినవాళ్ళు చాలా కొద్ది సంఖ్యలో ఉన్నారు. ఆ కొద్ది మందీ  విష్ణుమూర్తికి చాలా దగ్గరవాళు ్ళ, బంధువులూను. వీరందరూ కలిసే ఇలాంటి పన్నాగం పన్నారన్న వార్తలు గూడా విశ్వసించదగ్గవి గానే ఉన్నాయి.

దేవలోకానికి ప్రస్తుతం విష్ణుమూర్తి ఏకచ్ఛత్రాధిపతి. ఏ పని కావాలన్నా ఆయన చెయ్యి చేసుకోవాలి. ఆయన అనుమతి కావాలి. కాస్త నోరుండి, ఎప్పుడన్నా, చెడామడా వాగుతుండే ఇంద్రుడికి స్వర్లోక నాధుడన్న బిరుదు పారేసి, పది మంది ఆడముండల్ని వెంట తగిలించాడు. దేవేంద్రుని నోరు మూతపడింది. తన కాలికింద చెప్పుల్లాంటి వారికి మంచి మంచి పదవులిచ్చాడు. పేరుకు వారు అధిపతులే గానీ, వారైనా స్వతంత్రించి ఒక్క పని చెయ్యడానికి లేదు. ఒక్క మాట మాట్లాడడానికి లేదు. ఏమి మాట్లాడవలసిందీ, విష్ణుమూర్తి చెబుతాడు. ఏమి చెయ్యవలసిందీ ఆయన నిర్ణయిస్తాడు. వీళ్ళు కేవలం సంతకాల రాయుళ్ళు. ఆ సంతకాలయినా ఎక్కడ చెయ్యవలసిందీ, ఆయనగారే ఇంట్ మార్కు చేసి పంపుతాడు. అక్కడ వీరు చేవ్రాలు చేస్తారు.

తను అధికారంలోకి వచ్చిన తరువాత విష్ణుమూర్తి; రావడానికి చేసిన ప్రయత్నాలకంటే, చాలా తెలివైన ప్రయత్నాలు శతాధికం చేయవలసి వచ్చింది. ఒక పదవి అబ్బడం వేరు. దాన్ని కాపాడుకోవడం వేరు. పదవిని కట్టబెట్టిన వారికి, దాన్ని ఊడబీకే అధికారం కూడా ఉంటుంది. కాబట్టే అధికారంలోకి వచ్చినవారు; తమ నీ పదవులలోకి తెచ్చిన వారికి, తిరిగి తమను దించిపారేసే అవకాశాలు, హక్కులు లేకుండా వ్యవహరిస్తారు.

మహావిష్ణువు ఆ పనే చేశాడు. తన బంధుకోటికి, ఆప్త వర్గానికి వారి వారి అనుయాయులకు మాత్రమే, ప్రాథమిక పౌరసత్వపు హక్కులుంచాడు. మిగతా వారికి పీకి పారేశాడు. ఇదేమిటని ఆయనగారి నెవరూ అడిగిన పాపాన పోలేదు గానీ, అడిగితే చెప్పవలసిన సమాధానాన్ని శ్రీ మన్మహావిష్ణువు తయారు చేసి సిద్ధంగా ఉంచుకొన్నాడు.

''ఒక ప్రాథమిక హక్కేగాదు- ఏ హక్కయినా ప్రతి పుల్లాయకూ ఉండాలనడం ఆటే వివేకం కాదు. కత్తి వీరుని వద్ద ఉండాలి. పిచ్చి వాడి దగ్గరుంటే, వాడు పిచ్చివాడు గనక, కనిపించిన ప్రతి వాణ్నీ పొడవవచ్చు. లేదా తనను తానే పొడుచుకోవచ్చు. ఉత్తమ రాజ్యమెప్పుడూ ఇలాంటివి జరగాలని కోరుకోదు. మన రాజ్యమూ, దాని పరిపాలనా పద్ధతి, చాలా ఉత్తమమని అందరకూ తెలుసు. ఇలాంటి 'అరాచకపు' చర్యలు మనం బొత్తిగా సహించం. ఇది 'శ్రేయోరాజ్యం' లక్షణం కాదు; కాబోదు. కేవలం రాజ్యలక్షణ దృష్ట్యా ఇలాంటి సముచిత చర్యలు చెయ్యక తప్పలేదు.''

తను అధికారంలోకి రావడం పట్ల , అయిష్టాన్ని ప్రకటించిన చాలా వర్గాలపై, విష్ణువు తన

అధికారాన్ని పురస్కరించుకొని, చావు దెబ్బలు తీశాడు. ఆ వర్గాలు బహిరంగంగా సభలు, సమావేశాలు జరుపగూడదనీ, ఊరేగింపులు లేవతీయరాదనీ, ఆయా శాఖాధికారుల చేత ఉత్తరువులు జారీ చేయించాడు. విష్ణువు చేతి కీలుబొమ్మల్లాంటి అధికారులందరూ, ఆ పనులు కళ్ళు మూసుకొని చేసిపారేశారు. ఇదేమిటని అడిగిన వారూ లేరు; అడిగినా చెప్పేవారూ లేరు.

ఈ విధమైన కట్టుదిట్టాలు చేసుకొన్న తరువాత; కేవలం లోకం కళ్ళు కప్పాలన్న అభిప్రాయం కొద్దీ, తనపై గల బాధ్యతలను 'తగు సమర్థులకు' పంచేశాడు. ఉత్పత్తి-అంటే సృష్టి- తన కొడుకుపరం చేశాడు. ఆర్థిక వ్యవహారాలు భార్యకు ఒప్ప చెప్పాడు. వార్తా సేకరణాదులకు- పుత్ర తుల్యుడైన నారదుణ్ని ఏర్పాటు చేశాడు. దేవ లోకాధిపతిగా, దేవేంద్రుడు వున్నాడయె! 'ప్రజాపతి' బిరుదంతో దక్షుడు తృప్తి పడి, ఎముకల్ని విరుచుకొంటుండె. తనకిక కావలసిన దేమిటీ?

అయితే ఈ 'నిరంకుశత్వం' ఇలా ఎక్కువ కాలం సాగలేదు. రాజ్యంలోని క్రింది వర్గాల వారిలో అసంతృప్తి రాజుకొంటున్నది. ప్రభుత్వం మీదా అధికారుల మీదా ఆయా వర్గాల వారు, అప్పుడప్పుడు నోరు చేసుకోసాగారు. రాజ్యంలో చిన్న చిన్న 'అలజడి' వంటి చర్యలు కొన్ని జరిగాయి.

ఇవన్నీ నారదుని ద్వారా విష్ణుమూర్తి ఎప్పటికప్పుడు తెలుసుకొంటూనే ఉన్నాడు. వీటిని ఆదిలోనే త్రుంచివేయకపోతే, తన రాజ్యానికి ముప్పు తప్పదని ఆయనకు తెలుసు. ఏవో చిలిపి చేష్టలుగా భావించి, వీటి పట్ల ఉదాసీనత చూపగూడదు. సన్న సన్న గరిక పోచలే వెంటిగా తయారయి, మదపుటేనుగును బంధిస్తాయి ఈ విషయం తనకు తెలీక పోలేదున అయితే తను ప్రత్యక్షంగా వీటి విషయంలో జోక్యం కలిగించుకోగూడదు. అందువల్ల చాలా గొడవలున్నాయి. తనేదైతే చెయ్యదలుచకొన్నాడో, అది తన క్రింది వారిచే తనే చేయించవచ్చు. ఈ ప్రతిక్రియతో, రోగం తక్కున కుదిరిందా సరే సరి; లేదా అప్పుడు తను ఎటుగూడీ 'శాంతి భద్రతలు' కాపాడవలసి వస్తుంది. తను విధిగా వాటిని కాపాడతాడు.

ఈ అభిప్రాయంతోనే విష్ణుమూర్తి 'అల్లరు'లను అణచివేయమని తన అధికారులకు ఆజ్ఞలు పంపించాడు.

చేయవలసిన సకల కార్యాలూ అధికారులు చేశారు. దీని వల్ల తాత్కాలికంగా శాంతి భద్రతలు దేశంలో నెలకొన్నా, అవి తుపాను ముందు నిశ్శబ్దంగా ఉండే ప్రకృతిని పోలినవే గానీ అన్యం కావు.

* * *

విష్ణుమూర్తి పరిపాలన వల్ల అధికంగా దెబ్బతిన్న వారు ప్రమదులు. దేవలోకంలో ప్రమధులు, దాదాపు 'అంటరాని వారు.' వారికి ఏ హక్కులూ లేవు. ఏ సదుపాయాలు లేవు. రాజ్యాంగం ఆ జాతి భద్రతకు చేసిన పనులేమీ లేవు. లేకపోగా, ఇదివరకున్న స్వల్ప సదుపాయాలను గూడా నేటి పాలన వర్గం రద్దు చేసింది. అలా రద్దు చేయడం శాంతి భద్రతల నిమిత్తమేనంటూ అది తన చర్యలను సమర్థించుకొంది. ఎంత ఘోరమైన పని చేసినా, అది సముచిత కార్యమేనని సమర్థించుకోని ప్రభుత్వం ఎక్కడైనా ఉంటుందా?

ఆర్థికంగా, సాంఘికంగా కూడా, ప్రమథులు చాలా హీన స్థితిలో ఉండిపోయారు. ఇదే స్థితిలో ఇంకా ఇతర జాతులు, వర్గాలు కొన్ని ఉన్నాయి. కానీ వాటికీ, ప్రథమ జాతికీ భేదమున్నది. ఇతర జాతుల్లో బాగా కలవాళ్ళు, విష్ణుమూర్తి ప్రభుత్వాన్ని సంపూర్ణంగా బలపరుస్తున్నారు. కొంత కొంత మంది, ముఖ్యమైన పదవుల్లో గూడా ఉన్నారు. ఆ పదవుల్లో ఉన్నవారు గూడా, బాగా ఉన్నవాళ్లో, లేక వారి తాలూకు వాళ్ళో అవడం చేత, వారుండి గూడా ఆ జాతికి ఏమీ ప్రయోజనం కలగడం లేదు. కావలసిన పనులు పెద్దవారే అడిగి చేయించుకొంటున్నారు. ఈ అట్టడుగున పడి నలిగి పోతున్న వాళ్ళు నలిగిపోతూనే ఉన్నారు. వీళ్ళ ఆలనా, పాలనా ఎవ్వరికీ పట్టలేదు. వీరిలో ఉండబట్టలేక ఎవరన్నా నోరు మెదిపితే, దాన్ని మూయించడానికి ఎక్కువసేపు పట్టేది కాదు.

'విష్ణుమూర్తి కేవలం కీలుబొమ్మలాంటి వాడు. అతనిదేమీ లేదు. నామకః అక్కడున్నాడన్న మాటే గానీ, అతను చేస్తున్నది చింతాకంత గూడా లేదు. అన్ని పనులూ మనమే చేసుకొంటున్నాం. మనం మనం ఒకటి. అధికారంలో ఉన్నది మనవారు; మనకేదో చెయ్యలేదని సణగడం మంచిది కాదు. మనవాడు మనకు చేస్తాడుగానీ, పరాయి వాడికి చేస్తాడా?'

ఇలాంటి 'మన' జాడ్యం తగిలించే వాళ్లు. ఈ జబ్బు పట్టుకొని ఈజాతి వాళ్ళంతా కిక్కురుమనకుండా నోరు మూసుకొనేవాళ్ళు. కనీసం - ఇలా తృప్తి పడదామన్నా, ప్రమథులకు, తమ వాడంటూ అధికారంలో ఏ ఒక్కడూ లేడు. తమ యోగ క్షేమాలను అధికారంలో ఉండి విచారించేది తమకు శత్రువు. ఇక తమకు ఎలాంటి రక్షణలుంటాయో ఎవరికి తెలీదు గనక!

జరుగుతున్న అన్యాయాన్ని సహించలేక, అసంతృప్తిని భరించలేక, తిరగబడిన ప్రమథులు; దారుణమైన శిక్షలకు గురి కాబడ్డారు. ఇలా ఎంత కాలం తామీ అక్రమాలను భరించాలి? వీటి నుండి ఎప్పటికి తమకు విముక్తి?

* * *

''మహానుభావా!'' అంటూ ప్రారంభించాడు నారదుడు. ''నేను మన రాజ్యమంతా తిరిగి వస్తున్నాను. ఇంతకాలమూ నన్ను 'విశేషాలేమీ తీసుకురావే'మని చంపుతుండేవారు. ఇప్పుడు కావలసినన్ని విశేషాలు తీసుకొచ్చాను.''

''ఏమిటవి?'' అని విష్ణుమూర్తి ప్రశ్నించకుండానే నారదుడు చెప్పనారంభించాడు.

''మీరిక్కడ కూచున్నారు. లోకమంతా సుభిక్షంగా ఉన్నదని మీ అభిప్రాయం. లేక కల్లోలంగా ఉన్నదని మీకు తెలుసేమో నాకు తెలియదు. కానీ మహాప్రభూ! మనం చిరకాలం ఇలా నిమ్మకు నీరెత్తినట్టు మసలడానికి వీలు లేదు. దేశంలో- ముఖ్యంగా- ప్రమథగణాల్లో అసంతృప్తి చెలరేగింది. వారంతా సంఘాలుగా ఏర్పడుతున్నారు. తమ సంఘాలను తాము కట్టుదిట్టం చేసుకొంటున్నారు. ఎన్నో హక్కులు కావాలంటూ తీర్మానాలు చేస్తున్నారు. ఆశయాలు ప్రకటిస్తున్నారు. ఆశయ సాఫల్యం కోసం ఎన్ని కష్టాలనైనా భరించాలని శపథాలు చేస్తున్నారు. దేశమంతటా చెల్లాచెదురుగా పడివున్న తమ వారిని, ఒక్క చోటికి కేంద్రీకరిస్తున్నారు. ఈ ఉద్యమం కార్చిచ్చులా దేశమంతటా కమ్ముకొంటున్నది.''

''అలాగా!'' అన్నాడు శ్రీ మహావిష్ణువు ఆశ్చర్యం నటించి. ''అయితే స్థానికాధికారులేమి చేస్తున్నట్టు? ఈ ఉద్యం దేశ క్షేమానికి భంగకరమని వారికి తోచలేదా? లేక భోగ విలాసాదులకు బానిసలై కర్తవ్యాన్ని విస్మరించారా? అదీ గాక; వీటినసలు లక్ష్యపెట్టనే లక్ష్యపెట్టటం లేదా? ఇలాంటి ప్రయత్నాలేవో జరుగుతున్నట్టు చూచాయగా నాకు తెలుసు. అవి మామూలు సంఘటనలను కొన్నాను గానీ, ఇంత దాకా వస్తాయనుకోలేదు. పరిస్థితులు ఇంతగా విషమించాయంటే, అధికారులు చాలా అసమర్ధంగా ప్రవర్తిస్తున్నారనుకోవలసి వస్తున్నది. ఇలాంటివి నేను సహించనని, వారికింకా తెలియదేమో!''

''కాదు ప్రభూ!'' అన్నాడు నారదుడు. ''అధికారులు చేయవలసిన ప్రయత్నాలన్నీ చేశారు. ఇంకా ఇంకా చేస్తున్నారు. కానీ వాటి వల్ల సత్ఫలితం కలుగ లేదు. కలుగలేదు సరిగదా, దుష్ఫలితాలు వేలాది ప్రభవించాయి. అధికారుల దండనలు, రక్షక భటుల అజమాయిషీలు అధికమైన కొలదీ, ప్రమధులు మరింత సన్నిహితులు కాసాగారు. ఏనాడూ కనని, వినని, ఐకమత్యం, ఈనాడు వారిలో వెల్లివిరుస్తున్నది. వారి ఉద్యమం మరింత బలపడుతున్నది. ఇదివరకొక్క ప్రమధులు మాత్రమే ఈ ఉద్యమంలో చేరారు. అధికారులు అణచడానికి ప్రయత్నాలు ప్రారంభించిన నాటి నుండీ, భూత పిశాచాది జాతులు గూడా ఆ ఉద్యమంలో కలిసిపోయారు. వారందరూ ఇప్పుడో అభేద్య శక్తిగా రూపొందారు. ఈ మహాశక్తిని ఎలా నిర్జించటమో తెలియక దేవేంద్రాది ప్రధానాధికారులు బుర్రలు బ్రద్దలు కొట్టుకొంటున్నారు...''

''సత్పురుషులు!'' అని అపహసించారు విష్ణువు; సాలోచనగా తలపంకించి.

నారదుడేమీ మాట్లాడలేదు.

* * *

ఒక్కసారి జయన్నినాదాలు మారు రమోగాయి. శంకరుడు చేసన్నతో సభా సదులను వారిస్తూ అధ్యక్ష పీఠమలంకరించాడు.

''కొందరంటున్నట్లు; ప్రస్తుత పాలక వర్గం మీద తిరుగుబాటు చేయడం మన అభిప్రాయం కాదు. దాని యంత్రాంగాన్ని బలహీన పరచి పాలనాధికారాన్ని చేజిక్కించుకోవడం గూడా మన అభిమతం కాదు. మనకు కావలసింది న్యాయం. మనం కోరుతున్నది, యథార్థంగా మనకుండ వలసిన హక్కులు. వీటిని వాంఛించడం కూడా మహాపరాధమే అయితే, మనం దోషులమే! ప్రాథమిక స్వత్వాలను, రాజ్యంలోని కొన్ని జాతులకు, లేకుండా చేసిన ప్రభుత్వం; అది ధర్మ ప్రభుత్వమని, కోటికోట్ల మంది ఘోషించినప్పటికీ, అధర్మ ప్రభుత్వమే అవుతుంది! ఒక దోషం; దానిని ఆచరించిన వాడు ఏ జాతీయుడైనా ఏ వర్గానికి చెందిన వాడైనా, దోషియే అవుతాడు. ఇది సర్వజనామోదమైన ధర్మం! కానీ ప్రస్తుత ప్రభుత్వం దీనిని కాదంటున్నది. ఈ అన్యాయాన్ని, అధర్మాన్ని, అక్రమాన్ని ఎదుర్కొనడమే మన ప్రధానాశయం.

''దేశంలోని ఇతర జాతలకున్న హక్కులు మనకూ ఉండాలి. వారితో సమానంగా మనమూ గౌరవింపబడాలి. ఈ ధ్యేయంతో ప్రారంభించబడిన ఈ ఉద్యమం, నేటికి మహాశక్తిగా రూపొందింది.

కొందరు సంకుచిత స్వభావులు భావిస్తున్నట్లు; ఇది కేవలం ప్రమథులకు మాత్రమే పరిమితం కాదు. ప్రతి పీడితునికీ, ఇందులో స్థానమున్నది. ప్రతి తాడితుడూ ఈ ఉద్యమంలో చేరవచ్చు. దేశంలో చెల్లా చెదరుగా పడివున్న భూత, ప్రేత, పిశాచాది జాతులు, రాక్షసులు ఈనాడీ మహోద్యమంలో చేరారు.

''ప్రభుత్వం చిత్రిస్తున్నట్లు, మనం దొంగలం కాము. మనలను క్రూరంగా అణచివేయడాన్ని సమర్థించుకొనడానికి, నీచాతి నీచమైన పద జాలం మన మీద ప్రయోగం చేస్తున్నది! ఈ భాషాడంబరం ద్వారా ప్రజల కళ్ళు గప్పాలని దాని ప్రయత్నం. తాత్కాలికంగా, ప్రభుత్వమే విజయం పొందవచ్చు. కానీ ఏనాటికైనా నిజం బైటపడక పోదు మనం ధర్మం కోసం, న్యాయం కోసం పోరాడుతున్నాం. అంతి విజయం మనకే లభిస్తుంది!''

* * *

ఈ విషయాలన్నీ మహావిష్ణువుకు తెలిశాయి. ఈ రోగానికి (!) మందు ఏమిటో ఆయన ఆలోచించే నిర్ణయించాడు. అయినా విష్ణువు ఆ ప్రతిక్రియను బైట పెట్టలేదు. తుది నిర్ణయంగా తన ఆలోచన ఎప్పుడూ ఉండనే ఉన్నది. ముందుగా దానిని బైట పెట్టినందువల్ల ఫలితమేమీ ఉండకపోవచ్చు. తన సూచనకంటే, తెలివైనదీ, శక్తివంతమైనదీ మరొక రెవరైనా సూచించే అవకాశం లేకపోలేదు. అలాంటిదే జరిగినప్పుడు, తన క్రిందివారి ముందు, తను- న్యూనత అనుభవించవలసి వస్తుంది. అయినా కళ్ళు బోయేటంతటి కాటుక తనకెందుకూ? ప్రముఖ ప్రభుత్వోద్యోగులందరినీ, ఒక చోట సమావేశ పరచి ఈ విషయం చర్చించడం చాలా ఉత్తమం! ఏ పుట్టలో ఏ పామున్నదో ఎవరికీ తెలియదు. దీని వల్ల వివిధ శాఖోద్యోగుల మనస్తత్వాలు, అభిప్రాయాలు తనకు తెలిసి పోతాయి. కొందరు మంచి పద్ధతులనే సూచించివచ్చు. అప్పుడు ఆ పద్ధతినే తనూ ఆలోచించి ఉంచినట్లు, వారితో బొంకనూ వచ్చు; లేదా- ప్రస్తుతం తను సమకూర్చి ఉంచిన మహాయుధం అప్పుడే బైట పెట్టవచ్చు. తనకు రెండు విధాలా లాభమే!

అందుచేతనే నారదునిద్వారా విష్ణుమూర్తి ముఖ్యులైన వారికి కబురు పెట్టాడు.

* * *

అన్ని సమావేశాల లాగా, ఇది సంతోష ధ్వానాలతో ప్రారంభం కాలేదు. చాలా బరువుగా బాధగా, మొదలెట్టబడింది. అందరి ముఖాలపై, భయాందోళనలు అగ్రాడుతున్నాయి. ఒకరినొకరు చూసుకోవడానికి సిగ్గుపడుతున్నారు. సంప్రదాయానుగుణ్యంగా దేవేంద్రుడు లేచి, 'స్వర్లోక నాథుడు' హోదాలో; అల్లరును అణచడానికి తను చేసిన చర్యలను సమావేశంలో తెలియపరిచాడు.

''ప్రప్రథమంగా; లాంఛన ప్రాయంగానే అవుగాక; శంకరుడు తన వారికి న్యాయంగా రావలసిన హక్కులను గురించి,ప్రభుత్వం చూపుతున్న పక్షపాత వైఖరిని గురించి నాతో చర్చించడానికి అనుమతిని వేడాడు. నేను, విష్ణుమూర్తి ప్రేరేపణపై నిరాకరించాను... ఫలితం చాలా దారుణంగా పర్యవసించింది. దానివల్ల మన దేశ శాంతి భద్రతలు దెబ్బతిన్నాయి. శంకరుని నాయకత్వాన,

ప్రమాధాది జాతులు 'అల్లరు'లను ప్రారంభించాయి. ప్రభుత్వోద్యోగులను చెరపట్టసాగారు. ప్రభుత్వ కార్యాలయాలను, ఆక్రమించుకోజొచ్చారు. కొన్నిచోట్ల, కొన్ని కొన్ని గ్రామాలు, వారి ఆక్రమణలోనికి వెళ్ళాయి. మన సైన్యంపై చెదురుగా దాడులు మొట్టమొదట జరిగినా, ఇటీవల ముఖాముఖి యుద్ధానికి సైతం సన్నద్ధులవుతున్నారు. వీటన్నిటినీ మించి వారి ప్రచారం మనకెంతో హాని కలుగజేస్తున్నది. మన ప్రభుత్వం లోనూ, దాని రాజ్యాంగంలోనూ వున్న లోపాలు, వారు వీధి వీధీ వాడవాడా తిరిగి ప్రచారం చేస్తున్నారు. మనం ఉన్నవారికే ఇంకా సహాయం చేస్తున్నామట! ప్రభుత్వం లోని అన్ని ఉద్యోగాలు, మన బంధువులకో, లేక స్నేహితులకో కట్టబెడుతున్నామట. మనం కాదని బుకాయించడానికైనా వీలు లేకుండా, అన్ని వివరాలతో సహా, సోదాహరణంగా, అంకెలు వేసి, వారు ప్రకటన పత్రాలు పంచి పెడుతున్నారు.

"ఈ ప్రచారం మన గుంభనను బట్టబయలు చేస్తున్నది. మనం చేస్తున్న అన్యాయాలు - మన దృష్ట్యా అవి ఎంత మాత్రం, అన్యాయాలు కావనుకోండి; అది కేవలం మన శత్రువులే, కసిబోక మనపట్ల వాడిన పదమే ననుకోండి; పది మందికీ తెలిసి పోతున్నాయి. మన వారిలో కొందరు ఈ విషయమై అప్పుడే తీవ్ర వాదోపవాదాలు సాగిస్తున్నారు. తెగించి కొందరు నన్ను అడిగారు గూడాను. వాటికి జవాబివ్వడానికి నేను నిరాకిరించాను. కానీ అందువల్ల; లొసుగులాంటిదేదో మన పక్షాన ఉన్నదన్న అపోహ- నిజమే ఉత్తి అపోహ- ప్రజలకు కలుగుతున్నది!"

"సరే! ఇంకెవరైనా ఈ విషయమై మాట్లాడదలుచుకొన్నారా?" అన్నాడు విష్ణుమూర్తి మధ్యలో కలుగచేసుకొని, అప్పటికింకా ఇంద్రుడు చెప్పదలచుకొన్నది పూర్తి కానేలేదు. దేవరాజ్య ప్రధానాధ్యక్షులీమాట అనడంతో, దేవేంద్రుడు కిక్కురు మనకుండా, వేదిక దిగి పోయాడు. తరువాత దక్షప్రజాపతి లేచి, అధ్యక్షుని అనుమతితో ప్రసంగించారు.

"దోషాలన్నీ అల్లరి మూకవేనని అనలేము"అన్నాడు దక్ష ప్రజాపతి, "కొంతలో కొంత మన వారి చేయిగూడా ఉన్నది. యక్షులు కిన్నరులు, సిద్ధులు, కింపురుషులు మొదలైన జాతులలోని కొందరు శంకరుణ్ని బాహాటంగా సమర్థిస్తున్నారు. 'యధోచితమైన' సాయం చేయటానికి గూడా మరికొందరు పూనుకొన్నారు. ఈ బలహీనత మనలో ఎప్పుడేర్పడిందో అదేమేరకు శంకరుడు ఉద్యమం బలపడుతుంది. ఈ విషయం ప్రధానాధ్యక్షుల వారికి, చూచాయగా తెలియపరచబడిందను కొంటున్నాను... బైటి నుండి రాగల ప్రమాదం కన్న; ఈ లోపలి 'ప్రమాదం' మరింత ప్రమాదహేతువని నా మనవి. ఈ అల్లరులను అణచడానికై మనం తీసుకొనబోయే ప్రతి చర్యా, అటునుండి గాక ఇటునుండే ప్రారంభించాలని విజ్ఞప్తి చేస్తున్నాను..."

ఆ పైన ఏమీ మాట్లాడడానికీ తోచక, మాటల కోసం తడబడి అట్టే అభాసుపాలు గాకుండానే దిగి వచ్చాడు.

విష్ణుమూర్తి ముఖం చిరాకును, విసుగునూ వెలిగ్రక్కుతున్నది. స్థిరంగా పీఠంపై కూర్చొనలేకపోతున్నాడు. 'ఇంకెవరైనా మాట్లాడుతారా?' అని విష్ణుమూర్తి అడిగితే; మాట్లాడాలని కాచుకు కూర్చున్న కొంతమంది- అతనామాట అనక పోవడంతో, కొద్దిగా నిరాశ చెందారు.

“బాగానే ఉంది!” అంటూ ప్రారంభించాడు విష్ణుమూర్తి. “ఇంత వరకూ మాట్లాడిన గౌరవనీయులైన ఇద్దరూ, ఉన్న పరిస్థితిని, సాకల్యంగా విచారించారేగానీ, దానిని చక్కబరచడానికి సముచితమైన సూచనలు చెయ్యలేదు. తప్పు ఎవరిదీ అన్న ప్రశ్న ఇప్పుడనవసరం! ఎవరిది కానీండి. జరగవలసిందేదో జరిగింది. ఈ విచికిత్సతో కుస్తీలు పట్టడం కూడని పని; ఉన్న ఉద్రేక వాతావరణాన్ని, ఎలా యథాస్థితికి తేవడమన్నదే ప్రస్తుత చర్చనీయాంశం! ఇందుకు తగు సూచనలివ్వగల వారెవరైనా వుంటే; వేదిక వద్దకు రావచ్చు; తమ తమ సూచనలను సభ వారికి తెలియపరచవచ్చు. అయితే ప్రధానాంశమొక దానిని ఎవ్వరూ విస్మరించరాదు. ఇక్కడ సమావేశమైన సదస్యులందరూ, ఆమోదించిన సూచనే అయినప్పటికీ, అది ‘సముచితం’కాదని తోచినప్పుడు, దానిని నేను ఆమోదించడం జరగదు. అటువంటి సూచన, ‘పరిశీలించదగిన సలహా’గా మాత్రమే భావించ బడుతుంది. లేక, ప్రభుత్వం తలపోసిన విధానాన్నే సదస్యులు గూడా సూచించిన పక్షాన అది వెంటనే శాసనరూపం దాల్చగలదు. కాకపోయినప్పటికీ ప్రభుత్వం గూడా తీవ్రంగా ఆలోచిస్తున్నది; తీసుకొన వలసిన చర్యలేమిటో తీసుకొంటుంది. ఒకటి మాత్రం నిజం! ప్రస్తుతమున్న అవ్యవస్థిత స్థితి లాంటిది, ఇక ముందు ఉండదు; ఉండబోదు. స్థితిగతులను చక్కబరచడానికి తగు కట్టుదిట్టాలు ప్రభుత్వం చేయనున్నది. ఆఁ.. మీలో ఎవరైనా ఎలాంటి సూచననైనా చేయదలిస్తే, నిరాక్షేపణీయంగా చేయవచ్చు. అది సూచనగా మాత్రమే పరిగణింపబడగలదు గానీ, శాసనం కాదనీ కాబోదనీ, మరో సారి హెచ్చరిస్తున్నాను...”

అని చుట్టూ కలయచూశాడు విష్ణుమూర్తి- ఏవో గుసగుసలు చెలరేగాయి. చిన్న చిన్న వాగ్వాదాలు తలెత్తాయి. ‘ఔ’ను- ‘కాదు’- ‘భేష్ బాగుంది’- ‘ఛ ఛ పచ్చి నిరంకుశత్వం’- ‘కాదు - రాక్షసత్వం’- ‘ఫరావాలా - ఒక మోస్తరుగా ఉంది.’ కొన్ని క్షణాల తరువాత ఈ సద్దు గూడా అణగిపోయింది. ఏవేవో సూచనలను ప్రతిపాదించి, పేరు దక్కించుకొందామన్న ఆశతో వచ్చిన కొందరు ‘ప్రముఖు’లకు తీరని ఆశాభంగం కలిగింది. ఇప్పటికే ఈ దిక్కుమాలిన గొడవలతో చిరాకెత్తిపోయిన అధిక సంఖ్యాక సదస్సులు, తుది నిర్ణయాన్ని, విష్ణుమూర్తికే వదిలివేశారు.

“మంచిది. మీమీ స్థానాలను మీరు భద్రంగా కాపాడుకొనండి. కేంద్ర కార్యాలయం నుండి కొద్ది రోజులలో మీకు క్రొత్త శాసనాలు అందుతాయి. వాటిని అమలు పరచండి. ఫలితాలు తెలియపరచండి. అప్పటికీ ప్రశాంత వాతావరణం నెలకొనక పోతే, అప్పుడు ఆలోచించవచ్చు.. ఒక్క మహేంద్రుడు తప్ప, తదితరులందరూ, వారి వారి ప్రాంతాలకు వెళ్ళవచ్చు. దక్ష ప్రజాపతి ఎప్పుడు వెళ్ళవలసిందీ, మేము కబురు పెడతాము. అంతదాకా వారు విశ్రాంతి భవనంలో ఉండవచ్చు..”

మహేంద్రుడు, దక్షుడు, ఒకరినొకరు ప్రశ్నార్థకంగా చూసుకొన్నారు. విష్ణుమూర్తి ఇది గమనించి గూడా, గమనించనట్టే నటించాడు.

* * *

“మహోదయులకు అభినందనాలు! ఈ ఉద్యమం ఇంతటి పటిష్టతరం కావడానికి, ఇన్ని

విజయాలను సంతరించడానికి, కారణభూతులైన వారందరికీ నా వందనాలు!'' అంటూ మహా శివుడు తన ఉపన్యాసాన్ని ప్రారంభించాడు. ''మనది ధర్మ పక్షం. మన చర్యలు న్యాయబద్ధమైనవి! అందుకే అన్ని చోట్లా మనలను విజయలక్ష్మి వరిస్తున్నది. అందుకే దేవజాతి లోని కొన్ని వర్గాలవారు మనపట్ల సానుభూతి ప్రకటిస్తున్నారు. మనకు అండదండగా ఉంటున్నారు. ఇదే సందర్భంలో మన వారు కొందరు చిత్రమైన సందేహాలను వెలిబుచ్చుతున్నారు. దేవ వర్గీయులను ఏ పరిస్థితులలోనూ నమ్మగూడదంటున్నారు. వారి సాయం, సాయంగా పరిగణింప గూడదంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వ బలాలకంటె, మన బలాలు అధికతరమైనవి గనుక, నేడో రేపో, నిస్సందేహంగా, మనం ప్రభుత్వాన్ని కైవసం చేసికొనబోతున్నాము గనక, ఏదో సాయం చేసినట్టు నటిస్తూ, పెద్ద పెద్ద పదవులను పుచ్చుకొందామన్న అభిప్రాయమే, వారి చేత ఇలా చేయిస్తున్నదని వీరంటున్నారు. ఇది నిజమని నేననుకోను. వాదనా సౌలభ్యం కోసం, యదార్థమేనని అంగీకరించినా, వీరి సందేహాలు హాస్యాస్పదంగా తోచకపోవు. మనం ప్రభుత్వాన్ని చేజిక్కించుకోడమంటూ జరిగినప్పుడు , ఇంత సహాయ పడిన వీరిని, అప్పటి మన ప్రభుత్వం 'తగు విధంగా' తస్కరించగలదు. కాక ద్రోహ చింతతోనే ఇవి జరిగాయని నమ్మబడినప్పుడు ద్రోహులకు విధింపబడే శిక్షలకు వీరు గూడా గురి కాబడతారు. కానీ, పరాయి వారి అనుపానులేమిటో తెలుసుకోకుండా వారిని ద్రోహులుగా కపటులుగా పరిగణింపలేము గదా! వారు దుర్మార్గులని తెలిసేవరకూ సన్మార్గులుగానే మనం భావించాలి...

''ఇక ప్రస్తుత విషయం! రాయబారాలు విఫలం కావడంతో మనం ప్రత్యక్ష చర్యలకు పూనుకొన్నాం. ఏ ఒక్కరికీ బాధ కలిగించాలనిగానీ, కష్టపెట్టాలనిగాని మనకు లేదు. అనివార్యమైన సందర్భాలలో కష్టనష్టాలకు కొందరు దేవరాజ్య ప్రజలు గురి కాబడినట్టు తెలియవచ్చింది. అందుకు మనం బాధ్యులం కామని వారికి మనవి చేస్తున్నాను. దుష్ట ప్రభుత్వపు పాలన క్రింద ఉన్నప్పుడు, ఇలాంటివి అనేకానేకంగా జరగడం గూడా అసహజం కాదని వారు తెలుసుకోవాలి. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు, అలాంటి బాధితులకు తగు ప్రతిఫలాలు ముట్టచెబుతాం. దేవరాజ్య ప్రభుత్వం, మీమీద ఉవ్వెత్తుగా దుష్ప్రచారం కొనసాగిస్తున్నది. మనం అధికారంలోకి వస్తే ప్రజలకు శాశ్వత బానిసత్వం తప్పదంటున్నది. విచ్చలవిడిగా నిరంకుశత్వం విలయతాండవం చేయగలదని ప్రజానీకాన్ని భయ పెడుతున్నది. ఇది సర్వాబద్ధమని ఆ ప్రజలు గ్రహించాలి. మన ప్రభుత్వంలో ప్రతి వ్యక్తికీ; సమానస్వత్వాలుంటాయి. జాతిభేదాలు గానీ, వర్గ భేదాలు గానీ ఉండవు. ఆశ్రిత పక్షపాతం, బంధుప్రీతి, మన చాయలకైనా రావడానికి లేదు. ఒక రకంగా చెప్పాలంటే; ఇప్పటికంటే ఇబ్బడిముబ్బడిగా, తన జీవితాలు; కాంతివంతము, సౌఖ్యదాయకము, ఆనంద విలసితాలుగా ఉండగలవని ఆ ప్రజలు గ్రహించాలి.

''మన విప్లవాన్ని అణచడానికి, క్రొత్త విధానాలను రూపొందించే విషయమై చర్చించడం నిమిత్తం, ప్రముఖ రాజోద్యోగులు కొందరు విష్ణుమూర్తి అధ్యక్షతన సమావేశ మయినట్లు నమ్మకంగా తెలియ వస్తున్నది. ఇది కేవలం భ్రమ మాత్రమే కాగలదు. ఇలాంటి 'కూబి' ఎత్తులకు మనం లొంగిపోము. శత్రువు వేసే ప్రతి కొత్త ఎత్తును మనం భగ్నం చేయాలి. చేయగలం కూడా!''

ఆ తరువాత గూడా శివుడేదో అన్నాడు గానీ ఆ మాటలు, జయన్నినాదాల రణగొణధ్వనిలో

కలసిపోయాయి.

* * *

"మహాదేవా!"ఇంద్రుడు వినమ్రుడై అన్నాడు. "తగు ఉపాయం మీరే సూచించండి. నాకేమీ పాలుపోవడం లేదు. ఎలా ఈ అల్లరి మూకలను అణచవలసిందీ మీరు సూచించండి; ఆ సూచనను నేను అక్షరాలా పాటిస్తాను!"

"మాట తప్పవనుకొంటాను!" అన్నాడు విష్ణుమూర్తి; అదోలా ఇంద్రుని వంక చూస్తూ.

"ప్రభువులు నన్ను విశ్వసించాలి!"

"మంచిది." విష్ణుమూర్తి పెదవులపై చిరునవ్వు పొటమరించింది. "శచీధవా! ఏ పని చేయడానికైనా ముందు, ఆ పనిని గురించి మనకు సమగ్రంగా తెలిసి ఉండాలి కదా? అల్లరి మూకను అణచడానికి ముందు దాని సంగతి సందర్భాలు, మనకు కరతలా మలకంగా ఉండాలి. అంతవరకూ మనకూ లోటు లేదు. అన్నట్టు - శంకరుడు యువకుడని గదూ నువ్వన్నది!"

"ఔను ప్రభూ!"

"వివాహితుడే ననుకొంటాను!"

"లేదు."

"కారణం నీకు తెలుసా శచీంద్రా?"

"తెలియదు, కానీ తెలుసుకోగలను."

"అవసరం లేదు గానీ, దక్ష ప్రజాపతికి; యుక్త వయస్కురాలైన కూతురు ఉన్నట్టు విన్నాను. నిజమే గదూ?"

"ఉన్నది. ఆ పిల్లపేరు 'సతి'. తగిన వరుని కోసం దక్షుడు ప్రయత్నిస్తున్నాడు."

"ఆ ప్రయత్నాలను ఆపవలసిందనీ, వరుడు సిద్ధంగా ఉన్నాడనీ, దక్షునికి చెప్పు..."

"మీ హృదయాన్ని నేను అర్థం చేసుకోలేకపోతున్నాను... అంటే; దక్షుడు, జామాతగా శంకరుని పరిగ్రహించాలనా తమ అభిప్రాయం?"

"అవును!"

"ప్రభూ! తమరు పొరబడలేదు గదా!" అన్నాడు మహేంద్రుడు కొయ్యవారిపోయి.

"లేదు!" అన్నాడు హరి కోపంగా. "దీని వలన ఎన్నో చిక్కులు ఇట్టే విడిపోతాయి. అనవసరమైన రక్త పాతం తగ్గుతుంది. శంకరుడు ప్రాణిగానీ, పాషాణం కాదు. ప్రాణి సహజమైన యవ్వనోద్రేకాలు అతగాడికీ ఉంటాయి. వాటిని ఉపయోగించుకోవడం ద్వారా, మనం కార్యాన్ని సానుకూలపరచుకోవాలి..."

"మరి దక్షుడిందుకు అంగీకరిస్తాడా ప్రభూ?"

"అతన్ని అంగీకరింప చేయడం మీ విధి. అలా చేయలేనినాడు, మీరు అసమర్థులే అవుతారు.

అసమర్థులు సమర్థవంతమైన పదవులలో ఉండదగరని మీకు తెలుసు. అదీగాక; చేయలేమని మీరంటున్నది- మామూలు వ్యక్తిగా కాక- బాధ్యత గల ఉద్యోగిగా అంటున్నారు. ఇలా అనడం, ప్రభుత్వ శాసనాన్ని ధిక్కరించడమవుతుంది. శాసనాన్ని ధిక్కరించడం ద్వారా, మీరు శత్రువులకు, పరోక్షంగా సాయపడుతున్నారన్న ఆలోచన, మాకు కలిగేందుకు, అవకాశమిచ్చిన వారవుతున్నారు. శత్రువులకు విధించబడే శిక్షలే వారికి సాయపడుతున్నవారికి గూడా విధించబడతాయని మీకు తెలియకపోలేదు. ఆలోచించండి! మీ ఇష్టప్రకారం నడిపించండి!"

ఇంద్రుడింకేమీ మాట్లాడలేదు.

* * *

దక్షుడు కోపంతో కుతకుతలాడి పోయాడు. ఇలాంటి అవమానం, తన జీవితంలో ఎరుగననుకొన్నాడు. అవామాన భారంతో నతశీర్షుడయినాడు. ముఖంలో ప్రస్ఫుటిస్తున్న భావాలు తప్ప, అతని అభిప్రాయాన్ని తెలుసుకొందుకు మరో మార్గమేదీ ఇంద్రునికి లేదు. లోలోపల ఎంత మదన పడుతున్నా, దక్షుడు బైటపడటం లేదు.

"చెప్పు దక్షా! నీ అభిప్రాయమేమిటి?" అన్నాడు ఇంద్రుడు.

దక్షుడు మెల్లగా తలెత్తి, ఇంద్రుని ముఖంలోకి చూసి, తిరిగి తలదించుకొన్నాడు.

"ఇది నాకు మాత్రమే సంబంధించినది గాదు. నా స్వవిషయమైతే, నిరభ్యంతరంగా, చేయగలను. కానీ కాదే! శంకరుని వివాహమాడటానికి 'సతి' అంగీకరించగలదని నేనెలా చెప్పను?"

"నువ్వు ప్రజాపతివి! ప్రజలను అదుపాజ్ఞలలో పెట్టడంతో బాటు వారి సౌఖ్యాలను చూడడం గూడా నీ విధి. అలాంటి బాధ్యతా యుతమైన పదవిలో ఉండి, నీవిలా అనడం మంచిది కాదు. 'సతి' నీ కూతురు కాక, మరొకరి బిడ్డ అయితే, ఏ శాసనాన్నాధారం చేసుకొని, నువ్వీ కార్యాన్ని నెరవవేరుస్తావో, అదే శాసనం; నీపై, నీవే అమలు పరచుకోవాలి. అలా చేయలేని నాడు, నీవీ పదవిలో ఉండతగవు. శాసన ధిక్కార నేరం, నీపట్ల ఉండటమే అందుకు కారణం! పదవీ రహితుడవైన నువ్వు, సామాన్య పౌరుని వంటి వాడవేగానీ, అధికుడవుకావు. అవసరమయిన సందర్భాలలో, సామాన్యుని ఆస్తి పాస్తులు, అతని తాలూకు వ్యక్తులు, ప్రభుత్వం స్వాధీన పరచుకొనవచ్చని నీకు తెలుసు.

...నీవు దీని కంగీకరించకపోయినా, ఈ విధానం నేను అవలంభించక తప్పదు. అలాంటి ఆజ్ఞలు నాకున్నాయి. చేజేతులా పదవిని కోల్పోవడం, విజ్ఞత కాదు. ఆపైన నీ యిష్టం... 'సతి' గూడా నీతోనే సమావేశాలకు వచ్చింది గదూ! ఆ పని నీవు చేయలేకపోతే, అధికారిగా నేనన్నా 'సతి'ని అందుకొప్పించగలనేమో ప్రయత్నిస్తాను..."

తండ్రి చెప్పిన మాటలన్నీ సతి విన్నది. ఇలా జరుగుతుందని, ఆమె ఏనాడూ అనుకోలేదు. తన వివాహం, ఫలానా వ్యక్తితో కావాలని, ఆమె ఎప్పుడూ కలగనలేదు గానీ, శంకరుని వంటి, పిశాచ గణ నాయకునితో అవుతుందని గూడా ఊహించలేదు.

మొట్టమొదట తనెంతగానో ప్రతిఘటించింది. కానీ ఇంద్రుడు, మహావిష్ణువు గూడా, తన నిందుకు ఒప్పుకొనేట్టు చేశారు. తన ఈ 'త్యాగం' వల్ల కోట్లాది ప్రజలు బాగుపడతారని నచ్చచెప్పారు. ఈ కారణం తననంతగా సంతృప్తి పరచలేదు. కానీ, ఆ తరువాత మహా విష్ణువు రహస్యంగా చెప్పిన విషయాలు, తన కెంతగానో నచ్చాయి...

"అమ్మా! ఇందుకు నువ్వు విచారించకు. ఇందాక ఇంద్రుడు ఉన్నాడు గనుక, అరవిడిచి మాట్లాడడానికి వీలు లేక పోయింది... నువ్వేదో భ్రమ పడుతున్నావు గానీ, ఇది నిజంగా, నీకెంతో ఉపకరిస్తుంది. శంకరుడు వస్తుతః తక్కువ జాతివాడు. అందునా అధమ వర్గానికి చెందినవాడు. పది మంది వెర్రి వెధవలు, గొప్పవాడి వన్నారు గనుక, అతను గొప్పవాడయ్యాడుగానీ, స్వతస్సిద్ధంగా, ఉత్త మామూలు వ్యక్తి. అటువంటి వాణ్ని పెళ్ళాడటం, నీకన్ని విధాలా ఉత్తమం. తను; మనకంటే తక్కువ వాడినన్న విషయం, అతనేనాడూ మరిచిపోలేడు. ఇష్టమున్నా లేకపోయినా, అతను మనల్ని గౌరవించి తీరాలి. 'భార్య'గా అతని ఆజ్ఞలను నీవు పాటించ నవసరం లేదు. నీ వతన్ని ఆజ్ఞాపించవచ్చు. అదుపులో పెట్టవచ్చు. అతని అడుగులకు మడుగులొత్తడానికి మారుగా, ఆ పనే అతనిచేత నీవు చేయించుకోవచ్చు. మరొక 'భర్త' వల్ల ఇలాంటి సౌకర్యాలు లభించవు...మనలో మాటగా నీకిది చెబుతున్నాను. దేవలోకంలో ఇందరు కన్యలుండగా, నిన్నే ఈ పనికై వినియోగించడానికి ముఖ్య కారణం; నువ్వు మాకు ఆప్తురాలివి కావడమే! రాగల సత్ఫలితం; నేవిక్కడ వుండి గూడా మరొకరికెలా దక్కనివ్వను? చిన్నదానివి గనుక, లోక వ్యవహారాలు నీకంతగా తెలియవు. నా మాట విను. అనవసరంగా భవిష్యత్తును పాడుచేసుకోకు. వివాహానంతరం మరికొన్ని రహస్య విషయాలు నీకు తెలియ పరుస్తాను..."

"మీ మాటను నేను కాదనలేదు" అన్నది తను. "అయితే- అతనికీ మనకూ బద్ధవైరం కదా, వివాహమెలా పొసగుతుందో తెలుసుకోవాలనుకొంటున్నాను..."

"చూడు తల్లీ!" అన్నాడు విష్ణుమూర్తి లాలనగా. "కొన్ని కార్యాలు నెరవేరిందాకా బైటికి అనరాదు. ఇది రాజ్యాంగా రహస్యం. ఆ గొడవలన్నీ, మేము చూసుకొంటాం. నీ పనల్లా, మేము చెప్పినట్లు చెయ్యడమే! ఫలితం కోసం నువ్వు విచారించనక్కర లేదు!"

తను అంగీకరించింది. మొట్టమొదట మనస్సు ఆదోలా అయింది. కానీ ఆలోచించి చూస్తే, తను చేసిన పని ఎంతో ఉత్తమ కార్యంగా స్ఫురిస్తున్నది. తన వ్యక్తిగత విషయాలు అలా వదిలేసి చూస్తే, దేశానికి తను చేసిన 'సేవ' అమూల్యమైనది! తన వివాహంతో కొన్ని కోట్లమంది ప్రజలు సుఖజీవనం చేయగలుగుతున్నప్పుడు; తను ఒక్కతే కష్టపడినా ఫరవాలేదు. ఇదయినా తను అనుకోవడమే గానీ మహా విష్ణువు చెప్పిన పద్ధతి ప్రకారం చూస్తే, వ్యక్తిగత జీవితం గూడా, సంతృప్తికరంగా ఉండేలా కనిపిస్తున్నది. ఐనా ఇదమిత్థమని, తనిప్పుడేమీ చెప్పలేదు.

కేవలం సౌందర్యం మాత్రమే గణనీయమనుకొంటే, శంకరుడు అందగాడే! ఇది తను 'చిత్రం'లో చూసి ఏర్పరచుకొన్న అభిప్రాయం. జీవంతో తొణికిసలాడుతున్న వ్యక్తి, మరింత అందంగా ఉండవచ్చు. తమకు 'అన్యాయం' చేస్తున్నాడని విరోధిగా భావించడం జరుగుతున్నది గానీ, బుద్ధి

కుశలతకైనా, దేవలోకంలో, ఏ ఒక్కరికీ తీసిపోడు. కాకపోగా, మరొకరకంగా చెప్పాలంటే, అతనితో తులతూగగల వ్యక్తి గూడా దేవలోకంలో లేడనవచ్చు. ఒకరు కాదు; ఇద్దరు కాదు; కొన్ని లక్షలమంది ప్రజలకు నాయకత్వం వహిస్తున్నాడు. వారందరినీ, తను కనుసన్నల వెంట తిప్పుతున్నాడు. తన మాట శిలాశాసనంగా చెల్లించుతున్నాడు. అత్యధిక బలసంపదలు కలిగి, ఎంతో పటిష్ఠమైన ప్రస్తుత ప్రభుత్వాన్ని, గడగడలాడించుతున్నాడు. ముఖాముఖి తలపడలేక, దొంగచాటుగా, మాయోపాయంతో, అతన్ని లొంగదీసుకోవాలన్న ప్రయత్నాలు; ఈ పాలక వర్గం చేయవలసినంత తీవ్ర సంచలనాన్ని కలిగించాడు. ఇన్నింటినీ ఇంత చక్కగా నిర్వహించుతున్న వ్యక్తి సామాన్యుడా? ఎంత మాత్రం కాదే! 'సామాన్యుడు'- 'అల్లరిమూక' 'రాలుగాయి' అని స్థానిక ప్రముఖులు పదే పదే దుష్ప్రచారం చేస్తూ, ఆందోళన పడుతున్నారంటే, ఆ ఆందోళన వెనుక, ఎంతటి భయం గూడు కట్టుకొని ఉన్నదో, ఆలోచించినవారికి తెలియకపోదు. వారంటున్నట్లు, నిజంగా శంకరుడు మామూలువాడే అయితే, అందుకోసం, రహస్య సమావేశాలు జరపడమూ, యుక్తి ప్రయుక్తులు పన్నడమూ, కేవలం అవివేకం కావలసి వస్తుంది! వీరికి తెలుసు; శంకరుడు అసమాన్యుడని, అందుకే ఇన్ని బదవలు వీరు పడుతున్నారు...

అటువంటి మహామహునికి ఇల్లాలుగా ఉండడం, నిజంగా గర్వించ దగ్గ విషయమే! మహావిష్ణువు ఏ అభిప్రాయంతో అన్నప్పటికీ, తను ఇందుకు ఆనందించాలి గానీ, విచారించరాదు-కానీ, తన కోరిక ఫలిస్తుందా లేదా అన్నదే ప్రస్తుత సమస్య. ఇంతటి మహామహుడు దేవతలు పన్నిన ఈ 'ఉచ్చు'ను తెలుసుకోలేడా? తెలుసుకోలేనంత అమాయకుడనటానికి ఆధారమేమీ లేదు. అలాంటి అమాయకుడు ఇన్ని పనులు చెయ్యనూ చెయ్యడు; అతనికోసం మహావిష్ణువు ఇన్ని పన్నాగాలు పన్ననూ పన్నడు. అది సందేహించనవసరం లేని విషయం!

అయితే, తన శక్తియుక్తులెమిటో ఇప్పుడే ప్రదర్శితం కావాలి. అలాంటి గండర గండణ్ని వశం చేసుకొనడం ద్వారా, తన వ్యష్టి ప్రతిభ బహిర్గతం కావాలి. దేవతా కోటిని రక్షించిందన్న కీర్తితో బాటు, ఒక మహా వ్యక్తిని జయించిందన్న కీర్తి కూడా తనకు దక్కాలి. ఇందులో తను ఓడిపోయిందో, అందరి భవిష్యత్తూ అంధకార బంధురమవుతుంది. కాక జయించడమే జరిగితే, తనకన్నా అదృష్టశాలిని, మరి పుట్టబోదు...

* * *

శంకరుడు చాలా తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. సతి చెప్పిన మాటలు విశ్వసించదగినవో కాదో తేల్చవలసిన బాధ్యత తనమీద ఉన్నది. ఇప్పటి తన నిర్ణయం మీదనే. తన వారి భవిష్యత్తంతా ఆధారపడి ఉన్నది. తను తప్పటడుగు వేస్తే, అధఃపాతాళానికి వెళ్ళడం తప్ప మరో మార్గమే లేదు.

తన వారు వాదిస్తున్నది గూడా నిజం లాగానే ఉన్నది. సతి దేవకన్య; అందునా దక్ష ప్రజాపతి తనూజ. తమకు శత్రుకోటి లోనిది. తమ గుట్టుమట్టులు తెలిసికోవాలన్న అభిప్రాయంతోనే, ఆ చుట్టు ప్రక్కల తచ్చాడుతున్నదనీ, అందుకే ఆమెను తాము బందీగా పట్టుకొచ్చామనీ తనవారు అంటున్నారు.

కానీ సత్యం మరొకలాగా కూడా ఉండి ఉండవచ్చు. దేవతలందరూ తమకు శత్రువులు కారు. ఆ జాతికి చెందిన చాలామంది; తమ పట్లా తమ ఉద్యమం పట్లా సానుభూతిని ప్రదర్శిస్తున్నారు. పరోక్షంగా సాయపడుతున్నారు గూడాను. ఈ సతి గూడా ఆ కోవకు చెంది ఉండగూడదా? కొందరు, ఆ రాజ్యంలో ఉండే సహాయ పడుతుండగా, ఈమె ఇక్కడికి వచ్చి, తనకు చేయూత నివ్వనిశ్చయించు కొన్నదేమో!

తనిప్పుడేమి చెయ్యాలి? సతిని విశ్వసించడమా? మానడమా?

* * *

నారదుడు సంభ్రమంగా ప్రవేశించారు. విష్ణుమూర్తి ప్రశ్నార్థకంగా అతన్ని పరికించాడు.

''దేవా! మన ప్రయత్నాలన్నీ విజయవంతమయినాయని తెలియచేయడానికి చాలా సంతసిస్తున్నాను. సతి, తన పాత్రను మహాద్భుతంగా పోషించింది. ఆమె సౌందర్యానికి శంకరుడు లొంగిపోయాడు. ఎంతగా ఆకర్షితుడయినాడంటే; అతని ఉద్యమం, మునుపున్నంత తీవ్రంగా లేదు. ప్రస్తుతం మన్మధుడు ఆ ప్రాంతాలలోనే సంచరిస్తున్నాడు. సతీ శంకరులిపుడు ఏకాంతమందిరా వాసులయినారు. తమ పాచిక ఆమోఘంగా పారింది... నాయకుడు, ఇతర కార్య నిమగ్నుడు కావడంతో, అతని బలగము, కర్తవ్యతా విమూఢయై దిక్కులు పరికిస్తున్నది. కొద్ది రోజులలో అది చెల్లా చెదరు కావచ్చు...''

విష్ణుమూర్తి ఫక్కున నవ్వాడు.

''ఏమిటి స్వామి?'' అన్నాడు నారదుడు ఆశ్చర్యంగా.

''అది, నువ్వనుకొంటున్నంత సులభం కాదు నారదా! అలా జరగడము గూడా మన అభిమతం కాదు. ఏమహా శక్తి మనలను ముప్పతిప్పలు బెట్టిందో, దానిని నాశనం చేయడం కన్న, పదిలంగా మనకుగా దానిని ఉపయోగపరుచుకోవాలి. అప్పుడే మన వివేకం గూడా బైటపడుతుంది. ఆ పని గూడా త్వరలోనే పూర్తి కావచ్చు...దేవేంద్రాదులను నా మాటగా ఇక్కడకు రమ్మని చెప్పు.''

* * *

శివుడు తన పరివారంలోని ప్రముఖులందరినీ ఒకనాడు సమావేశ పరిచాడు. ఆ సమావేశంలో ఇటీవలి తన చర్యలకు శంకరుడు సంజాయిషీ ఇవ్వవలసి ఉన్నది.

''నాకు తెలుసు'' అంటూ ప్రారంభించాడు శివుడు. ''నన్ను గురించి మీరిలాగే అనుకుంటారని, నేను ఎప్పుడో అనుమానించాను. మీ సందేహాలన్నీ సవ్యమైనవేనని ఒప్పుకొంటున్నాను. అయితే వాటికి నా ప్రత్యుత్తరాలు గూడా మీరు జాగ్రత్తగా వినాలి. ఇంతా చేసి, నేను దోషినేనని మీరభిప్రాయపడితే, శిక్షార్హుణ్నే.

''చాలా మంది బహిరంగంగా చర్చిస్తున్నట్లు, సతిని నేను వివాహమాడబోతున్నాను. ఇందులో

నా స్వార్థం లేకపోలేదు గానీ, అంత కన్నా, మన ఉద్యమానికి మహోపకారం జరుగనున్నది... అవసరమయితే, రక్తపాతం జరపడానికి గూడా మనం సిద్ధపడ్డాము. కానీ, అంతకన్నా సులవైన మార్గాలున్నప్పుడు, వ్యవహారం, అంతదాకా పోవడమే అనవసరం! సతిని వివాహం చేసుకోవడం ద్వారా, ప్రస్తుత ప్రభుత్వంలోని ఒకానొక ప్రముఖోద్యోగి, మనకు చాలా దగ్గరి వాడవుతున్నాడు. అతని నుండి మనమేదైనా సహాయం పొందవచ్చు... ఆదిలో ఇలా ఆలోచించిన నా ఆలోచనలన్నీ, మహావిష్ణువు గుర్తించాడు. మనందరి తరపునా ఒక ప్రతినిధి, ఆయన మంత్రివర్గంలో ఉండటానికి, తన సమ్మతిని తెలియబరిచాడు. ఇదొక మన విజయమే! విడిగా ఉండి, ఏదో రకమైన ఆందోళన చేస్తుండటం కన్న, ప్రభుత్వంలో, బాధ్యతాయుతమైన పదవిలో ఉండటం ద్వారా మనకు మనం ఎన్ని పనులైనా సాధించుకోవచ్చు.. మహావిష్ణువు; నాకేమీ అభ్యంతరం లేకపోతే, మంత్రివర్గ సభ్యునిగా, నా పేరును ప్రకటిస్తానని గూడా తెలియబరిచాడు... అనవసరమైన రక్తపాతం జరిపి, అనిశ్చితమైన విజయాన్ని పొందజూడటం కన్న, దీనికంగీకరించడం ఉత్తమ పద్ధతిగా నేను అభిప్రాయపడుతున్నాను. ఇదివరకు లాగానే, ఈ విషయంలో గూడా, నా అభిప్రాయంతో మీరందరూ ఏకీభవించగలరనే ఆశిస్తున్నాను...''

నాయకుని మాటలకు ఎదురు చెప్పడం తెలియని వారందరూ ఈ నిర్ణయం అమోఘంగా ఉన్నదని ఏకగ్రీవంగా అంగీకరించారు.

* * *

శంకరుడు, 'లయశాఖ'కు ప్రధానాధికారిగా నియమింపబడ్డాడు. ఉండడానికి, అతనికీ చాలా అధికారాలున్నాయి గానీ, వాటిని ఉపయోగించడానికి వీలు లేదన్న నిబంధనలు గూడా ఉన్నాయి. పూర్వం అతని కుండిన వ్యక్తి స్వాతంత్ర్యం గూడా ఇప్పుడు లేకుండా పోయింది. విష్ణుమూర్తి, తన పానుపైన ఆదిశేషుని తాలూకు వారిని, అతనికి ఆభరణాలుగా నిర్దేశించాడు. తన బావమరిదియైన చంద్రుణ్ని అతని నెత్తిమీదకెక్కించాడు. పట్టుమని పదిబారలు పేరెం తియ్యలేని వృషభాన్ని, వాహనంగా ఉంచుకోమన్నాడు. అతని భార్యకు మాత్రం, సింహాన్ని వాహనం చేశాడు.

ఇన్ని కట్టుదిట్లకూ శివుడు లోబడ్డాడు. ఈ శాఖలో ఉండి తన వారినేదో ఉద్ధరిద్దామని అతని భ్రమ! చివరకు అది గూడా చేయలేకపోయినట్లు అనేక దృష్టాంతరాలున్నాయి. తనవారు గదా అని; హిరణ్య కశిప, హిరణ్యాక్షులకు వరాలిచ్చాడు. కానీ విష్ణుమూర్తి వారిని సంహరించిందాకా నిద్రపోలేదు. తనవారి వత్తిడి భరించలేక, వారికి ఏవో వరాలు ఇచ్చేశాడు. అవి విష్ణువు చేత పరిహరింప బడుతుండేవి.

ప్రభుత్వంలో, అతనికంటే అతని భార్యకు ఎక్కువ పలుకుబడి ఉన్నది. శంకరుడు చేయలేని పనుల నెన్నిటినో, ఆమె సులువుగా చేసి వేసింది. అతని దాంపత్య జీవితం గూడా అంత సౌఖ్యప్రదంగా లేదు. ఈ పదవిలోకొచ్చి అతనేమయినా సాధించి ఉంటే, అది తన చేతులతో తనవారిని నాశనం చేయడమే! జలంధరుడు, తారకాసురుడు, బలి... ఇలా ఎంతమందినని లెక్కించడం! ఈ ప్రలోభానికే శంకరుడు గురి కాకుండా ఉన్నట్లయితే, దేవరాజ్యం ఏనాడో అతని హస్తగతమయి ఉండేది. అయితే

ఈ ఊహ శంకరునికి వచ్చి ఉండదు. ఈ పదవిలో ఉండి తనవారిని ఏదో బావుకొనేట్టు చేదామని అతని సంకల్పం! కానీ జరిగింది దానికి విరుద్ధంగా పర్యవసించింది. ఆ మహా విప్లవాన్ని, ఈ కారనంతో విష్ణువు అణచి వేయడమే గాక, అందుకు ముఖ్య రాకులయిన వారిని, శంకరుని హస్తంలోనే తుదముట్టించాడు. అతను చేసిన ప్రతిపనీ, అభాసుగా తయారయ్యేట్లు అల్లిక లల్లాడు. అతన్ని కీలుబొమ్మను చేసి కూచోబెట్టాడు.

తన 'స్థితి ఇది' అనీ, తనెందుకూ కొరగాకుండా పోయినాననీ, శంకరుడు గ్రహించిన నాడు, అతనా పంజరం నుండి విముక్తుడవుతాడు.

కానీ ఈ వివేకం ఒకప్పుడు కలిగినట్లయితే, తనవారినీ, తననూ కొంతలో కొంతైనా బాగు చేసుకొన గలిగేవాడు. ఇప్పుడా అవకాశం గూడా లేదు. బాగు చేయడానికి పనికిరానంతగా వారు పాడైపొయ్యారు. ప్రస్తుతం శివుడు గుడ్డి కన్నులాంటివాడు. అది మూసినా తెరిచినా గూడా ఫలితం ఒక్కటే!

**1956** ప్రారంభం నుండి, 1959 ఏప్రిల్ నెల దాకా భరద్వాజ మద్రాసులో ఉన్నాడనీ, ముందుగా ధనికొండ హనుమంతరావుగారి మూడు పత్రికలలోనూ పనిచేశాడనీ, మనం చెప్పుకున్నాం. సున్నితమైన కారణాల వల్ల ధణికొండ వద్ద ఉద్యోగం మానుకొని ఒక కలాల కంపెనీలో పనికి కుదిరాడు. అతను మద్రాసులో ఉన్నది సుమారుగా మూడేళ్ళు.

1. "ఆ మూడు సంవత్సరాలలో చాలా మంది నటీనటులను, దర్శకులను, నిర్మాతలను, పంపిణీదారులను, సినిమా తారల పొందు కోసం అల్లల్లాడిపోయేవారిని, సినీ రచయితలను భరద్వాజ కలుసుకున్నాడు. వీరందరి అనుభవాలను అతను నోట్సుగా తీసుకొన్నాడు. మరి తను కూడా ఒకటి, రెండు సినిమాలకు కథ, మాటలు కూర్చినవాడే. అప్పుడు తను పడిన యమచెరలను అక్షరబద్ధం చేశాడు."

.......................................................................................................

1. చూడండి: "భరద్వాజ భారతం" గ్రంథానికి కొల్లూరి కోటేశ్వరరావు గారి సంపాదకీయం. ప్రచురణ 1983)

.......................................................................................................

ఈ సినిమా అనుభవాలను పొదువుకొన్న కథలను ఆ నాళ్ళలో అతను అనేకం రాశాడు. ఈ కథల మాటకేమిటి గానీ - భరద్వాజకు అనంతమైన కీర్తి ప్రతిష్ఠలను సంపాదించి పెట్టిన నవల 'పాకుడు రాళ్ళు.' చలన చిత్ర పరిశ్రమ ఆధారంగా చిన్న కథలు, పెద్ద కథలు అంతకు ముందూ ఆ తరువాత చలా వచ్చిన మాట నిజం. కాని ఒక నవలగా రావడం మాత్రం 'పాకుడు రాళ్ళు'తోనే ప్రారంభమైంది. తెలుగు భాషలో వెలువడిన మొదటి 'నేచురల్ లిస్ట్' నవలగా సాహిత్య విమర్శకులు దీనిని అనుకరిస్తూ, అనుసరిస్తూ ఎన్నో నవలలు పుట్టుకొచ్చాయి.

మల్లంపల్లి సోమశేఖర శర్మగారు లేకపోతే, ఒక వేళ ఉన్నా వారు 'పాలపుంత' కథను చదివి ఉండకపోతే, చదివిన తరువాత తన అభిప్రాయమును నిర్మొహమాటంగా చెప్పి ఉండకపోతే, పాకుడురాళ్ళు నవల వచ్చి ఉండేది కాదు. అతను ఎన్ని రాసినా; నవలా రచయితగా భరద్వాజ రెండే నవలల్లో - పాకుడురాళ్ళు, కాదంబరి నవలల్లో - జీవిస్తాడు. మిగతావి 'ఓహో' అనిపిస్తాయే తప్ప ది కాలాలపాటు బట్టకట్టి బతకవు. బతకలేవు.

ఆ రెండు నవలల్లోనూ పాకుడురాళ్ళు పెద్దది. మునుముందుగా రాసింది. ఈ నవలకు 'మూల'మనదగిన కథ పాలపుంత. దాదాపు 9 వందల పేజీలు విస్తరించిన పాకుడు రాళ్ళు నవల, ఈ పాలపుంత కథలో సూక్ష్మంగా, బీజ ప్రాయంగా గోచరమౌతుంది...

# పాలపుంత

**బద్ధకంగా** వొళ్ళు విరుచుకొని, ఒక్కసారి గట్టిగా ఆవలించి, చిటికవేసి, ఓ సిగరెట్టు ముట్టించి, మళ్ళీ ఆలోచనల్లో పడ్డాడు సారథి. మనస్సును మరో దానిమీదికి మళ్ళింతామని ఎంత ప్రయత్నించినా, కళ్ళెంలేని గుర్రంలాగా అది సారథి అదుపులో ఉండకుండా ఉన్నది. ఈ ఆలోచనలతో అతను చిరాకెత్తిపోతున్నాడు. తల చిటచిట లాడి పోతున్నది. ఒకటి రెండుసార్లు, పనిమనిషి వచ్చి 'ఏం కావాలి అయ్యగారూ?' అని అగిగింది. మనోరమ గూడా ఓసారి హడావుడిగా తొంగిచూసి, 'ఏం హబ్బీ! ఒంట్లో బావోలేదూ! పోనీ డాక్టర్ను కన్సల్టు చేసి చూడకపోయావా?' అంటూనే వెళ్ళిపోయింది.

ఆ పరామర్శ చూస్తే సారథికి ఎన్నో అనుమానాలు కలిగాయి. 'నిజంగా ఈ మనోరమ, తను కావాలనుకొన్న మనోరమేనా' అనిపించింది. ఏదో కళ్ళనీళ్ళు తుడవడానికి తప్పితే, ఇందులో ఆప్యాయతంటూ తగలడిందా? ఏ అనిపించింది. ' దిక్కుమాలిన మొహమాటప్పనులు చెయ్యమని ఏ దేవుడేడిచాడా' అనిపించింది. నాలుగైదు రోజుల క్రిందటయితే, తను మనోరమకు, ఏదో ఓ సమాధానం - ఆవిడకు నచ్చే సమాధానమే- ఇచ్చి ఉండేవాడు. కానీ, ఈ నాడలా అనిపించడం లేదు. ఆమెను రెచ్చగొట్టి, మనస్సును గాయపరచి, ఘోరంగా హింసించాలని బుద్ధి పుడుతోంది. ఏదో ఒక విధంగా మనోరమను, తన కాళ్ళమీద పడేట్టు చేసుకోవాలని అనిపిస్తోంది. కానీ తనలా చేయగలడా? అందుకు తను సమర్థుడేనా? ఈ ప్రశ్నలు సారథికి తట్టనేలేదు...

* * *

చాలా కాలం క్రిందటి సంగతి. అప్పుడు మంగాయమ్మ అనే ఓ పద్దెనిమిదేళ్ళ పిల్ల, ఓ సుమారైన బస్తీలో , ఓ ఇరుకు సందులో, అంతకన్నా ఇరుకైన ఓ ఇంట్లో ఉండేది. ఆ పిల్లకు తల్లీతండ్రీ ఉన్నారు. ఆ తండ్రి నాటకాల్లో, ఏవేవో పనులు చేసేవాడు. తల్లి గూడా ఈ తండ్రి దగ్గరకు రాకపూర్వం శరీరంమీద బతికింది. ఈ తండ్రి దగ్గర కొచ్చాక గూడా కొంతకాలం అలాగే జీవించింది.

అలా జీవించడం ఆ తండ్రికి ఇష్టమో కాదో తెలీదు. అతను మాత్రం, ఎప్పుడూ ఆ తల్లిని 'ఇదేమీ' అన్న పాపాన పోలేదు. ఆ తండ్రి ఇంట్లో లేనప్పుడు, అనేక మంది ఆ యింటికి వచ్చిపోతుండేవారు. ఆ వచ్చినవారి పనులేవో అయిందాకా, పాపం- ఆ తండ్రిగారి పనులు గూడా పూర్తయ్యేవి కావు.

మంగమ్మకు కాస్తంత వయస్సు వచ్చిందాకా, ఆ తల్లే నాటకాల్లో వేషలేస్తూ ఉండేది. మంగాయమ్మ తరువాత, వరసగా నలుగురు పిల్లలు పుట్టుకొచ్చారు. ఆ తల్లి వేషాలెయ్యడం మనేసింది. ఆమె లేని లోటును మంగమ్మ భర్తీ చేసింది.

ఒకసారి ఏదో ఊళ్ళో 'చింతామణి' నాటకం ఆడారు. ఆనాటకంలో 'రాధ' పాత్రను ఒక అద్భుతమైన పిల్ల నటించింది. ఆ పిల్లకు నటించడంలో అట్టే ప్రావీణ్యం లేదు. ఆమె నటనలో, నాజూకుతనం గానీ, శిల్పంగానీ లేదు. కానీ నటనపట్ల ఆమెకున్న ఆపేక్ష, ఆసక్తి అడుగడుగునా కనిపిస్తూ ఉంది. బొటాబొటీగా పదిహేనేళ్ళున్న ఆ పిల్ల 'స్టేజీఫియర్' లేకుండా డైలాగ్స్ డెలివరీ చేసింది. ఉన్న ఒకటి రెండు పద్యాల్నీ కమ్మగా అన్నది. ఓ చిన్న సైజు డాన్సుకూడా చేసింది. ఆమె నటనకు చాలా మంది దిమ్మ తిరిగిపోయారు. నలుగురైదుగురు వన్స్‌మోర్‌లు గూడా కొట్టారు.

వాళ్ళను చూసి సారధి ముందుగా అసహ్యపడ్డాడు. తరువాత జాలిపడ్డాడు. అసలే ఆ నాటకంలో రాధ కారెక్టర్ లొడితెడు. ఆ లొడితెడు దాన్నీ, ట్రూపువాళ్ళు మరింత కట్ చేశారు. అయినా ఆ పిల్ల బాగా నటించింది. అంతకన్నా ఆ పిల్ల అద్భుతంగా ఉన్నది. మహా మహా వాళ్ళకే వంకబెడుతున్న తనకు, ఆ పిల్ల నటన ఎందుకు నచ్చిందో సారధి చప్పున ఊహించలేకపోయాడు. నటనకన్న, దానిపట్ల ఆ పిల్లకున్న ఆసక్తే కారణం కావచ్చు. లేదా కళ్ళు తిరిగి పడిపోయే, దాని అందమూ కావచ్చు. ఎందుకైనా మంచిదని, సారధి- ఆ రెండవ కారణం తోనే తృప్తి పడ్డాడు. కొందరు. స్టేజీకేసి విరగదొక్కుకొన్నారు. ఇంకా కొంతమంది క్లాసుల కోసం అడ్డం కట్టిన అలవల్ని విరిచి పారేశారు. సారధి కూడా ఆ జనంతో పాటు లేచాడు. ఎందుకో 'ఒక్కసారి గ్రీన్‌రూంలో కెడదా'మనిపించింది. 'అట్లా వెళ్ళడం బాగుంటుందా' అనిపించింది. 'ఆఁ ఎందుకు బాగుందులెస్తూ' అనిపించింది. జనాన్ని తప్పించుకొని, స్టేజీ బొంగులన్నీ దాటుకొంటూ తెరవెనక్కు వచ్చాడు.

గ్రీన్‌రూమ్ నానాక చాటుగానూ ఉంది. కృష్ణుడు ఓ మూల జేరగిలబడి బీడీ దమ్ము కొడుతున్నాడు. చింతామణి 'దీరీసు' మార్చుకుంటూ ఉంది. బిలబిల లాడుతున్న గ్రీన్‌రూమంతా ఆశగా వెదికాడు సారధి. చేతులనిండా కొబ్బరినూనె పూసుకొని మొఖానికి పాముకొంటున్న ఓ పిల్ల కనిపించింది. తెల్లటి పరికిణీ కట్టుకొంది. పలచని జాకెట్టు వేసుకొంది. ఆ పిల్లకేసి ఓ నిమిషం పాటు చూశాడు సారధి. ఒక్కసారి నిట్టూర్చి, పెదాలు తడుపుకొన్నాడు. ఇంతలో మరో ముసలాడు- మరీ అంత ముసలాడు కాదు- ఓ క్షణం సారధికేసీ, ఆ పిల్లకేసి చూసి, ఎందుకో భుజాలు కుదుపుకొని, ఆ పిల్ల దగ్గరకెళ్ళాడు. అతనందించిన తువ్వాలుతో ఆ పిల్ల ముఖం తుడుచుకొంది. అనవసరంగా పమిట సరిజేసుకొంది. పరికిణీ దులుపుకొంది. సారధి పొంగిపోయాడు. ఆ రాత్రి అతనికి ఇంటికి వెళ్ళబుద్ధి పుట్టలేదు. వెళ్ళినా నిద్ర పట్టలేదు. పట్టినా ఆ పిల్ల మాటిమాటికీ కలలో రాసాగింది.

దానా దీనా తేలిందేమిటంటే, సారధికి ఎన్నడూ ఎవరిమీదా కలగని 'ఆపేక్ష' మంగాయమ్మ

మీద కలిగింది. ఆ ఆపేక్షను అతను మనస్సులోనే దాచుకొంటే ఏమి జరిగేదో తెలీదు. కానీ అతనాపని చెయ్యలేదు. వారం రోజులయ్యాక రెండు పచ్చనోట్లు జోబీలో వేసుకొని గుంటూరు వచ్చాడు. అట్టే శ్రమ లేకుండా అంకప్ప ఇంటికి చేరుకొన్నాడు. ఆ సమయాన అంకప్ప ఇంట్లో లేడు. మంగాయమ్మా లేదు. పత్తిపాడులో 'సతీ తులసి' నాటకం ఆడటానికి వెళ్ళారట. ఇప్పుడో ఇంకాసేపటికో రావాలిట...

ఈ వార్త సారధిని ఎంతగానో నిరుత్సాహ పరచింది. అతనేవేవో ఆలోచించుకుంటూ వచ్చాడు. తను వాకిట్లోకి రాగానే మంగాయమ్మ ఎదురవటం, తన్ను చూచి, ఓ నిమిషం ఆశ్చర్యపడి, ఆ తరువాత నవ్వుతూ ఆహ్వానించటం, తను కాదు కూడదంటూనే... ఏదీ? అనుకొన్న దొక్కటీ, జరిగి చావందే!

సారధి చిరాకు పడుతున్నాడని, లలితాంబ గ్రహించింది. "అప్పటికీ నేను వద్దో అని మొత్తుకొంటూనే ఉన్నాను బాబూ! దానికీ ఇష్టం లేదు. ఆ తండ్రిదాని ప్రాణం తీస్తున్నాడు. ఈడేరినబిడ్డ ఇంకా ఊళ్ళంట తిరిగితే.." అని ఓ క్షణం ఆగి, సారధి ఏమనుకొంటున్నాడో తెలుసుకొనేందుకు ప్రయత్నించి, అతను ఏమనుకొంటున్నదీ తెలీక చేతికింది కొచ్చిన కడగొట్టుదాన్ని, ఓ గసురుగసిరి, 'కాఫీ తెస్తానుండండి' అంటూ లోపలకు చక్కా పోయింది.

ఆవిడొచ్చేలోగా, అందినంత వరకూ, సారధి ఆ యింటిని చూచాడు. గోడలకు చాలా రకాల ఫొటోలు వేళ్ళాడుతున్నాయి. కొన్నింటిలో మొన్న తను చూసిన అంకప్ప బొమ్మలున్నాయి. అయిదారు ఫొటోల్లో, ఇప్పుడు తనతో మాట్లాడినావిడ ఉన్నది. మూడింటిలో మంగాయమ్మ ఉన్నది. మంగాయమ్మ బొమ్మకేసి తదేకంగా చూస్తున్న సారధికి, లలితాంబ కాఫీ తెచ్చిన సంగతి కూడా తెలియలేదు. ఆవిడ జ్ఞాపకం చేశాక, కాస్త సిగ్గుపడ్డాడు.

అనుకొన్న టైం దాటిన రెండు గంటలకు, వాకిటి ముందు జట్కా వచ్చి ఆగింది. ముందుగా అంకప్ప దిగాడు. చిన్న ట్రంకుతో మంగాయమ్మ ఆ తరువాత దిగింది. సారధి కుర్చీలోంచి లేచి నిలబడ్డాడు. అతన్ని ముందుగా చూసినవాడు అంకప్ప. "ఎంతసేపయింది బాబూ మీరొచ్చి?" అన్నాడు అంకప్ప, కూతురు చేతిలోంచి పెట్టెనందుకొని మెట్లెక్కుతూ, సారధి ఏదో గొనిగాడు. అప్పటి దాకా అదోలా ఉన్న మంగాయమ్మ, తండ్రి ఎవర్నో పలకరించడం విని, చప్పున తలెత్తి లోపలికి చూసింది. సారధి ఆశించినట్టు - ఓ క్షణం ఆశ్చర్యపోయింది. ఆ తరువాత నిండుగా నవ్వి, చప్పున లోపలికొచ్చింది. సారధి కాస్తంత దోవ తప్పుకొన్నాడు.

"నాటకం ఎట్లా జరిగింది?" అన్నది లలితాంబ.

"అమోఘం! అమోఘం!! ఒకటే వన్సుమోర్లు, ఒకటే వన్సుమోర్లు!!" అన్నాడు అంకప్ప.

"కలెక్షన్ బాగా వచ్చిందా?"

"ఆ. ఏడెనిమిదొందలు దాకా ఉంటది. ఐతేనేం, అనుకొన్న ప్రకారం, ఆ సుబ్బారాయుడు ముట్టజెప్పలా! డబ్బు ఇవ్వందే రంగేసుకోబోమని మనవాళ్ళన్నారు. నాటకం ఆడకపోతే విరగదంతామని జనమన్నారు" అన్నాడు అంకప్ప విసుగ్గా. "అబ్బా! పోనియ్యవే పాడుగొడవ! కాసిని నీళ్ళు దొడ్లో పెట్టు. ముందు స్నానం చేస్తా"

ఈలోగా మంగాయమ్మ, ముఖం సబ్బుతో కడుక్కొని, తుండుతో తుడుచుకొంటూ, సారధికి ఎదురుగ్గా ఉన్న కుర్చీలో కూలబడింది. ఆమె కళ్ళు ఎర్రగా ఉన్నయ్! పెదిమల రంగు, ఇంకా అక్కడక్కడ ఉన్నాననిపిస్తోంది. మనిషి చాలా బడలిగ్గా కన్పిస్తోంది కాస్సేపు సారధి మాట్లాడతాడేమోనని చూసింది. అతనలాంటిదేమీ చేయకపోవడంతో, తనే మాట్లాడింది. గత రాత్రి జరిగిన సంగతులన్నీ వైనవైనంగా చెప్పింది.

"ఆ ఈ దిక్కుమాలిన నాటకాలంటే నాకు బొత్తిగా గిట్టదు. మా నాన్నే నన్ను చంపుకు తింటాడు. రాత్రి చూడండి - నాటకం ఆడనూ ఆడాము, అభాసుపాలు కానూ అయ్యాము. రానూ, పోను ఖర్చులు దండగ, పైగా వొళ్ళు హైరానా మాత్రం మిగిలింది... మీరు వస్తున్నాననిముందుగా ఉత్తరమ్ముక్కన్నా రాసి పడెయ్యక పోయారా? మా అడ్రస్ మొన్న మీరు రాసుకొన్నారు గదూ?... చూశారూ మా ట్రూపులో ఉన్న వాళ్ళు మరీ సన్యాసి వధవలండీ! మొన్న మీ ఊళ్ళో కాస్సేపు నాతో మీరు మాట్టాడారాండీ, మా గుంపు అప్పుడే మనకు, ఏమిటేమిటో అంటగట్టేశారు. ఈ వెధవలకు ఇంతకన్నా మరో పనీ పాటా లేదు... ఇవ్వాళ ఉంటారుగా... సాయంత్రం ఏదన్నా మంచి పిక్చర్ కెడదామని... ఆకలిగా ఉంది. నిద్ర గూడా వస్తోంది... ఏమంటారు?...ఆఁ... వడ్డించవే అమ్మా వస్తున్నాను, ఏం మరి వెళ్ళిరానాండీ?"

మంగాయమ్మలో అన్నమాటను నిలబెట్టుకోవాలన్న పట్టుదల ఎంతయినా ఉన్నదని సారధికి తెలిసి వచ్చింది. ఏదో మర్యాద కోసం తనతో బాటు సినిమా కొస్తానన్నదేమోనని సారధి అనుకొన్నాడు. తనతో రావలసిన అవసరం మట్టుకు ఏమున్నదనీ, అనుకొన్నాడు. ఏమున్నదో సారధికి తోచలేను. మంగాయమ్మ మాత్రం అయిదున్నర దాటకుండానే మేకప్ చేసుకుని వచ్చింది.

"ఆట మొదలెట్టడానికి చాలా టైం ఉంది. ఇప్పుడప్పుడే దేనికీ? కాస్సేపు ఎక్కడన్నా కూచుందామా?" అన్నాడు సారధి.

మంగాయమ్మ మొదట ఫక్కున నవ్వింది. ఆ తరువాత 'అలాగే' అంది. ఆ నవ్వులో సారధికి చాలా చాలా సంగతులు కనిపించాయి.

తన మనస్సులో ఈ మధ్య బయలుదేరిన సంక్షోభానికి తగిన చిట్కా ఇప్పుడు తెలిసినట్లు సారధి ఫీలయ్యాడు. కానీ ఆ తెలిసిందాన్ని మంగాయమ్మ కెట్లా తెలియచెయ్యాలో మాత్రం అతనికి తెలియలేదు.

"నేనిట్లా వచ్చినందుకు, నీకేమీ ఆశ్చర్యం కలగలేదా?" అన్నాడు సారధి ఆ పిల్ల ముఖం కేసి చూస్తూ.

మంగాయమ్మ కాస్సేపు మెదలకుండా ఊరుకొని, తాపీగా ముఖం పైకెత్తి, అతనికేసి ఓ క్షణం చూసి, వస్తున్న నవ్వును ఆపుకుంటూ 'లేదు' అంది.

"అదేం? ఇందాక నువ్వట్లా అన్నట్లు లేదే! వస్తున్నట్టు ముందుగా జాబన్నా రాశావు గాదేం- అన్న ధోరణిలోమాట్లాడావు గదూ?" అన్నాడు సారధి.

"మీరింత అమాయకులని నేననుకోను. అదేమో ఇల్లు, ఇది పార్కు" అన్నది మంగాయమ్మ.

"స్థలాలను బట్టి మాట్లాడే మాటలు మారుతుంటాయని నాకు తెలియదే!"

"మరి దేన్ని బట్టి మారుతాయంటారు? అదే మా ఇల్లయితే, ఇప్పుడు నన్నడిగిన ప్రశ్న అడిగి ఉండేవారేనా? మీరు బూకరిస్తే నేను చెప్పలేను గాని ఏనాటికి అడిగి ఉండరు."

మంగాయమ్మ ఉత్త అందమయిందే కాదు; దానికి మించిన తెలివి తేటలు గూడా ఉన్నాయి. ఎంత బాగా మాట్లాడిందీ... ఇలా కొన్ని నిమిషాల పాటు, మంగాయమ్మ తెలివి తేటల్ని మెచ్చుకొన్నాక- సారధి తను వచ్చిన పనేమిటో చెప్పాడు.

"మీరనుకొన్నంత గ్లామర్ ఇందులో ఏమీ ఉండదండీ! బోలెడంత డబ్బు కావాలి. అంతకన్నా ముఖ్యం రిస్కును భరించాలి. అనుకొన్నవి అనుకొన్నట్లు జరిగి చావవు. నానా చెరలూ ఉంటాయి." అన్నది మంగాయమ్మ.

"అవన్నీ ఉండవని నాకు తెలీక పోలేదు. వాటన్నింటినీ రిసీవ్ చేసేందుకు సిద్ధపడే నేనీ ఫీల్డులోకి అడుగు పెడుతున్నాను. డబ్బు సంగతి నాతో అనకు. నేను లక్షాధికారిని కాకపోవచ్చు గానీ, ఈ పాటి పెట్టుబడి సులభంగా పెడతాను" అన్నాడు సారధి.

మంగాయమ్మ ఏదో ఆలోచిస్తూ ఊరుకొని, అంతలోనే ఫక్కున నవ్వుతూ, "మీరెందుకీ లైనులో కొస్తున్నట్టు? ఏం బావుకొందామని? నేనిట్లా అంటున్నందుకు మరోలా అనుకోకండి. మీరేదో భ్రమంలో ఉండి ఇందులోకొస్తే మాత్రం ఆ భ్రమలు వచ్చిపోవటానికి ఆట్టే కాలం పట్టదు. ఇవన్నీ మీరు ముందగా ఆలోచించుకోవాలి" అన్నది.

"నీ ధోరణి చూస్తుంటే నాకింకో అనుమానం గూడా వేస్తున్నది. చెప్పనా?" అన్నాడు సారధి. మంగాయమ్మ ఏ జవాబు ఇవ్వకముందే "నిజంగా నేనిలా సొంతకంపెనీ పెట్టడం నీకిష్టం లేదనుకుంటాను. అథవా ఉన్నా, నా కంపెనీలోకి రావడమంటే నీకు సమ్మతం లేకుండానన్నా ఉండాలి. కాకపోతే, నువ్విన్ని మాటలు అనవే!"

"అదేమిటండీ?" అన్నది మంగాయమ్మ ఈసారి ఆశ్చర్యపోయి.

"అమ్మాయ్ నాతోవసవసలు పనికిరావు. ఉన్న సంగతేదో కటీపిటీ తేల్చెయ్. నువ్వొచ్చినా రాకపోయినా నేనో సొంత కంపెనీ పెట్టడం ఖాయం! నేను రాసిన నాటకాలే నాలుగైదున్నాయి. ముందుగా వాటినేస్టేజీ చెయ్యాలి. అవి కాస్తంత సక్సెస్ అయితే బయటి వాళ్ళ చేత కొత్త తరహాగా నాటకాలు రాయించి ఆడతాం. నువ్వేదో ఆకాశం మీదినుంచి మాట్లాడకు. నువ్వు సరేనంటే రేపు ఎగ్రిమెంటు రాసుకొందాం. అన్ని ఖర్చులు భరించి నెలకు వందరూపాయల జీతం. కంపెనీ పర్మిషన్ లేందే బైటి ట్రూపుల్లో పని చెయ్యటానికి వీల్లేదు. ఖచ్చితంగా పాతిక ముప్ఫయ్ రిహార్సల్స్ ఉంటాయి. చచ్చినట్టు వాటన్నింటికీ హాజరు కావాలి" అన్నాడు సారధి.

"అబ్బ! మీతో వేగడం కష్టమండీ! ఇప్పుడు నేనేమన్నాననీ, అలా కోపగించుకోవడం?" అన్నది మంగాయమ్మ.

ఈ సుతిమెత్తని మాటలు సారథి మీద బొత్తిగా పనిచెయ్యలేదు. “ఆ సంగతి తరువాత చెబుతాను. ముందు నే నడిగిన దానికి సమాధానమివ్వు” అన్నాడు అతను.

“నా మట్టుకు నాకిష్టమేననుకోండి. మరి నాన్నా వాళ్లను కొనుక్కోవద్దూ?”

“అది నా వంతు పని!” అన్నాడు సారథి. “మరి వెళదాంలే. సినిమా బిగిన్ చేసే వేళయింది.”

“అః... దిక్కుమాలిన పిక్చర్ పోనిద్దురూ! కాస్సేపిక్కడే కూర్చుందాం. నాకిక్కడే బావుంది”అన్నది మంగాయమ్మ.

సారథి ఆ మాటతో ఏకీభవించాడు.

* * *

ఆ రోజున ‘పాడులోకం’ తాలూకు రిహార్సల్స్ జరుగుతూ ఉన్నాయి. హీరోహీరోయిన్లు మొదటిసారిగా కలుసుకొనే సన్నివేశమంది. ఆ చూపుల్లోనే వారు, ఎడతెరిపి లేకుండా ఒకరినొకరు ప్రేమించేసుకుంటారు. హృదయాలు మార్చుకొంటారు. కళ్ళతో ఫొటోలు తీసి వాటిని గుండెల్లో భద్రంగా పదిల పరచుకొంటారు. ఆ తరువాత వాళ్ళ ప్రేమను పెద్దవాళ్ళు అప్రూవ్ చెయ్యకపోవడమూ, ఇద్దరూ విడివిడితా ఎదురు తిరగడమూ, అక్కడా చిన్న వాడూ, ఇక్కడీ చిన్నదీ ఓ పావుగంట సేపు విరహ గీతాల్లాంటివి పాడడమూ, చివరికి చచ్చిపోవడమూ, అంతా మామూలుగా జరిగిపోతుంది.

నాటకం మొత్తంలో ఎనిమిది కారెక్టర్లున్నాయి. హీరో సారథి, హీరోయిన్ మంగాయమ్మ. హీరో ఆ కొసనుంచి వచ్చి, అక్కడున్న పూల చెట్టునుండి ఓ పూవు తుంపి, వాసన చూస్తుంటాడు. అప్పుడే హీరోయిన్ ప్రవేశిస్తుంది. అక్కణ్నించీ డైలాగ్స్. ఈ సీనును ఇప్పటికీ పదిసార్లు రిహార్సల్ చేశారు. రాను రాను సారథికి విసుగెత్తిపోతూ ఉంది. ఎన్నిసార్లు చెప్పినా మంగాయమ్మ అర్థం చేసుకోవడమే లేదు.

“నువ్వింత ఎద్దు మొద్దు స్వరూపానివనుకోలేదు. నీకన్నా ఏ చవట కుంకయినా బాగా చేస్తుంది. ఇదే ఆఖరుసారి. జాగ్రత్తగా విను. వాళ్ళిద్దరూ కొత్త వాళ్ళు. వయస్సులో ఉన్నవాళ్ళు. ఒంటరిగా ఓ పూదోటలో కలుసుకొన్నారు. అప్పుడా పిల్ల ఎలా ప్రవర్తిస్తుందంటావ్? వాణ్ని చూడంగానే ముందుగా భయపడుతుంది. ‘అయ్యో! ఒంటరిగా, ఇలా పరపురుషుడి దగ్గరకొచ్చానే’ అని గాభరా పడుతుంది. ఆ తరువాత క్రమంగా భయం తీరి, అతనికేసి చూస్తుంది. వాడూ అప్పుడే చూస్తాడు. తను చూస్తున్నట్టు ఆ యబ్బాయికి తెలిసిపోయిందే- అని సిగ్గు పడుతుంది. తల వంచుకొంటుంది. పోబోతుంది. కాని పోలేదు. ఎందుకో తెలుసా? అప్పటికే ఆ పిల్ల హృదయంలో ప్రణయ బీజం పడింది... ఇన్ని- ఇన్ని భావాలు నువ్విప్పుడు చూపించాలి.. అదేమిదేమని వస్తూనే డైలాగ్ లంకించుకొంటుంటివి. ఇక నేనేం చావను?” అన్నాడు సారథి చెమటలు కక్కుతూ.

రిహార్సల్ రూమంతా నిశ్శబ్దంగా ఉంది. ఎవ్వరూ మాట్లాడ్డంలేదు. సారథి వొక్కసారి మంగాయమ్మకేసి తిరిగి” ఊఁ, కానివ్వు. పద, నేనిక్కడే పూలు కోస్తున్నాను. నువ్వామూలనుంచి రావాలి. కమాన్. ఊఁ త్వరగా రా” అన్నాడు.

మంగాయమ్మ అక్కణ్నించి కదల్లేదు.

‘‘ఏం వినిపించడంలా? ఆ పక్కనించి రావేం?’’ అన్నాడు సారధి పెంకులెగిరిపోయేట్టు.

గాలివాన ముదిరే సూచనలు కనిపించాయి. నలుగురూ కలగజేసుకొని ఆ పూటకు రిహార్సల్ కాన్సిల్ చేయించారు. సారధి రుసరుసలాడుతూ తన గదికేసి వెళ్ళిపోయారు.

చాలా పొద్దుబొయ్యాక, ఏదో చప్పుడయితే లేచి వెళ్ళి తలుపు తీశాడు సారధి. వాకిట్లో మంగాయమ్మ నిలబడి వుంది. ఒక్కసారి ఆవిడ ముఖంలోకి చూసి లోపలకు తప్పుకున్నాడు. మంగాయమ్మ తలొంచుకొని లోపలికి వచ్చి తలుపు దగ్గరగా వేసి, వారనానుకొని నిలబడి పోయింది.

‘‘ఇలా వచ్చావేం?’’ అన్నాడు సారధి.

జవాబుగా మంగాయమ్మ వెక్కిళ్ళు వినిపించాయి. సారధి ఈ సంఘటనను నమ్మలేక పోయాడు. మంగాయమ్మ ఏడుస్తుందని, అతనెప్పుడూ అనుకోలేదు. ఆ ముఖం నవ్వటానికి తప్ప ఏడవటానికి బొత్తిగా అన్‌ఫిట్!

‘‘నేను ఉదయమే గుంటూరు పోతున్నాను. నన్ను పంపెయ్యండి’’ అన్నది మంగాయమ్మ.

‘‘అదేం?’’

‘‘ఏమీ లేదు. నేను పనికిరాను. మీరు చెప్పినట్లు చేయడం నాకు చేతకాదు. పనికి రాని సజ్జునుబెట్టుకొని మీరెంత కాలమని బాధపడతారు? మీరేవో పెద్ద ప్లె ఆలోచనలతో దీన్ని ప్రారంభించారు. ఆ ఆలోచనలు నావంటి వాళ్ళ వల్ల ఏనాడూ నెరవేరవు. నెలకు వందల చొప్పున పుచ్చుకొంటూ నేనెందుకూ ఇక్కడ ఉండడం?’’

‘‘ఇందాక నేనట్లా అన్నందుకేనా నువ్విలా అలగడం?’’ అన్నాడు సారధి ఫక్కున నవ్వి.

‘‘అలగడమా? అలగడానికి నేనెవత్తెను? వంద రూపాయల కోసం వేషం వెయ్యడాని కొచ్చిన ముష్టి ముండను.’’

‘‘అట్లాగని నేనెప్పుడూ అనలేదే!’’

‘‘మీరు అన్నా అనకపోయినా, నా స్థితి అదేనని నాకు తెలుసు.’’

‘‘చాలా సేపాయిరి- నిలబడే వున్నావు. నా మీద కోపముంటే ఉండొచ్చు, ఈ కుర్చీ ఏం పాపం చేసుకొంది? పోనీ ఇలా వచ్చి కూచో గూడదూ?’’

‘‘నేనింకా పెట్టెలు అవీ సర్దుకోవాలి. వెడతాను. చెబుదామని వచ్చాను’’అన్నది మంగాయమ్మ వెనక్కు తిరుగుతూ.

సారధి చప్పున దగ్గరగా వచ్చాడు.

‘‘పిచ్చి వేషాలెయ్యకు. దవడలు పేలిపోతాయి. మర్యాదగా ఇలా వచ్చి కూచో. లేదా నేనే కూచోబెట్టవలసి వస్తుంది.’’ అన్నాడు సారధి నవ్వుతూనే. ‘‘ఇంత మంచి ముఖంలో బ్రహ్మాండమైన భావాలు పలికించవచ్చు గదా! ఆ అవకాశం నువ్వెందుకు ఉపయోగించుకోవా? అని-’’

మంగాయమ్మ ఏమీ మాట్లాడలేదు.

"నువ్విలా రావడం చూస్తుంటే, మన రెండో నాటకం లోని సీనొకటి జ్ఞాపకమొస్తోంది. అందులో గూడా, హీరోయిన్, ఓ అర్ధరాత్రి, హీరో గదిలో కొస్తుంది. అతని చేత కాస్సేపు బ్రతిమిలాడించుకొని, చివరికి..."

మంగాయమ్మ ఫక్కున నవ్వి, చప్పున తన పొరబాటును తెలుసుకొని నాలుక్కరుచుకొంది.

"అలాంటివేమీ కుదరవండీ! ఆ హీరోయిన్ పిచ్చిది గనక-"

"ఈ రోజు చాలా బావున్నావ్ కదూ? నామీద కోపంతో- ఇదే నిజమయితే, ప్రతిసారీ, నామీద నీకు కోపం ఉండాలనే నేను కోరుతాను."

సారథి శరీరం అతని స్వాధీనం తప్పిపోయింది. వెర్రెత్తిన వాడిలా ఆమెను దగ్గరకు తీసుకొని, గట్టిగా ముద్దు పెట్టుకొన్నాడు. మంగాయమ్మ లాంఛనంగా రవంతసేపు గునిసి, తరువాత అతని గుండెల మీద తల పెట్టుకొని కళ్ళుమూసుకొంది.

* * *

ఆ రోజుల్లో ఆ నాటకాలకు మాంఛి గిరాకీ ఉండేది. పాత నాటకాలు చూసీ చూసీ విసుగెత్తి పోయిన ప్రజలకు, సారథీ సమాజం వారి నాటకాలు ఎంతో హాయి నిచ్చాయి. ఇందులో పాటలూ పద్యాలూ లేవనీ పుణ్యమూ పురుషార్థమూ లేదనీ, అనే వాళ్ళు అంటూనే ఉన్నారు. కానీ బ్రహ్మాండంగా సక్సెస్ అవుతున్నాయి. వరసాగ్గా రెండు సంవత్సరాలు కళాపరిషత్తు పోటీల్లో సారథీ సమాజం బహుమతులు తెచ్చుకొంది. ఆ రెండు సంవత్సరాలూ, మనోరమ- అదే మంగాయమ్మ- ఉత్తమ నటనలకు గాను ప్రత్యేక బహుమతుల్ని అందుకొంది.

ఒకసారి ఎవరో పెద్ద మనిషి పనిమాలా ఇంటికొచ్చి, సారథితో గంటల తరబడి మాట్లాడుతూ కూచున్నాడు. ఆ మాటలకు అంతూపొంతూ కనిఎంచటం లేదు. అన్నాల వేళగూడా మించిపోతోంది. విసుగెత్తి సారథిని కేకేసింది మనోరమ.

"వస్తున్నాను, ఏదీ నువ్వోసారి ఇలారా!" అన్నాడు సారథి..

"వీరిది మద్రాసట. నలుగురు భాగస్తులతో కలిసి ఏదో పిక్చర్ తియ్యబోతున్నారట. అందులో హీరోయిన్‌గా నిన్ను బుక్ చేద్దామని వచ్చారు."

మనోరమ శరీరం ఒక్కసారి వణికిపోయింది. భరించరాని ఏదో శక్తి ఆవేశించినట్లుగా ఊగిసలాడింది.

"ఈ రోజుల్లో పిక్చరు తియ్యాలంటే, అయిదారు లక్షలన్నా ఉండాలి. కానీ లక్షతోనే ప్రారంభిస్తున్నాం! డిస్ట్రిబ్యూటర్ల మీద ఏ మాత్రమో ఆశ వుంది. అదీగాక నేను వేలకు వేలు స్టార్లకోసం పొయ్యబోవడం లేదు. అందరూ కాకపోయినా కొంతమందినయినా కొత్తవాళ్ళను తీసుకొంటున్నాను. మిగతా భాగస్తులకు ఈ ఇండస్ట్రీలో పరిచయం లేదు. నేను ఎనిమిదేళ్ళుగా ఈ లైనులో కొట్టుకొంటున్నాను. పదిహేను పిక్చర్లకు అసోసియేట్‌గా పనిచేశాను. ఇంతకాలానికి సొంతంగా బొమ్మ

తీద్దామని బుద్ధిపుట్టింది. నాగేశ్వరరావు, రేలంగి, ఫ్రీగా యాక్షన్ చేస్తామన్నారు. నా పిక్చర్‌కు నాగేశ్వరరావు హీరో. ఒప్పుకుంటే మనోరమ హీరోయిన్. నేనాట్టే ఇచ్చుకోలేను. నెలకు అయదు వందలిస్తాను. పిక్చరు పనిమీద రావలసిన వచ్చినప్పుడు కారిస్తాను. ఇష్టమయితే ఇదిగో ఎగ్రిమెంటు. సంతకం పెట్టి ఎడ్వాన్సు పుచ్చుకోండి!'' అన్నాడాయన.

ఆ రాత్రి మనోరమా, సారథీ చాలాసేపు మాట్లాడుకొన్నారు.

''నువ్వేమో ఏ సంగతీ చెప్పకపోతివి. అవతలేమో ఆ పెద్ద మనిషి మాటి మాటికీ అడుగుతుండె. అందుకని సరేనన్నాను. రేపుదయమే మళ్ళా వస్తాడు. అవునో కాదో చెప్పు. ఇప్పటికయినా మునిగిపోయిందేమీ లేదు. కాకపోతే 'మా వల్లకాదు బాబూ!' అంటాను. ఇన్నిటికీ నీ ఉద్దేశమేమిటి?'' అన్నాడు సారథి.

''మీరేమనుకొంటున్నారో చెప్పండి!'' అన్నది మనోరమ.

''నన్నడిగితే ఒప్పుకోవడమే మంచిదంటాను. జీతం కూడా తక్కువ మొత్తమేమీ కాదు. భగవంతుడి దయవల్ల, ఈ పిక్చర్ సక్సెస్ అయితే నీకింకా మంచి ఆఫర్సు రావచ్చు. మనమైనా ఎంతకాలం ఈ నాటకాలాడుతూ కూచోగలం?'' అన్నాడు సారథి.

''మీకేమీ అభ్యంతరం లేకపోతే నాకూ లేదు'' అన్నది మనోరమ.

''ఇలాంటి విషయాలు మాటిమాటికీ నన్నడక్కండి. మీకు మంచిదని తోచిన ప్రతిదీ నాకూ మంచిదే!''

* * *

మద్రాసు వచ్చిన పది రోజులకల్లా, రెండు కాగితాల మీద పద్దెనిమిది పంక్తులు వ్రాసి, మూర్తిగారు పట్టుకొచ్చారు.

''ఎల్లుండి రాత్రి తొమ్మిదింటి నుంచి పదకొండింటి దాకా రిహార్సల్ ఉంటుంది. అప్పటిగ్గానీ నాగేశ్వర్రావుకు తీరదు. కారు పంపిస్తాను. ఇద్దరూ రండి'' అన్నాడు మూర్తి.

ఆ కాయితం మనోరమ చూసింది. ఉత్త డైలాగ్స్. వాటికి తలా తోకా లేదు. నాలుగయిదుచోట్ల 'కోపంగా చూస్తుంది' - 'వేలితో బెదిరిస్తుంది'- 'సిగ్గుపడి తలవంచుకుంటుంది' అని మాత్రమే ఉంది. అసలా కథేమిటో, ఆ కథలో ఈ సీను ఎక్కడొస్తుందో బొత్తిగా అంతుపట్టలేదు. వాటిని ఏం చెయ్యాలో గూడా తెలియలేదు.

''పోర్షను గావును. సినిమా పోర్షన్లు ఇలాగే ఉంటాయేమో నాకు తెలీదు. అయినా కొంప మునిగిందేమీ లేదు. కంఠతాపట్టు'' అన్నాడు సారథి.

తొలిసారిగా మేకప్ చేయించుకుంటున్నప్పుడూ, కెమెరా ముందు నిలబడ్డప్పుడూ మనోరమ వణికిపోయింది. కళ్ళు చిరతలుపడే ఆ లైట్ల ముందు నిలబడటమూ, అన్నమాటే యాభయిసార్లు అనటమూ ఆమెకు విసుగెత్తించాయి. ఎంత ప్రయత్నించినా ఆ పూట వందడుగులు కూడా షూట్ కాలేదు. సారథి చాలా బాధపడ్డాడు. మనోరమ అలసిపోయింది. ఎటుగూడీ ఉత్సాహంగా ఉన్నవాడల్లా

మూర్తిగారే!

అయితే ఈ గిజాటు ఎక్కువకాలం ఉండలేదు. మూర్తిగారు చాలా ఓపిగ్గా మేఇ చేయవలసిందీ మనోరమకు చెప్పేవాడు. ఆవిడ గూడా విసుగు లేకుండా వాటన్నింటినీ వినేది. వెధవది. ఓ చిన్న నవ్వును సెల్యూలాయిడ్ మీది కెక్కించడానికి, ఒక్కోసారి యాభయి, అరవైసార్లు నవ్వాల్సి వచ్చేద.తీఇ ఇంత యాతనగా నవ్విన ఆ నవ్వు ఎంత సోయగంగా ఉండేడుస్తుంది గనక!

ఆరు నెల్లు గడిచాయి. రెండు రీళ్ళవరకూ షూట్ చేశారు. రెషెస్ చూసినవారు మనోరమ అద్భుతంగా నటించిందన్నారు. ఒకటి రెండు పత్రికలు ఈ మాటను రాశాయి గూడాను. అదృష్టవంతుణ్ణి చెడగొట్టేవారూ దురదృష్టవంతుణ్ని బాగు చేసేవారూ లేరు. మనోరమ జీవితంలోకి చూసినప్పుడు, ఆవిడ అదృష్టజాతకురాలే అనాలి. కానీ ఆ అదృష్టవం కూడా ఎల్ల కాలం ఒక్కచోటనే పీఠం పెట్టుకోదు. అప్పుడప్పుడు విడిచిపోవడం కద్దు. ప్రస్తుతం మనోరమ ఈ దశలోనే ఉంది.

మూర్తిగారు ఎంత ప్రయత్నించినా ఆయననుకున్నట్టు కంపెనీ సాగలేదు. మిగతా ముగ్గురు భాగస్తుల చుట్టూ సజ్జు పోగయింది. మనస్పర్థలు వచ్చాయి. కంపెనీ కాస్తా మూలపడిపోయింది. ఉన్న డబ్బుతో రెండు మూడు నెలలు అలాగే గడిచాయి.

"ఇప్పుడేం చేద్దాం?" అన్నది మనోరమ. "ఏదో బావుకొందామని ఇంత దూరం వచ్చాం. అదిట్లా తగలడింది. మళ్ళీ మనం బెజడవాడ పోదాం. మన నాటకాలు మనకుండనే ఉన్నాయి."

"నువ్వు చెప్పేది చివరి దశ. మనమింకా అక్కడికి రాలేదు. నీమీద నాకు ఆశ వుంది. ఇవ్వాళగాక పోయినా; రేపయినా నువ్వు పైకొస్తావు. నీకు గొప్ప ప్యూరున్నది. బెజవాడలో ఉండి చేసేదేమిటో ఇక్కడ ఉండి చెయ్యొచ్చు." అన్నాడు సారథి

ఆ తెల్లవారే అతను నోరమను వెంట బెట్టుకొని పది పదిమేను ఫిలిం కంపెనీల చుట్టూ తిరిగాడు. అందరూ 'చూస్తా' మన్నారు.దీని వల్ల కలిసొచ్చిందేఈ లేదు. అయిదారుగురు పత్రికల వాళ్ళకు మనోరమ గురించి చెప్పి కాస్త పబ్లిసిటీ ఇవ్వమని అడిగాఉ సారథి. ఒకాయన పేజీకి యాభయ్ రూపాయల చార్జీ అవుతుందన్నాడు. ఇంకొకాయన తప్పకుండా చూస్తానన్నాడు. ఒక పత్రికాయన మట్టుకు 'ట్రై కలర్ టైటిల్ మీరు అచ్చేసివ్వండి. నా పత్రిక్కు వేస్తాను. అంత కన్నా నేనేమీ చెయ్యలేను. బ్లాకులు ప్రింటింగు, అంతా కలసి అయిదారొందల లోపు" అన్నాడు.

సారథీ నిర్జీవుడయ్యాడు.

ఈ ప్రతిష్టంభనను విడల గొట్టిన వాడు మూర్తి. ఆయనొకనాటి ఉదయమే వచ్చాడు.

"ఇలా జరుగుతుందని నేనెప్పుడూ అనుకోలేదు. ఎంతో ఫ్యూచర్ని దృష్టిలో పెట్టుకొని మిమ్మల్ని రప్పించాను. కాలం, ఖర్మం కలసి రాలేదు. జరిగిందేదో జరిగింద.తీఇ మీకు నా చేతనైన సాయమంతా చేస్తాను. మీరు తిరిగి బెజవాడ వెడదామనుకొంటున్నారటగా! ఇప్పుడు నాలుగైదు తెలుగు పిక్చర్లు కొత్తగా ప్రారంభించారు. వాళ్ళకు నేను మనోరమను పరిచయం చేస్తాను. అందరూ కాకపోయినా ఓ ఒక్కరన్నా అవకాశమివ్వొచ్చు. నాకా నమ్మకముంది. మరి వస్తారా?" అన్నాడు.

సారథి- మనోరమ కేసి చూశాడు.

"నా ప్రాణం విసిగిపోయిందండీ" అన్నది మనోరమ.

"ఈ వొక్కసారీ నా మాట వినండి" అన్నాడు మూర్తి.

"సరే వెళ్ళిరా!" అన్నాడు సారథి.

"మీరు రారూ?"

"ఎందుకూ? నేను రాను. మీరిద్దరూ వెళ్ళిరండి" అన్నాడు సారథి చిరాగ్గా.

మధ్యాహ్నానికల్లా మనోరమ టాక్సీలోంచి నవ్వుతూ దిగింది.

"ఏమయింది?" అన్నాడు సారథి ఆత్రుతగా!

"నిశా ఫిలింస్ వారి పిక్చరులో ఛాన్స్ దొరికింది. ఆట్టే పెద్ద వేషం కాదు. పిక్చరు మొత్తంలో పది పదిహేనుసార్లు కనిపిస్తుంది. ఆ కారెక్టర్‌కు రెండు డాన్సులున్నాయి. అయిదు వేలిస్తామన్నారు. మూర్తిగారు వెయ్యి రూపాయలు అడ్వాన్సు ఇప్పించారు." అన్నది మనోరమ, నోట్ల కట్టను సారథి చేతికిస్తూ.

"నీ దగ్గరే ఉంచు. అవునుగానీ, మూర్తిగారేరీ?"

"నన్ను టాక్సీ ఎక్కించి పంపించారు. వీలుంటే రెండు మూడు రోజుల్లో కనిపిస్తామన్నారు."

నిశా ఫిలింస్ వారి సాంఘిక చిత్రంలో రెండు సార్లు క్లబ్ సీను వస్తుంది. ఆ సీనులో మనోరమ డాన్సు చెయ్యాలి. మనోరమ బొత్తిగా నాట్యం ముఖం ఎరగనిదేం కాదు. చిన్నతనంలో కొంత కాలం పాటు నేర్చుకొంది. ఆ నేర్చుకొన్నదేదో అడపా, దడపా ఉపయోగపడుతూనే ఉంది. ఇదీ అలాగేననుకొంది మనోరమ. తీరా చూస్తే దానికీ, దీనికీ పోలికలే లేవు. ఒళ్ళంతా కనిపించే గరగరల పావడా తొడిగారు. హైహీల్ బూట్ వేశారు. జుట్టంతా మొగాడి జుట్టుకు మల్లే, కురచగా వొంకు లొంకులుగా విరిచి కట్టారు. అన్నిటి కన్నా ఘోరం పమిట తీసేశారు. రొమ్ములు ఎత్తుగా ఉండేట్టు బ్రేసియర్స్ పెట్టారు. కాలు ఛమ్మున పైకెత్తమన్నారు. రొమ్ములు కదిలించమన్నారు.

ఈ పనులన్నీ చేయడం మనోరమకు ఎంత మాత్రం ఇష్టం లేదు. పిక్చర్ విడుదలయ్యాక ఈ దిక్కుమాలిన డాన్సు ఎన్ని వేలమందో చూస్తారు. ఈలలు వేస్తారు. కేకలేస్తారు. చప్పట్లు కొడతారు. ఓ నిమిషం పాటు ఆ ఘోష యావత్తూ మనోరమ చెవుల్లో మారుమోగింది. మనస్సంతా ఏదో జబ్బు పడినట్లయింది. ఒకసారి- ఈ కాంట్రాక్టును రద్దు చేసుకుందామని గూడా అనుకొంది.

"అలా ఉన్నావేం?" అన్నాడు సారథి ముఖం అదోలా పెట్టుకొన్న మనోరమను చూసీ చూడంగానే.

"నేనిక షూటింగులకెళ్ళను. ఈ సినిమా లైను నాకు బొత్తిగా గిట్టదు" అన్నది మనోరమ.

"ఎందుకని?"

"ఏమన్నా కానివ్వండి. ఈ దిక్కుమాలిన అడవా చాకిరి నేను చెయ్యలేను. డబ్బొస్తుంది

కదా అని విషం తాగుతామా ఏమిటి?'''

''సినిమాల్లో యాక్ట్ చెయ్యడమంటే విషం తాగడమని నాకింకా తెలియదే!'' అని ఆశ్చర్యం నటించాడు సారథి.

''అదే నయం! ఒక్కసారితో ప్రాణాలు పోతాయి. ఇది అంత కన్నా ఘోరం! బైట ఉండి చూసినప్పుడున్న గ్లామర్, ఇందులోకొస్తే ఉండదు. ఎంత విసుగు? ఎంత వేస్టు?'' అన్నది మనోరమ ముఖం చిట్లించి.

అవిడన్న మాటల్లో అబద్ధమేమీ లేదు. ముష్టి పదిహేను నిమిషాల డాన్సును షూట్ చెయ్యడానికి పది రోజులు పట్టింది. పట్టుమని పది అడుగులు వెయ్యంగానే డైరెక్టర్ 'కట్' అనేవాడు. డాన్సు డైరెక్టర్ మళ్ళీ వచ్చి, ఎట్లా చెయ్యాలో చెప్పేవాడు. కెమేరా వెనక్కెళ్ళి, టేక్‌కు తిరిగి రెడీగా ఉండేది- లైట్లు ఆరిపోయి మళ్ళీ భగ్గుమంటూ వెలిగేయి. రికార్డు మ్యూజిక్ వింటూ మనోరమ కళ్ళు వయ్యారంగా తిప్పుడూ, పగలబడి నవ్వుతూ, నాలుగడుగులు వేసేది. 'ఒకే' అన్న కేక- నాలుగు నిమిషాలన్నీ గడవకముందే మళ్ళీ 'కట్' ఇదీ వరస.

ఆ రోజంతా ఇలాగే జరగడంతో మనోరమ ఒళ్ళంతా విరగ్గొట్టినట్టుగా ఉండి, కుర్చీలో చేరగిలబడిపోయింది. ఎవరో కాఫీ తెచ్చి బల్లమీద పెట్టారు. ఇంకెవరో 'సోడా కావాలా?' అన్నారు.

ఆ పూట షూటింగ్ అయిపోయింది. అందరూ ఇళ్ళకు బయలుదేరుతున్నారు. మేకప్ తీసేసి మనోరమ గూడా బయలుదేరబోయింది. ఒక పైజమా వాడొచ్చి 'అయ్యగారు రమ్మంటున్నారు' అన్నాడు. ఇంటికి ప్రయాణమయిందల్లా వాడి వెంట, ఆ అయ్యగారి దగ్గరకొచ్చింది మనోరమ. లోపల గదిలో ప్రొడ్యూసర్ కూచుని ఉన్నాడు. మనోరమను చూడంగానే కళ్ళొక్కసారి ఎగరేశాడు. ఆఫీసులో ఇంకెవ్వరూ లేరు. తన నెందుకు పిలిపించిందీ తెలుసుకోవడానికి మనోరమ ఓ నిమిషం పాటు అక్కడే నిలబడింది.

''డాన్సు చాలా బాగా చేశావా?'' అన్నాడాయన. మనోరమను మునిగిపోయేలా చూస్తూ. ''నేచూళ్ళ డైరెక్టరుచెప్పాడు. డైరెక్టరుగారికి నువ్వంటే శానా ఇష్టానికిమల్లే వుంది... నిన్ను చూస్తే డాన్సు మాష్టరుకు కిట్టదేం? అదేం లాభం లేదు. అందరితోటీ మంచిగా ఉండాలి. అందరు చెప్పినట్టా వినాలి... ఆఁ వాడెంత, వాడి బిసాదెంత? నువ్వు సరేనంటే రేపీపాటికి వాణ్ణి లాగెయ్యనూ! పొద్దు పోయింది.. ఇంటికేం పోతావ్? ఏదన్నా హొటలుకు పోదాంపద! నిన్ను నెక్స్టు పిక్చర్‌లో హీరోయిన్ను చేస్తా!''

మనోరమకు ఈ సరికే అంతా అర్థమైపోయింది. ఆవిడ పర పురుషుణ్ణి ఎరగనిది కాదు. కాని ఎప్పటిమాట! సారథి రాకముందు సంగతి. ఇది సారథికి తెలిస్తే ఏమనుకొంటాడు? మనోరమ భయంతో కంపించి పోయింది. ఆమె ఏ సంగతీ చెప్పకముందే అతను దగ్గరగా వచ్చి కౌగిలించుకొని గట్టిగా ముద్దు పెట్టుకొన్నాడు. మనోరమ అసహ్యంతో ముఖం పక్కకు తిప్పుకుంది. అతగాడు ఇవేమీ గమనించలేదు...

''రాత్రి నీకోసం చాలా సేపు చూశాను. రాలేదేం?'' అన్నాడు సారథి, ఉదయమే జోగుతూ

వస్తున్న మనోరమను చూసి.

''రాలేదు'' అన్నది మనోరమ.

''అదే - ఎందుకనే అడుగుతున్నాను?''

''పనుండి ఉండిపోయాను''

''అలాగేం?'' అన్నాడు సారథి మనోరమకేసి అదోలా చూస్తూ.

మనోరమ ఇంకోమాట మాట్లాడకుండా లోపలికెళ్ళింది.

నిశా ఫిలింస్ వారి చిత్రం బాగా డబ్బు చేసుకోలేకపోయింది. రెండో వారం తిరక్కుండానే డబ్బాలు తిరిగొచ్చాయి. దీనితో ఆ చిత్రంలో పనిచేసిన అందరి రాతలూ బైటపడ్డాయి. నెక్స్ట్ పిక్చర్‌లో మనోరమను హీరోయిన్ను చేస్తానన్న ప్రొడ్యూసరు మట్టిగొట్టుకు పోయాడు. వ్రతం చెడ్డా ఫలితం దక్కాలన్నది జరగనేలేదు. ఈ నెక్స్ట్ పిక్చరు మీద బ్రహ్మాండమైన ఆశలు పెట్టకుంది మనోరమ. ఆ ఆశలన్నీ చివరకు నీళ్ళుగారిపొయ్యాయి.

ఒకసారి సారథి ఇంట్లో లేనప్పుడు, ఓ గళ్ళ లుంగీ వాడు వచ్చాడు. వాణ్ని ఇదివరకెక్కడో చూసినట్టు మనోరమకు గుర్తు కొచ్చింది. కానీ ఎక్కడ చూసిందీ జ్ఞాపకం రాలేదు.

''మీరిట్లా ఎంతకాలం ఉంటారు? మీలో బ్రహ్మాండమైన టాలెంట్సున్నాయి. అవన్నీ ఇలా నాశనం కావడం నాకిష్టం లేదు. సోమసుందరం గారు కొత్తగా తీస్తున్న అయిదారు పిక్చర్లకు డిస్ట్రిబ్యూటరు. ఆయన తలచుకొంటే మీ కెలాంటి సాయమైనా చేస్తారు. అదీ గాక మీరంటే ఏ మాత్రమో అభిమానం గూడా ఉంది. పోనీ, ఓసారి వెళ్ళి మాట్లాడి చూడండి! ఆయన మాటంటే ఈ ప్రొడ్యూసర్లకు వేద వాక్కు'' అన్నాడు వాడు.

అదేమిటో చూడాలని అనుకొంది మనోరమ. వాడన్న వాటిల్లో ఒక్క మాట గూడా అబద్ధం లేదు. సోమసుందరం గారు నిజంగా చాలా మంచివారు. మనోరమను చూస్తూనే, ఆయన తన హర్షాన్ని ప్రకటించిన వారయినారు.

''ఈ ఆఫీసు పనిలో సతమతమైపోతున్నాను. ఒక్క క్షణం రెస్టు దొరకదు... అన్నట్టు నువ్వు బెంగుళూరు ఎప్పుడన్నా చూశావా? పోనీ మహా బలిపురం వెడదామనుకొంటున్నాను. తోడెవ్వరూ లేక ఆగిపోయాను. హాయిగా ఓ టూర్ కొట్టొద్దాం... పాపం ఈ మధ్య నీకు బొత్తిగా పిక్చర్లు లేవుగదూ...?' అన్నారు సోమసుందరంగారు.

మహాబలిపురం వెళ్ళబోయే ముందు, సారథితో మాట మాత్రమన్నా చెబుదామనుకొంది మనోరమ. అయితే ఆ మాత్రం అవకాశం దొరకనే లేదు. తెల్లవారే వద్దామనుకొన్న ప్రయాణం కాస్తా మరొక రోజు డేకింది...అయితేనేం? రెండు పిక్చర్లలో హీరోయిన్‌గా బుక్కయి పెద్ద మొత్తం ఎడ్వాన్సుగా పుచ్చుకొని మనోరమ ఇంటికొచ్చింది.

సారథి ఏమంటాడోనని మనోరమ గుండెలు పింజం పింజం అన్నాయి. సారథి ఏమీ అనలేదు. ఆమెతో మాట్లాడను గూడా మాట్లాడలేదు. ఏదో ఒకటి అని ఈ గుంభనను బద్దలు గొట్టినట్లయితే,

మనో రమ ఇంతగా బాధ పడకపోను. అతను నిమ్మకు నీరెత్తినట్టుగా ఉన్నాడు. వంటమనిషి అన్నం వడ్డిస్తోంది. అతను నిశ్శబ్దంగా తిని తన గదిలో పడుకొంటున్నాడు.

''నా మీద కోపం వచ్చిందా?''అన్నది మనోరమ ఒకనాడు సారథిని నిలవేసి.

''ఎందుకూ?''

''అయితే మాట్లాడవేం?''

''కోపం వస్తే మాట్లాడరా ఏమిటి? అయినా నా కోపం నిన్నేమీ బాధించలదే! మాట్లాడవలసిన అవసరం వచ్చినప్పుడు తప్పకుండా మాట్లాడతాను. అలా బిగదీసుకుపోయే తత్వం నాది కాదు''అన్నాడు సారథి.

''పోనీ నాదేననుకోండి. సోమసుందరం గారు డిరస్ట్రిబ్యూట్ చేసే రెండు పిక్చర్సులో నన్నుహీరోయిన్‌గా బుక్ చేశారు. ఏడ్వాన్సు గూడా యిచ్చారు. మరి మీ ఉద్దేశమేమిటి?''

ఈ మాట వింటూనే సారథి ఫక్కున నవ్వాడు.

''ఆ పెద్ద మనిషి నిన్ను బుక్ చేశాడు. ఎడ్వాన్సు గూడా ఇచ్చాడు. నువ్వూ వొప్పుకొన్నావు. అంతా అయిపోయింది. ఇప్పుడు నా అభిప్రాయం అడిగి మాత్రం ఏం లాభం? ఒక వేళ నేను కాదంటే మట్టుకు ఇప్పుడు నువ్వు చేయగలిగిందేమిటి? ఆ పిక్చర్‌లో యాక్ట్ చెయ్యకుండా ఎటుగూడీ మానుకోవు. అయినప్పుడు, మధ్యలో నా ఉద్దేశంతో ప్రయోజన మేముంటుందా అని?'' అన్నాడు సారథి.

''మీరైనా అలా ఎందుకంటారు?''అన్నది నోరమ, ఏ మాత్రమో మనసు గాయపడి. ''నేను పది పిక్చర్లలో బుక్కయి పైకి రావడం మీకు మాత్రం ఇష్టం కాదా యేమిటి?''

''అయ్యో!'' అన్నారు సారథి కళ్ళు చికిలించి ముక్కుపుటాలు ఎగరేస్తూ. మనోరమ ఓసారి అతనికేసి చూసి గిరుక్కున వెనక్కు తిరిగి, చకచకా తన గదికేసి వెళ్ళిపోయింది.

* * *

మనోరమ హీరోయిన్‌గా నటించిన చిత్రాలు బ్రహ్మాండంగా డబ్బు తెచ్చాయి. అలా తేవడానికి చాలా మంది చాలా రకాలుగా శ్రమపడ్డ మాట నిజమేగానీ, ఎక్కువ భాగం క్రెడిట్ మనోరమకే దక్కింది. చాలా సంవత్సరాల నుండీ పాత ముఖాలు చూసి విసుగెత్తిపోయిన వారి పాలిటి దేవ కన్యగా మనోరమ అవతరించింది. సంవత్సరం తిరక్కుండానే ఆవిడకు బోలెడుమంది ఫాన్సు తయారయ్యారు. ప్రతి రోజూ కట్టలకు కట్టలు ఉత్తరాలు వచ్చి పడుతున్నాయి. అందులో చాలా ఉత్తరాల్లో ఉన్న విషయమల్లా తన ఫొటో పంపమని; కొన్ని ఉత్తరాలు ఆమెకు ప్రణయ సందేశాలను మోసుకొచ్చాయి. ఒక పత్రిక వారు ''నా కేమనిపిస్తుందంటే...?'' అన్న శీర్షికపెట్టి, ఆ పత్రికా పాఠకులకు మనోరమను ఏమేమి చెయ్యాలని ఉన్నదో సగర్వంగా చ్రురించారు. మరొక పత్రిక వారు ఆవిడ దినచర్యలను సచిత్రంగా ప్రచురించటానికి గాను ఫొటోలుతీసుకొన్నారు. ఇంకొకరు ఆవిడ

అలంకారాలను ప్రచురించారు. వీటన్నింటి కిందా ఆమెకు ఏ మాత్రమో ఖర్చయింది...

ఇప్పుడావిడ చేతిలో ఏడెనిమిది పిక్చర్లున్నాయి. చాలా మంది డైరెక్టర్లు ఆమెకు తెలిసిన వాళ్ళున్నారు. పేరు మోసిన రెండు మూడు డిస్ట్రిబ్యూటింగ్ కంపెనీల వాళ్ళతో ఆవిడకు 'సన్నిహితమైన సంబంధా'లున్నాయి. పరిస్థితి బాగుపడటంతో మనోరమ తన కుటుంబాన్ని గుంటూరు నుండి రప్పించుకొంది. స్వంతంగా ఓ మేడ కట్టించింది. ఈ మేడ కింద మనోరమ చిల్లికానీ కూడా ఖర్చు పెట్టలేదు. ఎవడో చెట్టియార్ కట్టించి యిచ్చాడు. ఆవిడ స్వంత ఉపయోగానికో కారున్నది. సారథి కోసం ప్రత్యేకంగా ఒకటి కొన్నది. ఈ నాటికీ సారథి పట్ల ఆమెకు అమితమైన గౌరవం ఉంది. ఎంత బిజీగా ఉన్నా, అతని యోగ క్షేమాలు, అప్పుడప్పుడన్నా స్వయంగా విచారిస్తుండేది. యావదాస్తీ మనోరమ పేరిట ఉన్నదన్న మాటేగానీ, అతని కొచ్చిన లోటేమీ లేదు. ఆ యింట్లో అతని మాటకు ఎదురు చెప్పేవాళ్ళు గూడా లేరు.

కానీ సారథికి, ఈ జీవితంలో ఏదో లొసుగు కనిపించసాగింది. ఏదో అసంతృప్తి దయ్యంలా అతన్ని వెన్నాడుతూనే ఉంది. తనూ కళాకారుడే! కళ కోసం తనూ ఒకప్పుడు ఆరాటపడిపోయాడు. ఏవో వెర్రి కళలు కంటూ, ఈ దోవలో పడ్డాడు. ఇది చాలా సజావైన మార్గమని ఆనాడు అనిపించింది. అందుకే నిస్సంకోచంగా ఇటుకేసి నడిచాడు. నెత్తీనోరూ కొట్టుకొంటున్న ఆప్తులందర్నీ కాదని, మనోరమను పట్టుకొని ఊరేగాడు. ఉన్న ఆస్తంతా కర్పూరంలా కాల్చేశాడు. అందుకు సారథి ఈనాడు విచారించడం లేదు. ఈ దోవన బడి, ఈ నాటికీ స్థితి కొచ్చాడు. ఇక్కణ్నుంచి ముందు మార్గం కనిపించడం లేదు. ఇక తనెంత కాలం బ్రతికినా, మనోరమ భర్తగా బ్రతకవలసిందేనా? తనకో వ్యక్తిత్వమూ, స్వంత జీవితమూ లేనే లేవా?

చాలా మంది అనుకొంటున్నట్టు, ఈ సంపద యావత్తూ తనది కాదు. కాదు సరిగదా, ఇందులో తనదంటూ పూచిక పుల్ల గూడా లేదు. ఇదంతా మనోరమ స్వార్జితం. ఆవిడ సంపాయించినది. తను ఆవిడ దయాధర్మాల మీద ఆధారపడి బ్రతుకుతున్నాడు. ఆమె ఏ క్షణాన తనను వెళ్ళమన్నా, కట్టుగుడ్డలతో వీధిలో కొచ్చెయ్యాలి. మనోరమ అలా అంటుందనీ కాదు, ఇవన్నీ జరుగుతాయనీ కాదు. కానీ జరిగే అవకాశాలున్నాయా, లేవా అన్నదే ప్రశ్న!

ఇంతకాలం నుండి తనను వేధిస్తున్న అసంతృప్తికి, కారణమేమిటో సారధికి తెలిసినట్లయింది. ఇప్పటి వరకూ తనకు స్వంత జీవితం లేదు. స్వంత వ్యక్తిత్వమూ లేదు. మరొకరి జీవితం- మనోరమ జీవితం- తను జీవించాడు. ఆవిడ వ్యక్తిత్వాన్ని తన వ్యక్తిత్వంగా చెలామణి చేసుకొన్నారు. ముందుగా ఈ 'గిరి'నుండి బయట పడితే తప్ప తనకు ఊపిరాడదు.

చావునుండి తప్పుకొన్న వాడిలా సారథి కంగారుగా లేచాడు. ఒక్కసారి బద్ధకంగా వొళ్ళు విరుచుకొని, గట్టిగా ఆవలించి చిటిక వేశాడు. ఏదో నిశ్చయానికొచ్చిన వాడిలా గదిలోంచి చకచకా బయటికొచ్చాడు. అర్ధరాత్రి దాటింది. అందరూ నిద్రపోతున్నారు. మనోరమ ఏదో ఔట్‌డోర్ షూటింగ్ ఉన్నదని రెండు రోజులయింది వెళ్ళి. ఎప్పటి కొస్తుందో తెలియదు. చెప్పి పోదామన్నా ఈ యింటిలో తనకు కావలసిన వాళ్ళెవ్వరూ లేరు. ఏదో అనుకోవడమేగానీ ఈ మనోరమ మాత్రం ఈనాడు

తనదా? తనదేనని, తను అనుకొన్నంత కాలమూ, ఈ ఇల్లు తనకు స్వర్గతుల్యంగా ఉంది. కాదనుకొన్నాక, భరించరానంత దుర్గంధంతో పిలపిల లాడుతున్నట్టు తను బాధపడిపోతున్నాడు. ఇది మనోరమను చూసి తను అసూయపడటమో, ఓర్చలేని తనమోకావచ్చు. తనకన్నా ఉన్నత స్థితిలో ఉన్నవాడి పట్ల, దిగువగా ఉన్న వాడి మనస్తత్వం లాంటిదేదో తనలోనూ పనిచెయ్యవచ్చు. వీటన్నింటినీ మించి మనోరమకు తనంటే వల్లమాలిన గౌరవాభిమానాలు ఉండవచ్చు. కాదనను కానీ తను దాన్ని నమ్మలేకపోతున్నాడు. ఇది తన లోపమేనని ఎవరన్నా అంటే, తను నిష్పేచీగా ఒప్పుకుంటాడు.

ఎంత ఆలోచించినా తనిప్పుడు తప్పుకోవడమే ఉత్తమంగా ఉంది. ఒకప్పుడు తన అవసరం మనోరమకు ఉంటే ఉండవచ్చు. కానీ ఈనాడలా లేదు. తను లేకపోయినా మనోరమ నిర్విచారంగా బతక గలదు. తను లేకపోవడమన్నది ఆవిడ జీవితానికెలాంటి లోటునూ రానివ్వదు. కాకపోగా ఏ మాత్రమో ప్రతి బంధకం గూడానూ. తన ఉనికి ఆమె స్వాతంత్ర్యాన్ని కొద్దిగానైనా కుంటుపరుస్తున్నది. అలాగని మనోరమ తనతో అననూ లేదు; ఆ అర్థం వచ్చేలా ప్రవర్తించనూ లేదు కానీ తనకా మాత్రం తెలియదా?

తనకు తను ఏమీ చేసుకోలేక పోయాడు. ఇతర్లకూ చెయ్యలేకపోయినాడు. కాగా ఇతర్ల స్వేచ్ఛకు తను రాహువులా అడ్డుపడుతున్నాడు. అయినప్పుడు తనిక్కడ ఉండటంలో అర్థం లేనే లేదు.

నిజమే! ఈ ఇంట్లో డబ్బు ఇవ్వగల అన్ని సౌఖ్యాలు తనకు అందుబాటులో ఉన్నాయి. ఈ ఇంటి నుండి పోయాక, తనకిన్ని సౌకార్యలు ఉండని మాట గూడా తను కాదనడు. దురదృష్ట వశాత్తూ ఈ సౌఖ్యాలు తనకు సుఖాన్నివ్వడం లేదు. ఈ భాగ్యం తనకు భాగ్యానికి మల్లే లేదు.

చాలా మంది - ఏ విచక్షణా లేకుండా, మనోరమ కోసం అల్లాడి పోవడం తనకు తెలుసు. ఆమె కోసం చచ్చే వాళ్ళున్నారని గూడా తనకు తెలుసు. ఒకప్పుడు తను కూడా మనోరమ కోసం కలవరించి పోయాడు. కానీ ఈ నాడామెను చూస్తుంటే, తనకు ఆకర్షణ కలగడం లేదు, సరిగదా అసహ్యం వేస్తున్నది. లక్షల మందికి పిచ్చెక్కించే ఆవిడ ఉజ్వల సౌందర్యం తనకు వాంతి కలిగిస్తున్నది. ఇది తన లోపమే నేమో! ఏది ఏమైనప్పటికీ తనీ బందిఖానాలో ఆట్టే కాలం ఉండలేడు. ఈ బంగారు సంకెళ్ళను ఇంకా భరించనూ లేడు.

సారథి గట్టిగా నిట్టూర్చాడు. ఒక్కసారి ఇల్లంతా కలియ చూశాడు. వందలాది కంఠాలు తననూ, తన వ్యక్తిత్వాన్ని, అవహేళన చేస్తున్నట్టు ఫీలయ్యాడు. ఆఖరిసారిగా మనోరమ గది కేసి చూసి, నిశ్శబ్దంగా బైట పడ్డాడు.

* * *

దాదాపు మూడేళ్ళ తరువాత సారథి తిరిగి బెజవాడలో అడుగు పెట్టాడు. అతని ప్రాణానికెంతో హాయి అనిపించింది. కానీ ఆ హాయిని గూడా అతను ఎక్కువ సేపు అనుభవించలేకపోయాడు.

పాత మిత్రులలో చాలా మంది ఆటూ ఇటూ చెదిరిపోయారు. ఉన్న నలుగురైదుగురయినా, నాటకాల ధోరణి మాని, ఏవో ఉద్యోగాలు చేసుకొంటున్నారు. వాళ్ళ దగ్గర కెళ్ళి కూడా ఈ నాటకాలు ప్రసక్తిని తిరిగి తీసుకు రాలేకపోయాడు సారథి.

అతన్ని నటుడుగా ఒక్కరూ గుర్తించలేదు. అందరూ 'మనోరమ భర్తగా' మాత్రమే చూశారు. అలాగే మాట్లాడారు. అలాగే ప్రవర్తించారు. మనోరమ యోగ క్షేమాలను గురించి అడిగారు. ఆవిడ ఏ సినిమాల్లో నటిస్తోందో అడిగారు. ఇంకా హిందీ మార్కెట్టుకు ఎందుకని వెళ్ళలేదని అడిగారు. ఇప్పుడున్న ఏ హిందీ స్టారుకూ మనోరమ తీసిపోదని, భరవాసా ఇచ్చినవారూ ఉన్నారు.

మొట్టమొదటగా అతన్ని చూసినవారు, అతని వెనక ఓ ఖరీదైన కారునూ, అందులో అందమైన మనోరమనూ వెదికారు. అతని వెంట మనోరమ గూడా వస్తున్నదేమోనని, చాలా మంది గుంపులు గూడారు.

వీళ్ళందరికీ ఏమని సమాధానం చెప్పడమో సారధికి తోచలేదు. తనకూ మనోరమ మనస్పర్థలొచ్చాయనీ, అందుచేత నేనిలా బెజవాడ రావలసి వచ్చిందనీ, వారికి ఎలా చెప్పడం? తన జీవితం తను జీవిద్దామని, మనోరమ నుండి వందల మైళ్ళ దూరం వచ్చినా; తనకా జీవిత సూత్రం చేజిక్కలేదు. ఇక్కడా తను 'మనోరమ భర్త'గానే ఉండిపోవలసి వచ్చింది.

ఒక రోజు పదిగంటల వేళ పోస్టుమాన్ తలుపు కొట్టాడు. సారథి వెళ్ళి ఓ రిజిస్టర్ కవర్ పుచ్చుకొన్నాడు. దానికేసి చూస్తూనే మనోరమ దస్తూరిని పోల్చుకొన్నాడు సారథి. ఏదో ఉత్తరం ఉంటుందనుకొన్న సారథికి, అందులో ఓ విల్లు కనిపించింది. అందులో తనకున్న యావదాస్థిని సారథి ఇష్టానుసారం రాసింది మనోరమ. దానితో పాటు చిన్న ఉత్తరం గూడా ఉంది.

"డబ్బు మిమ్మల్ని నాకు దూరం చేస్తుందని ఏ మాత్రం తెలిసినా దాని పట్ల నేనూ తగు జాగ్రత్తలోనే ఉండేదాన్ని. మీరెందుకెళ్ళారని నేను అడగను. అడిగినా మీరు జవాబు చెప్పనవసరం లేదు. నన్నీ దిక్కుమాలిన మద్రాస్‌లో ఒంటరిగా వదలి వెళ్ళారు. నేనేమయిపోతానని మీ ఉద్దేశం? మీరు నాతో చెప్పకుండా వెళ్ళారు. నేను చెప్పే వస్తున్నాను. పదకొండో తేదీ మెయిల్లో బయలుదేరుతున్నాను. పన్నెండు ఉదయానికల్లా మీరు స్టేషనుకు రండి-

- మీ మనోరమ"

సారథి కొన్ని నిమిషాలపాటు కొయ్యబారిపొయ్యాడు. ఏవో తియ్యని జ్ఞాపకాలు మనస్సులో మోసులెత్తాయి. కళ్ళు నీటితో నిండిపోయాయి. ఆ రాత్రే విల్లుతో సహా మెయిలెక్కాడు. అతని మనసిప్పుడు మనోరమ కోసం ఘోరంగా కలవరించి పోతున్నది.

* * *

**"నీ పొరుగింటి వాడు** నీతి పరుడో, అవినీతి పరుడో నిర్ణయించడానికి,అతన్ని అంచనా వేయడం, ఎంత అవసరమో, నీ సంపదను అంచనా వేయడానికి కూడా అంతే అవసరం" అంటాడు

లెనిన్.

ఒక మనిషి తాలూకు నీతి, అవినీతి- అచ్చంగా అతని మీదనే ఆధారపడి ఉండవు. అతను జీవిస్తున్న వాతావరణం మీద, అతనుంటున్న పరిసరాల మీద సైతం ఆధారపడి ఉంటాయి. కొంతమంది కడుపారా తింటున్నారన్న మాట నిజం. ఎక్కువ మంది, అర్ధాకలితోనూ, పూర్ణాకలితోనూ మాడి పోతున్నారన్న మాటా నిజం! ఈ పేదవారికీ, ఆకలితో నకనక లాడిపోతున్నవారికీ, ఏదో ఒక సమయాన, ఈ అన్నం తింటున్న వారి మీద కోపం రావడం సహజం. కడుపు నిండా తింటున్న వారు, ఏమరుపాటుగా ఉన్నప్పుడు, అందినంత అన్నాన్ని దొంగిలించుకుందామని అనిపించడం సహజం. అల్లాగా అనిపించీ, అనిపించీ, అనిపించీ- ఎప్పుడన్నా దొంగతనం చేస్తారు. దొంగతనం చేయడం, మన చట్ట ప్రకారం నేరమే! సందేహం లేదు. అయితే ఈ నేరానికి బాధ్యులెవరు? మనం ఏమంటామంటే, మన చట్టాలు ఏమంటాయంటే "తిండికి లేనివారే నేరస్థులు" అని. కానీ ఏదో విధంగా మనమూ ఇంత తిండి తిందామన్న దుష్టపుటాలోచనలు కలిగించి, వారిని ఈ దొంగతనానికి పురి కొల్పింది, కడుపునిండా తింటున్న వారే గదా! నేరం చేయవలసిందిగా, తెర వెనుక ఉండి ప్రోత్సహించిన వారిని, బుద్ధిపూర్వకంగా మరిచిపోయి, కనిపించే లాగానో, పట్టుబడే లాగానో నేరం చేసిన వారిని మాత్రమే మనం నేరస్థులని అంటున్నాం. పాపులనీ అంటున్నాం. ఇదొక చిత్రమైన సమస్య. ఈ సమస్యను సరిగ్గా అర్థం చేసుకోవడానికి, సామాజిక పరిజ్ఞానం, ఆర్థిక పరిజ్ఞానం, రాజకీయ పరిజ్ఞానం ముఖ్యంగా కావాలి.

ఒక వ్యక్తి జీవిత విధానమైతేనేం, ఆలోచనా విధానమైతేనేం, ఇంకా ఇంకా... మిగిలిన విధానాలైతేనేం, ఆర్థిక పరిస్థితి మీద ఆధారపడి ఉంటాయి. ఆ స్థితి మారిన కొద్దీ ఈ విధానాలు కూడా మరుతూ ఉంటాయి.

ఈ మార్పులో; సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలకు చెందిన మౌలిక సత్యాలు దాక్కొని ఉంటాయి. ఈ సత్యాలను బయటికి తీయాలి. తీసి కథలుగా మలచాలి.

1952 నుండే- ఈ సామాజికావగాహనకు భరద్వాజ ప్రయత్నించినట్లు విమర్శకులు చెబుతున్నారు గానీ- అది నిజం కాదు- ఇందుకు సంబంధించిన భావాలు, అంతకు ముందు నుంచే అతనిలో ఉన్నాయి. అతను పెరిగిన వాతావరణం అటువంటిది. తండ్రిగారికి జాతీయోద్యమంతో ఉన్న సంబంధం, సామ్యవాదులతో తనకేర్పడిన సంబంధం, తాననుభవించిన ఆకలి, దారిద్ర్యం, నిరుద్యోగం; అడుగడుగునా, ఎదురౌతున్న అసమానతలు- ఇవన్నీ భరద్వాజ ఆలోచనా విధానాలను సరిదిద్ది, అతన్ని సరైన మార్గంలో నిలబెట్టాయి. ఆ మార్గంలోనే అతను- ప్రయాణించి ఉండవలసింది. కాని పెనుభూతంలాగా చలం అడ్డుపడ్డాడు. పడి భరద్వాజను తన అష్టబాహువుల తోనూ బంధించి వేశాడు. ఆ బంధంలో చిక్కుకొని తను స్వేచ్ఛ కోసం పోరాడుతున్నానన్న భ్రమా సముద్రంలో ఈదులాడాడు భరద్వాజ. చలాన్ని తాగి, ఆ తాగిన మత్తులో జోగిసలాడుతూ, చలం గొంతుతో, చలం మాటలనే, చలం లాగా ఆలపించాడు. అప్పుడన్నాడు చలం 'నా వారసుడు భరద్వాజ' అని! భరద్వాజ మనస్సు కలుక్కుమన్నది. గుండె గుబగుబ లాడింది.

పైగా ధనికొండ వంటి మిత్రులు, 'నీ గొంతు కోసం నీవు వెదుక్కో'మని పోరుతూనే ఉండిరి... వీటన్నింటి ఫలితంగా చలంగారి పద్మవ్యూహం నుండి, ఈ అభిమన్యుడు, విజయధ్వానం చేస్తూ బయట పడ్డాడు... 'కామాజిక స్పృహ' ఉన్న రచనలకు ఓ నమస్కారాన్ని పెట్టారు. 'సామాజిక స్పృహ' ఉన్న రచనల వేపు లేఖినిని మలిపాడు. అంతకు ముందు చాలా కాలంగా, మనసు లోలోపలి పొరల్లో దాగొని, గుసగుసలాడుతున్న అసలు సిసలు ఆలోచనలు, కాస్త ఆలస్యంగానైనా అక్షర వాహనాలెక్కి అందరి ముందకూ రాసాగాయి. పాత్రల వంటి మీద పిసరంత ఉల్లిపొర గుడ్డనైనా ఉండనీకుండా, వాటిని నిరంతర సురత క్రీడా నిమగ్నం చేసి, పాఠకులకు వెర్రెక్కించి, కిర్రెక్కించిన భరద్వాజ వేరు. కటిక కాటుక పొగల చీకటి గుయ్యారాలలో దూరి, చాటుగా మాటుగా తచ్చాడే ఊహలను వొడుపుగా పట్టుకొని వాటికి ముగుదాడు బిగించి, వాటితో క్రీడలాడించిన భరద్వాజ వేరు. 'వే'రని ఉత్తినే అనడం కాదు; ఈ కథ ఆ మార్పుకొక అక్షర సాక్ష్యం...

# వర్గదృష్టి

**అవాస్తవికం,** అసందర్భం, అసహజం మొదలైన లక్షణాలను, మనం సరిగ్గా అర్థం చేసుకోవడం లేదనుకొంటాను. మనకు ఇష్టంలేనివి జరిగినప్పుడూ, మనకు సరిపడని మాటలు విన్నప్పుడూ, మన అభిరుచులకు భిన్నమైన పనులు చేయవలసి వచ్చినప్పుడూ, మనం ఇలాంటి మాటలు వాడుతుంటామేమోననిపిస్తుంది. మనకు వాస్తవం కానిది, సందర్భోచితం కానిది, సహజం కానిది, మరొకరికి అవుతుందని, సాధారణంగా మనం అనుకోలేము. ఎంత అసహజమూ, అవాస్తవికమూ అయినా, దాని తాలూకూ వేళ్ళు- చాలా దూరంగానేనా, వాస్తవికంలోనే ఉండి ఉంటాయి. అంత దూరానికి పోలేక చప్పున మనం మన పడికట్టు రాళ్ళను వాడుతుంటామని నా నమ్మకం. ఈ విషయాన్ని నేను శరభయ్య ద్వారా రుజువు చేసుకొన్నాను.

మనిషి ఆలోచనలెపుడూ, తనకు లేనిదాని చుట్టూతా పరిభ్రమిస్తుంటాయనుకొంటాను. గర్భదరిద్రుడు, భోగభాగ్యాలను, గురించీ, భాగ్యవంతులు అనుభవించే, సుఖసౌఖ్యాలను గురించీ ఆలోచిస్తే; అన్నీ ఉన్నవాడు, లేమిలో ఉన్నవారి ప్రశాంత జీవితాన్ని గురించి ఆలోచించడం అనుభవంలో ఉన్న విషయం.

దాదాపు ఆరేళ్ళపాటు పట్నంలో గడిపేశాక, నాకు పట్నవాసం మీద గట్టిగా మొఖం మొత్తింది. రవంత హాయి, వెసులుబాటు, కమ్మని గాలి, నిర్మలమైన పలకరింపు, ఆపేక్ష, నగర జీవితంలో కొరవడ్డాయనిపించింది. బ్రతుకులో యధార్థం పోయి, నటన, కృత్రిమత్వం, దొంగ మర్యాదలు, నిజాన్ని చెప్పలేని బలహీనత, వేగం, జీవితంలో చోటు చేసుకొంటున్నట్లనిపించింది. కొంత కాలం పాటు, ఈ పై పై బ్రతుకును వంకెకు తగిలించి, అసలు మనిషిలా గడపాలనుకొన్నాను. ఆఫీసుకు ఏకంగా నెల రోజులు సెలవు పెట్టి రావులపాడు వెళ్ళాను. అక్కడే నాకు శరభయ్యతో పరిచయం కలిగింది.

ముకుందం చెప్పినదాకా, శరభయ్యను గురించి నాకుతెలీదు. తెలుసుకోవలసిన విశేషం గూడా అతనిలో నాకేమీ కనిపించలేదు. మనిషి, పొడుగ్గా, లావుగా ఉంటాడు. బిరుసు మీసాలు. పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు. నల్లగా ఉంటాడు. ఏదో చదువుకొన్నాడు. ఇదీ ముకుందం అతన్ని గురించి నాకు చెప్పింది.

"ఇవన్నీ నాకెందుకు చెబుతున్నట్టు?" అన్నాను ముకుందంతో.

ముకుందం, తన దొంగతనాన్ని నేను పసిగట్టినట్టు, ముసిముసినవ్వులు నవ్వాడు.

"అబ్బాయీ! ఇది పనులెద్దడి కాలం. నిన్ను వెంటబెట్టుకొని, చేలంటా, వాగులంటా, గట్లంటా తిరగడానికి నాకు తీరదు. నువ్వేమో, 'రా రా' అని నన్ను పట్టుకొని గీమారుతున్నావు. నీకా శరభయ్యగాణ్ని తగిలిస్తా. వాడివెంట తిరిగిరా. అందుకే వాణ్ని గురించి నీతో ఇంతగా చెబుతూంట-" అన్నాడు ముకుందం.

"అతగాడికి మాత్రం పన్లూ, గిన్లూ ఉండవట్రా! నువ్వేమో, మహా విరగబడేవాడివున్నూ, ఆ శరభయ్యేమో, గాలికి తిరిగేవాడూనా! నీకు లేనితీరిక, వాడికెలా ఉంటుందీ?" అన్నాను ముకుందం, దొంగతనం ఈసారి నిజంగానే పట్టుకొని.

"ఉంటుంది" అన్నాడు ముకుందం సంగ్రహంగా.

మర్నాటి ఉదయం, నేను నిద్రలేవకముందే శరభయ్య వచ్చాట్ట. నన్నెక్కడికో తీసికెళ్ళడానికి, శరభయ్యా, ముకుందం, గతరాత్రే ఒప్పందానికొచ్చారట.

అదే మీదేమని నేను లేచి, కాఫీ తాగి బైటికొచ్చేసరికే, శరభయ్య ప్రత్యక్షమయ్యాడు.

"ఏమోయ్ శరభయ్యా! మా వాణ్నీ పూట ఎక్కడికి తీసికెడతావేమిటి?" అన్నాడు ముకుందం.

"ముందు బయల్దేరనీండి. గడపదాటాక, కాళ్ళెటు గుంజితే అటు" అన్నాడు శరభయ్య నాకేసి చూసి నవ్వుతూ.

ఆ 'విట్' నేనూ అనుభవించాలని, శరభయ్య ఉద్దేశమనుకుంటాను.

ఊరు దాటినదాకా, ఎవ్వరమూ పలకలేదు. మాదిగగూడెందాటి, పెద్దవాగు పొంతనే, పొలంగట్టు మీదుగా నడుస్తున్నాం. వేరుసెగన చేలు, పచ్చగా, నిండుగా, యౌవనంగా చూపుకందినంత మేరా కనిపిస్తున్నాయి. కొన్ని చోట్ల, కంది చాళ్ళు, పసుపు మునుగులు వేసుకొన్న, మారువాడీ ముత్తైదువుల్లా కనిపిస్తున్నాయి. దూరంగా మంచె, చెదురుగా తుమ్మ చెట్లు, గాలికి ఊగుతున్న, గిజిగాడు గూళ్ళు, నీటి వాసనతో బరువైన గాలి... చాలా హాయిగా ఉంది.

మరో యావలేకుండా, ఈ పొలాల మధ్య చిన్న గుడిసె వేసుకొని, చెట్లను, పంటల్ని, గడ్డిని, పశువుల్ని, చిన్న చిన్న రంగు రంగు పురుగుల్ని చూస్తూ, ఇక్కడే, ఇలానే కలకాలం ఉండిపోదామనిపించింది.

"ఇక్కడ కూచుందామంటారా?" అన్నాడు శరభయ్య- నా వాలకం కనిపెట్టి.

ఇద్దరం గట్టుమీద చదికిలపడ్డాం.

శరభయ్య పైపంచె తీసి, నడుం మీదుగా కాళ్ళ చుట్టూ చుట్టి రెడ్డిగం వేసి కూచుని, చుట్ట ముట్టించాడు.

"ఈ సంవత్సరం పంటలెలా ఉన్నాయి శరభయ్యా?" అన్నాను కాలక్షేపం కోసం.

నోట్లోంచి చుట్ట తీసి తబుక్కున గట్టుపక్కన ఉమ్మేశాడు శరభయ్య. చుట్ట కొనకొరికి వేలితో నాలిక మీంచి, ఆ కొసను తీసి నేలకు రాచాడు.

"ఆఁ- ఏం పంటలు బాబుగారూ! ఈ ఏడు సరిగ్గా వానలే లేకపోయె. వరపున బట్టతడుపు జల్లు పడ్డట్టయితే, మా వూరి పని, సీతారాం కోరుతుండేదనుకోండి. చిట్టని చినుకే లేకపోయె! సన్న జనం పని, మరీ 'గోరకలి'గా ఉంది లెండి. నాలుగకరాల 'యెగసాయం' చేసే కోటప్పగారి పెదరామయ్య, మొన్న కూతురుపెళ్ళి చెయ్యడానికి ఆవలిచ్చి సచ్చాడనుకోండి. ఊరంతా అనుకోటం, 'జంఝామృతం'గా అయిదు రోజులు పెళ్ళి చేస్తాడని. మాలా, మాదిగా, అలగాజనం చాలా మంది నోళ్ళు తెరుచుకుని కూచున్నారు. తీరా చూస్తే తుస్స్ మనిపించాడు. బ్రామ్మడిగ్గూడా, పాతికిచ్చి సరిపుచ్చాడు. పెదరామయ్య పనే అట్టా ఉంటే, ఇక తక్కిన నాయాళ్ళ సంగతి - లబో దిబో" అన్నాడు శరభయ్య.

చుట్ట ఆరిపోయింది. అగ్గి పెట్టివ్వబోయాను. 'ఎందుకు లెండి' అంటూ జేబులోంచి చెకుముకి సంచి తీశాడు. ఇంత దూది తీసి, చెకుముకిరాయి అంచునే పెట్టి, అది కదలకుండా, ఎడం బొటనవేలితో అదిమి పెట్టి, కుడిచేత్తో 'బిళ్ళ' పట్టుకుని, రాయిని గట్టిగా రాశాడు. రెండోసారికే దూది అంటుకొంది.

"ఈ కోమటి నరసయ్య ఉత్త..." మాట పూర్తి చెయ్యకుండానే, చుట్ట గబగబా కాలుస్తున్నాడు శరభయ్య. "అక్కడికీ మంచి ముక్కలు ఏరియ్యవయ్యా అన్నా. సురేకారం మండినట్టు మండుద్దన్నాడు. లాగీ, లాగీ, దవడలు పీక్కుపోతున్నాయి గానీ పొగరాదు. ఉత్త ముండమోపి సరుకు. మహా అడ్డకాలుపు. మీరు చుట్ట కాలుస్తారా? కాలిస్తే పాటిపొగాకు కాల్చి చూడండి. మా భేషుగ్గా కాల్తుంది. చేదుండదు. సాంబ్రాణి కడ్డీలాగా మాంఛి సువాసన..."

చుట్ట సాంబ్రాణి వాసనొస్తుందని, నాకిప్పటికీ నమ్మకం లేదు. కానీ వొస్తుందంటున్నాడు శరభయ్య. అతని అనుభవాన్ని, నేనెలా కాదనడం?

"మీరొచ్చినప్పణ్నించీ, మిమ్మల్నో సంగతడగాలనుకొంటున్నానండీ!" అన్నాడు శరభయ్య.

"ఏమిటది?"

"ముకుందంగారు మీతో ఏమీ హెచ్చరించలా?"

"లేదే!"

"మర్చిపోయారేమో లెండి! మాపిటికి మళ్ళా గ్యాపకం చేస్తాను."

శరభయ్య అడగదలుచుకున్న సంగతేమిటా అని చాలా సేపు ఆలోచించాను. అతనికి నా నుండి కావలసిన పనులంటూ ఏమీ ఉండవని నాకు తెలుసు. అయినా, అతనేదో పెద్ద విషయమే

నన్నడగాలనుకొని ఉంటాడనేది ఖాయం. ఆ పని తను చెబితే కాదన్న అనుమానంతోనే, ముకుందం చేత చెప్పించాలనుకొని ఉంటాడు. ముకుందం మాట నేను తప్పక వింటానని శరభయ్య విశ్వాసం!

"మావూరెలా ఉందండీ?" అన్నాడు శరభయ్య కాస్సేపాగాక.

"దివ్యంగా ఉంది."

నాకేసి, ఆశ్చర్యంగా చూశాడు శరభయ్య. తరువాత, మెల్లగా నవ్వాడు.

శరభయ్య నా మాట నమ్మలేదనిపించింది నాకు.

"ఏమిటండీ బాబూ మీరూ అట్లా అంటారు! అంతంత పెద్ద పెద్ద పట్నాల్లో ఉండొచ్చినోరికి, దిక్కు దివాణం లేని, ఈ వూరికొంపలు నచ్చడమేమిటండీ నా తలకాయ? ఓ రోడ్డు లేదు. పోస్టాఫీసు లేదు. బస్సులేదు. కరెంటు లేదు. ఆస్పత్రి లేదు. గాంధీగారు చచ్చిపోతే, పదిహేను రోజులగ్గానీ మాకు తెలిసింది గాదు. ఇంకా తెల్లోళ్ళే ఉన్నారనుకొంటున్న వాళ్ళు బోలెడు మంది! ఇలాంటి ఊళు ళ్ళ మీకు నచ్చాయంటే నేను నమ్మలేదు."

శరభయ్యకు చెప్పాల్సిన సమాధానం నా దగ్గర సిద్ధంగా ఉంది. ఇవన్నీ ఉంటే ఇట్టే సుఖ పడతామని అతని ఉద్దేశం. ఇన్ని ఉన్నా, సుఖమంటే ఏమిటో ఎరగని వాళ్ళు, పట్నాల్లో లక్షలాదిగా ఉన్నారని, శరభయ్యకు తెలీదు. నేను చెప్పినా నమ్మడనిపించింది.

నేను మెదలకుండా ఊరుకోవడం చూసి, తన మాటలతో నేను ఏకీభవించాననుకొన్నాడు శరభయ్య. అందుకే-

"అంతే నంటారా బాబయ్యా?" అన్నాడు శరభయ్య, విజయ శంఖం బైటికి తీస్తూ.

"ఇవన్నీ ఉండేసరికి, ఇప్పుడున్న వ్యవస్థే సీదా మారిపోతుంది! ఈ హాయి, ఈ తీరుబాటు, అరవిడిచి కబుర్లాడుకోడం, ఒకరికొకరు సాయపడటం...ఇవన్నీ ఉండవనుకొంటాను. నాగరికత పెరిగిన కొద్దీ మనిషికీ మనిషికీ మధ్య, అగాధాలు ఎదిగిపోతున్నాయి. ప్రతివాడూ తన చుట్టూ, తాను గోడలు కట్టుకొని, తనకు తానే బందీ అయిపోతున్నాడు. మాటల్లో, రాతల్లో, ఉపన్యాసాల్లోని సహజీవనం, సోదరత్వం, సౌభ్రాతృత్వం, సౌమనస్యం, విచ్చలవిడిగా పేలిపోతుంటాయి. పక్కవాడు తిండి తినలేదని తెలిసికూడా ఆ సంగతి తెలీనట్లు నటించడం, ఇంకా పల్లెటూళ్ళకు పాకలేదను కొంటాను. ఇంట్లో అన్నిటికీ అగచాట్లు పడుతున్నా, ఏ బాధలూ లేనట్టు ప్రవర్తించడం, ఉన్నదానికన్నా ఎక్కువ ఉన్నట్టు పోజ్ చేయడం, ఆత్మవంచన, దగా, కుట్ర, మోసం, ఇత్యాది అంటు జాడ్యాలు, బస్తీల వరకే ఉండిపోయాయనుకొంటాను. ఈ వొక్క కారణం చాలదా, ఈ పల్లెను మెచ్చుకోడానికి"

తరువాత అనిపించింది, రెచ్చిపోయి మాట్లాడానా అని! అయినా, నా ఆర్గ్యుమెంట్ శరభయ్యకు నచ్చలేదని నేను గ్రహించాను అతనేదో చెప్పాలనుకొని, చెప్పడం ఆపాడనిపించింది.

ఎండెక్కింది. ఊళ్ళోంచి పశువులు, మందలు మందలుగా వస్తున్నాయి. అన్నం దుత్తలు నెత్తిమీద పెట్టుకొని ఆడవాళ్ళు గట్లమ్మటే పోతున్నారు. "ఉత్తితీత తీతా" అంటూ తుమ్మల్లోంచి ఏవో పిట్టలు అరుస్తున్నాయి. వేరు సెగన చేనుమీంచి, మదపుగాలి విసురుతోంది. చిన్న పిల్లలు కొంత

మంది గేదెల మీదెక్కి సవారి చేస్తున్నారు. ఓ కుర్రాడు పాటందుకొన్నాడు-

“సోగ్గాడో చిన్న నాయనో

సోగ్గాణ్ణి తీసికెళ్ళి,

వొలకుల్లో బెడితేను,

వొలుకులన్ని తెగ్గలికె సోగ్గాడో!”

మిగతా కుర్ర సజ్జంతా ఒక్కసారి గొల్లున అందుకున్నారు.

“సోగ్గాడో (యహ) చిన్ని నాయనో!

సోగ్గాణ్ని తీసికెల్లి వొలుకుల్లో బెడితేను...”

మొదటి కుర్రాడు. ముల్లుగర్రతో, ముందున్న గేదెను ఒక్క చరుపు చరిచాడు. పశువులన్నీ గునుకు పరుగు లంకించుకొన్నాయి. జిమ్మున దుమ్ము లేచింది...

“నారిగాడు, నరసమ్మ,

నారింజ తోపుకాడ,

నాటకాలాడారు సోగ్గాడో!!

సోగ్గాణ్ణి ఎత్తుకెల్లి,

సూరికింద దయాంగ,

బల్లితల్లి తన్ను కెల్లె సోగ్గాణ్ణో!”

గుంపు ఝామ్మున కంఠాలు విప్పింది మళ్లీ!

“సోగ్గాడో నా చిన్ని నాయనా!

నీ కెన్ని తిప్పలొచ్చినయ్యి సోగ్గాడో!”

పశువులూ, వాటితో బాటే, ఆ పాట కూడా డొంక మలుపులోనికి, దూరంగా వెళ్ళిపోయాయి. ఆ పాట వింటూ అలాగే ఆ పశువుల వెంట వెళ్ళిపోదామనిపించింది. శరభయ్య లేకపోతే అంత పనీ చేద్దునేమో!

“పోదామటండీ!” అన్నాడు శరభయ్య.

లేచాను.

“సాయంత్రం మునేటి దగ్గర కెడదాం!”

“అలాగే!”

ఒక్కోసారి మనం చేసే ఉపకారం కూడా ఘోరంగా వికటిస్తుందనుకొంటాను. పాపంగదా అని మనం సాయానికి పోతాం. ఆ సాయమే వాళ్లకు సంకెళ్లుగా తయారవుతుంది. నాకేదో తోడుగా ఉండాలని, శరభయ్యను పంపించాడు ముకుందం. ఈ శరభయ్య, పుడకలా తయారయి కూచున్నాడు

నా ప్రాణానికి, ఏదీ చూడనివ్వడు. ఏదీ ఆలోచించనివ్వడు. ఆ మునేటి దగ్గరా అతనితో ఇదే గొడవ.

“చూస్తానికి జిట్టెడు లేదుగానీ, మా లావు ఉరవడండోయ్! మోకాళ్ళోతు నీళ్ళల్లో కూడా నడవలేం. ఒకసారి తిరపతయ్యగారి పెద జీతగాడు, ‘యామనపిల్లి’ నించి పత్తిత్తుల బస్తాలేసుకొని, వస్తున్నాడు. అందరూ వొద్దుద్దంటూనే ఉన్నారు మలపనాయాల వినకుండా బండిని ఏట్లో దిగేశాడు. నీళ్ళు కూడా ఎక్కువగా లేవండీ. మహా ఉంటే ‘డొలుపు’ దాకా ఉంటాయి. ఇంకో రెండు పగ్గాల దూరం వస్తే, బండి ఒడ్డెక్కేదే! పుల్ల కోడెకు ఇసుకలో కాళ్ళు నిలవలా! బండి తల్లకిందయింది. రెండో రోజున, సంగమేశ్వర మొగి దగ్గర గట్టుబట్టింది. ఊరూ ఉకమూ ఏకమయిందంటే నమ్మండి! అయ్య చచ్చినప్పుడు గూడా జిర్రున చీదని తిరపతయ్య, నెల రోజులు ప్రజ ముఖం చూడలా.”

ఆ రాత్రి ముకుందాన్నడిగాను; రేపణ్ణించీ శరభయ్యను నాతో పంపడం మానేయమని!

“నేను పంపడమేమిట్రా! అతనే నీ వెంట పడుతుంటేను!” అన్నాడు ముకుందం.

“అతనట్లా అనలేదే!”

“నేను పంపానని చెప్పాడా?”

నిజానికి, శరభయ్య ఆ మాట గూడా నాతో అనలేదు. మరి నేనెందుకలా అనుకొన్నాను?

“తనను గురించి నువ్వేదో నాకు చెబుతావన్నాడే!” అన్నాను.

“వెంటబడి నా ప్రాణాలు తోడుతుంటే అలాగే చెబుతానన్నాను.” అన్నాడు ముకుందం.

“ఏం కావలిట?”

“ఉద్యోగం - ఏ ఉద్యోగమైనా సరే! నెలకు నలభై రూపాయలైనా చాలట. నిన్ను పట్టుకొంటే పనవుతుందని శరభయ్య నమ్మకం. పోనీ, ఏ చప్రాసీ పనన్నా ఉంటే చూడరా పాపం! చాలా అవస్థ పడుతున్నాడు” అన్నాడు ముకుందం జాలి పడుతూ.

నాకేమో పట్నం మీదా, ఉద్యోగం మీదా మొహం మొత్తి ఇలా పారిపోయొస్తే, శరభయ్య వాటి కోసమే మోజు పడుతున్నాడు.

“ఒక్క పూట తిండి దొరికే గ్యారంటీ ఉంటే, ఆ ఉద్యోగం మాని, ఈ పొలాల్లో పాక వేసుకొని ఉండటానికి నేను రెడీగా ఉన్నాను. మరి శరభయ్యకు ఆ మాత్రం ధారకంగూడా ఇక్కడలేదా? ఇక్కడే బ్రతకలేనివాడు, అక్కడెలా బ్రతుకుతాడు? అసలీ ఏటిని, బీళ్ళను, గడ్డిని వొదిలి రావడానికి ప్రాణాలెలా వొప్పుతాయోగానీ...”

ముకుందం, నా మాట పూర్తికాకుండానే వెళ్ళి నిద్రపోయాడు...

నాలుగో రోజున ఒంటరిగా పట్టుకొని, శరభయ్యే నోరు తెరచి నన్నడిగాడు.

“ఇక్కడ చాలా ఇబ్బందిగా ఉంది బాబుగారూ! వ్యవసాయప్పనులప్పుడు ఏదో పని దొరుకుతుంది గానీ, యేటెల్లకాలం కడుపులు మాడ్చుకోవాలిసొస్తోంది. సగం తిండి సగం గుడ్డ, సగం బతుకులేం బతుకులు బాబయ్యగారూ! ఇద్దరు పసికూనలున్నారు. ఒంటి మీద సరైన గుడ్డ

పాస లేదు. మీ కళ్ళ ముందు పడుంటా. ఏదో పని - కూలి నాలైనా చేసుకొని బతుకుతా. మీకు తెలిసిన చోట, పడెయ్యండి బాబుగారూ!''

శరభయ్య, ఉత్తరీయంతో కళ్ళు తుడుచుకొన్నాడు.

నా యీడువాడు, ఇద్దరు బిడ్డల తండ్రి, బ్రతకడం కోసం, అలా కంట నీరెట్టుకోడం, నా గుండెలను నొవ్వజేసింది! ఏదోపని శరభయ్యకు ఇప్పించాలనుకొన్నాను. ఇదంత సులభం కాదని నాకూ తెలుసు. నా అధికారాన్నీ, పలుకుబడిని గట్టిగా ఉపయోగిస్తే- శరభయ్యకు, ఆపాటి సాయం చేయగలననిపించింది. అయినా ఆ మాట అతనితో అనలేదు.

అనుకొన్నదానికన్నా ముందుగానే రావలపాటి నించి బయలుదేరాను. ముకుందం, సెలవంతా ఇక్కడే గడపమని బలవంతం చేశాడు గానీ నాకే ఉండబుద్ధి కాలేదు. ఊరు, దాని పరిసరాలు, చూడటం, ఆనందించడం అయిదారు రోజులకే అయిపోయింది. మరో నాలుగు రోజులు, ఉత్తినే ఉండిపోయాను. ఈ పదిరోజుల పల్లెవాసంతో, నాకు ఉడ్డు గుడిచినట్లయింది. ఏమీ తోచదు. చదవడానికి ఉండదు. తిరగడానికి ఉండదు. ఆలోచించడానికి ఉండదు. సంఘర్షణ, పోటీ, వేగం ఉండదు. ఇలా అనడం సరికాదనుకొంటాను. నాకు మాత్రమే ఇవి అక్కడ దొరకలేదనడం, సబబనుకొంటాను.

ఈ పదిరోజుల అనుభవంతో, పల్లెవాసులు అనుకొన్నంత- సాహిత్యంలో వర్ణించ బడుతున్నంత అమాయకులు, సత్యసంధులు కాదనిపించింది. స్వార్థం, కపటం, దోచుకోవడం, దర్పం, ఇవన్నీ ఎంతో కొంత వారిలోనూ ఉన్నాయనిపించింది. పట్నాల్లో ఉన్నవారు పెద్ద ఎత్తున ఒకరినొకరు పీక్కుతింటూంటే, పల్లెల్లో చిన్న సైజున అదేపని సాగుతోందనిపించింది. పక్కవాడి చేలో గడ్డి - మరోడి బీట్లో దొంగతనంగా గొడ్లను మేపుకోడం, పిట్టవాటుగా అక్కడో కండి, ఇక్కడో పరక రొల్లుకోడం, గట్లను గజాల లెఖ్ఖన మార్చడం, పిచ్చి మానికలతో కొలవడం, తాలూ తప్పా, కూలీలకివ్వడం... అంతా మామూలే!

పట్నం వచ్చాక, శరభయ్య సంగతే మర్చిపోయాను. ముకుందం ఉత్తరంలో రాసిందాకా నాకా సంగతే జ్ఞాపకం రాలేదు.

శరభయ్య బెజవాడకు మకాం మార్చాడుట. ఏదో కంపెనీలో చిన్న ఉద్యోగం చేస్తున్నాడట. అంతకు మించి ముకుందం జాబులో మరే వివరమూ లేదు. నేను సాయం చేదామనుకొని గూడా చేయలేకపోయాను. పోనీ ఎక్కడో ఓ చోట బ్రతుకుతున్నాడుగదా అని సంతృప్తి పడ్డాను.

శరభయ్య రాసిన ఉత్తరం చూసేదాకా అతని పని మరీ అంత అధ్వాన్నంగా ఉంటుందని నేననుకోలేదు.

''యాభై రూపాయలిస్తున్నారు. పది రూపాయలు ఇంటద్దె మింగుతోంది. మిగిలిన నలభై రూపాయలూ 15 రోజులు కూడా రావు. మిగతా రెండు వారాలూ ఎలా బతుకుతున్నామో నాకే తోచడం లేదు. జీతం పెంచమంటే వెళ్ళిపొమ్మంటారు. వెళ్ళి బ్రతకగలిగే అవకాశం లేదు. నాలాగా బాధ పడుతున్నవారు చాలా మంది ఉన్నారు. రోజుకు పది గంటలపని, ఇంకా ప్రొప్రయిటరు

ఏడుస్తూనే ఉంటాడు. సమ్మె చేదామనుకొంటున్నారు కొందరు. లాభం ఉండదు. పోలీసులు పిట్టల్ని కాల్చినట్టు కాలుస్తారు. సరిగ్గా బ్రతికే అవకాశాలూ లేవు. వాటి కోసం ప్రయత్నిస్తే నిలువునా చంపడం! స్వాతంత్ర్యం వచ్చాక మనుషుల్ని చంపడం మరీ సులవయిపోయింది.''

ఈ ధోరణిలో ఉంది శరభయ్య ఉత్తరం. శరభయ్యలో గట్టి మార్పు లొచ్చాయనిపించింది. ఇదివరకు సరిగ్గా మాట్లాడటం గూడా చేతకానివాడు, ఇప్పుడు ఇంత స్పష్టంగా తనను గురించి రాశాడంటే, ఆ మార్పును తక్కువ అంచనా వెయ్యగూడదు. శరభయ్యకు సానుభూతి చూపుతూ ఉత్తరం రాసినట్టు జ్ఞాపకం.

రెండేళ్ళ పాటు అతన్ని గురించి నాకేమీ తెలియలేదు. ముకుందం రాసే ఉత్తరాల్లో గూడా అతని ప్రసక్తి ఉండేది కాదు.

1949లో అనుకొంటాను. శరభయ్య సెంట్రల్ దగ్గర కనిపించాడు. నేనతన్ని చూడలేదు. శరభయ్యే నన్ను పేరుబెట్టి పిలిచాడు. పేరు చెప్పుకొన్నాక గానీ, అతన్ని నేను గుర్తు పట్టలేకపోయాను. మనిషి బాగా మారిపోయాడు. ముతక పంచె కట్టాడు. మోకాళ్ళ దాకా, ఖద్దరు లాల్చీ వేసుకొన్నాడు. చలవ కళ్ళజోడు, నెత్తిమీద గాంధీ టోపీ, చంకలో తోలుసంచీ, మరో చేతిలో అయిదారు పత్రికలు.

అతనే నన్ను కాఫీకి బలవంతం చేశాడు. కాఫీ తాగుతున్నప్పుడు, మెల్లిగా నా యోగ క్షేమాలడిగాడు. 'అమ్మాయి పిల్లలు కులాసాగా ఉన్నారా' అన్నాడు. తనే బిల్లు చెల్లించాడు. వద్దంటున్నా వినిపించుకోకుండా, పది రూపాయల ప్లాస్టిక్, సామాన్లు కొని పిల్లలకివ్వమన్నాడు. నన్నడిగి ఇంటి అడ్రసు పుచ్చుకొన్నాడు. ఆలోచించడానికి, మాట్లాడడానికీ శరభయ్య నాకు అవకాశం ఇవ్వలేదు. నేను చూస్తుండగానే టాక్సీ ఎక్కి 'యెమ్మెల్యే క్వార్టర్స్' అన్నాడు శరభయ్య.

ఆ పోయిన పోక, మూడో రోజున ఆఫీసులో కలుసుకొన్నాడు శరభయ్య. ఒకటోరకం సిగరెట్టు తనొకటి అంటించి, మరొకటి నాకిచ్చాడు.

''మీకు శంకరంపిళ్ళై తెలుసునటండీ మాస్టారూ?'' అన్నాడు శరభయ్య.

''ఏ శంకరం పిళ్లై?''

''జాయింట్ సెక్రటరీ...''

''ఓ అతనా! తెలియకేం?''

కాస్సేపటిదాకా, శరభయ్య ఏమీ అనలేదు. సిగరెట్టును ఆఖరి సారిగా గట్టిగా పీల్చి, యాష్ ట్రేలో పడేసి, వేళ్ళు విరుచుకొన్నాడు. ఒక రెండు క్షణాలు, నా కళ్ళల్లోకి దీక్షగా చూశాడు.

''అతనెలాంటి వాడంటారు?''

''మంచివాడేనే! ఏం?''

శరభయ్య, ఓసారి చుట్టూరా చూసి గొంతు సవరించుకొన్నాడు.

''మరేం లేదు లెండి. మా అప్లికేషను అతని దగ్గరున్నదని తెలిసింది. మీరూ ఓసారి కదిపి

చూడండి. అవసరమయితే, కొంత 'ఖర్చు' పెడదాం. దానికి చాలా మంది కాంపిటీషనున్నారు. అతను తలచుకొంటే పనవుతుందని విన్నాను. అతనితో నాకు పరిచయం లేదు. మీరున్నారన్న ధైర్యం లేకపోతే, నేనీ గొడవలోకే దిగకపోదును. సాయంత్రం క్లబ్బులో కలుసుకొన్నప్పుడు, ఆయనకి జ్ఞాపకం చేయండి. మరి నాకు సెలవిప్పిస్తారా? రేపు కలుస్తాను..."

శరభయ్య వెళ్ళిపోయిన చాలా సేపటిదాకా, అతన్ని గురించే ఆలోచిస్తూ ఉండిపోయాను. నా కెందుకో చటుక్కున అనిపించింది శరభయ్య దేవాంతకుడని! అలా, అప్పుడెందుకనిపించిందో, నాకే స్పష్టంగా తెలీదు.

శంకరంపిళ్ళై క్లబ్‌లో కనిపించినపుడు మాట సామెతగా అడిగాను. ఆ బస్సు రూటు ఇంకెవరికో ఖాయమైందనీ, నాలుగయిదు రోజుల్లో ఆర్డర్లు పంపబోతున్నామనీ అన్నాడు. అంతమాట అతనన్నాక, ఇంకా శరభయ్య కేదో వరగబెట్టమని, నేను పిళ్ళైతో అనలేకపోయాను.

మొన్నోడు పది గంటలకల్లా శరభయ్య వచ్చాడు. శంకరం పిళ్ళై చెప్పిన సంగతినే అతనితో అన్నాడు. క్షణకాలం శరభయ్య ముఖం మాడిపోయింది.

"రాత్రి మీ హెూటలుకు నాలుగైదుసార్లు ఫోను చేశాను. మీరు రూములో లేరుటగా?"

"ఎందుకండీ?" అన్నాడు శరభయ్య.

"మీకు నేనే విధంగానూ సాయపడలేకపోయాను. కానీ మీరు మాత్రం..."

"ఆఁ దానిదేముందిలెండి!" అంటూ నవ్వాడు శరభయ్య.

"ఇప్పుడు నా దగ్గర గూడా డబ్బు లేదు. నాలుగైదు వందల రూపాయల గుడ్డలు తెచ్చి ఇంట్లో పడేసి వెళ్ళారు. నేనిమ్మన్నానని ఇచ్చారుటగా! పోనీ వాళ్ళవి వాళ్ళకిచ్చేయండి. ఇంకా వాటిని అలానే ఉంచాను..."

ఈ మాటలంటున్నంత సేపూ, శరభయ్య 'ఆఁ పోన్లెండి' 'సింగినాదంగాదూ' 'ఏమిటండీ మీదంతా-' అంటూనే ఉన్నాడు. నేను పిలుస్తున్నా వినిపించుకోకుండానే వెళ్ళిపోయాడు.

అయిదారు రోజుల తరువాత శంకరం పిళ్ళై కనిపించి చెప్పాడు. ఆ బస్సు రూటు శరభయ్యకే వచ్చిందట. పాత ఆర్డర్స్‌ను కాన్సిల్ చేస్తూ 'పైనించి'హుకుం వచ్చిందట! అంతకన్నా వివరాలు నేనడగానూ లేదు, అతను చెప్పనూ లేదు.

మళ్ళీ శరభయ్యను కలుసుకొనే మహద్భాగ్యం 1953లో కలిగింది. 49 నాటికీ, 53 నాటికీ, నాకెక్కడా లంగరంద లేదు. రెండస్థుల మేడ, ముందు చిన్న తోట, ఓ పక్కగా గారేజి, దాని పక్కనే పెద్ద షెడ్డు, అందులో నాలుగు బస్సులు, అట్టహాసంగా ఉంది.

"ఎలా ఉన్నారు? ఏం చేస్తున్నారు?" అన్నాను లాంఛనంగా.

"ఏం చెయ్యడానికీ తీరిక చిక్కడం లేదండీ! నా పూర్తి కాలాన్ని దేశ సేవకే అంకితం చేద్దామనుకొంటున్నాను. దేశం రాజకీయంగా విముక్తి పొందినా, ఇంకా మనం విముక్తులం కావలసిన సమస్యలు అనేకం ఉన్నాయి. నిన్న మొన్నటి దాకా, బ్రిటిషువాళ్ళు మనల్ని అణచి పెట్టారు. మన

ప్రకృతి సంపదను ఉపయోగ పెట్టనివ్వలేదు. మన మీద తీవ్రమైన ఒత్తిడి ఉంది. ఆ వత్తిడిని తగ్గించాలంటే ఆ రంగాన్ని అంటి పెట్టుకున్న ప్రజలకు, కొత్త పనులు చూపాలి. అంటే పరిశ్రమలు అభివృద్ధి కావాలన్నమాట. ప్రతిదాన్నీ మనం ఇతర దేశాలనుండి తెప్పించుకొంటున్న కారణాన, మన విదేశీ నిల్వలు కార్పూరంలా హరించి పోతున్నాయి. ఈ సంక్షోభాన్నుండి దేశాన్ని రక్షించవలసిన అవసరం ఎంతైనా ఉంది. దేశ భక్తుడైన ప్రతివాడూ ఇప్పుడు చెయ్యవలసినపని, విరివిగా పరిశ్రమల్ని స్థాపించడం, నేనూ ఉడుతా భక్తిగా, దేశం పట్ల నాకున్న బాధ్యతల్ని నిర్వహిద్దామనుకొంటున్నాను...''

''గొప్ప ఉద్దేశం. కానివ్వండి'' అని వచ్చేశాను.

ఇది జరిగిన నాలుగు నెలలకే ''శరభేంద్రా ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్'' వారి సప్లిమెంటుల్ని దినపత్రికలు ప్రకటించడం జరిగింది.

ముకుందం జాబు రాసినదాకా, ఈ శరభేంద్రా ఇండస్ట్రీస్, శరభయ్యదేనని నేను రూఢ చేసుకోలేక పోయాను. శరభయ్యను గురించి ఆలోచిస్తుంటే - అలా ఆలోచించే హక్కే నాకు లేదనిపించింది. పట్టుమని పది సంవత్సరాలు గడవలేదు; చిత్రంగా ఆరిపోయాడు శరభయ్య. ఈ మార్పుకు అతని తెలివితేటలే కారణమన్న వాదాన్ని, ఇప్పటికీ బహిరంగంగా నేను ఖండించలేక పోతున్నాను. పరిసరాలతో ఇట్టే ఇమిడిపోవడమే కాదు; వాటిని తనకు ఉపయోగపడే పద్ధతిలో మలుచుకోవడం శరభయ్యకు బాగా చేతనవుతుందనుకొంటాను. జీవితం 'రేస్' లాంటిదనుకొంటే, శరభయ్య మనకు విపులంగా అర్థమయిపోతాడు. బలం, జవం ఉన్న గుర్రం గెలుస్తుంది. బలం లేనివి, ఓడిపోతాయి. గెలిచిన గుర్రాన్ని చూసి అసూయపడి లాభం లేదు. మరో గుర్రం గెలవగూడదన్న శాసనమేమీ లేదే!

అతనేవో అవినీతి మార్గాల ద్వారా ఈ స్థితి కొచ్చాడని, చాలా మంది నాతో అన్నారు. ఆ వాదనతో నేనెప్పుడూ ఏకీభవించలేదు. ఏదో మార్గం వల్లకాటి మార్గం- అతను సాధించాడు. సన్మార్గంలో ఉండి, నువ్వు కలలో కూడా కనలేనివాటిని అతను చిటికెలో చెయ్యగలడు. కొండమీది కోతిని దింపమన్నా దింపగలడు. అతని మాటకున్న చెలామణీ నీ రూపాయి నోటుకు లేదు. నీ మంచితనం, నిజాయితీ, సన్మార్గం, రుజుత్వం వగైరా వగైరాలు కేవలం అలంకార ప్రాయాలు. శుద్ధ దండగ. కాదనే వారికి ముకుందాన్ని చూపించదలచుకొన్నాను.

నాకు తెలిసినంత వరకూ ముకుందం సజ్జనుడు. చాలా మందిలో అంతర్గతంగా ఉండే సవాలక్ష దుర్లక్షణాలు వాడిలో లేవు. ఏ పని చేసినా మనస్ఫూర్తిగా చేస్తాడు. అనుకొనేదొకటి, అనేదొకటి ముకుందం నిఘంటువులోనే లేదు. చెప్పిన దాన్ని మాట తప్పకుండా చెయ్యడం వాడి ప్రత్యేకత. 1940లో చేస్తున్న ఉద్యోగాన్ని వొదిలేసి దేశ సేవకు పూనుకొన్నాడు. ఖద్దరు కట్టాడు. ఇంట్లో వారందరి చేతా కట్టించాడు. రాట్నం వొడికాడు. కల్లుపాకల దగ్గర పికెటింగ్ చేశాడు. దెబ్బలు తిన్నాడు. ముణ్నెల్లపాటు జైల్లో ఉండి వచ్చాడు. హరిజనులను ఇంట్లోకి రానిచ్చాడు. సమిష్టి భోజనాలు చేశాడు. అంతా గొప్పవాడన్నారు. స్వచ్ఛంద సేవకుడన్నారు. 'జై'లలో కొట్టారు. ఏం జరిగిందట? ముకుందం ఇప్పుడు ఎందునా కాకుండా ఉన్నాడు. ఆస్తంతా కరిగిపోయింది. బ్రిటీషు వాళ్ళమీద కోపంతో

కొడుకుల్ని చదివించడం మానేశాడు. వాళ్ళెందుకూ పనికిరాకుండా ఉన్నారు. కూటికి గుడ్డకు నానా గడ్డి కరుస్తున్నాడు. ఏదో ఓ ఏర్పాటు చెయ్యమని ముకుందం జాబు రాశాడు. నాలుగు రోజులు ఆలోచించాక, కుటుంబంతో సహా బయలుదేరి రమ్మని జవాబు రాశాను.

రాశానేగానీ, నేనే విధంగానూ సాయపడలేనని నాకు తెలుసు. అథవా ఏదో తంటాలుపడ్డా, అది ముకుందానికి కావలసిన విధంగా ఉండదనేది ఖాయం. అలాగని నా ప్రయత్నాలు మానలేను. అదృష్టం వుంటే- ఏమో ఎవరు చెబుతారు?

ఎన్నడూ దేనికీ యాచించని ముకుందం, ఇప్పుడు తన కుటుంబ భవిష్యత్తుకోసం, ఉద్యోగాలు యాచిస్తున్నాడు. అందులోనూ, నేర్పులేదు. ధైర్యం లేదు. నన్నే ఏదో చూడమన్నాడు. అలా అనడంలో నాలుగైదుసార్లు శరభయ్య ప్రసక్తి తెచ్చాడు.

"శరభయ్య నీకేమన్నా వరగబెడతాడని నువ్వనుకొంటున్నావా?" అన్నాను.

"దాన్ని వొరగ బెట్టడమనకు. ఇంకేమన్నా అను, నేను ఊరికే డబ్బివ్వమనడం లేదు. చాకిరీ చేయించుకోమంటున్నాను. న్యాయంగా డబ్బివ్వమంటున్నాను. ఇందులో వొరగబెట్టడమేముందీ! నాకెందులో శరభయ్యమీద నమ్మకముంది. ఒక ఊరివాళ్ళం. చాలా కాలం కలిసి మెలిసి తిరిగిన వాళ్ళం. అనేక సార్లు అతనికి సాయపడ్డాను. ఇప్పుడా మాత్రం చెయ్యలేడా - అని!"

ముకుందాన్ని చూసి జాలిపడ్డాను.

"మనుషుల సంగతి నీకు బొత్తిగా తెలీదు ముకుందం. నువ్వెప్పుడో పదిహేనేళ్ళ కిందటి సంగతి చెబుతున్నావు. అప్పటికీ ఇప్పటికీ మీ ఇద్దరి అంతస్థుల్లోనూ చాలా తేడా ఉంది. ఆ తేడా తప్పకుండా, మీ స్నేహాలమీద పనిచేస్తుంది. తీరా వెళ్ళాక, అతను కాదంటే నువ్వు చాలా బాధపడతావు. అందుకు సిద్ధమేనంటే వెడదాం పద." అన్నాను గతిలేక.

"నువ్వెందుకిలా అనుకొంటున్నట్టు?" అన్నాడు ముకుందం నవ్వుతూ.

"నీకంటే మనుషుల్ని గురించి నాకెక్కువ తెలుసు గనక."

ఏమనుకొన్నాడో ఏమోగానీ ముకుందం ఆ సంభాషణను అంతటితో ఆపేశాడు. నేనూ కదపలేదు.

కాదనుకొంటూనే శరభయ్యకు నేను ఫోను చేశాను. నాలుగు సార్లూ అతను దొరకలేదు. స్వయంగా రెండు దఫాలు వెళ్ళాను. ఇంట్లో ఉండడు. ఫ్యాక్టరీలో ఉండడు. ఎక్కడికెళ్ళాడంటే తెలియదని జవాబు. విసుగెత్తి మానేశాను.

"ఇవాళ శరభయ్యను చూశాను" అన్నాడు ముకుందం ఓనాటి మధ్యాహ్నం.

"ఎక్కడ? ఏమన్నాడు?"

"రాజీ కుదిరే అవకాశం లేదు."అన్నాడు ముకుందం చాలా నిరుత్సాహంగా.

అతనంటున్నదేమిటో నాకు బోధపడలేదు.

‘‘అదేరా! సమ్మె సంగతి. నాలుగు రోజుల్నించీ, మొత్తం కూలీలందరూ సమ్మె చేస్తున్నారుగా.’’ అన్నాడు ముకుందం.

‘‘నాకు తెలీదే?’’

‘‘చేస్తున్నారు.’’ అన్నాడు ముకుందం.

‘‘ఎందుకు చేస్తున్నారని అడిగాను. వారు చెప్పిన మాటలు వింటుంటే గుండె తరుక్కుపోయింది. రోజుకు పదిగంటలు పనిచేయిస్తాట్ట. ఏ చిన్న తప్పు జరిగినా జరిమానాలు వేస్తాట్ట. అంకెలు వెయ్యకుండా రసీదుల మీద సంతకాలు తీసుకొని, ఎక్కువ డబ్బిచ్చినట్లు లెక్క రాస్తాట్ట. జీతాలు పెంచమని ఆరునెల్ల నించీ అడుగుతుంటే, ఇదిగో అదిగో అంటూ జరుపుతున్నాట్ట. ఆఖరుకు గత్యంతరంలేక, నెల రోజుల నోటీసిచ్చి, నాలుగు రోజుల్నించి సమ్మె చేస్తున్నారు. దాన్ని పడగొట్టడానికి నానా యాతనలూ పడుతున్నట్టు గ్రహించాను. ఈ సమ్మె సాక్కుండా చేస్తే, నా పిల్లలకి ఉద్యోగాలిస్తానన్నాడు. నాకూ ఏదో ముట్టచెబుతాట్ట.’’

‘‘ఇందులో నీ ప్రసక్తేముంది.’’ అన్నాను అర్థంగాక.

‘‘కూలీలు, నా తీర్పుకు నిలబడతామన్నారు. ఆ సంగతి శరభయ్యకు చెప్పాను. తీర్పెలా ఉండాలో అతను నాకు డిక్టేట్ చేశాడు.

ఈ తీర్పుకు కూలీల్ని వొప్పుకునేట్టు చేస్తే, నాకీ లాభాలుంటాయన్నాడు. లుచ్చా’’ అన్నాడు ముకుందం.

అంత కోపం ముకుందానికి రాగా నేనెప్పుడూ చూడలా.

‘‘ఏం చేదామనుకొంటున్నావ్?’’

‘‘సమ్మె సాగుతుందని చెప్పాను. ఈ రోజునించీ నేనూ సత్యాగ్రహం చేయబోతున్నాను.’’ అన్నాడు ముకుందం.

‘‘అయితే శరభయ్య కంపెనీలో నీ పిల్లల ఉద్యోగానికి ఆశ వొదులుకోవాలి.’’

‘‘ఒదులుకుంటాను. ఇంత నీచంగా వచ్చే ఉద్యోగాలు, నా పిల్లలు చెయ్యనక్కర్లేదు.’’ అన్నాడు ముకుందం.

ఆఫీసునుంచి బయలుదేరబోతుండగా శరభయ్య ఫోను చేశాడు. తనను కలుసుకోమని. ముకుందాన్ని గురించి అడగడానికనుకొన్నాడు. నా అనుమానం నిజమే అయింది.

‘‘ముకుందానికి మీరన్నా చెప్పి చూడండి సార్! ఆ కూలీ వెధవల్ని వెంటేసుకొని గోల చేస్తున్నాడు. వాళ్ళు వాగినదంతా నిజమేనంటాడు. వాళ్ళకు పక్క తాళం వేస్తున్నాడు. రాబొయ్యేముందు, ఆఫీసులోకి పిలిపించి మాట్లాడి చూశాను. ఉత్త మూర్ఖుడు. వాళ్ళడిగిందంతా ఇచ్చెయ్యమంటాడు. నేనీ పరిశ్రమల్ని ఎందుకు పెట్టానో చెప్పాను. దీనివల్ల ఎంత విదేశీ మారకం దేశానికి ఆదా అవుతుందో అంకెలలో చూపించాను. ఇలా సమ్మెల్ని వెనకేసుకొచ్చి దేశ ద్రోహివి కావద్దని ఎంత చెప్పినా వినిపించుకోలేదు. మీరన్నా చెప్పి చూడండి! వస్తూ వస్తూ పోలీసు రిపోర్టు చేసి వచ్చాను. రేపు

కాల్పులు జరిగితే జరగొచ్చు. నా బాధ్యత లేదు. ముందుగా చెబుతున్నాను. మంచిగా వినకపోతే, తన్నయినా వినిపిస్తా. ఈ కూలీ వెధవలకి లొంగిపోయి దేశం పట్ల నాకున్న బాధ్యతల్నించి తప్పుకోలేను. నాకూ అతనికీ కావలసిన వారు గనక ఇంతగా చెబుతున్నాను గానీ... కొడుకులకు ఉద్యోగమిస్తానన్నాను. కావలిస్తే అతన్నీ నా దగ్గరే ఉండి పొమ్మనండి. ఈ మానేజిమెంటంతా తన్నే చూసుకోమనండి. నేను కాదనను. అంతే గానీ..."

ఆ రాత్రి భోజనాలయ్యాక, శరభయ్య ఇచ్చిన ఆఖరి ఛాన్సు ముకుందానికి చెప్పాను. చివరికి నా అభిప్రాయం గూడా తెలియపరిచాను.

"అదిగాదు ముకుందం! ఇప్పుడు నువ్వా సమ్మెలో ఉండనంత మాత్రాన నీకొచ్చిన లోటేమీ లేదు. నువ్వు దేశ భక్తుడివి కాకుండానూ పోలేదు. జీవితంలో చాలా దెబ్బలు తిన్నావు. ఇక తినే ఓపిక నీకు లేదు. ఉన్నా, నీ పిల్లల కోసమన్నా దాన్ని కొంత కాలం పాటు కట్టి పెట్టడం మంచిదని నా సలహా. తరవాత నీ ఇష్టం!"

చెబుతున్నంత సేపూ, ముకుందం, నా ముఖంలోకి గుచ్చి గుచ్చి చూస్తూనే ఉన్నాడు. అంతా విన్నాక మ్లానంగా నవ్వాడు.

"నా మాటలు నీకు నచ్చలేదా?"

"అందుగ్గాదు" అన్నాడు ముకుందం. "మనుషులు ఇంత చిత్రంగా ఎలా మారిపోతారో నాకు తెలియకుండా ఉంది. కూటికీ గుడ్డకూ అల్లల్లాడిపోయిన రోజుల్నించి, ఇంత సులభంగా శరభయ్య మర్చిపోతాడనుకోలేదు. బెజవాడ వెళ్ళిన కొత్తలో, అతను నాకో జాబు రాశాడు..."

"ఏదీ, జీతం చాలడం లేదనీ, ఎక్కువ చెయ్యమంటే పొమ్మంటున్నారనీ, సమ్మె చేస్తే కాల్పిస్తున్నారనీ -అదేనా?"

"అవును. ఇవన్నీ తెలిసి, తనే అనుభవించి గూడా శరభయ్య, ఇంత కఠినంగా తయారవడాన్ని నేనర్థం చేసుకోలేక పోతున్నాను." అన్నాడు ముకుందం...

"నా కర్థమయింది" అన్నాను కసిగా. "నాకు శరభయ్య మీద ఎప్పుడూ మంచి అభిప్రాయమే ఉంది. తనను దాచుకోవడానికి ప్రయత్నించక పోవడం, అతనిలో ఉన్న సుగుణం. కుక్క, కుక్కలాగా అరవాలిగానీ, ఆవులాగా అరవగూడదు. అలా అరచిందో- దాని నిజాయితీని, మనం తప్పకుండా శంకించాలి. కూలీగా బ్రతికినప్పుడు, ఆ మాటలే అన్నాడు. డబ్బున్న వాళ్ళమీద, కసి కోపం, మంట, అసూయ...ఇవన్నీ అతని అనుభవంలో ఉన్నవే! ఇప్పుడు అతనే డబ్బున్న వాడయ్యాడు. తనను గురించి, ఇప్పటి కూలి జనం, ఏమనుకొనేదీ అతనికి తెలుసు. కాబట్టే అతనికి అంత మంట. తను పోగుచేసుకొన్న సంపదను నిలువునా దోచుకొనేందుకే, కూలీలు ఇలా సమ్మె చేస్తున్నారన్న భావం, అతనిలో ఉంది. ఇవన్నీ ఉండటం, శరభయ్య తప్పు కాదనుకొంటాను. అలా ఉండటం, ఆ వర్గ లక్షణ మయినప్పుడు, మనం శరభయ్యను తప్పుపట్టి లాభం లేదు. తన స్థితికి అతీతంగా అతను మాట్లాడి ఉంటే, ఇంకా కూలీలమీదా, ప్రజల మీదా, బీదతనంమీదా సానుభూతి చూపిస్తే, మనం తప్పకుండా, అతని విషయంలో జాగ్రత్తగా ఉండాలి. తన వర్గ దృష్టిని బైట పెట్టడంలో, శరభయ్య

ఎప్పుడూ తప్పటడుగు వెయ్యలేదు. కదూ?''

"అది పరిణామమనే నువ్వంటే, అటువంటివాటికి నేను చాలా దూరంగా ఉండాలని కోరుకొంటున్నాను. అలా - ఊసరవెల్లిలా మారి పోవడం నాకు చాతకాదనుకొంటున్నాను. నేను న్యాయం, ధర్మం, సత్యం అనుకొన్నదాని కోసం. మనస్ఫూర్తిగా దెబ్బలాడిన వాణ్ని, ఏ ఎండకాగొడుగు పట్టడం - ఇంతవరకూ నా వల్ల కాలేదు!'' అన్నాడు ముకుందం గంభీరంగా.

"ఇక ముందు గూడా కాదు. నీ చేత గాని తనాన్ని కప్పి పుచ్చుకొనేందుకుగాను ధర్మం అంటావు. న్యాయం అంటావు. సత్యం అంటావు. మారనంటావు. పరిస్థితులకు అనుగుణంగా మారలేకపోవడం జడలక్షణం గానీ మనిషి లక్షణం కాదనుకొంటాను. నువ్వంటున్న చిలకపలుకులన్నీ మంచివా చెడ్డవా అని తర్కించకు. మంచివే కావచ్చు. కానీ ఈ నాణేలు ఇప్పుడు చెలామణిలో లేవు. ఈ చెల్లని డబ్బులు జేబులో వేసుకుని, ఏమేమిటో కొందామని బయలుదేరావు. నీ ప్రయాణం శు ద్ధ దండుగ. నువ్వేమీ కొనలేవు. పైగా మాయ డబ్బులిచ్చి మోసం చేస్తున్నావని నీ మీద కేసు పెట్టే ప్రమాదం ఉంది. ఆలోచించుకో!''

ఆ తెల్లవారి శరభయ్య ఫోన్‌లో పిలిచి చెప్పాడు; సత్యాగ్రహం చేస్తుంటే ముకుందాన్ని పోలీసులు అరెస్టు చేశారట. వంటినిండా గాయాలతో స్పృహలేకుండా స్టేషన్‌లో పడి ఉన్నాట్ట.

ముకుందాన్ని చూసి, జాలిపడాలో విచారించాలో నాకిప్పటికీ తెలియడం లేదు.

* * *

# ఇప్పుడు

## (1965-)

## వాడే వీడు

## నాకు దేవుని చూడాలని ఉంది

**1962** నుండే 'కృష్ణా పత్రిక' వారు భరద్వాజ రచనలను ఆహ్వానించారు. 'ఇదిగో-అదిగో' అంటూనే ఒక కథ, అరకథా రాసి సరిపెడుతూనే ఉన్నాడు. ముదిగొండ సుబ్రహ్మణ్య శర్మగారు, రచనల కోసం భరద్వాజను వేటాడటం ప్రారంభించారు. ఈ వేటనుండి తప్పుకోడం తెలియని వాడేం కాదు గానీ, కాశీనాథుని సుబ్రహ్మణ్యంగారు, 'ఉడుం'లాగా పట్టుకొన్నాడు. ఆ

పట్టు వల్ల బ్రహ్మాండమైన నవల "పాకుడు రాళ్ళు" రాశాడు భరద్వాజ. ఆ ఊపులోనే 'కరిమింగిన వెలగపండు' - 'జలప్రళయం' నవలలూ రాశాడు. మొత్తం భూగోళ శాస్త్రాన్ని కథాకథన రీతిలో 'విను వీధిలో వింతలు'గా రాశాడు. అనేక వైజ్ఞానిక వ్యాసాలను రాశాడు. 'వేకువ' పేరుతో హరిజన సమస్య మీద ఒక 'నవలానిక' రాశాడు. ఈ మధ్యలోనే పురుషోత్తం అనువదించిన రెండు ఆంగ్ల కథానికా సంపుటాను వెలువరించాడు. కొంత కాలం పాటు-- 'జీవన సమరం'లో మునిగి తేలాడు. తెలుగు భాషలో వెలువడిన మొట్టమొదటి 'యధార్ధ జీవిత గాధా సంపుటి' కర్తగా భరద్వాజను ఆంధ్ర ప్రజలు గౌరవించారు.

ఇప్పుడు కథానికా రచనలో మరో కొత్త ప్రయోగం ప్రారంభించాడు భరద్వాజ. ఒక పదం -- ఎన్ని అర్థాలనిస్తుందో - ఒక పదాన్ని ఎన్ని విధాలుగా వాడవచ్చునో- చెప్పడం, భాషాశాస్త్ర వేత్తల పని! పద స్వరూపాన్ని సంపూర్ణంగా అవగాహన చేసుకొంటే తప్ప ఇది సాధ్యం కాదు. అదీగాక ఇది పాండిత్యానికి సంబంధించిన 'గొడవ'. ఈ 'గొడవ'లో ఉన్న క్లిష్టతను తొలగించి, దీన్ని సృజనాత్మకంగా కళాత్మకంగా రూపొందించడం సాధ్యపడుతుందని, భరద్వాజ రుజువు చేశాడు. ఆయన రాసిన 'ఆవంత' - 'తే-నీరు'- 'పుట్టి'- 'ఆ-పన్నులు' - 'వాడే-వీడు' అన్న కథలు ఈ శబ్ద క్రీడలలోని వైచిత్రిని మనకు దర్శనీయం చేస్తాయి. అందులోంచి ఓ కథ...

# వాడే వీడు

**"ఆకాశవాణి** - రావూరి భరద్వాజ రచించిన వాడే వీడు వింటారు."

చచ్చాంమురా భగవంతుడా! దాని 'ఫార్మేట్' ఏమిటో కూడా చెప్పకుండా ఎనౌన్సర్ వెళ్ళి పోయాడు. ఇప్పుడేమిటి చేయడం? నేనేం చెప్పాలని ఈ ఎనౌన్సర్ మహాశయుని అభిప్రాయం?

మరో 10, 15 నిమిషాల దాకా అతగాడు, ఈ చుట్టు ప్రక్కలక్కూడా రాడు. ఈ లజ్జు గుజ్జుల్ని యింతటితో ఆపేసి ఈ 15 నిమిషాలూ విరామ సంగీతం ప్లే చేయటం పెద్ద కష్టమేమీ కాదు కానీ నాకా పని చేయటం బొత్తిగా యిష్టం లేదు. ఈ శీర్షికను గురించి ఎనౌన్సర్ మహాశయుడు తన మనసులో ఏదో అనుకొనే వుంటాడు. అతనేమనుకొన్నాడో తెలీదు. అతనేమనుకొన్నాడో, ఏమనుకొని ఉంటాడో, ఏమనుకొని వుండవచ్చునో, నేననుకొని యిక కార్యక్రమాన్ని ప్రారంభిస్తాను.

ఆ ఎనౌన్సుమెంటు వింటూనే, నా మనసులో మెదిలిన పుస్తకాలు మూడున్నాయి. పేరు కవి మూడే గానీ - నిజానికొక్కటే పుస్తకమది. పాంచకడీ దేవ్ రాసిన అపరాధ పరిశోధన నవల. "వాడే వీడు"- "నేనే"- "కాలూ రాయి" అన్న మూడు పేర్లకింద, మూడు రాగాలుగా వెలువడిన ఒకే వొక్క నవల అది!

దాదాపుగా 40 సంవత్సరాల నాటి మాట. ఉసిలిపోతున్న గ్రంథాలయం గోడలకు జారగిలబడి,

ఎప్పుడూ, ఎవ్వరూ విప్పని బీరువాల తలుపుల్ని తెరచి అందిన ప్రతి పుస్తకాన్నీ, ఆవురావురుమంటూ మింగేసే కాలమది. ఆకలి, దాహం, కాలం, దేశం, ఏవీ ఏ పరిస్థితుల్లోనూ దృష్టికి రాని రోజులవి.

ఆ నవల చదివి, మళ్ళీ చదివి, మళ్ళీ మళ్ళీ చదివి, మళ్ళీ మళ్ళీ మళ్ళీ చదివి - కావాలని ఆపాదమస్తంభయంతో నింపేసుకొని, ఆ భయాన్ని పోగొట్టుకునేందుకు గుంజుకొని, రుంజుకొని, ఉన్న ధైర్యాన్నంతా పుంజుకొనడంలో వుండే హాయి - క్షమించండి, ఇప్పుడు నా కెక్కడా కనిపించడం లేదు. ఎంచేత? ఎంచేతనో మనవి చేస్తాను.

ఉండండి- ఎనౌన్సర్ లబలబలాడిపోతున్నాడు. నేను చెప్పవలసింది, 'వాడే వీడు' అన్న నవలను గురించి కాదనుకుంటాను... ఏం మహానుభావా! మరిదేన్ని గురించి? అతనేదో అంటున్నాడు. అంటున్నట్టు నేను కంటున్నాను. కానీ వినబడదు. అతనికీ నాకూ మధ్య గాజుపలకలు అడ్డం వున్నాయి. నయనేంద్రియమే తప్ప- శ్రవణేంద్రియం ఉపయోగపడదిప్పుడు-

పోనీ అతని ఆదేశాన్ని పాటించి ఇక్కణ్నించే నా కొత్త కార్యక్రమం ప్రారంభిస్తాను. ప్రారంభించాను-అది ప్రారంభమై కూడా పది సెకెండ్లయింది.

'వాడే వీడు' అన్న ఈ శీర్షిక వినంగానే నాకు మొదట స్ఫురించింది. పాంచకడీదేవ్ రాసిన అపరాధ పరిశోధక నవల-

ఎనౌన్సర్ మహాశయుడు అది కాదన్న తరువాత స్ఫురించింది ఈ వాక్యానికున్న వివిధార్థాలు. కొంచెం విడమరచి చెప్పుకుందాం.

''వాడేవీడు' అన్న వాక్యంలో రెండు పదాలున్నాయని తెలుస్తూనే వున్నది. ముందుగా 'వాడే' అన్న పదాన్ని తీసుకొందాం. ఆ పదానికి వాడిపోయే, కసుగందే, మ్లానమయ్యే, వాడుకచేసే, ఉపయోగించే, అతనే, అనే అర్థాలున్నాయి.మహాపండితులూ, భాషా శాస్త్ర వేత్తలూ, అందులోంచి ఇంకిన్ని అర్థాలనుపిండుతారనటంలో మనకెవరికీ అనుమానాల్లేవుగదా!

ఇహ రెండవది - 'వీడు' అన్న పదం. దీనికి పుంజీల కొద్దీ అర్థాలున్నాయి. వీడు - అంటే, వదలిపెట్టు, విడిచిపెట్టు, విశదం చెయ్యి, ఇల్లు, కొనసాగు, వర్థిల్లు, పెరుగు, ఎదుగు, కట్టుము, కానుక, పట్టణము, శిబిరము, అధికజన సమూహము అన్న అర్థాలతో బాటుగా; మధ్యలో అర్థానుస్వారాన్ని చేర్చినప్పుడు; ఇతను, ఈ పురుషుడు, అన్న అర్థాలూ కనబడతాయి. విరివిగా; చూశారా- క్షమించండి యిక్కడ చూడ్డానికేమీ లేదు; 'విన్నారా' అనాలి, విన్నారా తమాషా' అటు యిటూ యెటునుండి చూసినా 'విస్తృతి', 'పుష్కలం', 'సమృద్ధి' అన్న అర్థాలిచ్చేపదం ఈ 'విరివి' అనిపిస్తుంది మనకు, వచ్చిన చిక్కేమిటంటే ఇక్కడ ఈ అర్థంలో, ఈ పద ప్రయోగం చేసి తీరాలంటే 'ర' సాధు రేఫం కాకూడదు. శకటరేఫం కావాలి. కాదూ 'పూవు' అన్న అర్థంలోనో, వికసించినది, వీడినది, తొలగినది- అన్న అర్థంలోనో ఈ పదాన్ని ప్రయోగించినప్పుడు 'ఱ' అని శకట రేఫం ఉండనవసరం లేదు. సాధు రేఫం మాత్రమే ఉండాలి. ఇక్కడ మరో అప ప్రయోగం పొడుచుకొచ్చి, మనస్సులో కలుక్కుమంటున్నది. 'అవసరం' అని ఇంతకుముందో ముక్క అన్నాను- 'అవశ్యకత'- 'అక్కర', అని నా అభిప్రాయం. కానీ నిఘంటువులు దీనికొప్పుకోవు. 'అవసరం' అంటే- సమయం,

వేళ, కురియుట, ఒకానొక మంత్ర విశేషం- ఇల్లాగా ఎన్నెన్నో అర్థాలున్నాయి. ఇక ఇందుకు సంబంధించిన కవి ప్రయోగాలు మన సాహిత్యం నిండా కోకొల్లలు. ఉదాహరణకు మనవి చేస్తాను-

...క్షమించండి! మళ్ళీ మన గడబిడ రావు రంగప్రవశం చేశాడు. ఏం బాబూ! ఈ సారి తమ బిడగడ లెందుకయ్యా? నీ మాట నేను శిరసావహించానే! నేనిప్పుడు పాంచకడీదేవ్‌గారి అపరాధ పరిశోధన నవల 'వాడే వీడు'ను గురించి మాట్లాడడం లేదు. తమరు, నాపట్ల దయతో ప్రకటించిన 'వాడే వీడు' అన్న శీర్షికను జస్టిఫై చేయడానికి కుస్తీ పడుతున్నాను. అందుకని నలభయ్యేళ్ళ కింది నా జ్ఞాపకాలను, నన్నీ ఆపదలో ఆదుకొమ్మని ఆహ్వానిస్తున్నాను. గుర్తున్నంత వరకూ, నానార్థాలను చెప్పుకుపోతున్నాడు... ఇక - నా దోవన నన్ను పోనీ. నే చెప్పుకునే సంజాయిషీ నన్ను చెప్పుకోనీ..

ఉఁహూ! మనవాడు వొప్పుకోడం లేదు. అతనిక్కావలసింది పదాలు, పదాలకున్న నానార్థాలు కావేమో! మరేమి కావాలో తెలీదు... నాయనా! ఇంక నువ్వేమన్నా అనుకో. జరిగిందానికి మన్నించమని కోరుతూ నా చాతనైనది కథ చెప్పడమే గనక, మిగిలిన సమయానికి ఆ కథ చెప్పేసి నా దోవన నేను చక్కా పోతాను. ఆ దరిమిలా, నువ్వే గంగలో దిగినా, నువ్వే గంగలో దిగకపోయినా నాకు విచారం లేదు. నేను నా కథను చెప్పుకు పోతున్నాను...

అసలు నా మొదటి పేచీ, ఈ శీర్షికతోనే! 'వాడే వీడు' అనడంలో ఇప్పుడు నాకు స్ఫురిస్తున్న మూడో అర్థం 'వాడిపోతున్న పట్నం' అని. కలకల లాడవలసిన పట్నం, పకపక లాడవలసిన పట్నం, తెక తెకలాడుతున్నదేం? మిగతా దేశమంతా బెట్టలిచ్చిపోయినా, నగరం, మాగాణం కావలసిందేనే! నదులన్నీ సాగరంలో కలిసిన రీతి, రోడ్లన్నీ రోమ్‌ను చేరుకొన్న భాతి, దేశ సంపదంతా, నగరాలకూ పట్నాలకు ప్రవహించడం నీతి! అల్లానే జరగడం రీతి. మరెందుకు నగరం వాడిపోవడం?

నగరం మిసమిసలాడే మిఠారి కత్తె

నగరం మోసాలకు ఆవాసం.

నగరం మింగడానికి మెతుకు లేకపోతేనేం?

నగరం మీసాలకు సంపెంగ నూనె గమగమలు.

నగరం నిండా-

... క్షమించండి!

ఇల్లాగా నగరం మీద అనగా 'వాడే వీడు' మీద చెప్పుకుపోదామనుకొన్నాను. కానీ మన గడబిడరావుగారు నోరూ, నెత్తీ మోదుకొంటున్నారు. అంటే వారనుకొన్నది యిదీ కాదన్న మాట... సరే! ఏం చేస్తాం? రోటిలో త దూర్చిన తదుపరి రోకటి పోటునకు భయపడనేల? వేరొండు గాథను పలికెదరు గాక!

నాయనా! ప్రియమైన తికమకరావుగారూ! ఆఖరు సారిగా చెబుతున్నాను- ఇప్పటికే దాదాపుగా సగం సమయం ఈ గొడవతో సరిపోయింది. ఇప్పుడు మళ్ళీ కొత్తగంతా కథ మొదలెట్టే వోపిక నాకూ లేదు. పొరపాటుగానో, గ్రహపాటుగానో, నగరం గురించి కొంత చెప్పుకొచ్చాను. ఇప్పుడు రంగస్థలం

మార్చి, పాత్రల్ని మార్చి కొత్తగా మొదలెట్టడం కన్నా- ఆ రంగం మీదనే, ఆ పాత్రలతోనే నా కొత్త కథ ప్రారంభిస్తాను. నువ్వొప్పుకో, ఉరేసుకో - నాకు సంబంధం లేదు. ఓరి నీ ఇల్లు బంగారం గానూ! మళ్ళీ ఏమిటయ్యా బాబూ! అవును, నాకు గుర్తున్నది. ఇంతవరకూ, రంగస్థలం మాత్రమే సిద్ధం చేశాననీ, పాత్రల్ని ప్రవేశ పెట్టలేదనీ, నాకూ జ్ఞాపకం ఉన్నది. రంగ స్థలం ఏర్పాటు చేసిన వాణ్ని పాత్రల్ని తీసుకు రానుటయ్యా బాబూ! పోనీ మాట వరసకు అనుకొందాం! పాత్రలు రావడమంటే నేరుగా రంగస్థలం మీదికే రావాలా? వచ్చినంత మాత్రాన ఏదో చెత్త మాటడాలా? ఖాళీగా రంగస్థలాన్నుంచి, పాత్రల నన్నింటినీ, తెర వెనక ఉంచి, అద్భుతంగా ప్రదర్శనను రక్తి కట్టించవచ్చు. అలాంటి నాటకం ఓటి రద్దామనీ ప్రదర్శించుదామనీ, నాకూ కుతూహలంగా వుంది. అయినా నేనిప్పుడు కథ చెబుతానన్నాను గానీ, నాటక మాడతాననలేదు. అదీగాక ఇంతవరకూ పాత్రలు ప్రవేశించకపోతే మాత్రమేం? ఈ కార్యక్రమం ముగిసేలోగా ఎప్పుడైనా ప్రవేశించవచ్చు. ఇక వినడం ప్రారంభించు! నాయకుని పేరు- అసలు- ఓ సంగజ్జెప్పండి, ప్రతీపాత్రకీ ఓ పేరు వుండి తీరాలా? ఈ నా కథానాయకునికి, ఏదో ఓ పేరు పెట్టి, అతని విశ్వరూపాన్ని ఆ చిట్టి, పొట్టి, బుజ్జి, బుడ్డి పేరులోకి కుదించడం నాకసలే యిష్టం లేదు.

అతనిది విశ్వరూపమన్నాను గదూ! అతనుండేది గూడా ఈ విశ్వమంతటానూ! అతన్ని నేను చాలా చోట్ల చూశాను. అమెరికాలోని సువిశాలమైన గోధుమ పొలాల్లో చూశాను. అక్కడి కీకారణ్యాల్లో కలప నరుకుతున్నప్పుడు చూశాను. కాంగోలో- యూరేనియం గనుల్లో చూశాను. దక్షిణాఫ్రికాలోని చిత్తడి నేలల్లో, చెట్ల కొమ్మలమీదా చూశాను. మధ్య ప్రాచ్య దేశాలలోని ఎగసిన ఎడారుల మధ్య, నిప్పులుమిసే ఎండకు మండుతూ, ఇసుకను ఫలహారంగా తింటున్నప్పుడు చూశాను. ఉగాండాలో కదళీవనాలకు కాపలా కాస్తున్నప్పుడూ; బురిండీలో, భాస్వరాన్ని బళ్ళకెత్తుతున్నప్పుడూ; బర్మాలోని బాడవ పొలాల్లో, వొంగి వరినారును నాటుతున్నప్పుడూ; పారిస్‌లో, పడుపుకత్తెలుండే వీధుల మొగదల నుంచున్నప్పుడూ అతన్ని నేను చూశాను.

దయచేసి నాకు అడ్డు రాకండి! నా కథా నాయకుణ్ని గురించి చెప్పవలసింది చాలా వుంది. పొలం దున్నడం, విత్తనాలు చల్లడం, ఎదిగిన పైరును కాపలా కాయడం, మార్చడం, బస్తాల కెత్తడం, ఖామందు ఇంటికి చేర్చడం, మెట్టుకట్టడం, చెమట తుడుచుకోడం, తను పండించిన పంటకేసి చూడడం, చూస్తూ చారెడు గింజలకోసం, చిరుగుల పంచె చాపడం, ఖామందు ఖస్సుమని లేవడం, గుడ్లనీరు గుడ్ల కుక్కకుంటూ ఆవురుమనడం, నా కథానాయకునికి తెలుసు.

భూగర్భంలో లోతులకు వెళ్ళడం, అర్రుతో రంధ్రాలు తొలవడం ఖనిజాలను గంపలకెత్తడం, ఫ్యాక్టరీలకు రవాణా చేయడం, ఆ ముడి సరుకుతో రకరకాల వస్తువుల్ని తయారు చేయడం, ఆ వస్తువుల్ని నీ- నా- ఉపయోగాలకు అందించడం నా కథానాయకునికి తెలుసు.

అతనికి పనిచేయడం తెలుసు. పని లేనప్పుడు పస్తులుండడం తెలుసు. ఆకలి తెలుసు. ఆక్రోశన తెలుసు. మహా భవనాలు నిర్మించడం తెలుసు. వాటి నీడన తలదాచుకోవడం తెలుసు. ధాన్యపురాసుల్ని సృష్టించడం తెలుసు. ఆ రాసుల పక్కనే గురగురలాడే పేగులతో, కడుపులో

కళ్ళెట్టుకొని, గొణుగుతూ పడుకోవడం తెలుసు. దొంగతనం తెలుసు. తాగడం తెలుసు. ఎండకు తడవడం తెలుసు. వానకు నానడం తెలుసు, చలికి చేతులతో ఎదిరించి రోడ్డువార ముడుచుకోడం తెలుసు. పిల్లల్ని కనడం తెలుసు. వారిని పాతికకూ పరకకూ అమ్ముకోడం తెలుసు. వారి కన్నూ కాలూ పొడిచేసి, విరిచేసి, వారిని చాపుతూ అడుక్కోడం తెలుసు. చెత్త కుండీల దగ్గర తిండి తునకలకోసం అన్వేషించడం తెలుసు.

నా కథనాయకుడు మితాహారి! ఎప్పుడు ఎంత దొరికితే అంతే తింటాడు. నా కథానాయకుడు మహాయోగి. ఎంతచిన్న గుడ్డముక్కతోనైనా సరిపెట్టేసుకుంటాడు. నా కథానాయకుడు పరమ శాంత చిత్తుడు తన చుట్టూ ఎంత అన్యాయం జరుగుతున్నా, కోపం తెచ్చుకోడు. నా కథా నాయకుడు ధీరోదాత్తుడు. తనకింత అన్యాయం జరిగినా తనింత అధోగతిలో ఉన్నా కిమ్మనడు. నా కథానాయకుడు అల్పసంతోషి. పిడికెడు మెతకులు పెడితే- నీకు ఉత్తమ లోకాలను ప్రసాదిస్తాడు. నా కథానాయకుడు గొప్ప భక్తుడు. ఏది యాచించినా దేవుని పేరు మీదుగానే అడుగుతాడు! నా కథానాయకుడు సౌమ్యవాది. నీవు తిండి పెట్టినా, తిట్లు వడ్డించినా, 'భగవదర్పితం' అనగలడు. నా కథానాయకుడు మహా త్యాగి ఇంకొకరి తప్పును కానుకూ, కానీకీ ఆశించి, తన నెత్తిమీద వేసుకొని, చావుదెబ్బలు తింటాడు.

నా కథానాయకునికి తెలుసు- ఇంటికన్నా గుడి పదిలంగా ఉంటుందని! నా కథానాయకునికి తెలుసు, గాలి తాగి ఎండ తినడం కన్నా కటకటాల వెనక బతకడమే సుఖమని! నా కథానాయకునికి తెలుసు, ఎప్పటికో ఒకప్పటికి న్యాయం గెలుస్తుందని! నా కథానాయకునికి తెలుసు, తనుపూర్వజన్మలో పంచ మహాపాతకాలూ చేశానని! నా కథా నాయకునికి తెలుసు. పుణ్యాత్ములకే తప్ప, తిండి, గుడ్డ దొరకవని!

అతని జీవితం చిత్రం
అతని మనుగడ విచిత్రం!
అతను లేనిదే- లేదుగదా మనుగడ
అతనిదంటూ ఏమీ లేదిక్కడా ఎక్కడా
అందుకే తిరుగుతాడు అక్కడక్కడా
మరీ బొత్తిగా లేనప్పుడు జరుగుబాటు
విధిలేక చేస్తాడు తిరుగుబాటు
ప్రాణం ఎంత తీయనిదో నీకు తెలీదా?
బతుకుటాశ ఎంత గట్టిదో
నీకు తెలీదా?
ఆ తీపిని వొదులుకొని ఆ ఆశను వొదుల్చుకొని
అన్నీ తెంపేసి

నిలువును నిప్పులతో నింపేసి
అప్పుడు ఎదుగుతాడు ఈ నా కథానాయకుడు
"రవిబింబం బుపమింప
పాత్రమగు ఛత్రంబై, శిరోరత్నమై
శ్రవణాలంకృతియై, కళాభరణమై
సౌవర్ణకేయూరమై ఛవిమత్కంకణమై
కటిస్థలి నుదంచద్ఘంటయై
నూపుర ప్రవరంబై, పద పీఠమై" ఎదుగుతాడు.
ఆ తరువాత-
"ప్రళయాగ్నిచ్ఛటభంగి, కుంభి విదళింపంబారు"
సింహాకృతితో నా కథనాయకుడు నడుస్తాడు.
"పృధ్వీ తంలంబెల్ల ఆకులమై క్రుంగ
కుఠారియై, కవచియై, కోదండియై
కాండియై, ఛవియై, సాహసియై
మృగాజన మనోజ్ఞశ్రేణియై తూణియై"
నిలబడతాడు నా కథానాయకుడు!
అవును. వాడే, ఈ బ్రహ్మాండమంతా,
"మృగాజన మనోజ్ఞ శ్రేణియై తూణియై" నిలిచిన వాడే!
సందుల్లో గొదుల్లో హీనంగా దీనంగా,
ఏడుస్తూ, బతుకుబడి ఈడుస్తూ
బతుకుతాడే వాడే నా కథానాయకుడు
వాడే భవిష్యన్మానవుడు-
వాడే వీడు!
వీడే వాడు!!

* * *

**నాస్తికునిగా** జీవితాన్ని ప్రారంభించిన భరద్వాజ ఆస్తికుడెప్పుడయ్యాడు? ఎందుకయ్యాడు? ఒకానొక బలహీనమైన క్షణంలోనా? విజ్ఞాన శాస్త్ర గ్రంథ పఠనం వల్లనా? 1947-49 సంవత్సరాల్లో, 'దేవుడు పుట్టాడు' అన్న కథ రాశాడు భరద్వాజ. నిస్సహాయ స్థితిలోనుంచే దైవభావం పుడుతుందని

ఆ కథ సారాంశం. ఈ మధ్యలో అతని పరిసరాలు మారాయి. అతనూ మారాడు. ఆ మార్పుల ఫలితంగా 'నువ్వేం చేస్తున్నావ్?'- 'స్వయంభువు' వంటి కథలు రాశాడు. దోషతప్తమైన మానవాత్మ అనుభవించే మూగ వేదనకు ఈ కథలు అక్షరాకృతినిచ్చాయి. వీటిని చదివి 'భరద్వాజ పతనమవుతున్నాడు'' అన్నవారున్నారు. ''భరద్వాజ సన్మార్గంలో కొచ్చాడు'' అన్న వారున్నారు. అతను పతనమయ్యాడో, సన్మార్గంలోకొచ్చాడో, రానున్న కాలంలో గానీ మనకు స్పష్టంగా తెలియదు.

నిన్నగాక మొన్ననే గదా- అతను 'జీవన సమరం' రాశాడు! 'నువ్వేం చేస్తున్నావ్?'- 'స్వయంభువు' వంటి కథలు- అంతకు చాలా ముందుగానే రాశాడే! 'అంతా దైవేచ్ఛ' అని నమ్మినవాడు, 'జీవన సమరం' వంటి రచనను చేయడం సాధ్యం కానే కాదు. ఇన్నిటికీ భరద్వాజను ఆవహించిన ఆ దైవభావ స్వరూప స్వభావాలను ఈ కథ- సూచ్యంగా వింగడిస్తుంది...

# నాకు దేవుని చూడాలని ఉంది!

**సత్య** ప్రమాణంగా చెబుతున్నా. నమ్మండి. గడచిన నాలుగైదేళ్ళుగా- మరీ ఖచ్చితంగా చెప్పాలంటే- ఐదేళ్ళుగా- నాకు దేవుని చూడాలని ఉంది. మీకీ పాటికి తెలిసే ఉండాలే! నేను కాస్త మొండి ముండా కొడుకును. నాది పరమ బండ జాతకం! ఏపనీ సజావుగా సాగదు. సాగదుగదాని- నేనూ ఊరుకోను. నా అంతు అదన్నా చూడాలి లేదా- దానంతు నేనన్నా చూడాలి. ఎక్కడో ఏదో మెలిక పడుతుంది. చచ్చీచెడీ దాన్ని విప్పుకుంటాను. అది విప్పుకొనే లోగా, ఇంకెక్కడో, ఎవరో పీటముడి వేస్తారు. దాన్ని ఓపిగ్గా విడదీసుకోవలసిందే తప్ప- విసుక్కోవడానికి లేదు. మెల్లగా ఆ పీటముడిని సరి చేసుకొనే వేళకు, మొత్తం దారం జారిపోయి, చిక్కుపడుతుంది. ఏది మొదలో, ఏది కొసో తెలియదు... అది కూడా తెలుసుకొనే సరికి- అసలా దారం మీదనే ఆపేక్ష పోతుంది. లేదా దాని అవసరమూ తీరిపోతుంది.

అంతకు ముందునుండే, ఈ కోరిక- దేవుణ్ని చూడాలన్న కోరిక- నా మనసు మారుమూలల్లో దాక్కొని ఉన్నదేమో నాకు తెలీదు. ఒక వేళ ఉన్నా- మిగతా కోరికల రణగొణ ధ్వనుల మధ్య, దీని తాలూకు గుసగుసలు ఉసిలిపోయి ఉండాలి. లోగడ ఎప్పుడూ, బలంగా అనిపించలేదు; అలా అనిపించినప్పుడు, ఊరుకోనూ లేదు.

1978వ సంవత్సరం జులై 5వ తేదీ బుధవారం. ఆ రోజున దేవుణ్ని చూడ్డానికి నిశ్చయించుకున్నాను. నిశ్చయించుకున్నానంటే ఇదేదో ఏకపక్షంగా నా అంతట నేననుకొన్నది కాదు. నాకిప్పుడు ప్రాణ మిత్రులు, ఆత్మీయులు, హితైషులు చాలా మంది ఉన్నారు గదా! వీరందరూ కలిసి నన్ను బాగుచేదామని సంకల్పించుకున్నారేమో! ఆ సంకల్పంలో ఒక చిన్న భాగమే నన్ను దేవుని దగ్గరకు తీసుకుపోవడం. ఇంతకు ముందే తమకు మనవి చేసుకొన్నాను దేవుని చూడాలన్న కోరిక నాలోనూ, చాలాకాలంగా ఉండి ఉండాలి. ఆ కోరికను మా వాళ్ళు మేలు కొలిపారు. నేనూ 'సరే' నన్నాను.

ఆ రోజు జులై 5 అని గదూ అన్నాను; బుధవారమని కూడా అన్నాను గదూ! నాకు బాగా జ్ఞాపకం; ఆ రోజు ఉదయం నుండే పుల్ల చినుకు రావడం ప్రారంభమయింది... మధ్యాహ్నానికి గాలి... ఆ ఈదురుగాలి దెబ్బకు, చెట్లు అల్లల్లాడిపోతూ ఘొల్లుమని గోల పెడుతున్నాయి. ఆకాశమంతా వానమబ్బులతో బరువెక్కిపోయింది. ఆ బరువును ఆచుకోలేక అప్పుడప్పుడది బాధగా మూలుగుతోంది... మూలగనప్పుడు, ఎవరో మెరుపు కొరడాలతో ఫణేలు మనిపిస్తున్నారు...

సాయంకాలం 4 గంటలయింది. నా హితులందరూ, నా కోసం ఎదురు చూస్తూ ఉంటారు. అదీగాక అప్పటికి వాన కూడా కాస్త వెనకబడింది. రోడ్లనిండా మోకాలి లోతున రొదలు పెడుతూ బురదనీరు... ఆ నీటిని చీల్చుకొంటూ- చిందగొడుతూ, కార్లు, బస్సులు, లారీలు... చిందిన నీరు మీద పడకుండా తప్పుకొంటున్న నావంటి వారూ...

ఆకాశవాణి నించి, మా ఇంటికి రావడానికి రెండు దోవలున్నాయి. ఆ రెండింటిలోనూ, ఒక దోవంటే నాకు చాలా ఇష్టం! మరీ కొండ మునిగిపోయేటంతటిదేమన్నా జరిగితే తప్ప- నేనా దోవనే వస్తాను, ఆ దోవనే పోతాను!

ఎందుకో చెప్పనా?

నాకు నూజీడీలంటే చాలా యిష్టం. మునెమ్మను నేను నాలుగైదేళ్ళుగా చూస్తున్నా. అంతకుముందు ఎక్కడున్నదో, ఎలా బతికిందో నాకు తెలీదు... ఐదేళ్ళ కిందట కొత్తగా, ఏర్పాటైన స్కూలు గేటుకెదురుగ్గా ఉన్న, చింతచెట్టు దగ్గర ఓ చిన్న గోనె పట్టా పరుచుకొని, మరీ చిన్న వ్యాపారం ప్రారంభించింది మునెమ్మ. ఐదేళ్ళ కిందట చిన్న చిన్న వ్యాపారాలు ప్రారంభించిన చాలా మంది వ్వాళ, ఎడాపెడా సంపాదించుకోవడం నాకు తెలుసు. కానీ మునెమ్మ వ్యాపారం పెరిగిందీ లేదు, తరిగిందీ లేదు.

నాకు నూజీడీలంటే ఇష్టమని చెప్పానుగదూ! మునెమ్మ- బలపాలు - చిక్కీలు, బెలూన్లు, నిమ్మతొనలు, రబ్బరు ముక్కలు, పెన్సిల్ పిక్కలు, తుతూరా బూరలు, చెరుకు పిక్కెలతో బాటుగా, నూజీడీలు కూడా అమ్మేది. నేను మునెమ్మ దగ్గర క్రమం తప్పకుండా నూజీడీలు కొనేవాణ్ని, ఏ కారణం చేతన్నా ఒక పూట నేను కొట్టు దగ్గరకు రావడం ఆలస్యమయితే, మునెమ్మ నాకోసం కళ్ళనిండా ప్రాణాలు నింపుకొని ఎదురు చూస్తూ ఉండేది.

ఒకసారి- హఠాత్తుగా సుస్తీ చేసింది. ఆఫీసు కెళ్ళలేక పోయాను. నన్ను వెదుక్కుంటూ మునెమ్మ ఆకాశవాణి కెళ్ళింది. అక్కడి వారినడిగితే, జబ్బుచేసి నేను రావడం లేదని చెప్పారుట. ఎవర్నో వెంట తీసుకొని మా ఇంటికొచ్చింది - గిల గిల లాడిపోతూ. నేనప్పుడు ఆసుపత్రిలో ఉన్నాను. మా రెండో వాణ్ని తీసుకొని ఆస్పత్రి కొచ్చింది మునెమ్మ. నన్ను చూస్తూనే భొళ్ళుమని ఏడిచింది. ఆప్యాయంగా నా వొళ్ళంతా నిమిరింది. రొంటి నుండి, రెండే రెండు నూజీడీలు తీసి నాకు తినిపించింది. అప్పణ్నించీ- మునెమ్మ- మా యింట్లో వారందరికీ దోస్తు!

అసలు సంగతి కొస్తున్నాను. అవ్వేళ నేను దేవుణ్ని తప్పకుండా చూడవలసిన రోజుగదా! అందుకోసం పెందరాడే బయలుదేరాను గదా! ఈలోగానేమో చచ్చేంత వాన కురిసి, వల్లమాలిన

ఈదురు గాలులు అతలా కుతలం చేశాయిగదా! అయినా నూజీడీల మీద నాకు మమకారం చావలేదు. రోడ్డు మలుపు తిరిగి, స్కూలు కేసి చూశాను. పాకలన్నీ వొరిగి పోయాయి. రోడ్డుకిద్దరిగా ఉండవలసిన చెట్టు కూలి, గేటుమీదికి వాలిపోయింది.

చెట్టు మొదట్లో- గువ్వలాగా- గునగున లాడుతూ- ఉండవలసిన మునెమ్మేదీ కొంప దీసి...

నెత్తురంతా ఎగసి నట్లయింది.

కొమ్మలు తప్పింది, గేటు తప్పించి, వొరిగి పోయిన పాకను తప్పించి, మునెమ్మ కోసం వెదికాను.

కొంచంగా వొరిగిన, తాడి బొత్తం మీద నిలబడ్డ కప్పు కింద గజగజలాడిపోతూ కనిపించింది మునెమ్మ.

"అవ్వా! ఇంటికి పోదాం రా!!"

"ఆన - తక్కువాయెగా బిడ్డా!" అన్నది మునెమ్మ.

మునెమ్మ సరుకులన్నీ తడిసి పోయాయి. వాటి కేసి చూస్తూ ఏడిచింది మునమ్మె.

సరుకుల మూటను. మునెమ్మవ్వను, ఇంటికి తీసుకొచ్చేసరికి మరీ పొద్దు పోయింది. అవ్వను వరండాలో కూచో బెట్టి, నేను మధ్య హాల్లో కొచ్చాను...

గోపీ - గఁయ్యిమని లేచాడు.

"నిన్ను బాగు చేయడం హరిహరాదుల వల్ల కూడా కాదు నాన్నా! నీ కెలాగూ తోచదు సరే, తోచిన వాళ్ళు చెప్పినట్లన్నా చెయ్యవు గదా! ఇప్పటి దాకా, వాళ్ళంతా చూసీ చూసీ విసుగెత్తి వెళ్ళిపోయారు. నువ్వు - తడిసి పోతావేమోనని, ఆఫీసుకు కారు కూడా పంపించారు. నువ్వక్కడా లేవటగా!" అన్నాడు గోపీ చిర చిర లాడుతూ!

దేవుని పట్ల నా కెలాంటి తృణీకార భావమూ లేదనీ, ఎంతో చిత్తశుద్ధితో, నాలుగ్గంటలకే, ఆఫీసునించి బయలుదేరాననీ చెప్పాను. ఆలస్యానికి కారణమూ చెప్పాను.

గోపి కళ్ళు క్షణకాలం మెరిసి, ఆ మరుక్షణంలోనే నీటితో నిండిపోయాయి.

వరండాలో కొచ్చి మునెమ్మవ్వను చూశాడు. నన్ను చూశాడు. గుడ్ల నీరు గుడ్ల కుక్కుకుంటూ - "రా! అవ్వా!!" అన్నాడు గోపీ.

మునెమ్మ పలక లేదు. గజగజలాడిపోతూ లేచింది. చలికి కొంకర్లు పోతున్న రెండు చేతులతో నా తలను పట్టుకొని, చిన్న 'డీడిక్కి' ఇచ్చింది. ఇచ్చాక-

"నా ఆయువు పోసుకు బుతుకు బిడ్డా!" అన్నది మునెమ్మవ్వ.

అలా అంటున్నప్పుడు మునెమ్మవ్వ కళ్ళల్లోంచి చెంపల మీదుగా నీటి ధారలు. అయితే- అవి కన్నీళ్ళో, వాన నీళ్ళో నాకు తెలియదు.

చెప్పొచ్చిన దేమిటంటే - దేవుణ్ని చూడాలన్న నా తొలి ప్రయత్నం అలా విఫలమయిందీ -

అనీ!

* * *

"మీరేం చేస్తున్నారీ మూడు రోజులూ? కళాభవనం, రవీంద్ర భారతి అదిరిపోయేలాగా సాహిత్య సభలు జరుగుతుంటే- మీరు తుపాకీ గుండుక్కూడా దొరకలేదేం?" అన్నాడు పన్యాల రంగనాథరావు కాస్తంత గొంతు పెంచి.

"మీ సభల్లో ఏం జరిగిందీ-- సమస్తాంధ్ర జనావళికీ వినిపించాలి గదా! ఆ పనితో మునగానాం. తేలానాంగా ఉన్నానయ్యా బబూ!" అని సర్ది చెప్పుకో బోయాను.

"అదెప్పుడో 8 గంటలకో, ఎనిమిది దాటాకనో గదా! ఆ పనేదో భీమయ్య చేస్తున్నాడే! ఈ లోగా సరదా కోసమన్నా అటు రాగూడదా?" అన్నాడు పన్యాల విషయాన్నింకా సాగదీస్తూ!

ఇక- తుంచేయకపోతే లాభం లేదనుకున్నాను. "నేను మిస్సయిన మంచి విషయలు ఏమైనా ఉంటే - నువ్వెలాగూ చెబుతావన్న ధైర్యం నాకుంది. చెప్పుకురా" అన్నాను.

రెండు మూడు సార్లు అటూ ఇటూ చూసి, గొంతు సవరించుకొని, చేతుల్ని ఒకదానితో మరోటి జోడించి, మధ్య మధ్య "దీనబ్బడోరి సిగదరగా!" అంటూ రంగనాధరావు చాలా గొప్ప విషయాలు చెప్పుకొచ్చాడు.

సాహిత్యం ఆకాశ వీధుల్లో విహరించకూడదనీ, అయోమయమైన భాషలో రాయకూడదనీ, అనుకొన్నారుట. సర్వ సామాన్యుల కష్టాలను, నష్టాలను, వేదనల్ని, రోదనల్ని, సాహ్యితంలో చిత్రించాలనీ, సామాన్యుని జీవితంలో రచయితలు కూడా భాగం పంచుకోవాలనీ, చాలా మంది ఉపన్యసించారుట.

ఈ విషయాలన్నీ విన్న తరువాత - చాలా మంది అవకాశాన్ని చేజేతులా పోగొట్టుకొన్నారేమో ననిపించింది. ఆ సంగతే రంగనాధరావుగారితో అన్నాను.

"ఫరవాలేదు లెండి! ఇవ్వాళ సాయంత్రం బ్రహ్మాండమైన సభ- భారీ ఎత్తున జరుగుతుంది ఇద్దరు ముగ్గురు మంత్రులు కూడా వస్తున్నారు. చాలా మంది పెద్దవారికి- చిరకాలంగా సాహిత్య సేవ చేస్తున్న వారికి- సన్మానాలుకూడా జరుపుతున్నారు. మీరూ వద్దురూ ఈ పని ఎప్పుడూ ఉండేదే!" అంటూనే రంగనాథరావు వెళ్ళిపోయాడు.

ఐదింటి దాకా కుర్చీలోంచి కదలడానికి లేదు. మహా సభా ప్రారంభం కూడా ఐదు గంటలకే అన్నా - మంత్రులు వచ్చిందాకా సభను ప్రారంభించరు గనుకా, అమాత్యులెప్పుడున్నూ, ఆలస్యంగానే వస్తారు గనకా, సభ కూడా ఆలస్యంగానే మొదలవుతుందనుకొన్నాను. అయినా- ముందుగానే హాజరవుదామనీ అనుకొన్నాను.

హైదరాబాదులో రోడ్డు దాటడమంటే ఎంత కష్టమో- ఆ పని చేసిన వాడిగ్గానీ తెలీదు... కాస్తంతలో ఆటో రిక్షా ప్రమాదం తప్పుకొని, సరిగ్గా అసెంబ్లీ గేటు ముందు కొచ్చాను. నా ముందు ఓ పాత రిక్షా, ఆ రిక్షానిండా నిలువెత్తున పచ్చ అరటి గెలలు, గెలల బరవుకు, రిక్షా చక్రాలు నేలకు

తగులుతున్నాయి. పల్లం గనక, రిక్షా వెనక్కు జరక్కుండా, బండిని వారగా తిప్పి, గానును, ఫుట్‌పాత్ కానించాడు. రెండుచేతులతో హాండిల్‌ను అదిమి పెట్టాడతను.

“ఎందుకలా?” అన్నాను.

అతను మాట్లాడలేదు. చేతులు తీస్తే ముందు చక్రం పైకి లేచి బండి బోల్తా పడుతుందని, చేతులతో అభినయించి చూపించాడు. హాండిల్ మీదినుంచి రెండు చేతులూ తీసినప్పుడు, చక్రంపైకి లేవకుండా కుడికాలితో దాన్ని అదిమి పెట్టాడు.

“ఎక్కడికి వెళ్ళాలి?” అన్నాను.

అతను చెప్పలేదు. చెప్పలేకపోతున్నాడు. జత్తులోంచి, ముఖం మీదుగా, గుండెల మీదుగా చెమట, చెమటకు తడిసి, ఎండకు ఎండి, తెల్లగా ఉప్పరిసిన బన్నీను, మడిమలకు పైగానూ, మోకాళ్ళకు దిగువగానూ- అది నిక్కరో, పాంటో కూడా తెలీని- ఓ మాసికల గుడ్డ ముక్క.

నేనూ అతన్ని చూస్తూ అక్కడే నిలబడ్డాను. ఐదు నిమిషాలు- పది నమిషాలు-

ఒక్క మూలుగు మూలిగి- బండిని ముందుకు గుంజాడు. బరువైన బండిని, ఎత్తుకు గుంజవలసి రావడంతో- అతనూ నేలబారుగా సాగవలసి వచ్చింది. రిక్షా ముందు చక్రం పైకి లేవకుండా అదుపుతూనే, రిక్షాను ముందుకు లాగుతున్నాడు. రిక్షా చక్రాలు కిర్రు మంటున్నాయి. అతని నరాలు కిరకిరమంటున్నాయి. అరికాలినుంచి బలాన్ని చేతుల్లోకి పుంజుకొని, బండిని ముందుకు గుంజుతున్నాడు. చేతిలోని సంచిని అరటిగెలలమీదికి వేశాను. పంచె ఎగదోపాను. ఓ అరటి గెలకు తల మోటించాను. చేతుల్ని వంగిపోయిన రిక్షా టాపుకు మోపు చేశాను.

“ఊఁ... కాస్త ఉడాయించు” అన్నాను రిక్షాను ముందుకుతోస్తూ.

రవీంద్ర భారతి ముందునుంచి ఐ.జి. ఆఫీసు ముందునుంచి, పెట్రోలు బంకు ముందునుంచి- ఆ మెరక గడితేరే సరికి అతనూ, నేనూ కూడా అలిసిపోయాం.

“ఇదేమిటి? ఇన్ని అరటి కాయలూ మీకే! కూతురు పెళ్ళా? కొడుకు పెళ్ళా? దగ్గరుండి తీసుకెడుతున్నారే! మంచిపని చేస్తున్నారు. ఈ కాలంలో- ఈ అలగా జనాన్ని ఛస్తే నమ్మకూడదు.” అని నాకు హితోపదేశం చేశారాయన గారు.

ఆయాసం వల్ల, నేనేం చెప్పలేదుగానీ, అదే అవమానంగా వారు భావించకుండా ఉండేందుకు, రెండు చేతులూ యెత్తి నమస్కరించాను.

ఇంకాస్సేపక్కడ ఆగాక, లకిడీకపూల్ వంతెన ఎక్కించి, ఆ తరువాత పిక్చర్‌హౌస్ దాకా, ఆ రిక్షాను అలా తోసుకుంటూనే వచ్చాను.

మహవీర్ హాస్పిటల్‌కు ఎదురుగ్గా ఆగాడు. నేనూ ఆగాను. రిక్షాను రోడ్డువారగా ఆపాడు. నేనూ అతనిపక్కనే వచ్చి నిలబడ్డాను.

ఓ పావుగంట అలాగే ఉండి- సొక్కు తీర్చుకొన్నాక-

“పోదామా?” అన్నాను.

“మీరెళ్ళండి దొరా! ఇదంతా సాఫ్ సీదా రోడ్డేగదా! నే గుంజుతాన్లెండి... ఇక మీరెళ్ళండి దొరా! పది కాలాలపటు సల్లగా బతకండి దొరా!” నా రెండు చేతులూ పట్టుకొని, నా కళ్ళల్లోకి చూస్తూ అన్నాడతను.

అన్నట్టు చెప్పడం మరచిపోయాను.

ఆ రోజున నేను భగవంతుణ్ని చూడాలనుకోలేదు. సాహిత్య సభల్లో పాల్గొని, బుద్ధిని వికసింప చేసుకొందామనీ, జన్మను చరితార్థం చేసుకొందామనీ, అనుకొన్నాను, కానీ- కర్మం! ఏమీ చేసుకోలేకపోయాను!!

* * *

1980 అక్టోబరు 26వ తేదీ ఆదివారం ఉదయం ఆరు నలభయ్యయిదుకు విశాఖ నుండి అరకులోయకు ప్రయాణం. అందుక్కావలసిన ఏర్పాట్లన్నీ హిందీ మేష్టారు చేశారు. అసలు మా కారుకు గురువులు, డ్రైవరుగా రావలసింది... హైదరాబాదు నుంచి ఛైర్మన్‌గారొస్తున్నారట గురువులేమో ఛైర్మన్‌గారి డ్రైవరట; అందుకని, నాకు వేరే కారునూ, వేరే డ్రైవర్ను అప్పారావు గారు ఏర్పాటు చేశారు.

విశాఖ, శ్రీకాకుళం జిల్లాకు నాకు మరీ కొత్తవేమీ కాదు. 1952 నుండి 1955 దాకా, ఈ జిల్లాల్లోని మారుమూల ప్రాంతాలు కూడా తిరిగాను. అయితే ఆ తిరగడం వేరు; ఈ తిరగడం వేరు. ఆ తిరగడంలోని విశేషాలకు గుర్తుకు తెచ్చుకొంటూ చెబుతున్నాను. కారు కీచుమంటూ ఆగిపోయింది.

“ఏమిటయ్యా?”

“పంక్చరయిందండీ! అదృష్టం; ఊరిముందు జరిగింది గనక బతికి పోయాం-” అని గొణుక్కున్నాడు డ్రైవరు.

బండిని ఓ పదిగజాలు తోసి, అక్కడున్న ఓ సైకిల్ షాపు ముందు ఆపి, కొత్త చక్రం బిగించమనీ, పాతదాన్ని బాగు చేయమనీ చెప్పాడు డ్రైవరు, తను ఊళ్ళోకి వెడుతూ.

మా ఆవిడా, పిల్లలూ కూడా శృంగవరపు కోట ఊరు చూడడం కోసం వెళ్ళారు.

“ఇక్కడ టీ దొరుకుతుందా బాబూ!” అన్నాను షాపతనితో.

‘శనం’ అన్నాడు షాపతను, షెడ్డులోంచి రోడ్డు మీదికొచ్చి. ‘అరేయ్ నా సిన్న కొడకా! బాబుగారొచ్చీసిర్ను. పట్నం బాబుగారు. యేడేడి టీ పట్రారోయ్ కొడకా! మంచి పొడేసి, మీగడ పాలేసి సెయ్యరోయ్ బామ్మరిదీ” అని కేకేశాడు బిగ్గరగా.

ఈ పిలుపులూ అపహాస్యాలూ నాకేం కొత్తగావు గనక ఆశ్చర్యపోలేదు. కాస్సేపటికి ఓ చేత్తో రెండు టీలు, ఇంకో చేత్తో రెండు (గ్లాసులు) మంచినీళ్ళు తీసుకొని పదేళ్ళ కుర్రాడొచ్చి నిలబడ్డాడు.

“సెప్తే సెవుఁడేరా సిన్న నా కొడకా! ఇంతాలీస మయిందేరా నా కొడకా” అన్నాడు షాపతను, రెంటినీ రెట్ట కొద్దీ పైకెత్తి కళ్ళల్లోంచి నిప్పుడు రాలుస్తూ.

ఆ కుర్రాడు వొణికి పోయాడు. అతనివేపూ నావేపూ బిక్కుబిక్కుగా చూశాడు.

''మరి టీ సన్నారిపోద్ది. పుచ్చుకోండయ్యా! ఈ కాలపు సన్నాసి నా కొడుకులికి, పౌరుసం పెద్ద దండయా! ఈ నా కొడుక్కు- రోజూ - ఏం బాబూ వింటున్నారా?'' అన్నాడు షాపతను. ట్యూబుకు పంక్చరు వేయడానికి దూరంగా ఉన్న చెట్టుదగ్గరకు పోతూ.

ఈ వ్యవధిలో ఆ కుర్రాణ్ని; వాడికంటే చిన్న వాణ్ని కబుర్లలోకి దించాను.

ఈ పదేళ్ళ కుర్రాడి పేరు బ్రహ్మాజీ. ఒంటి మీద చొక్కా లేదు. జుత్తుకు నూనె లేదు. నిక్కరు కూడా గజ్జల్లోకి పీక్కుపోయి ఉంది. చేతుల నిండా, నూనెమసి... ఆ రెండో కుర్రాడి పేరు అప్పారావు. వాడికి చిరిగిన బన్నీను ఉంది. చేతుల నిండా, ముఖం నిండా, వొంటి నిండా మసి, ఇద్దరికీ అమ్మనాన్నలున్నారు. ఇద్దరికీ అన్నలు, అక్కలు తమ్ముళ్లూ ఉన్నారు. ఇద్దరూ, ఉదయం 7 గంటలకల్లా షాపుకొస్తారు. రాత్రి 9 గంటల దాకా ఉంటారు. పని నేర్పింది కాక, రోజుకు అర్థ రూపాయి దాకా షాపతను ఇస్తాడట. ఇంటికెళ్ళి తినొస్తారుట! ఎప్పుడన్నా- పని మరీ ఎక్కువగా ఉంటే - ఇంకో పావలా ఇస్తారట.

''చొక్కా వేసుకోలేదేం?మసి అంటుతుందనా?'' అన్నాను జాగ్రత్తగా.

అయిష్టంగా అవునన్నట్లు తలూపారు. అది అబద్ధమని తక్షణమే తెలిసిపోయింది నాకు.

షాపతను చూడకుండా చెరో యాభయ్ రూపాయలూ ఇచ్చాను. వారు ఆ నోట్లకేసి బెదురుగా చూశారు.

''నేను అరకు వెళుతున్నాను. సాయంకాలం వస్తాను. అప్పటికి మీరు చిన్న లాగు, చొక్కా కొనుక్కుని ఇక్కడే ఉండండి. సరేనా?''

ఓ అరగంట తరువాత కారు బయలుదేరింది. శృంగవరపు కోట దాటాకనే ఘాట్‌రోడ్ ప్రారంభం... నున్నని రోడ్డు. అడవి పచ్చదనాన్ని, చిక్కదనాన్ని కలుపుకొన్న పరిమళాలు, పసుపు పచ్చని అడవి పూల మొక్కలు, కొండ వాగులు, అక్కడక్కాడా చెల్లా చెదురుగా, నాలుగో అయిదో గిరిజనుల గుడిసెలు... ఇవన్నీ నన్నంతగా ఆకట్టుకోలేకపోయాయి.

చామనచాయగా, బక్కగా, బీదగా, జీబురుగా, భయం భయంగా పదేళ్ళ బ్రహ్మాజీ; వణికి పోతూన్న అప్పారావూ; వారి పేదతనం... ఇవే నన్నూ నా మనస్సునూ ఆక్రమించేశాయి. తిరిగి మేము శృంగవరపు కోట వచ్చేసరికి, దాదాపుగా ఏడు కావస్తున్నది. ఐనా ఆ షాపు దగ్గర చాలా మంది గుంపు కూడి ఉన్నారు.

కారు ఆగగానే బిలబిల్లాడుతూ, వారంతా దగ్గర కొచ్చారు. బ్రహ్మాజీ, అప్పారావు శుభ్రంగా స్నానం చేశారు. నూనె పూసుకొని తల దువ్వుకొన్నారు. కొత్త నిక్కర్లు, కొత్త చొక్కాలు వేసుకొన్నారు.

''తః వః రొస్తారని ఐదింటి నించీ ఇక్కడే...''

ఆ పిల్లలిద్దర్నీ ఆ గుడ్డల్లో చూస్తూంటే ఎంత ముద్దొచ్చారని!

కాస్సేపు అవి ఇవీ మాట్లాడి, బయలు దేరబోతున్నప్పుడు బ్రహ్మాజీ, అప్పారావూ, భయం భయంగా నా చొక్కా కొసను తాకి, నమస్కారం చేస్తున్నప్పుడు ఇద్దర్నీ దగ్గరకు తీసకొని,

కౌగలించుకోకుండా ముద్దెట్టుకోకుండా ఉండలేకపోయాను. అలా ముద్దెట్టుకొంటున్నప్పుడు వాళ్ళ కళ్ళు ఎలా మెరిశాయంటే-

ఈసారి నేను దేవుణ్ని చూడాలనుకోలేదు; సాహిత్య సభలోనూ పాల్గొనాలనుకోలేదు.

* * *

కనే అమ్మకు కనే రంది, తినే అమ్మకు తినే రందీ తప్పదంటారు. నాకైతే కందామనీ, తిందామనీ, లేదుగానీ, రాద్దామనే రంది ఉంది. ఈ రందికి ఆరంభమైతే ఉన్నదిగానీ, అంతం కనిపించడం లేదు. గడచిన 40 సంవత్సరాలుగా, చెత్తా చెదారం చాలా పోగు చేసి పడేశాను. ఇహ చేతులు ముడుచుకుని కూచోవచ్చు. కానీ పాడు ప్రాణం- అలా కూచోనివ్వదు. ఇంకేదో చేయాలనీ, చేయమనీ, ఒకటే రొద, ఈ దిక్కుమాలిన రొద నుండి బయట పడటం కోసమని, ఒక పెద్ద నవలా రచనకు ప్రణాళికను తయారు చేశాను. ఈ నవల మూడు భాగాలుగా ఉంటుంది. మొదటి భాగం పేరు ''మురికి వాడ.'' రెండవ భాగం పేరు ''సంత'' మూడవ భాగం పేరు ''కనకపు సింహాసనం''. ఈ నవల 1942వ సంవత్సరంలో ప్రారంభమయి 1982వ సంవత్సరం నాటికి ముగుస్తుంది.

ఒక నలభై సంవత్సరాల సామాజిక జీవితాన్ని- ఆంధ్ర దేశపు జీవితాన్ని- ఇందులో చిత్రించాలన్నది నా ప్రయత్నం, ఈ ప్రయత్నం సఫలం కావడానికి, గ్రంథ గత జ్ఞానం మాత్రమే సరిపోదు. అనుభవం కావాలి. రకరకాల ప్రాంతాల ఆనుపానులు తెలిసి ఉండాలి. మనుషులు వారి ఆర్థిక స్థితి గతులు తెలిసి ఉండాలి. ఇది తెలుసుకోవడం కోసం నేను, రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలలో తిరగవలసి వచ్చింది.

ఈ నవలలో ఒక చోట బాగా వెనుకబడిన ప్రాంత ప్రజలూ వారిని దోచుకుతినే మైదాన ప్రాంతపు వ్యాపారస్థులూ వస్తారు. ఈ వివరాల సేకరణ కోసం శ్రీరాం సాగర్ ప్రాజెక్టు ప్రాంతాన్ని ఎన్నుకొన్నారు.

1982 ఏప్రిల్ 10వ తేదీ శనివారం...

శ్రీరాంసాగర్ ప్రాజెక్టును చూసి ఆశ్చర్యపోయాను. ప్రకృతిని మచ్చిక చేసుకోవడం కోసం, మానవుడు చేస్తున్న ప్రయత్నాలు- ఈ రూపంలో ఇక్కడ కనబడుతున్నాయి... ఎత్తుగా కట్ట, దాని వెనక గోదావరి జలాలు- అవి కాలవలోకి దూకుతూ, పరుగెడుతూ, పొలల్లోకి చొచ్చుకు రావడం... కొత్త కాలవ కట్ట మీదుగా సుమారు 25 కిలోమీటర్ల ప్రయాణం ... చివరకు స్వర్ణ నది దాకా వచ్చాం. అక్కడో 'అక్విలేరు', నిర్మిస్తున్నారు. అక్కడున్న కూలీలను కలుసుకొన్నాను. కలుసుకొని కబుర్లలో దింపాను. అలా దింపినందుకు గుత్తేదారు, అతని మేస్త్రి నా వేపు గుర్రుగా చూస్తున్నాడు.

వాళ్ళు చెప్పినదాని సారాంశం ఇది-

వారిది పాలమూరు. తరతరాలుగా రెక్కల మీదనే ఆధారపడి జీవిస్తున్నారు. పొలాలు లేవు. ఉన్నా పండవు. పండినా 'దొరలు' దక్కనీరు. పంట ప్రజలకు దక్కితే మాట వినరని, దొరల భయం.

ఏడాది కొకసారి గుత్తేదార్లో వారి మేస్త్రీలో వస్తారు. వచ్చి మనిషికి వేయి రూపాయల చొప్పున అప్పులిస్తారు. ఈ అప్పును, నెలకు వంద పాతిక రూపాయల చొప్పున ఎనిమిది మాసాల్లో తీర్చుకోవాలి. ఇలా తీర్చుకోవడానికి, ఆ గుత్తేదారు పని చూపెడతారు. ఈ పని ఉదయం 6 గంటలు ప్రారంభమయి, సాయంకాలం ఆరు గంటల దాకా ఉంటుంది. ఈ పని చేసినందుకు కూలి డబ్బులంటూ గుత్తేదారివ్వడు. ఉదయం పదిగంటల కొకసారి, సాయంకాలం నాలుగ్గంటలకొకసారి పశువులకిచ్చే మడ్డి కూడు లాంటిది పెడతారు. ఇంకే సదుపాయాలూ ఉండవు. ఈలోగా ఏదన్నా అవసరం పడి, ఐదో పదో తీసుకొంటే, ఆ వారం అదనంగా పని చేయవలసి ఉంటుంది. పిల్లలు పని చేయడానికి అభ్యంతరం లేదుగానీ, గుత్తేదారు వారికి డబ్బులివ్వడు. బిస్కట్లిస్తాడు. ఒక కుటుంబంలోని నలుగురు పెద్దవాళ్ళు నాలుగు వేలు తీసుకొంటే, ఆ నాలుగురూ ఒకే చోట పనిచేస్తారన్న గ్యారంటీ లేదు.

లచ్చమ్మ సంగతి సరిగ్గా అలానే జరిగింది. నర్సింలు హైదరాబాద్‌లో రోడ్డుపని చేస్తున్నారు. లచ్చమ్మ అక్కలేరు పనిలో ఉంది. ఇక్కడికొచ్చేనాటికి లచ్చమ్మకు నాలుగో నెల. వచ్చి నాలుగు మాసాలయింది. ఈ నాలుగు నెలల్లోనూ, లచ్చమ్మకు మొగుడి సంగతి ఏమీ తెలియదు. ఒక వేళ ఉత్తరం రాద్దామన్నా, నర్సింలు అడ్రసు లచ్చమ్మకు తెలియదు. తెలిసిన గుత్తేదారు గానీ, మేస్త్రీగానీ లచ్చమ్మకీ సంగతి చెప్పరు.

ఎనిమిది నెలల గర్భవతి, చిటచిటలాడే ఎండలో, రాళ్ళు పగల కొట్టడమూ, కొట్టిన రాళ్ళను ఏరి తట్టల్లోకి సర్దడమూ చేయవలసిన పనేనా? క్షణం పాలుమాలితే బండ బూతులు తిట్టే గుత్తేదారు వాడి కనుసన్నల్లో మెలుగుతూ, వాడి కనుకూలంగా, పనులు నడిపించే మేస్త్రీగారు- లచ్చమ్మ లాంటి వారి మీద ఒక కన్ను కాదు- రెండు కళ్ళూ వేసి ఉంచుతారు. ఎందుకంటే లచ్చమ్మ కనుముక్కుతీరు తిన్నగా ఉంటుంది గనక!

"ఎయ్య తీసినా. నాలుగు నెల్లాయె... ఇంక నాల్గు నెల్లు దొరకాడ ఉండాలె. దొర సెప్పింది సెయ్యాలె... ఈ పాడు పొట్ట- నన్ను నిలబడనీయక పాయె, కూకోనీక పాయె బిడ్డా! వంగోని ఎట్టా పని సేతు బిడ్డా?" అని లబ్బుమన్నది లచ్చమ్మ.

"నానీ! మన దగ్గర డబ్బెంత ఉంది?"

మా చిన్నవారు సాభిప్రాయంగా నా వేపు చూశాడు. చూసి-

"సుమారుగా 7-8 వందల దాకా-"

గుత్తేదారుని కలుసుకొని అడిగాను-

"లచ్చమ్మకు వెయ్యిచ్చారు. నాలుగు మాసాలు పని చేసింది. ఇంకో నాలుగు మాసాలు మీ దగ్గర పని చేయాలి. కానీ... చూస్తున్నారు గదా! ఆ మిగిలిన అయిదు వందలు నేనిస్తాను. లచ్చమ్మను విడిచి పెడతారా?"

సాధారణంగా ఇలాంటి బేరసారాలకు గుత్తేదారు లొప్పుకోరుట. కానీ ఇతగాడు వొప్పుకొన్నాడు. అతనికి అయిదు వందలూ చెల్లించాను. నేనెందుకు లచ్చమ్మను విడిచి పెట్టిందీ తెలీక- నలుగురూ నాలుగు రకాల గుస గుసలాడుతున్నారని, ఆ తరువాత తెలిసింది! అందరి దగ్గరా సెలవు తీసుకొని

లచ్చమ్మ మాతో వచ్చింది.

ఆ రోజూ, ఆ మర్నాడు కూడా లచ్చమ్మ మాతోనే ఉంది. మొన్నాటి మధ్యాహ్నం నిజాం బాదు పోతానన్నది. అక్కడున్న రెండో తమ్ముడి దగ్గర రెండు రోజులుండి, అయిద్రాబాద్ వెడతానన్నది.

బస్సు దాకా వచ్చి ఆమెనెక్కించాను. ఇంకో పాతిక రూపాయలు లచ్చమ్మ చేతికిచ్చాను.

“సచ్చి- నీ బిడ్డనై పుడతా సల్లని దొరా” అన్నది లచ్చమ్మ నా చేతులని కళ్ళకు అద్దుకొంటూ.

* * *

నేను మళ్ళీ మొదటికొస్తున్నాను నాలుగైదేళ్ళుగా- మరీ ఖచ్చితంగా చెప్పాలంటే ఐదేళ్ళుగా- నాకు దేవుని చూడాలని ఉంది గానీ, ఇంతవరకూ చూడలేకపోయాను. ఇందులో అచ్చంగా దేవుని తప్పే ఉన్నదని నేననడం లేదు. నేనూ అంత సీరియస్‌గా ప్రయత్నం చేయలేదనుకోండి! చేసినట్లయితే- కనిపించేవాడేనేమో మరి!

ఒక రోజు రాత్రి- బాగా పొద్దుపోయాక, ఏదో చప్పుడయితే లేచి కూచున్నాను. తలుపు దగ్గిర ఎవరో తారట్లాడుతూ కనిపించారు.

“ఎవరది?” అన్నాను.

“నీ పేరు, ఫలానా, అవునా? నీ కోసమే వెదుక్కుంటూ వస్తున్నాం. నువ్వేనా దేవుణ్ని చూడాలనుకొంటున్నది?”

“అవునండీ!” అన్నాను.

“నీకు పిచ్చా? లేక చాదస్తమా? దేవుణ్ని సరాసరిగా ఎవ్వరూ చూడలేరయ్యా నాయనా! నా మాట విను. అసలు అలాంటి కోరిక కోరడమే పొరబాటు.”

“ఇన్నిటికీ తమరెవరు?” అన్నాను కాస్త అనుమానం వేసి.

“మేం దేవదూతలం” అన్నారు వారిద్దరూ.

“ఎందుకొచ్చాడు?” అన్నాను.

“తమకీ సంగతి చెబుదామనీ-” అన్నాడు రెండో దేవదూత.

“దేవుడు కనిపించకపోతే మానె- ఆయన చాయలన్నా- అంశాలన్నా కనపడవద్దా? ‘ఉదకం నారాయణ స్వరూపం’ అన్నారు. ఎండకాలలో ఈ నారాయణ స్వరూపం చాలా మందికి కనిపించడం లేదు. ‘అన్నం పరరబహ్మ స్వరూపం’ అన్నారు. అన్ని కాలాల్లోనూ ఎక్కువ మందికి, ఈ పరబ్రహ్మ స్వరూపం కూడా కనిపించడం లేదు. నేను కోరుకొనేదేమిటంటే- అన్ని కాలాల్లోనూ సమస్త జనానికీ ఈ నారాయణ పరబ్రహ్మ స్వరూపాల దర్శన భాగ్యం, కొరత లేకుండా లభించాలీ- అని! నేను దేవుణ్ని చూడాలనుకోవడం కూడా ఇందుకే! ఇదేదో కూడని పని- అనిగానీ, అనుచితమైన కోరికని గానీ- నేననుకోవడం లేదు” అన్నాను దేవదూతలతో.

“వాళ్ళ సంగతి, వీళ్ళ సంగతీ నీకెందుకయ్యా బాబూ! నీక్కావలసిందేమిటో నువ్వడగరాదా?

నీ ఏడుపేదో నువ్వేడుచుకో రాదా? నేను కడుపు నిండా తింటే నీ ఆకలి తీరుతుందా? నేను మందు తాగితే నీకు రోగం తగ్గుతుందా?'' అని మొదటి దేవదూత నన్ను నిగ్గ దీశాడు.

ఆ తర్కానికి నా తలకాయ చిటచిట లాడిపోయింది. వాడి ధోరణి చూశాక నాకింకో అనుమానం కూడా కలిగింది-

''వీడు సిసలైన దేవదూతగాడేనా లేక నకిలీ సరుకా?' అని. మరోటేటంటే- ఈ భూలోకపు రాజకీయ కశ్మలమంతా, దేవదూతల దాకా ఎప్పుడు పాకిందా- అని. ఇన్ని అనుమానాలు కడుపులో ఉంచుకొని వీళ్ళతో మాట్లాడకపోవడమే మంచిదనిపించింది చెప్పొద్దూ!

''ఏ వంంరా! నాక్కావలసింది దేవుడుగానీ, దేవ దూతలు కాదు... ఇప్పటికే అనవసరంగా మీతో చాలా వాగాను. ఇక నన్ను విసిగించొచ్చు.. నా నిద్రపాడు చేయనూ వద్దు. వెళ్ళిరండి'' అన్నాను.

నాకు హితోపదేశం చేసిన దేవదూతగారు, తనమాట విననందుకు రుసరుసలాడుతున్నారని నేను అనుమానించాను.

దేవదూతలు వెళ్ళిపోయిన రెండో రోజునో- లేకపోతే- మూడో రోజునో మరి-

ఒక తీయని వాసన అంతటా అలముకొన్నట్లు; రుచులూరే కాంతి పుంజాలు నిలువునా ముంచెత్తినట్లు; రంగు రంగుల నిశ్శబ్దాలు అందంగా వికసించినట్లు; ప్రశాంత, నిశాంత, సుఖాంత స్వప్నశకలం నక్షత్ర మండలాల నుంచి దిగివచ్చి, సుతారంగా కను రెప్పలను చుంబించినట్లుగా అనుభూతి-కి లోనయి-

''ఎవరది?'' అన్నాను.

''నేనే!''

''అంటే'' అన్నాను.

''నన్నెప్పుడూ నీవు చూడనే లేదా? నే నసలు- నీకు తెలియనే తెలియదా?.. ఈ అనుభూతులు- ఎప్పుడూ నీ అనుభవంలోకి రానే లేదా!''

''వచ్చాయి. ఈ తీయని వాసనను- ఆనాడు- ఆ వానలో తడిసిన అవ్వ, ఆప్యాయతతో నా తలను, చేతుల్లోకి తీసుకొని, కన్న బిడ్డకిచ్చినట్లుగా, డీడిక్కి ఇచ్చినప్పుడు అనుభవించాను... ఆ రిక్షా డ్రైవరు అనురాగంతో నా చేతుల్ని స్పృశించి, నా వేపు చూసినప్పుడు, రుచులూరే ఈ కాంతి పుంజాలను, అతని కన్నుల్లో చూశాను... నన్ను తాకాలన్న కోరికను అణచుకోలేక, తాకడానికి సాహసించలేక, నా చొక్కా కొసను ముట్టుకొన్న బ్రహ్మాజీని అప్పారావును, ఆలింగనం చేసుకొని ముద్దుపెట్టుకొన్నప్పుడు, రంగు రంగుల నిశ్శబ్దాలు అందంగా వికసించటమంటే ఏమిటో అనుభవించాను... ప్రశాంత, నిశాంత సుఖాంత స్వప్న శకలం, నక్షత్ర మండలాల నుంచి దిగివచ్చి సుతారంగా కనురెప్పల్ని చుంబించినప్పటి అనుభూతిని, లచ్చమ్మ నా చేతుల్ని తన కనులకు అద్దుకొన్నప్పుడు అనుభవించాను. ఇంతేకాదు- అనురాగం, కారుణ్యం, నిర్మలత్వం, లలితత్వం, సూనృతం, ఉన్న అన్ని చోట్లా, అన్ని వేళలా ఇలాంటి సంవేదనలను, అనుభవిస్తూనే ఉన్నాను'' అన్నాను.

“ఇప్పుడు సరైన దోవలో కొచ్చావు. నన్ను అన్నిచోట్లా, అన్ని వేళలా చూస్తూనే, నా కోసం అన్వేషిస్తున్నానంటావేం? సరే- ఇన్నిటికి నన్నెందుకు చూడాలనుకొంటున్నావ్? నానుంచి నీకేం కావాలి?”

“నీవు దేవుడివో కాదో నాకు తెలీదు” అని ఆగి, పరకాయించి చూశాను. “ఇది వరకు నిన్నెప్పుడూ చూడలేదు కూడా. కానీ అన్ని చోట్లా నిన్ను నేను చూసన్తూనే ఉన్నట్లుగా నువ్వునొక్కిచెబుతున్నావ్! ఒక వేళ చూస్తున్నానేమో మరి. అదలా ఉండనీ, నీవు నిజంగా దేవుడివే అయితే, నాకేం కావాలో, నీకీ పాటికే గ్రహింపయి ఉండాలి. ఒక వేళ నీవు దేవుడివి కాకపోయినా, నాక్కావలసిందేమిటో చెప్పడం వల్ల నష్టమేమీ లేదు. నాక్కావలసిందిదీ-

“నకాయ యే హంగతి మీశ్వరాణాం

అష్టర్థియుక్తా మపునర్భవం వా

ఆర్తిం ప్రపద్యే బిల దుఃఖ ఖాజా

మంతః స్థితోయే న భవంత్మ దుఃఖాః”

(పుణ్య పురుషులు చక్రవర్తులై అనుభవించ అష్ట ఐశ్వర్యాలను కోరను. మోక్షం నా కక్కరలేదు. నా కోరిక ఇంత మాత్రమే! లోకం లోని దుఃఖ పీడితులందరి హృదయాల్లో నేను ఉండాలి. వారి బాధలన్నీ నేను అనుభించి అయినా సరే- వారి దుఃఖాన్ని నేను పోగొట్టాలి.)

అందుకే- ఇలా చేసేందుకే- చేసే శక్తిని పొందేందుకే నేను దేవుణ్ని చూడాలనుకొంటున్నాను.

**సమాప్తం**